
ఆంధ్ర సచిత్ర వారపత్రిక



25 నయాపైసలు. 6-9-61



అది కూలా నాకే ఇత్తావా....

ఫోటో: పి. డి. ఉష (మచిలీపట్నం)

తెలుగు పత్రికలన్నిటిలోనూ ఆంధ్రసచిత్ర వారపత్రిక
సర్క్యులేషన్ అత్యధికమైనది!

ఆ తెల్లని అడ్డుగోడలనుండి విజయసూచక వాతావరణంలోకి రండి —వాస్మాల్ వాడండి

మీకున్న తెల్ల వెంట్రుకలకు బదులు స్వాభావికమైన
నల్లని నిగనిగలాడే కురులను వాస్మాల్ మీకు
యిచ్చుటవలన మీరు యువకులుగా కనపడెదరు
యువకోత్సాహము మీలో తొణికిసలాడును
మీరు యెంతో ఆకర్షణీయంగా అగుపడుతూ,
విజయమార్గములో సునాయసంగా ముందుకు
సాగిపోగలరు ఇది వెంట్రుకలను నల్లపర్చుటలో
అసలైన సాధనము వెంట్రుకలకు
పుష్టి నిచ్చునది, అంద మిచ్చునది వాస్మాల్
వెంట్రుకలకు బహుళ ప్రయోజనకారి



వాస్మాల్

వెంట్రుకల నల్ల పర్చుటలో తప్పక పనిచేస్తుంది

ముచ్చిలింప వీలుగాని సీసాలలో
గడ్డనూనెగాను, పోమేడ్ గాను కెమిస్టు
లందరివద్ద, స్టోర్సులన్నింటిలో లభించును

హైజీనిక్ రిసర్చి ఇన్స్టిట్యూట్, పి ఓ బాక్సు 1192, బొంబాయి-1

ఉత్తరాలు

'రేఖా' చిత్రకథ

"రేఖా చిత్ర కథ"లో రాకెట్టు ప్రయాణముచేస్తూ గంద్రగోళ జీవులతో సంభాషణ జరుపుచున్నను ముగ్గురిని (బంగారము, సింగారము, అప్పారావు) చూపినారే, మరి రాకెట్టును నడుపుచున్నవారెవరో తెలియజేస్తారా లేక నిధి కోసము పోవుచున్నారని అదంతా అదే పోవుచున్నదా!

చెట్లపల్లి శ్రీ జయలక్ష్మి నరసింహారావు
(రాజగంగవూరు)

ఆటోమాటిక్ పైలట్ ఉన్నదేమోనని మా అనుమానం

* * *


గోళ్ళు కరెన్సీగాచూసి సంతోషపడ్డాను నా గోళ్ళొకటి ప్రమాదంవల్ల దెబ్బతిని వూడటానికి సిద్ధమైంది దాన్నిపెట్టి మళ్ళా పత్రిక కొందామను కొంటుండగా కరెన్సీ మారిపోయింది ఏం చేస్తాం నా ఖర్మ

వేమూరి సత్యనారాయణ (సింగరాయకొండ)

మనమూ-మనరాష్ట్రం

"మనమూ—మనరాష్ట్రమూ" అంటూ ప్రారంభించాక 'కౌండిన్య'గారు వ్రాసిన వ్యాసాలు ప్రశంసల నందుకున్నయంటే వాటిలో ఇమిడియున్న యదార్థత కొంతవరకు కారణం కావచ్చు కాని 9—8—61 పత్రికలో శ్రీసంజీవయ్య ముఖ్యమంత్రి అయిన తరువాత అంటూ మొదలుపెట్టి ఏవేవో వ్రాశారు నిజానికి వారన్నట్లుగా రాష్ట్రములోనేగాదు యావద్భారతావనిలోనే షెడ్యూలు కులాల సంఖ్య అధికం సంఖ్య అధికంగా ఉన్నంతమాత్రాన బలం అధికమయిందని వారు వ్రాయడం విచారకరం ఉదాహరణకు ప్రతీ 7 గురిలో ఒక హరిజనుడున్నా, లేదా సుమారు 40 కోట్లలోనూ 12 కోట్లు హరిజనులున్నా ఎంతమంది మంత్రులకు ఎంతమంది హరిజన మంత్రులున్నారనేది శ్రీ కౌండిన్య తెరుగక పోరు ఏనుగు ఎంత పెద్దదయినా కుయుక్తులలో గుంటనక్కను సరిపోదుగదా? అలాంటప్పుడు రాష్ట్రంలో వెనుకబడినవారి సంఖ్యాబలంవల్ల ఒరిగేదేమిటి?

ఆంధ్ర ముఖ్యమంత్రియై శ్రీ సంజీవయ్యగారు ప్రమోషన్ల గురించి కొంత శ్రద్ధ తీసుకొనియుండవచ్చు లేదా ఆదేశాలు పంపవచ్చు "దేవుడు వరమిచ్చినా పూజారి తలుపులు తెరువడు" అన్న మాట అబద్ధము కాదని ఆంధ్రపత్రిక చదివే పాఠకులకు తెలియదంటారా? ఆయన ఆదేశం ప్రకారమే ఏ సీనియర్ ఆఫీసరో ఇద్దరిని రిక్రూట్ చేస్తున్న సమయంలో "దండంబాబూ" అంటూ శర్మగారో, శాస్త్రులవారో వచ్చి జాతివాడిని బాబు మీరు చేయకపోతే ఎవరు చేస్తారు? వాళ్ళకు ఇంకా 10 సం ప్రభుత్వం గ్యారంటీ యిచ్చిందికదా? అని ఏదో చెప్పి అందులో ఒకటి తాను కొట్టుకొని



ఉత్తరాలు

పోయిన ఉదంతాలు ఎన్ని లేవు? ఒకవేళ క్రింద వాళ్లే ఏదో సహాయం చేస్తుంటే సహించలేని పెద్ద మనుష్యులు మంత్రులదాకావెళ్ళి తారుమారు చేయించడంలేదా? ఇలాంటి సందర్భములో శ్రీ సంజీవయ్యగారు లాఖీదులు పంపినా వెనుకబడిన వారు ఎంత ముందుకొస్తారన్నది మనము గ్రహింత వచ్చు

అన్ని ఉద్యోగాలు ఆది ఆంధ్రులకే అన్నమాట వాడుకయిపోయింది ఇన్ని లక్షల మంది ఉద్యోగస్థు లలో ఎంతమంది ఐ జి లు లేదా ఎంతమంది కలెక్టర్లు ఆదిఆంధ్రులు? ఎన్ని వేల హిందూ దేవాలయాలపై ఎంతమంది హరిజనులు పెత్తనం చేస్తున్నారు. ఇలాంటి ప్రశ్నలు వేసుకుని ఆత్మశుద్ధితో జవాబు చెప్పితే సంతోషిస్తా పైగా వెనుకబడినవారికి పగ తీర్చుకోవాలన్న దృష్టి అధికం అని లేనిపోని అప నిందలు వారిపై మోపి, వెనుకబడినవారిపై ప్రభుత్వానికుండే దయా దాక్షిణ్యాలను వారినుండి తీసివేయడానికి ప్రయత్నించడం శ్రీ కౌండిన్యగారికి మంచిదేనా అని ప్రశ్నిస్తున్నా

"ఆంధ్రపత్రికంటే అభిమానమే నాకు ఇది అచ్చొత్తిస్తుందంటే అనుమానమే నాకు

ప్రభుపాద (పర్లివైద్యనాథ్)

లోకం పోకడ

'లోకం పోకడ' శీర్షిక ప్రజాదరణ పొందు ననుటలో సందేహములేదు ఊమెన్‌గారికి నా ధన్యవాదములు

చిట్యాలు కృష్ణమూర్తి (కాకినాడ)


ఢిల్లీ లేఖ

శ్రీ కృష్ణగారివంటి నిశిత విమర్శకుడు ఒక్కరు వుంటే చాలు, కన్ను చెదరకుండా కాటుక పెట్ట డానికి

ముక్కుకు సూటిగా విమర్శించే విమర్శకు లున్ననాడే ప్రజాస్వామ్యం చిరకాలం వర్ధిల్లుతుంది

తోట రామమోహనరావు (దుమ్ముగూడెం)

★



బుధవారం 6-9-61
ప్లవ సం॥ శ్రావణ బ॥ ద్వాదశి
సంపుటము 53 సంచిక : 52

స్థాపితము:
1908

* * *

ముఖ్యసంపాదకుడు
శివలెంక శంభుప్రసాద్

* * *

సంపాదకుడు
శివలెంక రాధాకృష్ణ

* * *

విడిప్రతి : 25 న. పై
సంవత్సర చందా : 13-0-0 రు

* * *

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టివీధి, మద్రాసు-1

★

లోకంపోకడ



'బ్రిటిష్‌వారి హయాంలో కూడా మనకింత అన్యాయం జరుగలేదు! ఆ తెల్లదొరలనే చూడండి. పీకకు ఆనేట్టుగా త్రాగుతున్నారు మనమేమో ఒక్కచుక్క కూడా దొరక్క అలమటించిపోతున్నాం.'

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు

విషయానుక్రమణిక

ముఖచిత్రం బాపూ బొమ్మ.

కథలు

వ్యాసాలు

సీరియల్ కథలు

బాలసాహితి

శీర్షికలు

శ్రీశైల ఆలయ ఉద్ధరణ నిధి

'ఆంధ్రపత్రిక' సేకరిస్తున్న శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివారి ఆలయ ఉద్ధరణ నిధికి ఆగస్టు 26 వ తేదీనాటికి రు. 38,189=32 వసూలు అయింది. యధాశక్తి విరాళాలు ఇచ్చి, ఈ పవిత్రమైన కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందని ప్రజలకు, ప్రజాసంస్థలకు విజ్ఞప్తి చేస్తున్నాము


రాష్ట్ర రాజకీయాలు
నీతో వేగలేకుండా ఉన్నా ఆమెనే కట్టుకుండూ!
కేంద్ర రాజకీయాలు
సంజీవయ్య పార్లమెంటుకు పోటీ చెయ్యవచ్చు
హో! హో! నెహ్రూకి సిక్కులతో బెడద వచ్చి పడింది!
స్వతంత్ర
కమ్యూనిస్టు
కాంగ్రెసువారి కీచులాటలు
సోషలిస్టు



కెరొలినా విశ్వవిద్యాలయం విద్యార్థినీ విద్యార్థులు ఇటీవల హైదరాబాదు వచ్చినప్పుడు ఆంధ్రవిద్యార్థులతో ఇష్టాగోష్ఠి

మనమూ-మనరాష్ట్రం

కౌండిన్య

కేంద్రం పరం కానున్న సింగరేణి గనులు. మద్యనిషేధం అమలుకు తెలంగాణా నాయకుల తహతహ!

సింగరేణి బొగ్గుగనుల్ని కేంద్రం స్వాధీనం చేసుకోబోతున్నది ఇన్నాళ్ళ ఈ ప్రయత్నాన్ని ప్రతిఘటిస్తూ వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం చివరకు తలఒగ్గింది తుదినిర్ణయం యింకా జరగలేదుకాని త్వరలోనే మంత్రివర్గం సమావేశమై ఆ ముక్క కాస్త తీరుస్తుందని ముఖ్యమంత్రి మొన్న చెప్పారు.

సింగరేణిగనులు ప్రస్తుతం ప్రయివేటు కంపెనీ క్రింద ఉన్నాయి పేరుకు ప్రైవేటు కంపెనీయేగాని దీని షేర్లలో నూటికి 88 వంతులు ప్రభుత్వానివే డైరెక్టర్ల బోర్డులో కూడా నలుగురు రాష్ట్రప్రభుత్వ ప్రతినిధులున్నారు ఈ కంపెనీ కొత్తగూడెం తాండూరు ఎల్లందు గనులు నిర్వహిస్తోంది ఏటా 23 లక్షల టన్నులు ఉత్పత్తిచేసి ర 10 12 లక్షలు లాభం తీస్తోంది దీని వరాస్తి విలువ 2 కోట్ల 66 లక్షలుంటుంది

> మా విలేఖరి అస్వస్థులుగా ఉన్నందున ఈ వారం 'న్యూఢిల్లీ లేఖ' ప్రచురించలేకపోయాము

ఇట్లా లాభసాటిగా సాగుతున్న పరిశ్రమ అవడం చేత చాలాకాలంగా కేంద్రం దీనిపై కన్నువేసి ఉంచింది అందుకుతగ్గ ప్రయత్నం కూడా చేస్తూనేవచ్చింది పెయిడప్ కాపిటల్ పరిమితి నిరుడు మూడుకోట్లకు పెంచడంతో 120 లక్షలు విలువగల షేర్లు కొని మరో 2 కోట్ల 95 లక్షలు అప్పుపెట్టి పాలకవర్గంలో ముగ్గురు తమ ప్రతినిధులను నియమించుకోగల హక్కు పొందింది ఇదిగాక ఎప్పుడైతేనేం ఈ గనుల అభివృద్ధికి అప్పురూపంలో 6 కోట్ల దాకా మదుపు పెట్టింది అందుకే అవకాశం దొరికినప్పుడల్లా అప్పు అడిగినప్పుడల్లా ఈ గనులను తమ వశం చేస్తే బాగుంటుందని సలహా ఇస్తోంది శ్రీ సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం ఈ ఒత్తిడి భరించి కేంద్రం అభీష్టం నెరవేరకుండా చూచారు ఆంధ్రప్రభుత్వం యాజమాన్యంక్రింద ఉన్న ఒక పెద్ద పరిశ్రమపై కేంద్రం పెత్తనం రాకుండా నివారించారు ; కావలసిన అప్పుకూడా సాధించారు కాని ఇప్పుడు శ్రీ సంజీవయ్య కేంద్రం వత్తిడికి మెత్తబడ్డారు

కేంద్రం ఈ గనులను తమ వశం చేసుకోవాలనుకోడానికి కారణం ఏటా వచ్చే 10 12 లక్షల లాభం మాత్రమే కాదు తృతీయ పంచవర్ష ప్రణాళిక ఆఖరుకు బొగ్గు ఉత్పత్తి 9 కోట్ల 70 లక్షల టన్నులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు అంటే ద్వితీయ ప్రణాళికలో (6 కోట్ల టన్నులు) సాధించిన దానికన్నా 3 కోట్ల 70 లక్షల టన్నులు అధికంగా ఉత్పత్తిచేయాలి. ఇందులో ప్రభుత్వరంగంలో సాధించాల్సింది 2 కోట్ల టన్నులు తతిమ్మా 170 లక్షల టన్నులు ప్రైవేటు రంగానికి కేటాయించారు ఈ 2 కోట్ల టన్నులలో 30 లక్షల టన్నులు (ఇప్పుడు ఉత్పత్తి అవుతున్న 23 లక్షల టన్నుల కాక) సింగరేణి గనుల నుంచి ఉత్పత్తి చేయాలని సంకల్పించారు ఇందుకు 20 కోట్ల పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది ఇది రాష్ట్రప్రభుత్వంచేత సద్యోపని కాదు రాష్ట్రానికి మదుపుపెట్టి ఈ ఉత్పత్తి సాధించడం కేంద్రానికి ఇష్టంలేదు కాబట్టి గనులలో ప్రత్యకాన్ని అభివృద్ధిచేయాలన్నా మూడవ ప్రణాళికలో నిర్దేశించిన ప్రకారం 30 లక్షల టన్నులు ఇందుండి ఉత్పత్తిచేయాలన్నా కేంద్ర

(62 వ పేజీ చూడండి)

అయ్యగారి రహస్యం సీతారాములు తెలుసుకోగలిగాడు. మరి తన రహస్యం?

గడియారం ఎనిమిదిసార్లు ఆవలించింది అయ్యగారు లేచి ఒక్కసారే ఆవలించారు చిటికెలు వేసేరు ఉలిక్కిపడ్డాడు కునుకుతున్న సీతారాములు గది అలాగే ఉంది అది నిన్న రాత్రి పన్నెండు గంటలకి, తెల్లవారుజామున నాలుగున్నర గంటలకి—అప్పుడు సూర్యుడు అవతల తెగ కాసేడు పైకి పొగినప్పుడున్నూ రూము అంతే అలాగే ఉంది అయ్యగారి గది ఏర్‌కండిషన్డు మరి గడియారంముళ్ళు రెండు వేళల సూచించే వాతావరణ ప్రభావం గదిమీద పడదు


సీతారాములు బయటికి దూసుకున్నాడు అప్పటికప్పుడే బట్లరు బెడ్‌కాఫీ తెస్తున్నాడు "దండా"లండీ అన్నాడు సీతారాముల్ని చూసి అందులో ఎక్కసక్కెమూ ఉంది భయమూ ఉంది ఆ రెండూ గుర్తించని సీతారాములు 'అయ్యగారు లేచారు ఆవలించారు' అన్నాడు చిటికెలో గదిలోకి దూసుకున్నాడు

"ఎదవనాయాల అయ్యగారి బాబుకి కూడా లేదు యీడి దరిజా సుఖవ్రదా నాయునా !" లోపల లోపల పళ్ళు కొరుక్కున్నాడు లోపలికి వచ్చిన బట్లర్ గురువులు

అయ్యగారు కాఫీ చప్పరిస్తూనే సీతారాముల్ని చూసి "ఏమిట్రా! నెధవ చింత కసగా ఉంది కాఫీయా ? కషాయమా ?" అని గద్దించారు బట్లరు వణికిపోయాడు సీతారాములు మాత్రం "ఎర్‌కండిషండ్ గదిలాగే మార్పు లేకండా "కొన్ని సుగర్" అంటూ యింత గ్లూకోజు వందులో కలిపేడు అవిధంగా బట్లర్ అప్పుడు రక్షింపబడ్డాడు

కాఫీ కసగా వుంటేనా కాదు వెంకడ బూట్లు సరిగ్గా పాలిష్ చేయకపోయినా, చాకలి ఇస్త్రీ మడతలు సరిగ్గా పెట్టకపోయినా, ఆఖరికి అమ్మగారు తనకి వడ్డన చేస్తానని స్వయంగా వచ్చినా, అయ్యగారు సీతారాముల్ని సంజాయిషీ అడగుతారు వాడిదంత బాధ్యత

అయ్యగా రటు కుడిప్రక్క బాత్‌రూమ్‌లో స్నానంచేసి మరి పది పదిహేను నిమిషాల్లో తయారై పోతారు ఈలోగా సీతారాములు తన డఫేదారు దుస్తులు ధరించి, సెక్రటరీ ఆవేళ ఫైళ్ళు తెచ్చింది లేనిదీ, డ్రైవరు క్రిందని కారు ఉంచిందీ లేనిదీ చూస్తాడు అయ్యగారు సంతకాలు పెడుతూంటే సీతారాములు వినయంగా ఆంజనేయుల్లాగ నించుంటాడు అప్పుడు వాడికి డ్రైవరు క్రిందని అయ్యగారి రాక గమనించకండా బీడీ కాల్చుకుంటాడేమోననే భయం వేస్తుంది. తానుకూడా ఒక్క బీడీదమ్ము లాగితే బాగుంటుందనే కోరిక కూడా చెలరేగుతుంది వాడికి బీడీదమ్ము అంటే సుఖం కాని నిన్నరాత్రి అయ్య





గారి మంచం క్రింద తలదూర్చి దొంగదమ్ము లాగింది ఖరీదైన సిగరెట్టు అటుతర్వాత వర గడుపే

అయ్యగారు వెనకా సీతారాములు ముందూ లిఫ్టులో వస్తారు అందుకే అందరూ వాణ్ణి పైలట్ రాములు, డేంజర్ లయిట్ రాములు అంటారు కసిగా ఉడుక్కుంటారు నౌకర్లు ఆఫీసులో

"పేదిపాటి గాకపోయామా" అనుకుంటారు ఒకరితో ఒకరు అయినవాళ్ళు రాజభోగం యింద్ర భోగం అయ్యగారంత సుఖం వాడిదని ప్రతీతిఉంది

ఆఫీసులోనూ, ఇంట్లోనూ అయ్యగారి గది ఏర్ కండిషన్డు అయ్యగారి భృత్యుడు సీతారాములు

సీతారాములు ఎక్కడ పుట్టాడో తెలియదు గాని యీ కొలువు వాడికి పాతిక సంవత్సరా లయ్యింది లభించి అంతే వాడి వయస్సు కూడా పాతిక వసంతాలే మరి సర్వీసు పాతిక సంవత్సరా లని ఎందు కన్నానంటే వాడు పెరిగింది అయ్యగారి గ్రాంటుతో నడిచే శిశుశరణాలయంలోనే పదేళ్ల సీతారాములు అయ్యగారింట అగడుగు పెట్టే [redacted] వాడంతే ఉన్న కొడుకు అటు తర్వాత ముగ్గురు పిల్లలూ ఉన్నారు. ఆ బంగళా వయస్సు ఆర్నెల్లు అది యిప్పుడు నాలు గంత స్తుల భవనం అయిపోయింది

సీతారాములు అయ్యగారి బూట్లు పాలిష్‌చేసిన రోజు లున్నాయి. అవి సోంబాబుతో గోలీలు రహ స్యంగా ఆడిన—ముఖవడ్డ రోజులు వాడు అయ్య గారి బట్టలు అందించడం, చేతికర్ర అందించడం చేసిన రోజుల్లో రెండో అబ్బాయి సోంబాబును గోలీలాడొద్దని—అప్పం అయ్యగారి ధోరణితో మందలించిన రోజులూ ఉన్నాయి

హమేషా అయ్యగారి కొలువు వాడికి సంప్రా ప్తించి అంతా నాలుగేళ్ళ

రెంచనుగా అయ్యగారి కారు ఆఫీసునుంచి నాలుగున్నరకి యింటికి వస్తుంది అప్పు డాయన తాను డైరెక్టరుగా ఉన్న నాలుగైదు కంపెనీల వ్యవహారాలు చూస్తారు సీతారాముల్ని సలహా లివ్వ లేదు, ఇవ్వడు కూడాను కాని చేతులు కట్టుకుని వింటానవల్సిందేను అయ్యగారు క్లబ్బుకెడితే కారుతో వాడూ ఉండాల్సిందేను

పెద్దబ్బాయి సోంబాబు పిల్లిలా వస్తాడు పేద్ద లాయరవుతాడని సోంబాబుని అయ్యగారు మొదట

(56-వ పేజీ చూడండి)

హరివంశము

సాందీపనిపర్వం - 26

శ్రీకృష్ణ! ఆమె ఏమిచేయును! కాశీమీద ఆమెకు మక్కువ లేదు గంధర్వునిమీద మక్కువ వదలలేదు ఆమె అనుకొన్నది "మరియొక జన్మ మెత్తి, ఈ నా భర్తను సేవింతును అప్పుడు కాశికి రాదును ఇప్పుడు సహగమనముగదా నాకు విధింపబడిన వది." అనుకొని ఆమె సహగమనమునకు పూనిక వహించినది ఆమె అప్పుడు ఏ కొండమీద వున్నది, ఆ కొండనితంబమును ఆశ్రయించి ఒక నిర్ఝరము పారుచున్నది మరియు ఆ కొండపైన కొండ అంచులను ఆశ్రయించి కర్పూర కదళికా ద్రుమాటవులు పెరిగివున్నవి ఆ అడవులమీద నుండి, తద్రుమనిర్యన్నిర్యాసధారాద్రవవాసనాను గంధములై, గంధసార గంధవాహములు వీతెంచు చున్నవి ఆ గాలులు ఆ గిరినిర్ఝరమునందు పతన వేగవశమున కల్గుచున్న తరంగములయందు కురంగములనుపోలి తురంగలించుచున్నవి అట్టి అంద్రభోవాషమున నామె ముఖప్రక్షాళనము చేసి కొన్నది స్నానము చేసినది విద్యాధరోపరివిరచిత చితాగంధసారకాష్ఠములయందు అగ్నిని రగుల్కొల్పి నది మారుతములేమో, గంధకరటికర్ణతాళ వృత్తాంత తాండవప్రస్తాన విస్తారితములుగా అగ్నిని మరియు రగుల్పొల్పుచున్నవి ఆ అగ్ని ఆ మారుతప్రచోదనమున విచ్చలవిడిగా మండు చున్నది, సుశీల ఆ అగ్నికి ప్రదక్షిణ మాచరించినది ఆమె దృష్టులు అప్పుడు నిసర్గకాతరములు అవి అప్పుడు పుష్పాంజలి విక్షేపముల భంగిని అంగీకరించినవి అట్టిదృష్టులతో నామె ఆ గట్టు నందలి శిలాఘట్టమున మెట్టి నిలచినది నిలిచి అంతర్గమున ఇట్లనుకొన్నది కాశిక బ్రహ్మ పురివాడలో నాదు పుట్టినిల్లున్నది సంతత స్వాధ్యాయాధ్యయనధ్వనిముఖరితము, అగ్నిహోత్ర ధేను ఖరఖురవలయార్ద్ర చంద్రకితాజీవము, త్రికాల శంభుపూజాసమారంభ విజృంభమాణ శంఖకాహళ బహుళ కోలాహలాకులము నయిన ఆనంద కాననమునకు, ఆనందకాననమునందలి బ్రహ్మ పురివాడకు చూడారత్నము ఆ నా పుట్టినిల్లు అభివృద్ధిపొందునుగాక! నా జనయిత్రి ప్రియంవద, కాశికాకటక విప్రకుటుంబినీశ్లాఘనీయ చరిత; ఆమె నిత్యముత్తైదువ అగునుగాక! నా తండ్రి, హరిస్వామి, రుద్రావాన విద్వత్సింహము, అష్టాదశ మహావిద్యాస్థానసామ్రాజ్యభద్రాసనాసీనుడు, ఆయన తన సమానులయందు ఉత్తమ శ్లోకుడై వర్థిల్లునుగాక! మహోన్మశానమున నా బంధువర్గము అంతయు నున్నది ఆ బంధువర్గము బంధువర్గపు తీగయునుపోలె కొనసాగి బ్రతుకునుగాక! పరమ శివ! కాశికానగర మధురప్రియునాయక! నేను ప్రతిప్రభాతమును గంగావాహితో తీర్థమాడిన ఫలమును నాయందు వుంచు, విశ్వేశ్వరస్వామి! విశ్వేశ్వరస్వామి ముక్తిమంటపికి నేను ఇడిన ముగ్గుల ఫలము నాయందు నెక్కొననీ! డుంటిభట్టు ప్రియజనక! ప్రతి చతుర్థిని డుంఠి భద్రేభ వక్త్రుని నేను ఆరాధనముచేసినట్టి ఫలమును నమ్మకానీయబోకు! ఉమాశ్లిష్టవపుష! ఆనందకాననములో నేను జన్మించినట్టి ఫలమును నాయందు పుష్పించనిమ్ము! ఈ సర్వపుణ్యములు సర్వఫలములు నాయందు కూడికొననిమ్ము! మరుసటి జన్మలో నాకు ఈ గంధర్వసుందరమూర్తిని భర్తనుగా దయచేయవలయునయ్యా! కారుణికా! నేను ఇప్పుడు మోహాటవిలోపడిపోయినాను నా మనస్సేమోవనేచరమై సంచరించుచున్నది అత్యంతము చపలమై సంచరించుచున్నది తండ్రీ! నేను ఎన్ని జన్మలు ఎత్తినా, భక్తి అనే త్రాటితో ఈ హృదయ కపిని కట్టివేయుమయ్యా! పశుపతి! నా మనస్సును నీకు పర్ణకుటిని చేసెదనో! దానికి నీవు ధృతి అనే ఆధారాన్ని సంతరించిపెట్టు, దృఢ గుణనిబద్ధంగా చెయ్యి! ప్రతిదినము సమ్మార్గఘటి



తముగా దిద్దు! స్మరారి! నా యీ చేతస్స్ఫుట పటకుటి విశదముగా వుంటుందిగాక! సగమనము, విచిత్రము, పద్మాఢ్యము అవుతుందిగాక! స్వామి! శక్తిసహితుడవై నీవు నా యీ చేతఃకుటిలో నివసించెదవుగాక! జయశంకర! జయసాంబ! జయ పరమశివ! పాహి! మాంపాహి

శ్రీకృష్ణదేవ! ఆమె అగ్నిప్రవేశ చేసినది ఆ అగ్ని ఆమె పాదములయందు మందారమై, ఆమెజఘనములయందు బంధూకమై, ఆమెనాభిదేశమున కొండగోగుపూవై, ఆమెవక్షమున తుమ్మిపూలై, ఆమె ముఖమున కల్పతరు ప్రసూనసుందరమై విహరించినది తండ్రి! ఆమె లింగత్రయగర్భిణికద! ఆమె సాన్నిధ్యవశముచేత విశాటుడును, ఆమె సాంగత్యవశమున విద్యాధరరాజును, సుకృతస్ఫురణచేత త్రిదివపదమునే కాంచినారు మరి విద్యాధరుడు ప్రాణప్రయాణవేళ ప్రియా సంస్మరణము కావించినవాడుకదా! అందువలన వాడు ఆమెకు భర్తయగుటకో అన్నట్లు తిరిగి భూమియందు జన్మించినాడు ఆమెయు అగ్నిప్రవేశసమయమున ఆ గంధర్వుడు తనకు పతికాగా ప్రార్థించియున్నదిగనుక భూమండలమున తిరిగి జన్మమునెత్తినది

ఇప్పుడు ఆవిద్యాధరుడు మలకేతు నామధేయుడైనాడు సుశీల కళావతియైనది వారికి పెండిలియైనది ఆమె భార్యయు, అతడు భర్తయును వారిలో కళావతికి పూర్వజన్మ వాసనలు వదలలేదు ఆమె ఇప్పుడు ముక్తామణిభూషలను ఒల్లలేదు రుద్రాక్షావళీదామకములు ధరించగా ఇచ్చగించినది పటీరద్రవము, పన్నీరు, కురంగనాభియు, కర్పూరమును, కాశ్మీరమును ఆమె అంగీకరించదు భస్మమునుమాత్రమే అంగీకరించును అట్టి ఆ దంపతుల కాపురము విచిత్రముగా సాగినది ఆమె శివునితప్ప మరియొక దేవుని యందు రక్తిని, భక్తిని చూపదు భర్తయందు భక్తిని, రక్తిని వదలుకొనదు ఆమె తన భర్తను చూచి నీవు శివుడవా అనును అతడు నేను నీభర్తను అనును వారు రాజులు రాజిత నిర్మోహపథావధిగా వారి కాపురము సాగినది వారి కడుపును ఫలించినది మలయకేతు మహీపాలమన్మథునకు ఆమె రతి, ఆమెకు అతడు అనంగుడైన మన్మథుడు భర్తయందు ఆమె శివుని చూచినది, శివుని ఆరాధించినది ఆమెకు అతనివలన సౌభాగ్యభాగ్య వైభవప్రాభవాది శుభగుణ శ్రీసమృద్ధులు, సుతులు, ముగ్గురు కల్గినారు ఆమె సుఖముకాని సుఖమును అనుభవించుచున్నది

ఒక్కనాడు ఒక చిత్రకరుడు మలయకేతుని రాజధానికి వచ్చినాడు వానివద్ద వారణాసీ వృత్తాంతములు లిఖింపబడిన చిత్రపటము ఉన్నది ప్రజలు వాని చిత్రలేఖనవైదగ్ధిని పొగడగా విని రాజు వానిని ఆస్థానికి పిల్పించినాడు తాను ఆ చిత్రపటమును తిలకించినాడు భార్యతోకూడి తిలకించినాడు ఆ పటమును తిలకించుచుండగా, కళావతి ప్రాగ్జన్మవాసనావాసితమైన మనస్సుకలదియైనది ఆమె ఇప్పుడు కళావతికాదు సుశీల కళావతిగా తన్ను మరచిపోయినది ఏదో సమాధి స్థితిని పొందినదానికివలె, కన్నులు మొగిచి ముహూర్తమాత్రము ఊరకుండి తిరిగి కన్నులను తెరచినది కాశియంతయు తాను అచ్చట అప్పుడు చూచుచున్నట్లు లామె కన్నులముందు ఆడినది తనపజ్జను ఉన్నయతడు ఎవ్వరు? తనకు భర్తయా! అవును! అవును అతడు గంధర్వుడు తన్ను నిద్దురలోనున్న దానిని ఎత్తుకొనిపోయినాడు అవును అవును అతనికి కాశికయున్న తెలియునా! అది తనప్రాణము. అది తన జీవితసర్వస్వము ఆమె అన్నది "ఓయి! గంధర్వరాజ! ఈ పటమును చూచినావా! ఓయి! కాశిక ధ్వనుర్వల్లి, గంగనారి, లోలార్క కుధరధరులు కోటియుగ్మము వృషము బాణము లక్ష్యమో వృజినరాశి మరి ధామము ష్కు డెవరందువు! సాక్షాత్తు పరమశివుడు సాక్షాత్తు విశ్వనాథుడు ఓయి! పరమశివ! ఓయి! సాంబ!

(55-వ పేజీ చూడండి)

హరిత శివశర్మ

మంచి చిత్రం కథ: మాయదారిలో మజిలీ

అందంలోంచి ఆనందంలోంచి ఆగిపోయిన కాలంలోంచి లేచి నిలబడ్డారు నాయుడుగారు. తృప్తిని నిట్టూర్చారు. వయసు, మీదపడ్డ ఇన్నేళ్లకు ఇన్నాళ్లకు ఈనాడు వయసుమీద ఉన్నవాడిగా జవసత్వాలతో నిండినట్టుంది దేహం. పువ్వులా తేలిగ్గా ఉంది. మూడునించి నాలుగుదాకా కూర్చొని అలాగే కాలం పోక ఆడటం చూడటం అనేది ఇంతదివ్యమైన అనుభూతిని ఇవ్వగలదని ఆయన ఇప్పుడే గ్రహించాడు. ఈ గంటసేపూ కాలం కూడా ఆగి తన ప్రక్కనే కూర్చుని తనతోపాటే కాలాతీత స్థితిలో ఉండి హాయిగా ఆడుకుంటున్న నవదంపతుల ఆటచూస్తూ ఉండిపోయింది. వాళ్ల ఆనందానికి, ఆ సన్నివేశం అందానికి చిరప్రేమ నాటికి చిత్రపటాలుగా నిలిపి చూపింది.

తను వయసులో ఉన్నపుడు జీవితం అంతా ఆనందంగా అందంగా మాత్రమే కనబడేది. గృహస్థు అయి బాధ్యతలు పెరిగాక జీవనసమరం ఆరంభించాక నానాటికం దుఃఖసుఖంగా అక్కడక్కడ సుఖాల పరామర్శలతో తెరచుకున్న పిల్లలు కన్నాక ఇప్పుడు అన్నవస్త్రాలకు లోటు లేకుండా నాలుగురాళ్లు వెనకేసి ఇరు వర్గాల కూతురికి పెళ్లిచేసి మితపడ్డాక మనసులో వికారాలు తగ్గిపోయాయి. ఈ స్థితి చేరి తెలుసుకొనేరు ఇది ఆనందమూ కాదు, దుఃఖమూ కాదు రెండూ కానిది బహుశా రెండిటికి మధ్య ఉండేది. ఇవాళ హాయిగా జీవితం పాతికేళ్లు వెనక్కి జరిగినట్టయింది పిల్లల ముచ్చట చూస్తూ ఉంటే.

తన జీవితపు మధుర ఘట్టాల ఆల్బం లోంచి ఒక పేజీ తీసి చూసినట్టయింది. ఈ క్షణాలన్నీ తను అనుభవించినవే. ఈ ఆనందం, తను మునిగి స్నానం చేసినదే. కాని ఇప్పుడు ఆ ప్రక్కన కూర్చుని చూసిచూసి గత స్మృతులు తనూ కాలం వెంటతెచ్చుకుంటే అంతా లేదు.

వాళ్ళతోపాటు వాళ్ళకి తోడుగా తనూ జోకులు వేయలేకపోయాడు. మొగుడూ పెళ్లాల సరసాలూ — అందులో మునుగుతూ వాళ్ళు వి, తోడు వాళ్ళు వి భోగాలు లేకుండా తోడు లేకుండా అర్థం లేకుండా ఉంటాయి. నిష్కారణం నవ్వేస్తారు. నవ్వుకుంటారు. వేళ్లు తగిలితే ఒళ్లు పులకరిస్తుంది. కాళ్లు కళ్లుమూసుకుంటారు. అది బాధో ఆనందమో బాధ కలిగించేటంతటి ఆనందమేమో వెధవది గుర్తురావటంలేదు ఇప్పుడు.

మళ్లీ మళ్లీ కావాలని మునివేళ్లు తగిలించుకుంటారు. దొంగచూపులు చూసుకుంటారు. నవ్వుతారు, సిగ్గుపడతారు. తనూ అందులో జొరబడి ఏదో జోక్ చేసే జాలిగా చూస్తారు. బావుండదు, ముసలాడేమనుకుంటాడో అన్నట్టు నవ్వుతారు. వెంటనే నవ్వుకుంటారు. తను మంచి జోక్ నే వేస్తున్నాడు మరి. వాళ్లు పగలబడి నవ్వుకుంటున్న వాటికన్న మంచిదే. ఏవిటో మాలోకం. వాళ్ల భాష వాళ్ల బాధ వాళ్లకే అర్థం కావాలి.

అదేవిటే! మరీ విడూరంగా పోతే అమ్మాయి సీత వేళ్ల మీదనే గదా ఎంతసేపూ అల్లుడిదృష్టి! దానికి కొరమ్ము బొత్తిగా గాదు. స్ట్రియేకాకి అరంగుళం ఇవతలగా వేళ్లు పెడ్తూ కాగుతుంది. ఆ పిల్లడు ఎంత నొచ్చుకుంటాడో! ఇంకా నయం! అమ్మో! అంతేగు నయమే. మరి తన మోచెయ్యి కుర్చీకి తగిలి నరం అదిరింది. ప్రాణం జిల్లుమన్నట్టయింది. మాటవరసకి అయ్యో అన్నా గంతే మళ్లీ వాళ్ల నవ్వులో గొడవల్లో పడిపోయారు! మరి దానివేసు గ్రియికర్రి కొడితేనే ఆ పిల్లడు అంతగా గంటలతరబడి తడిలిపోయాడు! అదేవిటి! కోపం కూడా వచ్చేసింది. "అలా ఆపితే వేళ్లు నెప్పెడతాయి చెప్పితేనీగ్గాదూ" అని గదమాయించాడు కూడా.

ఇరవైయేళ్లు పెంచి పెద్దచేసిన తనకిలేని బాధ, — ఇరవై రోజుల్లు కూడా కాలేదు పెళ్లయి — వీడికుండాలి. ఏమో ఉందేమో ఏమో ఏమిటి ఉంటుంది అది కాపరానికొచ్చిన కొత్తలో అమ్మదానేత్ర కూడగా మలు తరిగినా ఉంటే, తను అంతసేపూ అలా నటింటి కిటికీ నిలువుల్లోంచి చూసు నిలబడేవాడు— ఆ కతి క్రీటవేపూ వేళ్లవేపూనా నిజమే చిత్రమే అంతా ఇంతేకాబోలు. అగో మాట ప్రతిజీవినీ కొన్నాళ్లు బాటు ఆవరిస్తుంది. కాని ఎంత చక్కని మాయ! ఎంత చిక్కని మాయ! మాయదారి బతుకులా మాయదారి ప్రేమలో ఎన్ని తెరలు వేసి ఎన్ని మాజిక్కులు చేశాడూ పైనున్నవాడూ! అంతా ఒక మాయసభలో కట్టి పారేశాడు అసాధ్యుడు.

బయటపడ్డాక ఎన్ని ఇక్కట్లు పేచీలు పూచీలు చుట్టూ కూడితేనేం—ఆ మాయలో ఉన్న కాసేపూ హాయి. బతుకంతా హాయిగా విశాలంగా దారిపొడుగునా ఇలాటి మాయదారి మజిలీలు ఎక్కడగా దగ్గరదగ్గరగా



కట్టేసుకోవాలి కాబోలు. ఇంటిదానిమీద గయ్యిమని లేచి తిట్టిపోసేకన్న చల్లగా సరదాగా మాటాడ్డమే మెరుగు. ఈలోగా ఓపది నిముషాలు సరదాగా అయిపోతుంది.

మనదగ్గిర ఉపకారం కోసం వచ్చినవాళ్లకి అది కాస్తా చేసేసి వాళ్ల మంచి మాటలు వింటూ ఉంటేనే బాగుంటుంది—ఏడుపు మొహాలూ, కోపపు మాటలూ చూడడంకన్న. ఈలోగా ఇంకో పదినిముషాలు అయిపోతుంది. ఇలా ఓలతు "పదినిముషాలు" పోగేసుకునేవరకూ, ఆలోగా "రైలుకి" టైమైపోతుంది. ప్రయాణం చేసినట్టే వుండదు అన్నట్లు ఇపుడు అప్రాడెవడో సిఫార్సు పట్టుకొస్తాడు కాబోలు ఉద్యోగం కోసం. చిన్నవెధవ అయినా దిగులుగా ఉన్నాడు. ఏవుంది ఉద్యోగం లేకనే వెర్రి వెధవ. అది దొరికితే పెళ్లాం వస్తుందనీ, సంసారం పెరుగుతుందనీ, జీతం చాలదనీ బాధలనీ తెలీదు కాబోలు. తెలుసేమో! తెలిసినా తెలిపోయినా వాడూ సీతలాటి చిన్నదాని చేసుకుంటాడు. ఓరోజు మధ్యాహ్నం ఆఫీసు ఎగేసి దాంతో కొరమ్ము ఆడతాడు. వాళ్ల మావగారు పక్కని కూర్చుని ముచ్చట పడతాడు.

కాలం కాసేపు ఆగిపోతుంది. అందం ఆనందం చిత్రపటాలై నిలచిపోతాయి. మంచిరోజుల ఆల్బంలో మరోపేజీ నిండుతుంది.

నాయుడుగారు తేలిగ్గా హాయిగా నిట్టూర్చి అందంలోంచి ఆనందంలోంచి ఆగిపోయిన కాలంలోంచి లేచి నిలబడ్డారు. బల్లదగ్గరకువెళ్లి ఆగిపోయిన జేబుగడియారం తీసి కాలచక్రం ముందుకు తిప్పారు. ★



దైవజ్ఞ పాతూరి శ్రీరామమూర్తి

6-9-1961 బుధవారము మొదలు
12-9-1961 మంగళవారము వరకు

మేషం

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా)

పట్టుదలతో నిలబడి మాట నెగ్గించుకున్నామనే సంతృప్తికి అవకాశం లేకుండా పోతుంది వృత్తిలో ప్రతిబంధకాలు వస్తున్నా మొత్తంమీద ఒక దారికి రాగలుగుతారు శుభకార్యాలలో మీ అంచనాకు మించి ఖర్చు అవుతుంది మిమ్మలను ప్రోత్సహించి సహాయం చేయవలసినవారే బాధ్యతలను మీమీద పెట్టటానికి చూస్తారు సభాగౌరవం లభిస్తుంది ఎదురు చూస్తున్న శుభవార్తలు సకాలంలో వస్తవి పదిమందితో కలిసి చేయు పనులలో స్పర్థలు రాగల సూచనలున్నవి వారాంతంలో ఆకస్మాత్తుగా దెబ్బ తగలటంవల్లగాని నరముల యందు పోట్లు, మంటలు వల్లగాని బాధ కనిపిస్తుంది 6, 7 తేదులలో ఇష్ట వస్తు ప్రాప్తి, బంధుగౌరవం

* * *

వృషభం

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా.)

ఈ సమయంలో ఇతరుల సలహాకోసం ఎదురు చూడటం మంచిదికాదు. పనులు నెమ్మదిగా జరిగినా సుఖము, సంతృప్తి బాగుంటవి అధికార్లతో సంప్రదింపులు అనుకూలిస్తవి అయితే డబ్బుకు సంబంధించిన లావాదేవీలలో ముందే ఖచ్చితంగా మాట్లాడుకొనటం అవసరం ఇతరుల వద్దనుంచి మీకు అందవలసిన పుస్తకాలు, లేక ముఖ్యమైన వస్తువులు సకాలంలో అందకపోవటం వల్ల మీ కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడుతుంది ధర్మకార్యాలు జయప్రదంగా జరుగుతవి దేహశ్రమ ఈవారం అంతా అధికంగా వుంటుంది వృత్తి, వ్యాపారాలలో స్నేహితులవల్ల కలిగే చిక్కులను యుక్తితో సమర్థించుకొనగలుగుతారు 8, 9 తేదులలో మనో విచారం, సుఖభంగం, బంధువులవల్ల ఖర్చు, శ్రమ

* * *

గ్రహస్థితి

కర్కాటకంలో శుక్రుడు, సింహంలో సూర్య రాహువులు, కన్యలో అంగారక బుధులు, మకరంలో గురు, శనులు, కుంభంలో కేతువు, కటక, సింహ, కన్యలలో చంద్రుడు

మిథునం:

(మృగశిర 3, 4 పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పా)

దైవానుగ్రహంవల్ల కుటుంబ సమస్యలు క్రమంగా ఒక దారికి వస్తవి గతవారంకన్నా ఆదాయం బాగుంటుంది ప్రతివిషయంలో చాకచక్యంతో ప్రశాంతంగా పనిజరుపుకోగలుగుతారు వినోదకార్యక్రమాలలో పాల్గొంటారు. మీ స్నేహితుల మధ్య ఏర్పడిన తగాదాలలో కొంత వరకు మీరు నలగవలసి వస్తుంది ప్రయాణాలు మీ నిర్ణయం ప్రకారం జరుగవు ఈ సమయంలో ఇతరులకు అప్పులు ఇచ్చే బాధ్యతలను పెట్టుకొనవటం మంచిదికాదు వారం రెండవభాగంలో మీమీద నిర్నిమిత్తంగా వదంతులు వ్యాపించగల అవకాశాలున్నవి లాటరీ, చిట్లా వ్యాపారంవంటి పనులతో ఉపయోగం తక్కువ ఈవారం అంతా సంచారంతో కూడిన పనులు అధికం 6, 7 తేదులలో ఆదాయ వృద్ధి, దైవకార్యాలు, మంచివారి స్నేహం

* * *

కర్కాటకం

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష)

అన్ని విధాలా జాగ్రత్తగా ఉండవలసిన సమయం తెలియకుండా దుబారా ఖర్చులు పెరుగుతవి ఏదో ఒక సందర్భంలో కలహాలు వస్తూవుంటవి మీ కార్యదీక్ష కొంతవరకు అనుకూలిస్తుంది మీకు ఆశ చూపించి మీ డబ్బు అపహరించటానికి చూచేవారు ఉంటారు జాగ్రత్తగా ఉండండి పిల్లలఆరోగ్యం బాగుండదు గతవారంలో ఆకస్మాత్తుగా మీమీద పడిన భారం ఈ సమయంలో తలవని తలంపుగా తొలగుతుంది హాస్యానికి కూడా తొందరపడి మాట్లాడతగిన సమయంకాదు విలువగల వస్తువులు పోగొట్టుకుంటారు విద్యావ్యాసంగాదులలో ఉత్సాహం తక్కువ పైవారి మెప్పుదలకోసం శ్రమ పెంచుకోవద్దు కుటుంబంలోనివారితో అభిప్రాయ భేదాలు వస్తవి 7, 8 తేదులలో ఆలోచనలేని పనులు బంధువిరోధం

* * *

సింహం

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా)

చేతిలోని నీరు వదులుకుని మబ్బులోని నీటికి ఎదురు చూచినట్లుగా ఉంటుంది విశేషంగా శ్రమపడి పని సాధించుకొనవలసిన సమయం సాటివారి సలహాను అనుసరించకుండా స్వశక్తితో విజయం సాధిస్తారు ప్రయాణాలు చేయవలసి రావచ్చు బంధువర్గంలో మీయందు గౌరవభావం పెరుగుతుంది పిల్లలఆరోగ్యం సరిగా ఉండదు ఎప్పుడూ ఏదో ఒక ఆలోచన, ప్రయత్నము చేస్తుఉంటారు సంఘంలో మీ మాటకు విలువ బాగుంటుంది ధనాదాయం సాధారణంగా ఉంటుంది వారాంతంలో ఒకేదఫా అనేకబాధ్యతలు చూచుకొనవలసి వస్తుంది జీర్ణకోశాలలో బాధ కనపిస్తుంది 11, 12 తేదులలో శుభ సంబంధమైన ఖర్చులు, మిత్రలాభం

కన్య:

(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా)

వృత్తిలో మాట దక్కించుకొనలేకపోతామనే భయం తోస్తుంది దైవబలంవల్ల వ్యవహార రంగంలో జయం పొందగలుగుతారు ఉత్తర, తూర్పు దిక్కులనుంచి అనుకూలవార్తలు తెలుస్తవి ఆరోగ్యంగురించి జాగ్రత్తగా ఉండండి నౌకరులు మొదలయినవారిమూలంగా కార్యసిద్ధి పొందగలుగుతారు క్రొత్త మార్గాలలో ధనాదాయం లభిస్తుంది ముందు ముందు ఎప్పుడో అనుకూలించగల పనుల నిమిత్తం ఈ సమయంలో శ్రమ, ధనవ్యయము కనుపించగల అవకాశాలున్నవి విధ్యమైనంతవరకు కార్యభారాన్ని తొలగించుకొనటానికి చూడండి వారాంతలో ఆలోచన తోచకపోవటంవల్ల లభించి అవకాశాన్నివదులుకొంటారు 6, 7 తేదులలో వేదాయ వృద్ధి, క్రొత్తవారితో స్నేహం, దైవకార్యాలు

*　　*

తుల

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు)

సుఖం తక్కువే కాని, గౌరవము, మనశ్శాంతి లభిస్తవి చిక్కులనుంచి ఎలా బయటపడగలమా అని ఆలోచించే సమయంలో అకస్మాత్తుగా ధనం లభిస్తుంది మీ మాటను నిర్లక్ష్యంగా చూచేవారు ఉంటారు అయితే తిరిగి ఏదో ఒక సందర్భంలో మీ ప్రాపకం నిమిత్తం రాక తప్పదు వ్యవహార రంగంలో మీ ఊహలు సక్రమంగా జరుగుతవి సంచారంతో కూడిన కార్యక్రమాలు అధికం అవుతవి చేతిలో ఉన్న డబ్బును ముందు ఖర్చుపెట్టటంవల్ల అత్యవసర సందర్భాలలో అవస్థ పడవలసివస్తుంది ముఖ్యంగా ముందు జరుగవలసిన పనులనుగురించిన ఆందోళన మిమ్ములను కొంతవరకు క్రుంగతీయగల అవకాశాలున్నవి 10, 11 తేదులలో సాహస కార్యాలవల్ల శ్రమ, అనవసరవిషయాలలో కలహప్రసంగాలు

*　　*　　*

వృశ్చికం

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

మీ యోగ్యతకు, పరిశ్రమకు తగినంత గౌరవము ధనాదాయము పొందగలుగుతారు వృత్తిలో అన్ని విధాలా అభివృద్ధి కనుపిస్తుంది వ్యవహార రంగంలో విజయం సాధించగలుగుతారు కాని, అపవాదులు రాకుండా చూచుకొనవలసిన అవసరం కనుపిస్తుంది మీ క్రింద పనిచేసే మనుష్యులతో పేచీలు రాగల సమయం ప్రయాణాలు అనుకూలిస్తవి ప్రత్యేకంగా ఒకానొక ప్రయోజనం నిమిత్తం మీరు చేసిన యోచనలు, ప్రయత్నాలు నిరుపయోగం కావటంవల్ల మనస్సులో తాత్కాలికంగా విచారం కలుగుతుంది కుటుంబసమస్యలు సక్రమంగా పరిష్కారం అవుతవి ఖర్చు అధికంగానే ఉన్నట్లు తోస్తుంది అయితే సుఖము, శాంతి లభిస్తవి పుణ్యకార్యాలలో పాల్గొంటారు 11, 12 తేదులలో శుభవార్తలు, బంధువులవల్ల అనుకూలత, అధికారులతో సమావేశం

*　　*　　*

ధనుస్సు

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా)

ప్రస్తుతం మీ వ్యవహారాలు చక్కదిద్దుకొనటంలో సులభంగా యుండే క్రొత్త పద్ధతులను అనుసరించగలుగుతారు కంట్రాక్టులు మొదలయిన ఒప్పందాలకు అనుకూలమయిన సమయం దూరమందున్న మిత్రులవద్దనుంచి లాభవార్తలు తెలుస్తవి అనుకోకుండా ఖర్చులభారం పెరుగుతుంది హాస్య ప్రసంగాలు మితిమీరకుండా చూచుకొనటం అవసరం కుటుంబకార్యక్రమాలు చాలాభాగం సకాలంలో జరుగుతూ ఉంటవి వృత్తి వ్యాపారాలలో అత్యాశకు పోవటంవల్ల మొదటికి మోసం రాగల సూచనలున్నవి ఇతరులకు సహాయం చేస్తామని లోగడ మాట ఇచ్చినా వీలునుబట్టి విరమించుకొనవలసి వస్తుంది స్నేహితుల నిర్బంధాలకులొంగి ఏ వ్యవహారంలోను పెట్టుబడి పెట్టవద్దు 7, 8, 9 తేదులలో మంచి పనులలో విఘ్నాలు ఇతరులవద్దనుంచి రావలసిన డబ్బుకు పేచీలు

*　　*

మకరం

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా)

మొదట్లో కొంత అసంతృప్తి కనుపించినా క్రొత్త పద్ధతులకు, క్రొత్త వాతావరణానికి అలవాటు పడటంవల్ల మనశ్శాంతి పొందగలుగుతారు ఆరోగ్యం ముందుకన్నా బాగుంటుంది జరగటానికి వీలుకాని పనులనుగురించిన ఆందోళన, ఆలోచనలు ఈ వారారంభంనుంచి విడిచిపెట్టి లభించిన అవకాశాన్ని చురుకుగా వినియోగించుకోగలుగుతారు బాహ్య ఆడంబరంమాత్రం తక్కువగాఉన్నా, ఫలితం బాగుంటుంది బంధు మిత్రుల వద్దనుంచి రావలసిన డబ్బుకు ప్రస్తుతం ఎదురుచూడవద్దు వృత్తిలో కలహప్రసంగాలు వచ్చినా మీ ప్రయోజనాలకు అభ్యంతరం ఉండదు కొన్ని వ్యవహారాలలో ఒక అడుగు వెనుక వేయవలసినట్లు తోచవచ్చు కాని, చివరకు మీ మాట నెగ్గుతుంది విశ్రాంతి మాత్రం ఉండదు 9, 10 తేదులలో నిరుత్సాహం, దొంగతనంగా వస్తువులు పోయే సూచన, త్రిప్పట

*　　*　　*

కుంభం

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ భాద్ర 1, 2, 3 పా)

లోగడ అకస్మాత్తుగా జరిగిన పొరపాట్లను సరిచూచుకొనటంతో ప్రస్తుతం మీ ప్రయత్నాలలో నిదానం ఏర్పడుతుంది సులభంగా నెరవేర్పగలమనుకుని ఒప్పుకున్న పనులు భారంగా తయారు అవుతవి ఎదురుచూస్తున్న వార్తలు సకాలంలో వస్తవి ప్రయాణాలు అనుకున్న ప్రకారం జరుగుతవి అయితే విశేషంగా ఫలితం కనుపించకపోవచ్చు గౌరవ బాధ్యతలు పైనపడే సమయం కుటుంబంలో శుభకార్యాలు జరుగుతవి అధికారులతో ఏవిధంగాను పేచీలు రాకుండా చూచుకొనండి ఇతరులనిమిత్తం పెద్ద మనుష్యులను కలుసుకొనవలసివస్తుంది ఈవారం మొత్తం మీద మనశ్శాంతి, గౌరవము బాగుంటవి మాటలలో మీ హుందా తనానికి లోపం రాకుండా చూచుకొనగలుగుతారు 10, 11 ,12 తేదులలో వ్యవహార అనుకూలత బంధువులతో కలతలు

*　　*　　*

మీనం

(పూ భాద్ర 4 పా, ఉ భాద్ర, రేవతి)

భిన్నాభిప్రాయాలుగల వ్యక్తులను మీ బుద్ధిబలంతో ఒక మార్గానికి తీసుకుని రాగలుగుతారు శ్రమపడి పైవారి ఆదరాభిమానాలను సంపాదిస్తారు అయితే విశేషంగా అదృష్టం కలసి వస్తుందని అనుకోవద్దు మీమీదఉన్న భారాన్ని తొలగించుకుంటారు కుటుంబంలో సాధారణమైన పేచీలు వచ్చి వెంటనే సమసిపోతవి చేసేపనిమీద మనస్సు నిలవకపోవటంవల్ల తరచు తప్పులు చేస్తుంటారు చాలావరకు మీరే సర్దుబాటు చేసుకోగలుగుతారు కాని, ఖర్చులు అధికమవుతవి వారం రెండవభాగంలో మిమ్ములనుగురించి లోటివారికి ఉన్న సందేహాలు తొలగిపోతవి మీ చిక్కులు విడిపోయిన తరువాత సహాయం చేయటానికి అందరు ముందుకు వస్తారు 6, 7 తేదులలో ఉత్తర దిక్కునుంచి శుభవార్తలు, ఇతరుల మోస యత్నాలు. ★

ఈవారము ధరలు

బంగారు ధర ఈ వారం మందీలో నిలుస్తుంది వెండి ధర కొద్దిగా పెరుగుతుంది పసుపు ధర తేజీవచ్చి వారం రెండవ భాగంలో తగ్గుతుంది వేరుశనగపప్పు ధర తేజీలో నిలుస్తుంది నూనె ధర మామూలుగా ఉంటుంది నూవుల ధర కొద్దిగా పెరిగి వారాంతంలో తగ్గుతుంది నూవుల నూనె ధరలో మందీ కనుపిస్తుంది గోదుమలకు గిరాకీ రావచ్చు మిర్చిధర కొద్దిగా పెరిగి మరల తగ్గుతుంది మినుముల ధర వారం ఆరంభంలో మందీలో ఉంటుంది

మనమూ మనదేహస్థితీ

డా॥ గాలి బాలసుందరరావు

టాన్సిలైటిస్ - శస్త్ర చికిత్స

గతవారం టాన్సిలైటిస్‌కు, ఔషధ చికిత్సను గురించీ, టాన్సిల్సు శస్త్రచికిత్సద్వారా తీసి వేయవలసిన పరిస్థితులను గురించీ తెలుసుకున్నాము

టాన్సిల్ లైటిస్‌కు శస్త్ర చికిత్స చేయవలసినవారు, అందుకు ప్రత్యేక నైపుణ్యం, అనుభవం సంపాదించిన శస్త్రవైద్యులు డాక్టర్లందరూ సర్జన్లుకారు — ప్రతి సర్జనూ ఆపని వేయిలేడు అందుకు ప్రత్యేకమయిన పరికరములు, మైకంయిచ్చే నిపుణుల సహాయం, ఆయుధములు అందించేవారి సహాయం, ఆపరేషన్ అయినతరవాత, రోగిని కాపాడే నైపుణ్యంవున్న నర్సుల సహాయమూ కావాలి ఇవన్నీ లేనివారు టాన్సిల్సు శస్త్రచికిత్సద్వారా తీసివేయడానికి పూనుకోడం, అతి ప్రమాదకరమయిన విషయం

శస్త్రచికిత్సతో టాన్సిల్ తీసివేసే విధానాన్ని టాన్సిలెక్టమీ అంటారు లాటిన్ భాషలో 'ఎక్టమీ' (Ectomy) అంటే 'కోసి తీసివేయడం' అని అర్థము టాన్సిలెక్టమీ అంటే టాన్సిల్‌కోసి తీసివేయడం 'ఎపెండి సెక్టమీ' అంటే ఎప్పెండిక్సు కోసి తీసివేయడం అతిసాధారణంగా జరిగే ఆపరేషన్ల ఇంగ్లీషుపేరే సామాన్యప్రజ సాధారణంగా ఉపయోగిస్తారు 'ఆపరేషన్' అన్నమాట శస్త్ర చికిత్సకు మారుగా ఉపయోగించడం మామూలైపోయింది.

టాన్సిలెక్టమీలో వివరములన్నీ సామాన్యప్రజకు అనవసరం కాని ఆ ఆపరేషన్‌లో వివరములు తెలుసుకున్నందున కొన్ని లాభాలున్నవి

టాన్సిలు కేబేజి ఆకారం గలది దానిమూలం కంఠకుడ్యంలో నాటివుంటుంది కంఠమును క్రమ్మివుండే మ్యూకస్ పొర టాన్సిల్ ముందుభాగమును కప్పి దానితో అంటే వుంటుంది ఆరోగ్యస్థితిలో ఈ పొర టాన్సిల్‌ను వదులుగా అంటి వుంటుంది పండిన చింతకాయలో చింతగింజను చుట్టివుండే పొరతో ఈ పొరను పోల్చవచ్చును చింతగింజ పుచ్చక, మంచిస్థితిలో వున్నప్పుడు ఈ పొరను చీల్చి, అదమగానే గింజ తేలికగా బయటకు వస్తుంది కాని గింజ పుచ్చినప్పుడు తేలికగా బయటికి రాదు టాన్సిల్ విషయంలోనూ అంతే! టాన్సిలైటిస్ ముదిరినకొద్దీ టాన్సిల్ పైపొర టాన్సిలును అతుక్కునిపోయి తేలికగా విడిపడదు టాన్సిల్‌కు పోయే అర్టరీలు, వెయినులు టాన్సిల్ వెనుకవైపునుంచే దానిలోకి ప్రవేశిస్తవి

ఈ పొరకు క్రిమి నిరోధకశక్తి ఎక్కువగా వుండదు అందువల్లనే టాన్సిల్ క్రిమి ప్రవేశాన్ని ఆపలేక తేలికగా ఇన్‌ఫ్లేం అయిపోతుంది

టాన్సిల్ తీసివేయడంలో కత్తులు ఉపయోగించరు టాన్సిల్‌మీద పొరను చిట్లించి టాన్సిల్‌ను వదులుచేసి, ఉక్కుతీగెను ఉచ్చుగాచేసి, ఆ ఉచ్చులో టాన్సిల్ మూలమునుఉంచి, ఆ తీగెను బిగిస్తారు ఇందుకు ప్రత్యేకమయిన సాధనం కావాలి క్షణకాలంలో టాన్సిల్ వూడి బయటకు వస్తుంది టాన్సిల్‌మీద పొర తేలికగా విడిపడ్డప్పుడు రక్తనష్టం (Hoemorrage) అంతగా వుండదు కాని యీ పొర టాన్సిల్‌కు అతుక్కొన్నప్పుడు ప్రతి అతుకులోనూ ఒక చిన్న రక్తనాళం తెగి రక్తనష్టం అధికంగా జరుగుతుంది అంతేకాదు టాన్సిల్ క్రింది భాగంలోవుండే పొరలు చినిగి తేలికగా మానక, అక్కడ మచ్చ యేర్పడి అది కుంచుకోడం జరుగుతుంది శస్త్రచికిత్సకు జంకి ఈ స్థితి యేర్పడే వరకు టాన్సిలైటిస్‌ను ముదర నివ్వగూడదు ఇల్లా ముదిరినప్పుడు రక్తనష్టమే కాకుండా, టాన్సిల్‌లో కొన్నిభాగములు మిగిలిపోయి, ఆపరేషన్ అయినతరవాత కూడా అప్పుడప్పుడు వాస్తూ పాత బాధ పాత బాధగావే ఉండిపోవడం జరుగుతూ వుంటుంది టాన్సిల్ మూలం సమీపంలో అతి ప్రధానములయిన నరములూ, ఆర్టెరీలు, వెయినులు ఉన్నవి దానిని గుంజ తీసేటప్పుడు వీటిలో ఏవయినా చినిగితే ఆ రక్తస్రావం అరికట్టరానిదై క్షణాల్లో ప్రాణ మోసం జరగవచ్చును ఇటువంటివేవీ జరగకుండా ఉండాలంటే తగిన అనుభవమూ, అవసరమైన హంగూ వుండాలి

టాన్సిలైటిస్ మరీ ముదిరిపోయి రక్తనాళములు తెగినప్పుడు తప్ప టాన్సిలెక్టమీలో పెద్ద రక్తనష్టమేమీ వుండదు అల్లా తెగిన రక్తనాళముల మూతులను పట్టుతో తయారయిన దారంతో నర్సును కట్టివేసి ఆ రక్తం నష్టాన్ని నిలిపివేస్తాడు ఇందుకూ సాధనములు వుండాలి మంచి నైపుణ్యం వుండాలి కాని అనుభవజ్ఞులచేతిలో మరీ ముదిరిపోని టాన్సిల్ కోసినప్పుడు తేలికగావే రక్తనష్టం ఆగిపోతుంది

టాన్సిలెక్టమీ కంఠంలో జరిగే ఆపరేషను. కంఠం, శ్వాసద్వారం టాన్సిల్ కోస్తున్నప్పుడు వచ్చే రక్తం, టిష్యూతునకలు, చీము, చొంగ ఇవన్నీ కంఠంలోకి పోకుండా జాగ్రత్తపడాలి ఆపరేషన్ జరిగేటప్పుడు శ్వాసకోశంలోకి, ఈ ప్రమాదకర పదార్థములు పోకుండా అరికట్టినా ఉచ్ఛ్వాస నిశ్వాసము తేలికగా జరగడానికి ప్రత్యేక సాధనములు వచ్చినవి అవి రాకమునుపు మైకం యివ్వడం చాలా ప్రమాదకరంగావే ఉండేది ఇప్పుడా ప్రమాదం లేదనే చెప్పవచ్చును అయితే యీ పరికరం అందరివద్దా వుండదు దీనిని ఉపయోగించడానికి ప్రత్యేక శిక్షణ కావాలి అసలు శస్త్ర చికిత్సలో ప్రమాదాలలో చాలావరకు(Anaesthesia) మైకం యివ్వడంలో, లోపంవల్లనే యేర్పడతవి 'మైకం' అంటే స్పృహతప్పడం ఆపరేషన్ చేయడానికి స్పృహ తప్పవలసిన అవసరం లేదు నొప్పి తెలియకుండా చేస్తే చాలు ఇందుకు అవలంబించే విధానాన్ని 'ఎనిస్తీషియా' (Anaesthesia)అంటారు "ఈస్తీషియా"అంటే "స్పర్శానుభూతి" బాధ, స్పర్శేంద్రియంవల్ల తెలుస్తుంది స్పర్శ లేకపోతే బాధేలేదు స్పర్శలేకుండా స్థానికంగా కొన్నిమందులు, రాచిగానీ, ఇంజక్షను ద్వారా యిచ్చికానీ, సాధించవచ్చును, స్పర్శను తెలుసుకునే మెదడు భాగమును పనిచేయకుండాచేసి సాధించవచ్చును ఇందుకు క్లోరోఫారం ఈథర్ ప్రత్యేకంగాగానీ, కొన్నిపాళములలో కలిపిగాని రోగిచేత పీల్పిస్తారు కొన్ని వాయువులను ఆక్సిజన్ అనే వాయువును కలిపి ఉపయోగిస్తారు ఈ పద్ధతిలో ప్రమాదాలు తక్కువ ఒక్కొక్కప్పుడు వెన్నుపాములోకి కొన్ని మందులు ద్రవరూపంలో పంపితే పంపిన ప్రదేశాన్నిబట్టి, శరీరభాగములు మొద్దుబారిపోతవి "ఈస్తీషియా"— స్పర్శానుభూతి—లేకుండాచేసే క్రియాకలాపమును 'ఎనిస్తీషియా' అంటారు ఎనిస్తీషియా ఇచ్చేవారిని ఎనిస్తెటిస్టులు' అంటారు ఈనాడు శస్త్ర చికిత్స సృష్టికి ప్రతిసృష్టిచేసేస్థితి అందుకున్నదంటే ఈ ఎనిస్తీషియాలో జరిగిన పరిశోధనలూ అందుకు ప్రత్యేక శిక్షణ, నైపుణ్యం కారణములు ఆపరేషన్‌లో ప్రమాదం నూటికి 90


(55-వ పేజీ చూడుడు)

కథ కాని కథ

ఆఫీసరు ఆహ్వానం!

(మొదటి బహుమతి రు. 10 లు)

మా రామునికి "రాజా" అనే బిరుదున్నది అతనికి చెస్ ఆటమీద ఉన్నంత మోజు ఏ యితర ఆట మీద లేదనే చెప్పాలి ఆ ఆటలో ఏముందో కాని ఆటలో కూర్చున్న తరువాత కొంప మునిగిపోయినా కదిలే రకంకాదు ఆ ఆట వాడి బుర్రలో ఎంతగా నాటుకుందో కాని ఆఫీసుకు వెళ్లినప్పుడు కూడా రెండు జేబులలోను రాజులు, మంత్రులు, ఏనుగులు మొదలగు ఆటవస్తువులును నింపుకొని చెస్ బోర్డును మధ్యకు మడచి నేరుగా ఆఫీసులోని తన డ్రాయర్లో ఉంచుకొనేవరకూ వచ్చింది ఏ దిన



మైనా మా ఆఫీసు హెడ్ అసిస్టెంటుగారు కానీ, ఆఫీసరుగారు కానీ లేకపోయినా, లేక కొద్ది టైము దొరికినా, ఆఫీసు వెనుకవున్న రూములోనికి వాణ్ణి బలవంతముగా తీసికొనిపోయి చెస్ బోర్డును వోపెన్ చేసి ఆటకు తయారవుతారు

ఆవేళ మా రాజా ఆఫీసు పనిలో పీకవరకు దిగబడిపోయాడు చెస్ ఆడటానికి సమయము చిక్కక ఆ చెస్‌బోర్డును ఎవరైనా చూడబోతారేమో నని దానిని ఫైళ్లమధ్య ఉంచి తన పనిలో మునిగిపోయాడు ఒక అర్జంటు ఫైలు ఆఫీసరుగారికి పంపవలసి వచ్చి చెస్ బోర్డును పొరపాటున ఆ ఫైలులో కట్టి పంపాడు తీరా ఆఫీసరుగారు సంతకానికి ఫైలు తీయబోయేసరికి చెస్‌బోర్డు బయటపడ్డది దానితో మా ఆఫీసరుగారు రాజాగాడిని పిలిపించాడు మనవాడు ఆఫీసరుగారు పిలిచారు గదా అని గబగబా ఆయన ప్రైవేటు గదిలో అడుగెట్టేసరికి "రావోయ్! చెస్ ఆడదాంరా' అని 'చెస్‌బోర్డు' ను టేబిలుపై పరచి మా రాజాను ఆహ్వానించాడు ఆనాటినుండి 'చెస్‌బోర్డు' మా కంటికి కనబడకుండానే పోయింది

ఎస్ వరంధామరెడ్డి (గూడూరు)

* * *

నా యిన జోడు

(రెండవ బహుమతి రు. 5 లు)

ఆవేళ ఆదివారం మా మిత్రబృందం ఐదుగురం కలసి గ్రంథాలయానికి వెళ్ళాము మాలో ప్రసాద్ అనే అతను కొంచెం అహంభావము కలవాడు వాసు అనే అతను కొంచము కవి, అదోరకము వాడు నేను మా సంజీవుడు సామాన్యులము ఆవేళ గ్రంథాలయము వద్ద నా జోడు కనిపించక వెతుకుతున్నాను ప్రసాద్ వచ్చి, 'ఆ ఎక్కడికి పోతాయి! కుక్కలు గూడ తీసుకువెళ్ళవు' అని గట్టిగా అరచి ఒక్కసారి నవ్వాడు ఇంతలో ప్రక్కనున్న కవి (వాసు) ఆ! కుక్కలు తీసుకెళ్ళవు కాని వీలుంటే పెద్దమనుష్యులు తీసుకెళ్లవచ్చు' అన్నాడు


ప్రకాశ్ (నైవేలి)

* * *

'అదెంతపని'

(రెండవ బహుమతి రు. 5 లు)

మా వూరిలో ఉన్నది ఒక్కటే క్లబ్ దానికి నేను అర్గనైజరుని రానున్న వార్షికోత్సవము ఎంతో గొప్పగా చేయ నిశ్చయించి అన్ని ఏర్పాట్లు చేశాము ఒక ఏభై ప్రోగ్రాం కార్డ్సు టైపు చేయించాము కాని అందులో కొన్ని 'ఐటమ్స్'



పూర్తిగా టైపు చేయడమే మరిచాడు టైపిస్టు తెల్లవారితే వార్షికోత్సవము మాకు వేరే పనులు చాలా ఉన్నందున ఆరవ తరగతి చదువుచున్న మా తమ్ముడు గోపిని పిలిచి అన్ని ప్రోగ్రామ్ కార్డ్సులోనూ ఈ ఐటమ్స్ వరుసగా వ్రాయమని ఒక లిస్టు యిచ్చాను "ఓ! అదెంతపని!" అన్నాడు మావాడు ఉదయం ప్రోగ్రాం కార్డ్సు ఒక్కొక్కటి తీసి చూడ్డం మొదలెట్టాము మొదటి ఇరువై కార్డ్సులో మాత్రం నేను చెప్పినట్లే రాశాడు తరువాత ముప్పయి కార్డ్సులో మాత్రం డిటో, డిటో అంటూ వరుసగా వ్రాశాడు

బి. సూర్యనారాయణ (హైదరాబాద్)

* * *

దేవికి సమాధానం

(రెండవ బహుమతి రు. 5 లు)

మొన్నీ మధ్యను నేనూ, మావారు మా మూడేళ్ళ పిల్లను తీసికొని విప్రనారాయణ నాటకాని కెళ్లాము నాటకం మహా జోరుగా జరుగుతోంది ఎక్కడా పిన్నుబడ్డ శబ్దము కూడా లేదు అది దేవదేవి విప్రనారాయణుని ఆశ్రమము విడిచి వెళ్లనా అని దీనంగా ప్రార్థించే ఘట్టం కాని ఆమె ప్రేక్షకులకందరికి వినుగు పుట్టేలా "వెళ్లనా స్వామి, నావంక చూచి చెప్పండి స్వామీ, స్వామి వెళ్లనా,



వెళ్లిపోనా ?" అని ఓ పాతిక ముప్పైసార్లయినా అనింది పెద్దవాళ్లం ఎలాగో ఓపికతో చూస్తున్నాము మా మూడేళ్లదాని కేమర్థమైందో, పెద్ద గొంతుక చేసుకొని "వెళ్ళు" అంది నేనూ మావారే కాక తక్కువ జనం, స్టేజిమీదవాళ్ళు అందరూ ఒక్కసారి గొల్లుమన్నారు అంతగా అభినయించే దేవదేవి కూడ నవ్వకుండా ఉండలేకపోయింది"

ఎస్ అహల్యాబాయ్ (హైదరాబాద్

* * *

హెర్క్యులెస్ బలం

(రెండవ బహుమతి రు. 5 లు)

మా తమ్ముడి క్లాసులో టీచరు హెర్క్యులెస్‌ను గురించి పాఠము చెప్పుతున్నారు అతని బలమునకు నిదర్శనముగా "హెర్క్యులెస్ ప్రొంటియర్ మెయిల్‌ని ఆపగల" డన్నారు అప్పుడు వెనుక బెంచిలోని యాకూబ్ టీచరుకు వినపడేలా "నేమా ఆపగలము చెయిన్ లాగటానికి" బలమెందు కన్నాడు

జి. వి. రావు (బొంబాయి)

నిర్హేతుకంగా ఒక పురుష పుంగవు డికి తనపై సానుభూతి పుట్టు కొచ్చిందంటే అరవిందకు నమ్మ కం ఎలా కలుగుతుంది ?

ఇది మరొక కథ



ప్రియమైన అరవింద!

సాయంకాలం మూడు గంటల బస్సుకే వస్తా న్నాను బస్సు మీవూరు చేరుకొనేసరికి నాలుగు గంటల ప్రొద్దవుతుంది తప్పక ఆ బస్సులో నన్ను కలుసుకుంటావు కదూ ! సాయంత్రం ఆరింటికి ఎటూ హాస్టలు చేరుకోవాలి—రేపటిరోజు కళా శాల తెరచేరోజు మనమనుకున్న ప్రోగ్రాం మేరకు బస్సులో కలుసుకోవాలి తప్పితే నాపై ఒట్టేసుమా ! తప్పక కలుసుకుంటావుకదూ !

ఇట్లు,
మీ మనోరమ

వాలుకుర్చీలో కూర్చుండిన అరవింద ఉత్తరం చదవడం ముగించింది ఉత్తరం చేరకున్నా తాను ఎటూ తప్పకుండా ఆనాడు పోవాల్సిందే మరు దినం—కాలేజి 'ఓపెనింగ్ డే' అని కొట్టొచ్చి నట్టు కేలండరు చూపిస్తూనే ఉంది

ఉదయంపూటనుండి "నేనూ వస్తా నక్కయ్యా' అంటూ తన చెల్లెలు రాధ సిద్ధమవుతోంది క్రితంరోజే అరవింద ప్రయాణానికి అనుమతించి ఆమెతండ్రి ఎటో పనిపైన వెళ్లాడు—

ఏకైక పుత్రిక చదువులతల్లి సరస్వతే అరవిందరూపంలో ఉంది అని అరవింద తల్లికో గట్టి నమ్మకం ఈదఫా కాలేజీకి వెళ్లితే ఇంక రావడం అంటూ వేసంగి సెలవులకే—అందుకే జిలేబీలు వండుతూంది గంట మూడున్నర దాటు తున్నా జిలేబీల వంటకం పూర్తికాలేదు అర వింద అరగంట తయారై జార్జెట్ చీరలో వెల్వెట్ జాకెట్‌లో మెరసిపోతోంది "నాకూ గాను తొరుగక్కయ్యా నేను వస్తాను" అంటూ— బేగ్‌లోని దుస్తులను పైకి లాగేస్తూ చిందర వందర చేస్తోంది రాధ—గంట నాలు గవుతూన్నా అటునైపు అమ్మగారి పిండివంటకాలు పూర్తి కాకపోగా ఇటునైపు రాధ ప్రయాణానికి సర్దిన సామాను చిందర వందర చేస్తోంది చిరాకు వేసింది అరవిందకు

"అమ్మా నీ పిండివంటల కో నమస్కారం ! బస్సు వేళయింది తొందరగా తెమలనివ్వు !" అంది "ఇదిగో పూర్తయింది ఆ పళ్లెంలో ఉండే జిలే బీలు తినవే" అనింది—మంచినీళ్లగ్లాసు పమీ పంలో ఉంచుతూ—అరవింద మనస్సంతా మనో రమపైన్నే కేంద్రీకృతమైంది రెండు జిలే బీలు తిని మంచినీళ్ళు త్రాగి రాధకికూడా యిచ్చింది అరవింద

"వేళకు బవాన్నయినా ఇంటి దగ్గర ఉండనిస్తారా రాచకార్యాలు వెలగబెడుతున్నట్టు—బవానుతోసహా వెళ్లారాయన అమ్మాయి ఊరికి పోతూందని బస్సుదాకా దిగబెట్టవలసిన బాధ్యత తనపై

మధురాంతకం దొరస్వామి



ఉందని విస్మరించటం—ఎంత అలసత్వం .... అసలు మగాళ్లే ఇంత" అని విసుక్కుపింది, అరవింద తల్లి.

బజార్లోనూగా బస్సు ఆగుతుంది కదటూ అక్కడికి వెళ్లి నేనే బస్సు ఎక్కుతాను అని నంచి ఒకచేత్తో ట్రంకు మరియొకచేత్తో ఎత్తు కొని "ఈసారి వచ్చేటప్పుడు మా మంచి జపాను బొమ్మ తెస్తాగా" .... అని రాధను పిల్చి "అర

చింత [illegible] జరుగుతుంది.

"హాయ్ హాయ్"మంటూ వేగంగా [illegible] బస్సు బజార్లో తాను [illegible] ఆ బస్సును సమీపించుతుంటలోపలనే బస్సు కదిలి వెళ్లుతోంది. తాను ఎక్కవలసిన బస్సు [illegible] అందులోనే మనోరమ వెళ్లిఉంటుంది.

బస్సుస్టాప్ అక్కడికి మూడు ఫర్లాంగు లుంటుంది అక్కడికి వెంటే ఒకవేళ బస్సు అక్కడ ఏ పదిహేను నిమిషాలైనా ఆగవచ్చు. తడబడిగా కాళ్లు నడుస్తున్నాయి .... ఆ చేతిలో నుంచి ఈ చేతిలో పెట్టె బస్సు స్టాపు చేరేసరికి బస్సు కదులుతోంది నిస్పృహతో బస్సుస్టాపులో కూర్చుండిపోయింది అరవింద.

ఇప్పుడేమిటి కర్తవ్యం అనే ప్రశ్న ఆమె క్వశ్చన్‌మార్కు ముఖంలో స్పష్టంగా దృగ్గోచర మవుతోంది. ఇంటికి తిరిగి వెళ్లడానికి [illegible] అంచలేదు రేపు కాలేజి ఓపెనింగ్ డే . [illegible] తాను తప్పక పోవాలి . మనోరమ కార్యకలాపాల్లో తాను కలుగజేసుకోవాలి—ఈపాటికి తిరుపతి చేరుతూంటుంది మనోరమ

రవి అరుణారుణకాంతిపుంజాలతో అస్తమింగత మవుతూన్నాడు. ప్రస్తుతం తిరుపతికి వెళ్లే బస్సు లేదు. అల్లంతదూరంలో రైల్వేస్టేషను . . దాని కనతిదూరంలో .. రైల్వేలైను నానుకొని ఏపుగా ఉన్న స్తంభం రెక్కమాను వంగినవిషయాన్ని తెలియజేస్తూవుంది వెంటనే ఆమె "ట్రెయిను లో వెడితే సరిపోతుంది!" అనుకుని పెట్టెను తీసుకొని రైల్వేస్టేషనువైపు వెళ్లింది.

దాదాపు మూడు ఫర్లాంగు లుంటుంది .. రైల్వేస్టేషన్—రెక్కమాను వంగిన దృశ్యంతో పాటు . . . కొంతదూరంలో వస్తూన్న రైలు కూత గూడా వినిపించింది పాదాలు చరచరా నడు స్తున్నాయ్ చేతులలో నుండి బేగ్, పెట్టె— భూమాతచేత ఆకర్షింపబడుతూ ఆమెగమనాన్ని విరోధిస్తూ భూమ్యాకర్షణ సిద్ధాంతాన్ని నిరూ పిస్తూన్నాయ్

వేగంగా నడవడంతోపాటు .. మోయలేనిభారం ... అరవింద తన కోమల బాహువల్లరితో ఆ వస్తువనుదాయాన్ని తీసుకొని పోతూ—అక్క డక్కడా దించుతూ . మరలా ఎత్తుకుంటూ పోతోంది

ఆవేళప్పుడు ఆ ప్రాంతంలో కూలీలైనా ఎట్లా దొరుకుతారు ? ఎవరో ఒకవ్యక్తి వేగంగా నడచు కొంటూ వస్తూన్నాడు అరవిందను సమీపించాడు. ఆమె పడే అవస్థను చూస్తున్నాడు పెట్టె వంచి దించింది—అరుణకాంతిలో ఆమె అరచేతులు కెంపు వన్నెను అధిగమిస్తూన్న సంగతిని గమనించిన ఆ ఆగంతుకుడు—'మీ కభ్యంతరం లేకుంటే నేను పెట్టెను ఎత్తుకోనా ? నేనూ రైలుకే వస్తూ న్నాను !' .... అరవింద జవాబు చెప్పలేదు. [illegible] పెట్టె బాగ్ తీసుకొని వెడుతూంది ఆ ఆగంతుకుడూ వెడుతున్నాడు

ఎక్కేటప్పుడు [illegible]

(46వ పేజీ చూడండి)

శిరోజాలంకరణ



1

1 పోనీ టెయిల్ మాదిరి జుట్టును నడినెత్తిన చేర్చి చిన్న తాడుతో గట్టిగా కట్టాలి క్రిందకు వ్రేలాడదీసిన మిగతా భాగాన్ని ఒకరింగులో దూర్చాలి కొసను రింగు అవతల అంచుమీదుగా పోనిచ్చి, లోనికి దూర్చి గట్టిగా ఇవతలకు లాగాలి శేషభాగాన్ని మెలికలు చుట్టుకుంటూ గుండ్రంగా లోపలి ముడిచుట్టూ చుట్టి పిన్నులు పెట్టుకోవాలి

బొమ్మలు:
దేవిక.



2

2 ఈ అలంకరణకు మొదట శిరోజాలను రెండుపాయలుగా చేసుకోవాలి, వాటిని రెండువేపులా చెవులదగ్గరగా చేర్చి త్రాళ్లతో గట్టిగా ముడివెయ్యాలి ఒక చెవిదగ్గర కట్టిన జుట్టుకొసను రెండవ చెవి దగ్గర చిన్న త్రాడుతో కడితే జుట్టు అర్ధచంద్రాకారంలో వ్రేలాడుతుంది. తర్వాత ఆవేపు కట్టుకున్న జుట్టును ఈ అర్ధచంద్రాకారంలో నుంచి క్రిందు, మీదుగా మెలికలుగా దూర్చి చివరి కొసను ఈ చెవిదగ్గర కట్టుకోవాలి. ఇక్కడితో ఈముడి పూర్తవుతుంది తర్వాత ఎవరి అభిరుచుల ననుసరించి వారు సెట్ చేసుకోవటం పూలు పెట్టుకోవటం తదితర అలంకరణలు చేసుకోవచ్చు.

"విరళ"

ఉత్తరాల దొంగలు

ఉత్తరాలు దొంగతనంగా చదివేవాళ్ళని ఉత్తరాల దొంగలంటారు ఇట్లా దొంగతనంగా ఉత్తరాలు చదివే రోగం పెద్దవాళ్ళకే ఎక్కువ నా అనుభవంలో జరిగిన సంఘటన ఒకటి రాస్తాను

ఒక ఏడాదిక్రితం మేం విశాఖపట్నంలోవుండే వాళ్ళం ఒకవాడు మావారు క్యాంపు వెళ్ళారు వారం రోజులవరకూ తిరిగిరారు నేనూ, మా ఆరేళ్ళ బాబూ యింట్లో వుండాలి మా బాబుకి ఇంటావిడ దగ్గర చాలా చనువుంది బామ్మగారూఅంటూ ఎప్పుడూ వాళ్ళింట్లోనే వుండేవాడు ఆవిణ్ణి క్షణమైనా విడిచిపెట్టకుండా సరే, ఒకరోజు పోస్టు వేళకి నే నింట్లో ఏదో పని చేసుకుంటున్నాను మాకేవైనా ఉత్తరాలువస్తే ఇంటివాళ్ళకివ్వటం పోస్టుమేన్‌కి అలవాటు వాళ్ళే తీసుకొచ్చిమాకిస్తారు ఆరోజు ఎంతకీ యివ్వకపోతే నేను వరండాలోకి వెళ్ళిచూద్దునుగదా! ఇంటావిడ మా బాబుచేత ఏదో ఉత్తరం చదివిస్తోంది అది ఇన్‌లాండ్ కవరు దాన్ని చింపకుండా లోపలి కాగితాన్ని తీసి మళ్ళీ పెట్టేయువచ్చు అది తీసి చదివిస్తోంది తను శ్రద్ధగా వింటోంది

నేను వెళ్ళగానే వులిక్కిపడింది వెంటనే నవ్వుతూ "చూశావా అమ్మాయీ! నేను వద్దన్నకొద్దీ ఉత్తరంచింపి చదువుతున్నాడు పైగా 'మా నాన్న రాశరు చదివితేనేం' అంటాడు అంది "అది కాదమ్మా మరీ " అంటూ మా బాబు ఏదో చెప్పబోతూండగా ఇంటావిడ మధ్యలో అందుకుని "చాల్లేరా, వెధవాయీ ఇంకా చెపుతావ్ కాదమ్మాయ్ ఉత్తరం ఎవరికొచ్చిందో చూడమంటే చింపిచదువుతూన్నాడు, అని చటుక్కునలేచి వెళ్ళిపోయింది "ఏరా బాబూ అలా ఉత్తరాలు చదవచ్చా, తప్పుగదూ ?" అన్నాను "అది కాదమ్మా, మరే బామ్మగారే చదవమంది" అన్నాడు నాకు నోట మాట రాలేదు ఆవిడిల్లాంటిదని నా కింతవరకూ తెలీదు నిజానికి మా బాబుకి ఒకళ్ళ ఉత్తరాలు చదివే అలవాటు లేదు అట్లాంటిది ఎవరూ చదవమనకపోతే ఎల్లా చదువుతాడు అంతటితో ఆ విషయం వదిలేసి వూరుకున్నా ఆ తర్వాత పోస్టువేళకి వీధిలో నుంచున్నాననుకోండి

అసలిట్లా దొంగతనంగా ఉత్తరాలు చదవాలంటే సిగ్గేయదూ! తమ ఉత్తరాలు ఇంకోళ్ళు చదివినారని తెలిస్తే వీళ్ళ కెట్లావుంటుందో ఆలోచించండి ఎన్నో వ్యవహారాలను గురించి రాసుకోవచ్చు భార్యా భర్తలు రాసుకోవచ్చు అట్లాంటి ఉత్తరాలు చదవటం తప్పుకాదూ? అసలు చిన్నపిల్లల కిలాంటి బుద్ధులు పుట్టనే పుట్టవు, ఎవరో నేర్పిపెడితేతప్ప వాళ్ళ ఆటలేమిటో వాళ్ళేమిటో అంతే అసలు మాయింటావిడ తెలివి చూడండి. తను చదివితే ఎవరైనా తప్పుపడ్తారని పిల్లడిచేత చదివించింది అదేమంటే పిల్లడిమీద చెప్పవచ్చు ఆవిడకేం తెలీదుగదాని పిల్లడిని కోప్పడతాం ఇంక పిల్లలకి చీవాట్లేగాక ఇట్లాంటి దురలవాట్లు అవుతాయి


అసలు కొన్ని అలవాట్లు చిన్నప్పట్నించీ మనలో మొలకెత్తి మనం పెద్దవాళ్ళ మవుతున్నకొద్దీ ఆ అలవాట్లు వృక్షాలులాగా పెరుగుతాయి మంచి అలవాట్లే అయితే ఇబ్బందిలేదు. ఎటొచ్చీ చెడ్డఅలవాట్లే వాటిని మొదట్లోనే తెంపేసుకోక కావాలని వృద్ధి చేసుకుంటారు కొందరు ఇందువల్ల వాళ్ళకే గాక ఇతర్లకి చాలా ఇబ్బందులు కలుగుతాయి

పిల్లలేదన్నా పొరపాటుచేస్తే కోప్పడో ఎట్లాగో చేయచ్చు ఏదన్నా దురలవాటుంటే మానిపించవచ్చు అంతేకానీ పెద్దవాళ్ళకే వున్నప్పుడు ఏం చెయ్యగలం? అదీగాక చిన్నపిల్లలు ఒకసారి చెపితే వింటారు పెద్దవాళ్ళు అదీలేదు

చెప్పొచ్చేదేమిటంటే ఇట్లా ఉత్తరాలు చదవటం వల్ల వీళ్ళకి నష్టం కూడా వుంది అసలు సంగతి తెలిశాక బోనులో చిక్కిన ఎలికలా ఎటు తప్పించుకోటానికీ వీల్లేకుండా అయిపోతారు భార్యాభర్తలు ఎన్నో విషయాలు రాసుకుంటారు అవన్నీ వీళ్ళ కెందుకు అసలెక్కువ భార్యా భర్తలు రాసుకునే ఉత్తరాలే వీళ్ళు దాచుకునేది ఏదెట్లావున్నా దొంగతనంబైటపడ్డాక వీళ్ళపరిస్థితిచెప్పతరంకాదు ★

ఎప్పుడూ ఇంతే— 97

శంకర్





వనితా వాణి

స్త్రీధర్మం-గృహిణీత్వం

సుశీలగారు వ్రాసిన "స్త్రీధర్మం— గృహిణీత్వం" అన్న వ్యాసం అన్నివిధాల బాగున్నది కాని కొన్నివిషయాలలో వారితో ఏకీభవించలేక పోతున్నాను మన స్త్రీలు కూడ పాశ్చాత్య స్త్రీలవలె అన్ని రంగాలలో ముందంజ వేయువలెననీ, 'ఊరికే ఉండటంకన్న, ఎంత చిన్నదైనా, ఉద్యోగం చేయడం గౌరవప్రదమని' సూచించారు. ఉద్యోగం చేయడం గౌరవప్రదం కావచ్చును నాకూ యిష్టమే ఉద్యోగం చేయడం కాని మనవారా విషయంలో సంకుచిత భావాన్ని కలిగియున్నారు రచయిత్రి ఒక్క విషయు మరువకూడదు పాశ్చాత్యదేశాలలో స్త్రీ పురుషులు కలిసి తిరిగితే చూచేవారు ప్రశ్నించరు ఒక ఆఫీసులో పనిచేసే స్త్రీ, అక్కడే పనిచేస్తున్న తన తోటి ఉద్యోగిని (పురుషుని) ఏవిషయంలోనైన సహాయం కోరితే అతను చేస్తాడు తనూ అంగీకరిస్తుంది ఇతరులు కూడ దీనిని సహజంగానే తీసుకుంటారు కాని అదే మన దేశంలో అయితే, ఇలాటి ఒక్క చిన్న విషయం తీసుకొని కథలు, వ్యాసాలు (వారిద్దరిమీద) కల్పిస్తారు స్త్రీకైనా, పురుషునికైనా, ఉద్యోగం ఉన్న ఊళ్ళోనే దొరకదు ఇక అందు నిమిత్తం, వేరే ఊళ్లకు పోవలసివస్తే ఈ ఊరివాళ్ళ (చూచైనా ఉండరు), ఆ అమ్మాయి ఎవరితోనో తిరుగుతుందనో, విచ్చలవిడిగా ఉందనో, ఇంకా కొంచెం ధైర్యంగల వాళ్లను చూచి ఎవడినో పెళ్లి చేసుకుందనో చెప్పేస్తారు ఇది మన దేశంవారికి తెలిసినది ఇది, మనవారు స్త్రీని గౌరవించే పద్ధతి ఇంక ఇలాటి సంకుచిత భావాలున్న ప్రజలమధ్య ఉద్యోగాలు చేయడానికి ఉపక్రమించిన స్త్రీగతి ఏమికాను ? కాని పాశ్చాత్యుల విషయం వేరు వారు మనవారివలె సంకుచితస్వభావులు కారు కాబట్టే మన స్త్రీ లెన్నటికివి పాశ్చాత్యులవలె ముందుకు రాలేరు మన ఉన్నతికి మన సమాజం సహకారం పూర్తిగా లభిస్తుందన్నమాట కలలోని వార్త కాబట్టే పాశ్చాత్యులను తలంచుకొని, వారివలె మనమూ పైకి రాలేకపోయామే, అని మనస్సును క్షోభ పరచుకుంటే ఇప్పుడున్న అంతో కొంతో మనశ్శాంతి కూడ నశిస్తుంది ఇతర దేశస్థులతో సమానులం కావలెననే రచయిత్రి అభిప్రాయంతో నేనూ ఏకీభవిస్తున్నాను కాని ఆ ఆశయం నెరవేరి చూచే భాగ్యం రచయిత్రికి, నాకు ఉండదని నిర్భయంగా చెప్పగలను

వే రేవతి (మద్రాసు)

*   *   *

శ్రీమతి మతుకుమల్లి సుశీలగారి వ్యాసం మమ్మెన్నెంతగానో ఆకర్షించింది నేటి సమాజపు స్థితిగతుల్నిబట్టి స్త్రీ ధర్మాన్ని, గృహిణీత్వాన్ని సరళమైన శైలిలో మనస్సుల కత్తేలా విశదీకరించా రీమె వ్యాసంలోని చివరివాక్యాల్లో రచయిత్రి సహృదయం ప్రతిబింబిస్తోంది 'జీవితమనే డబుల్—రూప్ లో భార్యాభర్తలు రూప్‌మేట్సు లాంటివాళ్ళు పరస్పరాదరణ, గౌరవము, సహాయము ఉంటేనే ఆ కలయిక సాఫీగా నడుస్తుంది' శ్రీమతి సుశీలగారికి మా ప్రశంసాపూర్వకాభినందనములు

వనితావాణి శీర్షికలో ఏ ఇల్లాలైనా వ్యాసం వ్రాయడం భయం ఖండించడమే ధ్యేయంగా పెట్టుకుంటారు కొందరు కేవలం వ్యాసంలో ప్రయోగింపబడిన పదజాలంయొక్క అర్థాన్నే తీసుకుని నిశితంగా విమర్శించకుండా, దాని వెనుకవుండే రచయిత్రుల భావాల్ని గూడా కాస్త పసిగట్టమని తెలుగు ప్రజానీకానికి విజ్ఞప్తి ప్రశంసలే గానీయండి, విమర్శలే గానీయండి, సంపాదకులు గూడా తగుమాత్రంగానే ప్రచురించి, మిగతా స్థలాన్ని మరొక చక్కని వ్యాసంతో సద్వినియోగం చేస్తే శీర్షిక కూడా సార్థకమవుతుందని మా అభిప్రాయం

జయంతి లక్ష్మి, రవి, పార్వతి (బెంగుళూరు)

*   *   *

మతుకుమల్లి సుశీలగారి "స్త్రీధర్మం—గృహిణీత్వం" వ్యాసం బాగున్నది అమెరికా—భారత దేశాల ఆర్థికస్థితిలోని తేడాలు ఆ సోదరికి బోధపడలేదనుకుంటాను మనదేశపు స్త్రీలలో చదువుకొన్నవారి సంఖ్య చాలా తక్కువకదా ! అయినా మన దేశపు సోదరీమణులంతా పై వ్యాసాన్ని చదివి స్త్రీల అభ్యుదయానికి పాటుపడగలరని ఆశిస్తున్నాను

కొల్లా వెంకటేశ్వరరావు (పెదకూరపాడు)

*   *   *

నాజూకు తిండ్లు

పి రాధగారు వ్రాసిన నాజూకుతిండ్లు వ్యాసం చదివాను వాస్తవానికి కొంతమంది అట్లా ఉంటారు అదీకాక ప్రక్కన నాజూకు తిండ్లు తినేవారు కూర్చుంటే మనకు అసహ్యం వేస్తోంది

పి సుజనాదేవి (రాఘవాపురం)

సి రాధగారు వ్రాసిన "నాజూకుతిండ్లు" అనే వ్యాసము నాకు నచ్చింది ఈ కాలంలో చాలామంది తిండి నాజూకుగా తింటూ ఆరోగ్యం పాడుచేసుకొంటున్నారు ఇలాటి విషయాలు వనితావాణి ద్వారా తెలియజేసినందుకు సోదరి రాధగారికి నా ధన్యవాదములు

మొన్నిమధ్యనే మా అన్నయ్య పెండ్లి అయింది. భార్య గాలివీస్తే ఎగిరిపోయేంత సన్నగా ఉంటుంది. తిండి ఎక్కువ తినదు విస్తరిలో పెట్టింది సగం తీసేస్తుంది మా పిన్నికి ఒక్కొక్కసారి కోపంకూడ వస్తుంది ఏదైనా సరే సగం తీసేస్తుంది వాళ్ళ ఆడబిడ్డ లందరూ "మా వదిన ఎక్కువ తింటే లావైపోతుంది అందుకే ఎక్కువ తినదు" అంటూ ఎగతాళి చేస్తారు

రాధగా రన్నట్లు ఆరోగ్యం దెబ్బతిని డాక్టర్ల బిల్లులయేసరికి మళ్లీ తిందామన్నా తినలేని పరిస్థితికి వస్తారు

మెండు పార్వతి (విజయవాడ)

*   *   *

ఈరోజుల్లో ప్రతీవారికి ఇదొక ఫేషన్ అయినది. ఈ నాజూకుతిండ్లు తినేవారు పూర్తిగా తింటారనే నమ్ముచున్నాను

కె అప్పలరాజు (భీమవరం)

*   *   *

సి రాధగారు, యీ నాజూకుతిండ్లు అను సమస్యను అతి చక్కగా వ్యక్తపరిచారు కాని రాధగారు, పురుషుల ప్రసక్తి తేలేదు పాపము! పురుషులు నాజూకుతిండ్లు కలవాటు పడరనేమో ?

సిహెచ్ రాములు (విజయవాడ)

*   *   *

సి రాధగారు వ్రాసిన "నాజూకుతిండ్లు", అను వ్యాసం చాలా బాగుంది రచయిత్రి చెప్పినట్లు ఇటువంటి నాజూకువారు చాలామంది ఉన్నారు రాధగారికి నా హృదయపూర్వక అభినందనలు

దిండివనం రజనీకాంతం (వెంకటగిరి)

*   *   *

నేను ఎరిగిన కొంతమంది తాము సరిగా తినరు గదా, ఎదుటవాళ్లను కూడా తిననివ్వరు ఒకసారి నా విషయములో అట్లాగే జరిగింది కొండపల్లి ఖిల్లాకు వనభోజనముల సందర్భముగా వెళ్లాము ఖిల్లాపైకివెళ్లిన తరువాత అంతా చూచి భోజనమునకు కూర్చొన్నాము నాతో సరదాగా మాట్లాడుతూ, నీవు అంతగా తినలేవు, తిన్నా పచాయించుకోలేవు అంటూ తక్కువగా వడ్డించింది అసలే దాదాపు పది, పన్నెండుమంది ఆడవాళ్ళ ఉన్నారు. వచ్చినట్లు తిని క్రిందకువచ్చి తాజాగా వేస్తూన్న బజ్జీలు, పకోడీ తిన్నాను నేనేకాదు మరికొంతమంది నా స్నేహితులకు కూడా అదేవిధముగా జరిగినది. నాజూకుగా తిన్నందువల్ల వాళ్ళు తరుగరు, పెరగరు ముఖ్యముగా ఆడవాళ్లలో అందాల యువతులలో మరీను

కె సత్యనారాయణప్రసాద్ (విజయవాడ)

మగవారికి పవిత్రత అక్కరలేదా?


'విశాఖ'

సరోజని చూసి ఆరు నెలలుపైగా అయింది దాని కబురే తెలియలేదు ఈ ఆర్నెల్లాయి కాలేజీ రోజుల్లో మే మిద్దరం స్నేహితులం అది బియ్యే స్సీతో ముగించింది దైవాధీనంవల్ల నేనింకా పై చదువులు చదువుతున్నాను గిండీలో ఎలక్ట్రిక్ ట్రైను ఎక్కితే తాంబరంలో దిగొచ్చు అక్కడ నుంచి అరఫర్లాంగు దూరం వాళ్ళ ఇల్లు నడిచే వెళ్ళొచ్చు "సరేవెళ్దాం" అని ఆలోచించుకుని బయలుదేరి వెళ్ళాను వాళ్ళ ఇంట్లోకి వెళ్ళేసరికి వాళ్ళ అమ్మ ఎదురు వచ్చింది "సరోజా" అని పిల్చారు సరోజ వచ్చింది చూసేసరికి నాకు అనుమానంవేసింది ఎప్పుడూ నవ్వుతూవుండే సరోజముఖం దీనంగావుంది నన్ను చూసేసరికి ఏడుపు నాపుకోలేక ఏడ్చేసింది "ఏం సరోజా! ఏమయింది? నీ కబురు ఆర్నెల్లాయి నాకు తెలియలేదు రిసెర్చిలో సెలవు దొరకడం ఎంత కష్టమో నీకు తెలియదా అలాంటప్పుడు నువ్వేనా మా లాబ్‌కి రాకపోయావా?" అన్నాను సరోజ మాట్లాడితే ఒట్టు వాళ్ల అమ్మే అంది "ఏం చెప్పనమ్మా సరోజ ఇంక వీధిలోకి రానేరదు మమ్మల్ని ముఖం ఎత్తుకోనియ్యకుండా చేసేసింది" అందావిడ నే నాశ్చర్యపోయాను

"మీరు కాలేజీలో చదివేరోజుల్లో పోట్లాడుకునేవారు జ్ఞాపకంవుందా! ఎంత ప్రేమించినా పెళ్ళి అయేటంతవరకూ జాగ్రత్తగా వుండాలి సినిమాల్లోలాగా మగవానితో తిరగకూడదు అని నువ్వు అంటే సరోజ తిరిగితే తప్పేం' అనేది మనమాట విననందుకు ప్రతిఫలం అనుభవిస్తోంది మొదట్నించీ చెపుతూనే వున్నాను ముల్లు వెళ్ళి అరటి ఆకుమీదపడ్డా ఆకు వెళ్ళి ముల్లుమీదపడ్డా ఆకుకే నష్టమని విన్నదికాదు"

నేను ఇంత చదివి తెలివితక్కువగా వ్యవహరించిన సరోజని చూసి జాలిపడ్డాను నేను సరోజా కలిసి అవతలిగదిలోకి వెళ్ళాం వాళ్ళమ్మ వంట ఇంటిలోకి వెళ్ళిపోయింది "ఏం చెప్పను? మా పక్కయింట్లో గది తీసుకున్న అబ్బాయి నన్ను పెళ్ళాడతానన్నాడు పెళ్ళాడతానన్నాడుకదా అని నమ్మి కూడా తిరిగాను అదృష్టవశాత్తు నేను ముప్పుతెచ్చుకోలేదు చదువుకున్నందుకు ఆమాత్రం జ్ఞానం వుండింది ఇదుగో మా నాన్నతో చెప్తానని వెళ్ళాడు మూడు నెలలయింది రాలేదు మొన్న నో రోజు పెళ్ళికి శుభలేఖ పంపాడు వీధిలో అందరికీ మా విషయం తెలుసు ఇంక నా జీవితం ఎలాగా నమ్మినందుకు బాగా శాస్తిచేశాడు" అని ఏడ్చింది మొగమహారాజు మా సరోజని ఇది తెలిసిన ఎవరు పెళ్ళాడతారు? పెళ్ళి చేసుకోకుండా వున్నా మాత్రం దానిజీవితం ఎలా సాగుతుంది? ఇలాంటి మచ్చతోను, అని నాతో చాలా బెంగపడిపోయింది సరోజని ఓదార్చి ఇంటికి వచ్చేశాను

ఇంటికి వచ్చేసరికి అమ్మ ఎదురు వచ్చింది. "చూడమ్మా ఈ ఉత్తరం చదివిచెప్పు. ఇలాంటి అన్యాయాలు జరుగుతుంటాయి' ఆడవాళ్ళకి అంతా దైవానుగ్రహంవుంటేగాని సరిగ్గా జరగదు" అంది నాన్న రాసిన ఉత్తరం చదివాను దాని సారాంశం ఇది అమ్మకి వేలువిడిచిన మేనమామ ఒకరు వున్నారు ఆయనకూతురు చిన్నపిల్ల పదిహేను ఏళ్ళుంటాయేమో ఆ అమ్మాయిని వాళ్ళవూరి కరణంగారి అబ్బాయి ప్రేమించానన్నాడు ఒకరోజు ఎవరికీ చెప్పకుండా ఇద్దరూ పూలమాలలు మార్చుకుని పక్కవూరులో కాపరంపెట్టారు ఇది తెలిసిన కరణంగారు ఆయనతండ్రి అంటే అబ్బాయి తాతగారు ఇద్దరూ పరువూ ప్రతిష్టా పోయిందని మొత్తుకుని బయల్దేరివెళ్ళి ఆ అబ్బాయిని తీసుకుని వచ్చి వారంరోజుల్లో ఇంకో పిల్లని ఇచ్చి పెళ్ళి చేసారు ఈ పిల్ల కాపురంకూడా వెలగబెట్టినందున గర్భిణీకూడానట. ఇది వాళ్ళనాన్న మా నాన్నతో పిల్లని తీసుకొచ్చి చెప్పాడుట నాన్నేమో మద్రాసులో ఆ అమ్మాయిని ఏ మందిర్‌లోనో చేర్పించే ప్రయత్నంలో తీసుకొస్తున్నానని రాసారు ఈరోజు ప్రొద్దున్న లేచి ఏముఖం చూసానో రెండూ విషాద వార్తలే అయ్యాయి



ఈ రెండింటినే తీసుకొందాం ఈ మచ్చ అనేది సరోజకీ, ఆ పిల్లకీ అంటగట్టారు కానీ ఆ మగవారికి లేదు కదా ఇద్దరూ పూలరంగడులలా పెళ్ళిళ్ళుచేసుకుని కాపరాలు చేస్తున్నారు వాళ్ళకేమాత్రం మనస్సు, నీతి అనేవి లేవా? వుంటే ఎందుకిలా చేస్తారు ఎప్పుడూ తాము చేసిన ఈ తప్పు, క్షోభపెట్టిన స్త్రీ వాళ్ళకి జ్ఞాపకం రావా అని అనిపిస్తుంది నామట్టుకు నాకు

ఈ రెండు పెళ్ళికి ముందర జరిగినవి కానీ ఇలాంటివే మొగవారు పెండ్లి అయ్యాక చేసేవి వున్నాయి నా స్నేహితురా లొకావిడ వున్నారు ఆవిడకీ, నాకూ వయస్సులో చాలా తేడా వుంది కానీ మే మిద్దరమూకూడా ఓరోజు అకస్మాత్తుగా పేరంటంలో కలిసాము దృక్పథాలు ఒకటే అవడంవల్ల ఇద్దరం స్నేహితులమయ్యాము ఆవిడ ఒకతరహా మనిషి ఆవిడభర్త ఒక కాలేజీలో లెక్చరరు ఆయనగారు క్లాసులో ఆడపిల్లల ఎదురుగా పోజులు పెడ్తాడు, ఇదేకాదు ఆయనగార్కి అప్పుడూ అప్పుడూ వారకాంతల్ని దర్శించటం అలవాటు అదీ ఆవిడతో గొప్పలుచెప్పి మరీ వెళ్తాడు కానీ ఆవిడమాత్రం తన అక్కా, బావ వస్తే అక్కతోటేగాని, బావతో మాట్లాడ్డానికి లేదు ఆవిడ సహనం ఏం చెప్పను పైగా అంటుందిగదా "ఆయన ఎలాపోతే మనకేంలెద్దూ మన్ని సరిగ్గా చూసినంతవరకూ నాకేం భయం లేదు నా దగ్గర ప్రేమగానే వుంటారు ఆయన మాట్లాడొద్దు అన్నప్పుడు మనం మాట్లాడకుండావుంటే తీరిపోతుంది" అంటుంది నాకు మాత్రం అతన్ని చూస్తే చిరాకు కానీ ఆడది పుట్టాక అవిడ ఏంచేస్తుంది కట్టుకున్నభర్త తనని సరిగ్గాచూస్తే అంతే చాలు అనుకుంటుంది.

మా నాయనమ్మ అంటూవుండేది వాళ్ళనాన్నగారికి ఇద్దరు ఉంపుడుకత్తెలుండేవారని ఇద్దరికి చెరో మేడట వాళ్ళమ్మని బాగా చూసుకునేవారుటకానీ అప్పుడూ అప్పుడూ ఇద్దర్నీ చూడ్డం కద్దుట నా కదివిని కోపంవచ్చేది "ఏంబామ్మా! ఆడదానికుండాల్సిన పవిత్రత మగవారికి అక్కరలేదా. ఇదే మీ అమ్మ ఇంకెవరితోనయినా చనువుగా మాట్లాడితే మీ నాన్న ఒప్పుకునేవారా" అన్నాను. మా బామ్మ బుగ్గమీద వేలువేసుకుని "చదివిస్తే వున్న మతి కూడా పోయిందంటే నీకు ఆడది అన్నాక మొగుడే సర్వం ఆయన ఏం చెయ్యమంటే అదే చెయ్యాలిగాని ఆయన వద్దన్నపని చెయ్యటమేమిటి? మగవాడికేం మహారాజు పవిత్ర గంగాభవానితో సమానం గంగలో ఎన్ని పాపాలు చేసినవారు మునగడంలేదు శవాలు కూడా వుంటాయి కాని గంగానది నీరు ఎప్పుడూ పవిత్రమైనదే అలాగా మగవాడుకూడాను ఎన్ని పాపాలు చేసినా తప్పు లేదు" అన్న బామ్మ మాటలు నాకు రుచించేవికావు

అయితే ఆడజన్మ అరటిఆకువంటిదేను కానీ ఆ ఆడవారికి ఇంత అన్యాయం జరుగుతుంటే మాత్రం సహించనేరను మొదట తనభర్త ఇష్టమొచ్చినట్లు తిరుగుతుంటే ఆడది ఏడుస్తుంది తర్వాత భర్తని ప్రాధేయపడుతుంది. ఎదురుతిరిగి ఇట్లాచేస్తే ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటానంటుంది దానికీ కరగకపోతే ఇంక నోరు మూసుకుని ఏంచేస్తున్నా చూస్తూ వూరుకుంటుంది ఎందుకంటే మనఅబలలం స్త్రీలు స్త్రీ సహజంగా భర్తే మన పట్టుకొయ్య మన జీవితపెన్నిధులు వారే కానీ నా సందేహం ఒక్కటే ఆడదానికి ఉండాల్సిన పవిత్రత మగవారికి అక్కరలేదా తను 'తన భార్యనుంచి ఏ పవిత్రతనైతే కోరుతాడో, ఆ పవిత్రత తనకిమాత్రం అక్కరలేదా తప్పు అనేది చెయ్యకూడదు కానీ అందులో ఈ ఆడా, మగా తేడా ఏమిటో నాకు తెలియదు. ఆడది చేస్తే సంఘం వేలెట్టి చూపుతుంది కానీ మగవాడుచేస్తే మొగమహారాజు అంటుంది.

ఈ విషయంలోనే నాకు శ్రీ కృష్ణమూర్తికంటే శ్రీ రామచంద్రమూర్తే యిష్టం. శ్రీ కృష్ణమూర్తికి భార్యలు అనేకం కానీ శ్రీ రామచంద్రునికి సీతాదేవిమాత్రం భార్య. ఏకపత్నీవ్రతుడు అందుకే సీతాదేవి అరుంధతితో "నే నాయనను ఎంతగా ప్రేమిస్తున్నానో ఆయన నన్నూ అంతలాగానే ప్రేమించి ఆదరిస్తున్నారు" అని అంది. దీని సారాంశం ఏమిటి? భార్యా భర్త

--- సహజంగా ప్రేమించుకోవాలి భర్తరికీ ఒకే న్యాయం వుండాలి భార్యకోన్యాయం, భర్తకో న్యాయుంకాదు

మా అమ్మ ఇచ్చిన ఉత్తరం చదివాక కూడా నాకదే అనిపించింది తమ జాతికాని అమ్మాయిని పెద్దలకి చెప్పకుండా పెళ్ళాడితే పరువూ ప్రతిష్ఠ పోతుందా అదే ఒక అమ్మాయిఅయితే కాపురంచేసి దాన్ని వదిలేట్లేముంది ఆ కళంకం ఇంకా వేతుల్లో వుండగానే ఇంకో అమ్మాయిని పెళ్ళాడితే తప్పు లేదూ మగవాడయినంతమాత్రాన్న మనస్సాక్షి వుండదా ఏమిటి ఇంకోపిల్లని పెళ్ళాడినంతమాత్రాన పోయిన పరువు ప్రతిష్ఠ తిరిగి వచ్చేసిందా ఈ అమ్మాయిని వుసురుపెట్టినది అంత త్వరగా మర్చిపోయా డా మహానుభావుడు

ఈసమయంలోనే నాకు థామస్ హార్డీ కావ్య కన్యక "టెస్ ఆఫ్ డూ బర్ వెల్లిన్" జ్ఞాపకం వస్తుంది టెస్ భర్త టెస్ నిస్సహాయస్థితిలో వుండగా ఎవరో పశువు చేసిన అన్యాయాన్ని క్షమించ లేరడు కానీ టెస్ మాత్రం అతడూ రెండు రోజులు ఇంకో స్త్రీతో ఉన్నాడని తెలిసికూడా క్షమించింది స్త్రీ చేస్తే ఆ భర్త క్షమించలేక పోయాడు తన తప్పిదాన్ని క్షమించమని భార్యని అడిగాడు భార్యకూడా ఆమెకి జరిగిన అన్యాయాన్ని చెప్పితే భార్యని వదిలి వెళ్ళిపోయాడు కానీ టెస్ మాత్రం జీవితాంతంవరకు భర్తకోసరమే పరితపించింది నామట్టుకి నాకు స్త్రీలందరూ కూడా ఈ టెస్ చదవాలనిపిస్తుంది

మన హిందూసంఘం చాలా పురాతనమైంది అలాంటి సంఘంలో ఎన్నో పవిత్రోద్దేశాలు వున్నాయి మనదేశంలో భార్యాభర్తలకి వుండే విలువ మరేదేశంలోనూ లేదంటే అతిశయోక్తి కాదు కానీ ఎందుకనో స్త్రీపట్ల పక్షపాతబుద్ధి ఈ సంఘానికి హిందూస్త్రీ సహజంగా నెమ్మదైనది నెమ్మదైనందువల్లనేలా వుంది మానం గలదీను, పవిత్రమైనదీను ఇంకే దేశంలోనూ కూడా స్త్రీని ఇంత అన్యాయంగా చూడ్డంలేదు స్త్రీ హృదయం చాలా మృదులమైనది ఆకలిదప్పుల్ని తీర్చుకోగలదేకాని భర్త నిర్లక్ష్యాన్ని తీర్చుకోలేదు కానీ ఆ భర్తలే ఈ కుసుమకోమలిని నలిపి పారవేస్తే ఆ కోమలి ఏమైపోతుందో ఆలోచించుకోండి మనదృక్పథాల్లో మార్పు రావాలి స్త్రీ పురుషుల సమానత్వం అని వివాదాలు రాగానే సరికాదు అన్నివిధాలా స్త్రీని గౌరవించాలి స్త్రీకి పవిత్రత ఎంత ముఖ్యమో పురుషునికి అంతే కావాలి అంతేకాని స్త్రీకోన్యాయం, పురుషునికో న్యాయం కూడదు హిందూ సంఘాన్నిమార్చ లేము మార్చడం అనేది "చీకట్లో గ్రుడ్డివాడు నల్లపిల్లికోసం వెదికినట్లుగా వుంటుంది" అని చాల మంది అంటూ వుంటారు

అసలు స్త్రీ జన్మలో ఒక్కసారి తప్పుచేస్తే ఆమచ్చ జన్మాంతం వుండిపోతుంది సంఘం ఆమెని క్షమించదు అదే పురుషుడు ఎన్ని తప్పులు చేసినా క్షమిస్తుంది ఉదాహరణకి పెళ్ళికాకపూర్వం ఒక అబ్బాయి అమ్మాయిలవేటలో వున్నాడను కోండి ఎంత చెడ్డవాడైనా పిల్లనివ్వడానికి ఎవరూ వెనుదీయరు పెళ్ళయ్యాక కొత్త కాపురం.

మగవారికి పవిత్రత...

అప్పుడందరూ "పెళ్ళికి ముందర ఏదో తిరిగాడు కానీ తప్పు డవేమిలేవు చక్కగా పెళ్ళాడి పిల్లల తండ్రి అయ్యాడు" అంటారు కానీ ఇదే పని భూతి స్త్రీవిషయంలో చూపరు ? అంతదాకా ఎందుకు స్త్రీని స్త్రీయే చులకనచేస్తుంది దీని పొరాంశం ఏమిటి? పురుషుడన్నవాడు తప్పులు చేస్తే క్షమించిన సంఘం స్త్రీ చేస్తే ఒప్పుకోదు కదా అలా అయితే పురుషుడు తప్పులు చెయ్యొచ్చు అనా, చేసినా ఫర్వాలేదనా లేక మాబామ్మ అన్నట్టు పవిత్ర భాగీరథీ కుమారుడనా? అయితే పురుషుడికి మాత్రం పవిత్రత అక్కరలేదనా అర్థం?

ఫ్రాన్సుదేశంలో మగవారు స్త్రీలోలురని భర్తఅయినవాడికి మిస్ట్రెసెస్ వుంటారని, వాళ్ళు వున్నాకూడా భార్య భర్తని వాళ్ళ గూర్చి ఏమీ అడగరని అంటారు అలాగే మనదేశంలో మహారాజులు కూడాను పురుషుడైనంత మాత్రాన ఏకపత్నీవ్రతం కూడదనా? పురుషుడైనా స్త్రీ అయినా సరే పవిత్రతే ముఖ్యం

ఈ విషయమైగాక బహుభార్యాత్వం, భార్యని కోల్పోయి కోల్పోకుండానే పునర్వివాహంకూడా శోచనీయమైనవే ఇంకా ఈ భార్య చనిపోయిందో లేదో అనుమానం తీరకముందే పెళ్ళాడేవారూ వున్నారు ఇన్నాళ్ళోయి ఆమెతో చేసిన కాపురం



అవీ ఎలా అంత సులభంగా మర్చిపోతారోకదా! అదే బాల్యవితంతువైనా పెద్దలే పునర్వివాహం జరిపిస్తేకూడా సంఘం దుమ్మెత్తిపోస్తుంది అలా అయితే దీని అర్థం స్త్రీ మాత్రమే పతివ్రత, అధవా పతివ్రత కాకపోయినా భర్త అన్నవాడిని మాత్రమే కొలుస్తూవుండగా ఆ భర్త తన యిష్టమొచ్చినట్లుండొచ్చునా? ఎంతమాత్రమూ వీల్లేదు

స్త్రీగాని, పురుషుడుగాని పవిత్రతకోసం తాప త్రయపడాలి పురుషులు తమ ఇష్టమొచ్చినట్లు గాక వివాహబంధాన్ని పవిత్రంగా ఎంచి తాము తమభార్యల కన్యాయం చేయకూడదని తీర్మానించుకోవాలి సంఘంకూడా స్త్రీ పురుషులమధ్య ఈ పక్షపాతబుద్ధి మానాలి స్త్రీ పురుషుల సమానత్వం అని వివాదాలు చెలరేగుతున్న ఈకాలంలో కూడా ఇలాంటివి జరగడం న్యాయంగాలేదు స్త్రీకి పురుషుడికి ఒకే న్యాయం వుండాలి

భర్త అన్నవాడు తను తనభార్యదగ్గరనుంచి ఏమేమి ఆశిస్తున్నాడో తన భార్యకి తను వాటిని ఇవ్వాలి ఉదాహరణగా తీసుకోండి అతనికి తన భార్య మగవారితో చనువుగా వుండకూడదు తనకి అన్యాయం చెయ్యకూడదు అనుకుంటాడను కోండి అప్పుడు తాను కూడా ఆమెకి అన్యాయం చెయ్యకూడదు ఇతరస్త్రీల సంపర్కం అవీ వదులుకోవాలి తాను భార్యనుంచి ఏ పవిత్రతని ఆశిస్తున్నాడో ఆపవిత్రత తనకీ వుండాలి అని ఆలోచించుకోవాలి. ఆ పవిత్రత వుండేటట్టుగా నడుచుకోవాలి అంతేనేగాని "నేరుమూసుకో, నీ కెందుకు నేను నా ఇష్టమొచ్చినట్లు పోతాను మగవాడిని" అన్న అహంకార కూడదు

"సకలగుణాభిరాముడు" అని వెటకారంగా దుర్గుణాలుండేవారిని కొంతమంది వ్యవహరిస్తారు. సీత, సావిత్రిలాంటి పతివ్రతలున్న ఈ దేశంలో రాముడొక పవిత్రమూర్తి ఏకపత్నీవ్రతుడు జయ నని ఆదర్శంగా పెట్టుకోవాలి స్త్రీపురుషు లిద్దరూ కూడా ఒకరినొకరు అన్యాయం చేసుకో కుండా వున్నప్పుడే భార్యా భర్తల బంధం పవిత్రంగా వుంటుంది మానినీ, మగవారిద్దరూ దీనికోసం కృషిచెయ్యాలి ఒక్కమా — కాలం మారింది. మనుష్యుల మనస్తత్వాలూ మారాయి మగవారూ పవిత్రతకోసం ప్రాకులాడుతున్నారు స్త్రీలలోనూ చెడ్డవారున్నారు కానీ వారి సంగతి కాదు నే చెప్పేది. మగవారిమన్న దురహంకారంతో స్త్రీలని ఏడిపించే వారికి మాత్రమే ఈ విన్నపం అంతేగాని ప్రతీ వారూ భుజాలు తడుముకుని నామీద దండెత్త వద్దని నా ప్రార్థన

పెళ్ళికి తర్వాతే కాకుండా పెళ్ళికి పూర్వం కూడా పవిత్రంగావుంటే అలాంటివారిని భర్తగా పొందిన భార్య అదృష్టవంతురాలు తన భర్త మాన సికంగాగాని, శారీరకంగా గాని ఇంకోస్త్రీని ఇష్టపడడం లేదని తెలుసుకొన్నప్పుడు భార్య ఎంత ఉప్పొంగి పోతుందో ఆ విషయాన్ని నే వేరే చెప్పనక్కరలేదు. తనభర్త హృదయంలో ఇంకొరికి చోటులేదని భార్య త్రికరణశుద్ధిగా నమ్మగల్గినప్పుడు ఆవిడకి దాంపత్యంలో ఆ విషయమై మానసిక క్షోభ వుండదు

కాలం మారింది ఇలాకాక ఆడవారికి అన్యాయం చేసేవారిని ప్రభుత్వం శిక్షిస్తుంది మొన్న ఈ మధ్య బొంబయిలో జరిగిన మీటింగులో డాక్టరు చిమన్‌లాల్ షా, శ్రీమతి మితనలాం, మిసెస్ రామా రావుగార్లు ఈ అన్యాయంచేసేవాళ్ళకి విధించా ల్సిన శిక్షలగూర్చి ప్రస్తావించారు కానీ ఇవన్నీ కూడా ఆ అన్యాయంజరిగిన వాళ్ళ మాన సిక క్షోభని తగ్గించవు కొంతవరకూ మిగతావారికి గుణపాఠం అవుతుంది మగవాడు తనంతటతానుగా పవిత్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి అప్పుడే ఈ అన్యాయాలు జరగవు అంతే కోర్టులూ, చట్టాలూ వాటిని అరికట్టలేరవు మా అమ్మ చుట్టం సంగతి ఆలోచించండి ఆ పిల్లని అలా మాయచేసి మళ్ళా పెళ్ళాడినందుకు ఆ ప్రబుద్ధుడుని ఇనుప కటకటాల వెనక పెడుతుంది కోర్టు కానీ సాక్ష్యం ఏది? నేను కున్న పూలమాలలా ఎండిపోయి పారవేయబడ్డాయి. నోరువిప్పి చెప్పనేరని వాయువు, దేవుడే సాక్ష్యాలు. సాక్ష్యంలేదని కొట్టివేస్తారు అందుకే మగవారికి పవిత్రతకి తమంతట తాము ప్రాధాన్యం ఇవ్వాలి. అలా శ్రీరామచంద్రమూర్తిని ఆదర్శంగా పెట్టుకుని జీవిస్తే భార్యలు కూడా సీతాదేవిలాగా "నేను మా ఆయన్నెంత ప్రేమిస్తున్నానో, ఆయనా నన్ను అంతలాగానే ప్రేమిస్తున్నారని చెప్పుకో గలరు ఇంకమీదనైనా మగవారు తప్పులు చెయ్యొచ్చు వాళ్ళకి పవిత్రత అక్కరలేదన్న భావం రూపుమాసిపోతుందనీ, భర్త తనభార్యలో ఏ పవిత్రతని కోరుతాడో తనలోనూ ఆ పవిత్రత వుంచుకుంటాడని ఆశించాలి ★



జరిగిన కథ

కాళిదాసు ఇంటి వరండాలో ఎవరో పసివాణ్ణి విడిచి వెళ్ళారు. భార్య మరణంతో, వృద్ధుడైన తండ్రి తప్ప వేరే ఆదరువు లేని కాళిదాసు ఆ అనాథ బాలుణ్ణి పెంచడానికి సిద్ధపడుతాడు. స్నేహితుడు వరూధి, మామగారు ఎంత చెప్పినా కాళిదాసు మళ్ళీ పెళ్ళి చేసుకొందుకు ఇష్టపడడు. శంకరశాస్త్రి తనకూతురు రుక్మిణికి సంబంధం చూసి పెట్టమని కాళిదాసును అడుగుతాడు. జానకి రామారావు కాళిదాసు చిన్ననాటి స్నేహితుడు. దొంగనోట్లు అచ్చు వేసే కేసులో అతణ్ణి పోలీసులు అరెస్టు చేస్తారు. కాళిదాసు ఇంటికి పనిపిల్లగా వచ్చిన గోవిందు డబ్బుతో పారిపోతాడు.

దాదాపు పదిహేను రోజులు గడిచిపోయిన తర్వాత ఒకనాడు కాళిదాసు మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చాడు. అతనికి ఒంట్లో చాలా నీరసంగా వుంది. కొందరాలు పెంపకం చేస్తున్నా, నిస్త్రాణగా నొప్పిగా వుంది.

అతడొక గంటసేపు కళ్ళు మూసుకుని విశ్రాంతిగా పడుకున్నాడు. తర్వాత లేచి అప్పుడే వచ్చిన

పెద్దిభొట్ల సుబ్బరామయ్య

మురళికి కాళిదాసు ఇచ్చి చిదంబరశర్మగారి ఇంటికి బయలుదేరాడు.

పదిహేను రోజుల క్రిందట చిదంబరశర్మకు పక్షవాతం వచ్చింది. ఆయన ఆ క్రిందటిరాత్రి మామూలుగానే తేలికగా భోజనంచేసి కాసేపు అటూ యిటూ తిరిగిన తర్వాత తన గదిలో పడుకున్నాడు. రోజూ తెల్లవారుఝామునే మేలుకునే తండ్రి, ఆరోజు చాలా పొద్దెక్కిన తర్వాత కూడా లేవకపోవడంతో ఆయన కూతురు రుక్మిణి లేపబోయింది. అప్పటికే ఆయనకు నోట మాట రావడంలేదు. నోరు ఒక ప్రక్కకు తిరిగిపోయింది. ఒక చెయ్యీ కాలూ స్వాధీనం తప్పిపోయాయి. ఏదో మాట్లాడబోతాడు కాని నోట మాటరాదు. కళ్ళనిండా నీళ్ళు నింపి చూస్తూ పడుకుని వున్నాడు. ఆమె కాస్సేపు బాధపడి, కాస్సేపు కళ్ళనీళ్ళు పెట్టుకుని తర్వాత ఆలోచించి కాళిదాసుకు కబురు పంపించింది. అతడు రాగానే "చూడండి నాన్నగారు మాటా పలుకూ లేదు ఎలా పడివున్నారో, చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నది. నాన్నకు ఈ దిక్కుమాలిన..." అంటూ పెదిమలు మొహాన కప్పుకుని ఏడ్చింది.

కాళిదాసు "మీరలా అధైర్యపడకూడదు. ఏమీ పరవాలేదు. హాస్పిటల్లో నాకు దగ్గర స్నేహితుడొకడున్నాడు. తీసుకువచ్చి చూపిస్తాను.

మీరు కంగారుపడకుండా కొద్దిసేపు నోపిక పట్టండి" అని చెప్పి కొద్దిసేపటిలో డాక్టరును తీసుకువచ్చాడు డాక్టరు పరీక్షచేసి "కాళీ! ఈయనను ఆసుపత్రికి తీసుకువచ్చి చేర్చు ఏమీ భయంలేదు పది పది హేను రోజుల్లో అంతా నయమైపోతుంది అదుర్దా పడనక్కరలేదు" అని చెప్పాడు కాళిదాసు వెంటనే బండి తీసుకువచ్చి, బండివాడి సహాయంతో ఆయను బండిలో పడుకో బెట్టి తీసుకుపోయి అప్పూటే ఆసుపత్రిలో చేర్చాడు వారం రోజులనుంచి రోగస్థితిలో సంతృప్తికర మైన మార్పులు కనిపిస్తున్నాయి కాళిదాసు ప్రతి రోజూ కనీసం ఒక్కసారి అయినా ఆయనను పరామర్శించి వస్తున్నాడు ఆమె కూడా ప్రతి రోజూ కొడుకును వెంటబెట్టుకునివెళ్ళి ఆయనను చూసి వస్తున్నది

కాళిదాసు నెమ్మదిగా నడిచి నిరంజనశర్మగారి ఇల్లు చేరుకున్నాడు అప్పటికి సూర్యుడస్తమించాడు సంధ్యవెలుగు కూడా కొద్దికొద్దిగా అంతరించిపోతున్నది సన్నని చంద్రరేఖ అప్పుడే ఆకాశంలో కనిపిస్తున్నది పక్షులన్నీ రొదచేస్తూ తమతమగూళ్ళను చేరుకుంటున్నాయి క్రొత్త బిచ్చగాడెవరో అప్పుడే భిక్షాటనకు బయలు దేరాడు

ఆయింటి వాకిలి తలుపు తాళం వేసివుంది ఆమె బహుశా తండ్రినిచూసి వచ్చేందుకు ఆసుపత్రికి వెళ్ళిందేమో! కాళిదాసు వీధిగేటు తీసుకుని లోపలికి వెళ్ళి పంచలోవున్న కుర్చీల్లో ఒక దాన్లో కూర్చున్నాడు మరి కొద్దిసేపట్లో అతడు ఆలోచనలో పడిపోయాడు అవన్నీ చిన్ననాటి జ్ఞాపకాలు

తమ చిన్నతనంలో వర్ధనీ తానూ కలిసి చదువుకున్నారు ఆమె ఎంతో ఉల్లాసంగా వుండేది ఇంట్లో ఆమె నందరూ గారాబంగా చూసేవారు ఏదికావాలని అడిగితే అది కొనిపెట్టేవారు ఆమె మాట కాయింట్లో ఎదురు చెప్పడమంటూ వుండేది కాదు కాలం చిత్రమైనది అది తెచ్చే మార్పులు చిత్రంగానే వుంటాయి అంతగడుగ్గాయి అయిన ఆపిల్ల క్రమాంగా మారిపోయింది పోర్త్ఫారంతో చదువు మానేసిన తర్వాత ఆమె చాలా అరుదుగా కనిపించేది కనిపించినప్పుడయినా, పలకరించేదికాదు ఆమె పెళ్ళికి పిలుపువస్తే వెళ్ళటం సంభవించింది ఆ వరుడు బాగా చదువుకున్నవాడు అందమైనవాడు ఇక ఆమె చాలా వింతగా మారిపోయింది ఆమె కనురెప్పలు బరువుగా వాలిపోతున్నాయి ఆమె కాటుకకళ్ళు సోగలై ఆకర్ణాంతములై వున్నాయి ఆమె జెడ నల్లత్రాచు పాములా వెడల్పుగా పొడుగ్గావుంది పచ్చని ఆమె బుగ్గమీద చుక్క వుంది నుదుట కుడిప్రక్కగా చిన్న పుట్టుమచ్చ వుంది.

పెళ్ళి అయిన తర్వాత ఆమెను మళ్ళీ కాళిదాసు ఎన్నడూ చూడటం పడలేదు ఆమె ఎప్పుడైనా పండుగలకు వచ్చి వెళ్ళుతున్నప్పటికీ అతడు చూడటం తటస్థించలేదు ఒక సంక్రాంతి పండుగ తర్వాత అతడు రైల్వే స్టేషనులో ఏదో పనివుండి వెళ్ళి తిరిగి వస్తూ వెయిటింగ్‌రూమ్ ముందు నిలబడిపోయాడు. లోపల ఆ భార్యాభర్త లిద్దరూ కూర్చుని మాట్లాడుకుంటున్నారు పండుగకు వచ్చి వెడుతున్నారు కాబోలు ఆమె భర్త నవ్వుతూ ఏదో చెబుతూవుంటే ఆమె కూడా నవ్వుతున్నది ఆమె ధ్యానం అంతా భర్తమీద తప్ప యితర ప్రపంచంమీద లేనట్టుగా తోచింది తర్వాత కాళిదాసు తనదోవన తాను వచ్చేయటం జరిగింది

కాలమెప్పుడూ ఒకేరీతిగా జరగదు అన్నివేళలూ మనవికావు తర్వాత విధి ఆమె జీవిత కుసుమ రాశిలో నిప్పులు పోసింది ఆమె భర్త, పుత్రుణ్ణి చూసే ఉత్సాహంతో అత్తగారి యింటికి రాబోతూ మాయదారి మరణం పాలబడ్డాడు అప్పటినుంచి ఆమె జీవిత మొక చిగురించని లత మూగవోయిన వీణ

ప్రహరీ తలుపు తీసిన చప్పుడైై కాళిదాసు ఆలోచనలోనుంచి తేరుకుని తలపైకెత్తి చూశాడు వర్ధని లోపలికి వస్తున్నది ఆమె వెనకనే రాధ కూడా చేతిలో ఒక ప్లాస్టిక్ బొమ్మతో లోపలికి వస్తున్నాడు

ఆమె మెట్లమీదికివచ్చి అతన్ని గుర్తించి

రాము:- సోమూ! తెల్లావు కంటె నల్లావు గొప్పది ఎందు చేత?

సోము:- ఇదే తెలియదట్రా! నల్లావు తెల్ల పాలివ్వగలదు కాని తెల్లావు నల్ల పాలివ్వ లేదుగా.

బి లక్ష్మణకుమార్ (కాకినాడ.)

"మీరా? ఎంత సేపయింది వచ్చి?" అని అడిగింది అతడు లేచి నుంచుని "ఎంతోసేపు కాలేదు ఒక పావుగంట అయిందేమో అంతే" అన్నాడు

ఆమె ముందుహాల్లో లైటు వెలిగించి అతని వైపు తిరిగి "కూర్చోండి" అన్నది తర్వాత తను కూడా అక్కడ చాపమీద కూర్చుని "ఏదో భగవంతుడి దయవల్ల యీ మాత్రంగా యీ గండం దాటిపోయింది నాన్న యీ పూట చాలా కులాసాగా వున్నాడు నెమ్మదిగా నాతో ఆ విషయమూ యీ విషయమూ మాట్లాడగలిగాడు కూడా అయినా యిదంతా మీ చలవ పగలూ రాత్రీ అనక అలా తిరిగి సహాయం చేశారు మీరు లేకపోతే యీ పాటికి దిక్కులేనిపక్షులమైపోయేవాళ్ళం" అన్నది ఆమె కళ్ళు శ్రావణమేఘాలవలె జలార్ద్రములైనాయి

కాళిదాసు సోఫాలో వెనక్కువ్రాలి "నేను చేసిందేముంది? అయినా మీరు అదృష్టవంతులు " అన్నాడు రెండు మూడు క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి రాధ కొద్దిదూరంలో చాపమీద కూర్చుని ఎక్కాలు చదువుతున్నాడు గోడనున్న గడియారం ఎనిమిది గంటలు కొట్టింది ఆమె లేచి "మీ రీ పూట యిక్కడే భోజనం చెయ్యాలి ఇప్పటికే పొద్దు పోయింది ఇంక యింటికివెళ్ళి వంట చేసుకోలేరు" అన్నది కాళిదాసు వారిస్తూ "వద్దండీ. నే నీ పూట అసలేమీ తినదలుచుకోలేదు వంట్లో అంత కులాసాగాలేదు" అన్నాడు

ఆమె పోబోతున్నదల్లా వెనుదిరిగిచూసింది. "అదేమిటి? అన్నం మానేస్తే మరీ నీరసం వస్తుందేమో! నామాట కాదనకండి ఇంట్లో పాలున్నాయి పాలతో వేడివేడిఅన్నం తింటే హాయిగా నిద్ర పడుతుంది ఒక అరగంటలో అంతా సిద్ధమైపోతుంది అందాకా మీరు పైన పుస్తకాల గదిలో కూర్చోండి" అన్న దామె ఆమె కన్నులలో ఒక అధికారం వుంది ఆమె నయాన చెప్పినా అది ఆజ్ఞవంటిదే కాళిదాసు బదులు పలకలేదు ఆమె లోపలికి వెళ్ళిపోయింది

నిముషాలు నిశబ్దంగా గడుస్తున్నాయి రెండు పిల్లులు చప్పుడు కాకుండా నడుస్తూ ఒక గదిలో నుంచి మరో గదిలోకి వెళ్ళాయి కిటికీ అవతల వున్న నందివర్ధనంచెట్టుకు పూచిన తెల్లని పువ్వులు చల్లని గాలికి పులకరించి కదులుతున్నాయి ఇంటి పైకప్పున పిచ్చికలు గూడుకట్టుకుని వుండి 'కిచ కిచ' మని రొద చేస్తున్నాయి రాధ తూగుతూ "ఎనిమిది ఫర్లాంగు లొక మైలూ "
అని చదువుతున్నాడు

కాళిదాసు కేమీ తోచలేదు 'అలా పైకివెళ్ళి చూస్తే పుస్తకాల గదిలో దినపత్రిక వుంటుందేమో! చదువుకుంటూ కూర్చోవచ్చు" అనుకుని అతడు లేచి మెట్లెక్కి పైకి వెళ్ళాడు ఆ గదిలో నాలుగైదు బీరువాలనిండా లావాటి పుస్తకాలున్నాయి. అందులో చాలాభాగం నిరంజనశర్మగారు ప్లీడరు ప్రాక్టీసు చేసిన నాటివి కొన్ని అరలలో తెలుగు కావ్యాలు కొన్ని వున్నాయి కాళిదాసుకు అక్కడ దినపత్రిక యేదీ కనిపించలేదు. అతడు కావ్యాలన్నీ వెదికి ఒక పుస్తకం చేతిలోకి తీసుకుని కూర్చున్నాడు అది ఒక వేదాంత గ్రంథం. కాళిదాసు పుటలు తిరగవేశాడు

జీవితమెంత బుద్బుదప్రాయమైనదో, కండలు పెంచి ప్రత్యర్థులను చిత్తుచేసే వస్తాదులకూ, రూపాయలతో తులాభారంతూగే మహా సంపన్నులకూ, కూడా జరామృత్యువు లేవిధంగా తప్ప రానివో వివరించాడు గ్రంథకర్త కాళిదాసు ఒక చోట ముగ్ధుడైపోయాడు 'కాలము' అనే దాని స్వభావాన్ని గ్రంథకర్త అద్భుతంగా వివరించాడు నిజమే మనం దాన్ని గురించి అంతగా ఆలోచించము అయినా ఈ కాలస్వభావం విచిత్రమైంది ఇప్పుడు మనం 'వర్తమానం' అనుకుంటున్నది మరికొద్దిసేపటికే 'భూతకాలమ'యిపోతున్నది ఇప్పుడు 'భవిష్యత్తు' అనుకుంటున్నది మళ్ళీ 'వర్తమానమై'పోతున్నది ఈవిధంగా క్షణాలు నిముషాలుగా, నిముషాలు గంటలుగా, గంటలు దినాలుగా, దినాలు నెలలుగా, సంవత్సరాలుగా పరివర్తనంచెంది, పసివాడుగా పుట్టిన మానవుణ్ణి పండుముదుసలిగా చేస్తున్నాయి ఇలా కాలమే జీవులపాలిటి మృత్యువవుతున్నది యముణ్ణి

(43-వ పేజీ చూడండి)



కమల్‌వారి ప్రే లో సంధ్య

తర్జుమా చిత్రాలపై దక్షిణాదికి మోజు

సాధారణ చిత్రాలకన్న తర్జుమా చిత్రాలపై మోజు విపరీతంగా చలనచిత్రరంగంలో ఉన్నట్లు గత ఆరు నెల్లుగా విడుదలైన చిత్రాలనుబట్టి తెలుస్తోంది గత అర్ధ సంవత్సరం విడుదలైన చిత్రాలపై పరిశ్రమ పరిస్థితిని సింహావలోకనం చేస్తూ దక్షిణభారత చలనచిత్ర వాణిజ్యమండలి తమ తాజా సంచికలో పేర్కొన్నది అందులో ఇలా ఉంది జూన్ 30 తో అంతమయ్యే అర్ధ సంవత్సరంలో మొత్తం 57 చిత్రాలు సెన్సారు అనుమతులు పొందినవి 1960 లో ఇదే కాలానికి 64 చిత్రాలు అనుమతులు పొందినవి 1961 అర్ధసంవత్సరం సెన్సారు అనుమతి పొందిన 57 చిత్రాల్లోను 23 తమిళం 24 తెలుగు, 3 కన్నడ 4 మలయాళం 4 హిందీవి

ఈ 57 చిత్రాలలోను 22 తర్జుమా చిత్రాలు అవగా 7 తమిళంలోను, 12 తెలుగులోను, 2 కన్నడ 1 మలయాళంలోను తయారైనట్లు పరిశీలనవల్ల తెలుస్తోంది

గత సంవత్సరం ఇదే కాలంలో సెన్సారు అనుమతి పొందిన చిత్రాలని బట్టి చూస్తే మామూలు చిత్రాలు 10% తగ్గిపోయినట్లు తేలుతోంది ఈ సంవత్సరం జూన్‌లోగా సెన్సారైన తర్జుమా చిత్రాలలో 50% పైన తెలుగు చిత్రాలే ఉన్నాయి

ఉచిత సంగీత ప్రదర్శనల నిరాకరణం

ఇదివరకు మాదిరిగా ఇకముందు చలనచిత్ర గాయకులను ఉచితంగా ప్రదర్శనలకు వినియోగించుకోరాదని చలనచిత్ర సంగీతకారుల సంఘం తీర్మానించింది

సంఘానికి రు 501 లు యిచ్చి చలనచిత్ర సంగీతకారులను ఉచిత ప్రదర్శనలకు వినియోగించుకునేవారు ఇకముందర ఈ పద్ధతికి స్వస్తి చెప్పి చిత్ర సంగీతకారుల సంఘం ప్రతి గాయకునకు రు 50 ఇవ్వందే ప్రదర్శనలకు ఆ వ్యక్తిని ఉపయోగించుకొనరాదని తీర్మానించింది

అయితే ఈ నిబంధన జాతీయ ప్రాముఖ్యాలు గలవాటికి అర్థమైన తదితర సంగీత ప్రదర్శకులకు వర్తించదట

సెన్సారుకు వ్యతిరేకులం కామని బిమల్‌రాయ్ ఉద్ఘాటన

చలనచిత్రాల సెన్సారు పద్ధతి పట్ల తామెన్నటికీ వ్యతిరేకులం కామనీ చిత్రాల మంచి చెడుగులను నిర్ణయించగల దక్షులు నిపుణులు—వీరికి సెన్సారు సంఘంలో స్థానం కల్పించాలని మాత్రమే తాము కోరుతున్నామని భారత చలనచిత్ర నిర్మాతల సంఘ అధ్యక్షుడు శ్రీ బిమల్‌రాయ్ తమ విధానాన్ని స్పష్టీకరిస్తూ ఒక ప్రకటనలో ఇటీవల బొంబాయిలో అన్నారు

సెన్సారు సంఘంలో పరిశ్రమకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని శ్రీరాయ్ అన్నారు సెన్సారువారు ఇటీవల అవలంబించిన ఆకస్మిక తీవ్ర దృక్పథంవల్ల పరిశ్రమ ఆర్థికంగా సంకుచితమై నిర్మాణంలో ఉన్న వివిధ చిత్రాల పనులు స్తంభించిపోవటం జరిగిందని కూడా శ్రీ బిమల్‌రాయ్ పేర్కొన్నారు

(49-వ పేజీ చూడండి)



బియోవుల్ఫ్

జరిగిన కథ

డేనిష్ మహారాజు హ్రోత్గార్ హియరాట్ అనే అపూర్వమైన భవనం నిర్మిస్తారు. ఆ భవనంలో జరుగుతున్న ఆనందకోలాహలం గ్రిండల్ అనే రాక్షసుడికి నచ్చదు. వాడు ఆభవనంపై పన్నెండుసంవత్సరాలు దాడి జరిపి జనులను చంపితింటాడు. వాడి దుండగాలను అరికట్టే ప్రయత్నంలో హ్రోత్గార్‌కు సహాయ్యపడేందుకు హైగెక్ రాజు మేనల్లుడు బియోవుల్ఫ్ కొందరు యోధులతో డేనిష్ రాజ్యానికి వస్తాడు. బియోవుల్ఫ్ గ్రిండల్‌తో పోరాడి వాణ్ణి చంపివేస్తాడు. గ్రిండల్ తల్లి హ్రోత్గార్ భర్తారుని ఎత్తుకుపోతుంది. బియోవుల్ఫ్ దాని నివాసానికిపోతాడు.

పెద్ద పెద్ద సుళ్ళు తిరుగుతూ నీటి అలు కొట్టుకోనారంభించాయి అతడు దూకిన వేగానికి నీటిలోని చేపలు చాలా ఎత్తుకు ఎగిరిపడనారంభించాయి

గ్రిండల్ తల్లి చాలా కాలంనుంచీ ఆ కొలను పైన అధికారం చెలాయిస్తోంది కొలనులో వెలరేగుతున్న అలజడిని చూచి ఎవరో తన ఆవాసానికి వస్తున్నట్లుగా కనిపెట్టేసింది. వెంటనే ఒక దూకు

స్వేచ్ఛానువాదం:
నాగరాజ్.

దూకి బియోవుల్ఫ్‌ను పిడికిలితో, గోళ్ళతో రక్కి అణచివేయాలని, చంపివేయాలని ప్రయత్నించింది కాని దాని ప్రయత్నం నిష్ఫలమైపోయింది బియోవుల్ఫ్ కవచానికి పైన వేసుకొన్న ఇనపగొలుసుకట్టు అంగరఖా (చొక్కా) ఈ ప్రమాదం నుంచి తప్పించింది ఈలోపల రాక్షసి బియోవుల్ఫ్ పెట్టాడుకొంటూనే కొలను అడుగు భాగానికి దిగిపోయారు వెంటనే ఆ రాకాసి బియోవుల్ఫ్‌ను తన గుహకు లాక్కుపోయింది అది లాక్కుపోయిన వేగానికి సింహబలుడైన బియోవుల్ఫ్ తట్టుకోలేకపోయాడు చివరకు ఏ ఆయుధము కూడా ఉపయోగించకలేపోయాడు అక్కడ చాలా చిన్న చిన్న దెయ్యాలు, వున్నాయిగా! అవి బియోవుల్ఫ్ ధరించిన గొలుసుకట్టు అంగరఖా పీకివేయాలని ప్రయత్నించాయి ఉడుపులు మాత్రం చిరిగి నీటిలో తేల నారంభించాయి

ఈ రగడంతా జరుగుతుండగానే బియోవుల్ఫ్ ఒక చిన్న హాల్లో ప్రవేశించాడు ఇది కూడా గ్రిండల్ తల్లిదే అయితేనేం జలచరాలనుంచి కొంత ప్రమాదం తప్పింది దాంట్లో నెగడి మండుతూవుంది ఈలోగా రాకాసి వంటయింటి కుందేలు మాదిగా టక్కున బియోవుల్ఫ్ పైకి దూకింది వెంటనే బియోవుల్ఫ్ తన కత్తితో దానిని పొడిచాడు కాని వెంటనే అతనికి తెలిసివచ్చింది ఎన్నో ఏళ్ళుగా ఎన్నో యుద్ధాల్లో తనకు విజయం సాధించిన కత్తి ఇప్పుడు పని చేయలేదని ఏమైనాసరే దీని అంతు తేలుస్తానని ప్రతిజ్ఞ చేసివచ్చాడుకదా బియోవుల్ఫ్! తన ప్రతి

ణ్ణను మళ్ళీ ఒకసారి జ్ఞాపకం తెచ్చుకున్నాడు తన చేతులతో దాని జబ్బ పుచ్చుకొని ఒక్క త్రోపు తోశాడు ఆ దెబ్బతో అది ఆవులిస్తూ, భూమిని కావులించుకుంది అయితేనేం! అది మాత్రం తక్కువా! ఇలాంటి ఉక్కుపిండాలను ఎన్నింటినో చూచిందాయె! క్రింద పడ్డప్పుడు తగిలిన దెబ్బను తమాయించుకొని కోపంతో బొబ్బలేస్తూ బియోవుల్ఫ్‌ను నేలమీదకు విసిరివేసింది అమిత బలవంతుడు, వీరుడు బియోవుల్ఫ్ పట్టు సడలి బలహీనుడై నేలకు జారాడు కొద్దిగా స్పృహ తప్పిందేమో కూడా!

బియోవుల్ఫ్‌ను క్రింద పడవేసి ఆ రాకాసి తన బారాటికత్తిని తీసింది ఆ కత్తి నాల్గడుగుల పొడుగు, రెండడుగుల వెడల్పు వుండి, తళతళా మెరుస్తోంది రెండు చేతులో్తటే కత్తి నెత్తింది. సూటిగా గుండెకు గురిచూచింది తన ఏకైక పుత్రుణ్ణి గాయపరచి చంపిన ఆ ఘాతకుడు తుచ్ఛ మానవుడు బియోవుల్ఫ్‌పట్ల ద్వేషం, ఈర్ష్య, రోషం, మరణించిన పుత్రునిపట్ల శోకాన్ని వెళ్ళగక్కుతూ ఆ రాకాసి కళ్ళు అగ్ని గుండాలలాగా మెరుస్తున్నాయి ఆ కత్తి బియోవుల్ఫ్ గుండెమీదికి మహా ఉద్ధృతంగా వస్తోంది అదే గనుక దిగితే ఈ కథ ఇక్కడి కాగేది!

ఆ కత్తి అలావచ్చి ఖంగ్‌న మోగుతూ అమాతం, ఒక అడుగులోతు భూమిలోకి దిగిపోయింది అక్కడ బియోవుల్ఫ్ వుంటేగా దెబ్బ తగిలేందుకు సరాసరి తన గుండెమీదికి గురిపెట్టిన కత్తిని చూచాడు బియోవుల్ఫ్ తాను లేచి ఆత్మరక్షణ చేసుకునే వ్యవధిలేదు 'అందుకని అమాంతం ఆఖరు ప్రయత్నంగా ప్రక్కకు జరిగాడు ఆ వజ్రకవచానికి గొలుసుకట్టు చొక్కాయే లేకపోతే ఆ కత్తి సూటిగా చక్కగా బియోవుల్ఫ్ గుండెలోతు పరీక్షచేసి భూమిలోకి దిగిపోయేది ఈ ప్రమాదం పసిగట్టి బియోవుల్ఫ్ ప్రక్కకు జరిగాడు ఆ కత్తి పక్కగావచ్చి బియోవుల్ఫ్ అంగరఖా ప్రక్క గొలుసుకట్టుకు రాచుకొని భూమిలోకి పోయింది

ప్రమాదంనుంచి తప్పుకున్న వెంటనే బియోవుల్ఫ్ ఆయుధంకోసం చుట్టూ వెతికాడు దగ్గరగా గుహ గోడకు ఆన్చి ఒక పెద్ద కత్తి వుంది దాని లక్షణం చూస్తేనే దాన్ని సామాన్యుడెవ్వడూ మోయలేడని తెలుస్తున్నది ఐనా గత్యంతరంలేదు గనుక లేచి ఆ కత్తి తీసుకుని రెండు చేతులతోటి ఎత్తి పట్టుకున్నాడు అంతవరకు, భూమిలోకి దిగిన తన కత్తిని లాక్కునే ప్రయత్నంలోవున్న రాక్షసి ఈ ప్రయత్నం పసిగట్టింది గుహంతా దద్దరిల్లిపోయేలాగా అరుస్తూ బియోవుల్ఫ్‌మీదికి దూకింది అంతే బియోవుల్ఫ్ చేతిలోని కత్తి మొన అనాయాసంగా దాని హృదయంలోంచి దూసుకుపోయింది మరణవేదనతో అది వేసిన రంకె సుడులు సుడులుగా తరంగాలు తరంగాలుగా ఉవ్వెత్తుగా లేచి కొలనంతా కలవరపెట్టింది

బియోవుల్ఫ్ ఆ గుహలోంచి చిన్నగా బయటకు వచ్చాడు దూరంగా వో మూలన గ్రిండల్ శరీరంపడివుంది ఒంటిచేతితోవున్న ఆ శరీరం చాలా భయంకరంగావుంది బియోవుల్ఫ్ తనకత్తితో గ్రిండల్ తలను మొండెంనుంచి వేరుచేసి తీసుకొని కొలను పైభాగానికి బయలుదేరాడు.

ఈ కొలనులో జరుగుతున్న రగడంతా ఒడ్డునున్నవాళ్ళకేమీ తెలియదు వాళ్ళు చూస్తుండగానే బియోవుల్ఫ్ కొలనులో దూకాడుకదా! ఒక అరగంట గడిచింది గంట కూడా గడిచిపోయింది అలలు భీకరంగావచ్చి ఒడ్డుకు కొట్టుకోవటం, జలచరాలన్నీ ఎగిరిపడటం, కొలను అంతా నెత్తుటిమయంకావటం వాళ్ళు చూచారు ఇలా రెండు మూడు గంటలు గడిచేటప్పటికి మాంసఖండాలు నీటిపై తేలుతూ కనిపించాయి జలచరాలు ఆమాంసంకోసం మూగటం, పోట్లాడుకోటం కూడా హ్రోత్గార్ ప్రభృతులు తిలకించారు కొంత సేపటికి బియోవుల్ఫ్ ధరించిన ఉడుపుల భాగాలు తేల నారంభించాయి అప్పటికి పూర్తిగా సాయంత్రమైంది

దుఃఖభారంవల్ల ఏర్పడ్డ ఉద్రేకాన్ని దాచుకునేందుకన్నట్లు సూర్యుడు కొలగర్భపు కనుమలో ముఖం దాచుకున్నాడు అతిఖేదనంవల్ల ఎర్రనైన ముఖంతో ఉదయించిన వెన్నెలరేడు పుట్టినవాడు గిట్టక తప్పదన్న సత్యాన్ని తెలుసుకొన్నవానిలాగా ప్రశాంతంగా, పిండారబోసినట్లుగా వెన్నెల కురిపిస్తున్నాడు రాజువెంటబోయే రక్షకభటుల్లాగా తారకలు తారాడుతూ రేరాజు వెంట పయనం సాగిస్తున్నాయి

అప్పటికి రాత్రి మూడవజాము కూడా గడిచిపోయింది హ్రోత్గార్ మహారాజు ఆయన అనుచరులు నిరాశా, దుఃఖాలతో జేవురించిన ముఖాలతో ఇంటికి వెళ్ళిపోయారు బియోవుల్ఫ్ ఇక ఎప్పటికి రాడని నిరాశ చేసుకునారు దుఃఖభారంతో కృంగిపోతూ మహారాజు అంతఃపురం చేరారు

* * *

ఐతే అలా కొలనువిడిచిపోనివారు కూడా కొందరున్నారు బియోవుల్ఫ్‌వెంట హ్రోత్గర్ సన్నిధికి వచ్చిన గీట్‌వీరులు మాత్రం ఆ కొలను వదిలిపోలేదు తమ ప్రియతమనాయకుడు సజీవంగా వున్నాడని ఇంకా వస్తాడనీ ఎదురు చూస్తూ, వీలైతే తమ ప్రాణాలన్నీ ధారపోసి ఆయనను రక్షించుకోవాలని సిద్ధంగా కొలను చుట్టూ తిరుగుతూ వున్నారు

రాక్షసిని చంపిన కత్తి, గ్రిండల్ తల పట్టుకొని బియోవుల్ఫ్ చిన్నగా ఈదుకుంటూ ఒడ్డుకు చేరాడు అతనిరాకకోసం పడిగాపులు కాస్తున్న మిత్రులంతా పరుగెత్తుకువెళ్ళి అతన్ని ఒడ్డుకుచేర్చి కవచం వగయిరాలను ఊడదీసి కొంత విశ్రాంతి కల్పించారు తరువాత వారంతా చిన్నగా బయలుదేరి రాజ్యంలోకి ప్రవేశించారు గ్రిండల్ తలను మాత్రం నల్గురు అతికష్టంమీద మోసుకుపోయారు ఇంతలో తెల్లవారిపోయింది

బియోవుల్ఫ్ బ్రతికి వచ్చాడన్న వార్త మహారాజు హ్రోత్గార్‌కు తెలిసింది ఆయన ఆనందం పట్టలేక నగరమంతా అలంకారం చేయించి హియరాట్ భవనంలో కొలువుదీరి కూర్చున్నాడు ఈలోపల బియోవుల్ఫ్ అతని మిత్రులు హర్షధ్వానాలు చేస్తూవచ్చారు హియరాట్ ద్వారంవద్దే పలువురు డేనిష్ అధికారులు వారికి స్వాగతంచెప్పారు


బియోవుల్ఫ్ గౌరవసూచకంగా తాను తెచ్చిన అపూర్వ కానుకలను మహారాజుకు సమర్పించి ఇలా అన్నాడు

"మహారాజా ఈనాడు నేను మీకు ఈ అమూల్య కానుకలను ఆనందంగా సమర్పిస్తున్నాను. ఇవి నే సాధించిన విజయానికి ప్రతిబింబాలు సర్వ రక్షకుని కరుణావిశేషంవల్ల ప్రాణాపాయం లేకుండా బయటపడ్డాను లేకపోతే నేను ఈపాటికి సరోగర్భంలో దీర్ఘవిశ్రాంతి తీసుకుంటూ వుండేవాణ్ణి కాని విధి నాకు అనుకూలించటంవల్ల ఆ దుర్మార్గులిద్దరు తాము సాగించిన మారణహోమాలకు తగిన శిక్ష అనుభవించారు ఇంక మీకు మీ ప్రజకు ఎటువంటి ఆపదా రాదు ఈ రోజునుంచి మీరు అనుచరులతో సహా నిర్భయంగా 'హియరాట్' భవనంలో నిద్రించవచ్చు భగవంతుడు మీకు బాధల నుండి విముక్తి కల్పించాడు"

బియోవుల్ఫ్! నీ విజయాన్ని ప్రపంచమంతా వేనోళ్ళ కీర్తిస్తుంది నీ అపార బలసంపదతో మానవోద్ధారకుడుగా ప్రఖ్యాతి పొందుదువు గాక! నీతో ఆజన్మాంతం సాన్నిహిత్యం ఏర్పరచుకోటానికి నేను సిద్ధంగా వున్నాను ఈనాటినుంచి మన ఉభయుల రాజ్యాలు ఆదర్శమైత్రితో వర్ధిల్లుగాక అని ఆశీర్వదించారు మహారాజు హ్రోత్గార్

ఆ తరువాత ఒక పెద్ద విందు జరిగింది మహారాజు హ్రోత్గార్ విలువైన నగలను, రత్నాలను బియోవుల్ఫ్‌కు ఇచ్చారు —(ఇంకా ఉంది)





కాల్గేట్ వాడి నోటినించి దుర్వాసన రాకుండా చేసుకోండి
రోజంతా దంతక్షయం రాకుండాకూడా కాపాడుకోండి!
ఎందుకంటే : ఒక్క సారి తోముకొంటేనే
కాల్గేట్ డెంటల్ క్రీమ్ నోటిలో దుర్వాసన మరియు దంతక్షయమునకు కారణమైన సూక్ష్మ క్రిములను 85 % వరకు తొలగించును
కాల్గేట్ 10 మందిలో 7 గురికి నోటి దుర్గంధమును వెంటనే ఆపుతుందని మరియు భోజనము అవగానే కాల్గేట్ పద్ధతిలో పళ్లు తోముకొనుట ద్వారా ఎక్కువ మందికి ఎక్కువ దంత క్షయము అరికట్టిందని దంత శాస్త్ర చరిత్రలో పూర్వమెన్నడూ తెలియచేయనంతలా శాస్త్ర పరిశోధనం ఫలితముగా నిరూపించబడినది !
ఊరికే నోటిలో నీళ్లు పోసుకొని పుక్కిలించుట చాలదు. భోజనము అయిన వెంటనే క్రమం తప్పకుండా కాల్గేట్ తో పళ్లు తోముకోండి దాని చేవతనమైన నురుగు పళ్ల మధ్య కనపడకుండా ఉండే సందులలోనికి వెళ్లి నోటి దుర్వాసనకు మరియు దంతక్షయమునకు కారణమైన కుళ్లి పోతున్న ఆహారపు తునకలను తీసివేస్తుంది !
పిల్లలు కాల్గేట్ తో పళ్లు తోముకొనుటకు యిష్టపడతారు ఎందుకంటే చాలా సేపు ఉండే దాని పెప్పర్‌మెంట్ వంటి రుచి అంటే వారికి ప్రీతి !
COLGATE DENTAL CREAM
మీకు పొడరు కావాలంటే, ఈ లాభములన్నిటిని మీరు కాల్గేట్ టూత్ పొడరు ద్వారా పొందగలరు... ఒక డబ్బా వెంట వస్తుంది
COLGATE TOOTH POWDER
కాల్గేట్ తో క్రమం తప్పకుండా పళ్లు తోముకొంటే
✔ నోటి దుర్వాసనను పోగొట్టును
✔ దంతక్షయమును నిరోధించును
✔ పళ్లను మెరుస్తూ ఉండేలా ఉంచును
COLGATE DENTAL CREAM
నోరు ఎక్కువ శుభ్రముగా తాజాగా ఉండుటకు మరియు పళ్లు ఎక్కువ తెల్లగా ఉండుటకు ప్రపంచములో ఏ యితర పళ్లు తోముకొనే క్రీమ్ కన్న కాల్గేట్ నే ఎక్కువ మంది వాడుతున్నారు

ఆదర్శాలు - అంతర్యాలు



సింగరాజు లింగమూర్తి

జరిగిన కథ

పోలయ్య అంటే ఆ ఊళ్ళో చాలా మందికి అభిమానం, గౌరవం కొంతమందికి అతినిపై అయిష్టం కలగడానికి కూడా కారణం లేక పోలేదు నరసింహప్ప చలమయ్య ఒకరినొకరు సాధించుకోవాలని ఎత్తులు వేస్తూ ఉంటారు నరసింహప్ప పోలయ్యను తన పక్షంలో చేర్పించటానికి ప్రయత్నిస్తాడు పోలయ్యకు, నరసింహప్ప పెద్దకూతురు ఇందిరకు, రాజారావు ట్యూషన్ చెబుతూ ఉంటాడు ఇందిర చెల్లెలు లలిత రాజారావును ప్రేమిస్తుంది నరసింహప్ప రాజారావు ట్యూషన్ మాన్పిస్తాడు రాజారావును మంచిచేసుకునేందుకు చలమయ్య అలివేణిని నియోగిస్తాడు తనకు ట్యూషన్ చెప్పమని ఆమె అతనిని అడుగుతుంది ఎన్నికలలో పోటీచెయ్యమని పోలయ్యను రాజారావు ప్రోత్సహిస్తాడు

పగలు పనిచేసిన కార్మికులకు 'ఇవ్వాళ్టికి ముక్తి కలిగిస్తున్నా'నన్నట్టు మిల్లు కూతపెట్టింది మరికొన్ని క్షణాలలోనే బిలబిలలాడుతూ కూలీలు మిల్లు గేటులోంచి బయటకు వచ్చారు

మిల్లుకు ఏభై గజాల దూరంలోఉన్న మైదానంలోంచి లౌడ్‌స్పీకరులో "రండోయ్ కార్మికులారా రారండోయ్" అని ఎవరో పాడుతున్నారు

ఆ పాట మిల్లులోంచి బైటకు వచ్చిన కార్మికులను ఆకట్టివేసిందా అన్నట్టు అంతా ఆ వైపునకు పరుగుపెట్టారు

పావుగంటలో ఆ మైదానం జనంతో నిండిపోయింది వారిలో ఎక్కువభాగం మిల్లు కార్మికులు మిగతావారు రైతులు, ఇతర పనులమీద ఆదారిని పోయేవారు

రంగపాండు మైకుదగ్గర నిలబడి "కార్మిక సోదరులారా!" మీరంతా నిశ్శబ్దంగా కూర్చుంటే త్వరలో సభ ప్రారంభిస్తాము కాబట్టి మీరంతా గోలచేయకుండా కూర్చోమని మరోసారి మిమ్మల్ని కోరుతున్నాను" అని మైకు పగిలిపోయేట్టు అరిచాడు

పాట లౌడుస్పీకరులోంచి 'బొయ్'మని చెవులు గింగుర్లుమనేట్టు వినిపిస్తున్నది

"అరుగో చలమయ్యదొర" అంటూ ఇద్దరు కార్మికులు ఆయన వస్తున్న దిక్కుకు చూచారు

"దొరవారు మా మంచోర్రా సత్తిగా ఇంట్లో గింజలు లేవుదొరా అంటే మొన్న పది శేర్లు పోయించిండ్రు" మరో కార్మికు డన్నాడు

"మొన్న నీకు పదిశేర్లు గింజలు పోయించగానే మంచోడైపోయిండా? అరి మంచితనం ఓరికి తెలియదారి, పొలంల కూలి సేయించుకొని గింజలు పొయ్యడానికి గప్పుడురా, గిప్పుడురా అని పదిసార్లు

(41-వ పేజీ చూడండి)

బంగారం - సింగారం - 'శాఖ' చిత్రకథ



వచ్చే వారం బి. వి. సత్యమూర్తిగారి బొమ్మల కథ
'అగ్గిరాముడు' ప్రారంభం!



ఒకరోజున అక్బరు, బీర్బల్ తోను, ఇతర రాజోద్యోగుల తోను ఉద్యానవనంలో కూర్చుని ఉన్నాడు వారంతా ధనమును గురించి, దానియొక్క మంచి చెడ్డల గురించి చర్చించుకొంటున్నారు. అప్పుడు బీర్బల్ అక్బర్‌తో, "ఒక మనిషి డబ్బుకోసం గడ్డి కరవమంటే కరుస్తాడు ఎటువంటి క్లిష్టతరమైన పనులనైనా చేస్తాడు" అన్నాడు అక్బరు అందులకు అంగీకరించలేదు

అక్బరు తన చేతిని దగ్గర ఉన్న చన్నీటి సరస్సులో పెట్టి వెంటనే పైకితీసివేసాడు. నీరు చాల చల్లగా ఉంది

"ఏ మనిషికైనా చాల డబ్బు ఇచ్చి ఒక రాత్రంతా ఈ సరస్సులో ఉండమంటే ఉండగలడా? ఒక వేళ అలా చేయటానికి ప్రయత్నిస్తే అతడు చలికి బిగిసిపోయి తప్పకుండా చచ్చిపోతాడు" అన్నాడు అక్బరు

"మహాప్రభూ! అటువంటి మనుష్యులు ఎంతమందో ఉంటారు. వారికి ధనవంతులమయ్యేదమన్న ఆలోచన చన్నీటినిగూడా వేడిగా చేసిపారేయగలదు." అన్నాడు బీర్బల్ అక్బరుతో.

ఇతర ఆస్థానఉద్యోగులంతా బీర్బల్ సమాధానమునకు నవ్వి, "అదిచెప్పటం సులువేకాని చేయటం కష్టం. కాని అటువంటి మనుష్యుడెవడో ఒక్క బీర్బల్ బుఱ్ఱలోనే ఉండియుంటాడు." అన్నారు పరిహాసంగా.

అందులకు బీర్బల్ అక్బరు ఆజ్ఞ తీసుకొని కొన్నిదినములలో అట్టి మనుష్యుని అక్బరు వద్దకు తీసుకొని వచ్చాడు.

"నివు ఒక రాత్రంతా ఆ చన్నీటి మందిరంలో ఉండటానికి సిద్ధంగా ఉన్నావా? నీ యంతట నీవు ఆ

(౪౬-వ పేజీ చూడండి)



వాసంతి

రంగధామి

చంద్రమౌళి పిచ్చివాడిలా అయిపోవటానికి కారణం ఏదో ఉందని డాక్టర్ కనిపెట్టాడు కాని పిచ్చికి మందు ఆయన ఇవ్వగలడా ?

చంద్రమౌళి ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ ఒక్కడే చాలాదూరం వెళ్ళాడు మనిషి ఎదిగినకొద్దీ, ప్రకృతిలోని గొప్పతనం అర్థమౌవుతుంది తన భావాల్నీ, ఆనందాన్నీ, విషాదాన్నీ, మంచినీ, చెడునీ అన్నిటినీ ప్రకృతిలో చూడగల్గుతాడుమానవుడు తన మనస్సు వికసిస్తున్నకొద్దీ, ప్రకృతిపై భావాల్ని ప్రదర్శిస్తూ తనహృదయంతో అనుబంధం ఏర్పరచుకొంటుంది వికసించిన కుసుమాల సౌందర్యం, వికసిత మాత్ప యవ్వనులకు విశిష్టంగా గోచరిస్తుంది ఆకాశంలో మేఘాలు విజృంభించినప్పుడూ, పెనుతుఫాను చెలరేగినప్పుడూ, వ్యధాపూరితహృదయాలు, తమ బాధామయజీవితాలతో ప్రకృతిని పోల్చుకుంటాయి జీవితంతో విసిగి వేసారిన పథికుడికి మిణుకు మిణుకుమనే నక్షత్రాలూ, గతితప్పని సూర్యచంద్రులూ, తనలాగే దైవోపహతుల్లా కనిపిస్తాయి.

చుట్టూ పొలాలూ, మధ్య చిన్న కాలిబాటా, గట్లమ్మట విటారుగా నుంచున్న తాటిచెట్లూ, ఎర్రదనంకూడా తగ్గిపోతున్న ఆకాశం, వీటిని చూస్తూ చంద్రమౌళి మెల్లిగా నడుస్తూ, తనని తాను మర్చిపోయాడు. ఎదురుగుండా ముగ్గురమ్మా

యిలు కిలకిలా నవ్వుకుంటూ వస్తున్న దృశ్యం కూడా అతను గమనించలేదు ఆకాశంవైపు అలాగే నిలబడి చూస్తున్నాడు

ముగ్గురూ సన్నగా, నాజూకుగా ఉన్న అమ్మాయిలు ఒకమ్మాయికి పద్దెనిమి దేళ్లుంటాయి ఇంకొకమ్మాయికి పదహారు మూడవ అమ్మాయి పన్నిండేళ్ల వయసులో ఉంది నవనాగరిక ఫేషన్లన్నీ వాళ్లలో ఉన్నాయి కాళ్లకు నుంచి జోళ్లూ, పౌడర్లద్దిన మొహాలూ, చేతికి రిస్టువాచీలూ వాళ్ల నాగరికతను వెల్లడిస్తున్నాయి

"ఎవరో కవి కాబోలే! ప్రకృతి తెగ పరిశీలిస్తున్నాడు."

"ఈ పల్లెటూరికి, ఒక కావ్యం రాయడానికి వచ్చాడు కాబోలు!"


"లేకపోతే సంఘసంస్కర్తేమో! పంచె, లాల్చీ పట్టిస్తున్నాయి."

"మరే! పాపం! ఇక్కడ ఈయన సంస్కరణ ఎవరికీ అక్కర్లేకపోయింది కాబోలు పొలాల్నీ, ఆకాశాన్నీ చూసి తృప్తిపడుతున్నాడు"

అవి వాళ్లలోవాళ్ళు చంద్రమౌళిని గురించి విమర్శించుకుంటూ అతన్ని దాటిపోయారు వాళ్ళ ముగ్గురూ, ఆవూరుకు కొత్తగావచ్చిన డాక్టరుగా రమ్మాయిలు డాక్టరు జానకిరావ్, ఆ పల్లెటూరి డిస్పెన్సరీకి మెడికల్ ఆఫీసరుగా బదిలీ అయి వచ్చి నెలరోజా లయింది ఆయనకుటుంబం మూడు రోజులక్రిందటే ఆవూరు వచ్చారు ఆయనకు ముగ్గు రమ్మాయిలూ ఇద్దరబ్బాయిలూ ఉన్నారు పెద్దమ్మాయి ఇంటర్ పాసయింది రెండో అమ్మాయి స్కూల్ఫైనలు పాసయింది తరువాత అబ్బాయి ఫిఫ్త్ఫారమ్, అమ్మాయి థర్డ్ఫారమ్ చదువుతున్నారు ఆఖరివాడు చిన్నవాడు

వాసంతి, జమున, సుశీలా ముగ్గురూ చాలా చురుకైన అమ్మాయిలు వాళ్ళ విశాఖపట్నంలో చదువుకుంటూ ఉండడంవల్ల, తండ్రి సాధారణంగా పల్లెటూళ్లలోనే ఉద్యోగం చేస్తున్నా, చదువుకోసం పిల్లల్ని పట్నంలో ఉంచటంవల్ల, వాళ్లకు పట్నవాసపుపోకడలే అబ్బాయి. తండ్రి డాక్టరవడం మూలాన, ఊళ్ళో ఉన్న పెద్దలందరితో స్నేహంగా ఉండడంవల్లా ఆవూరిలో బాగా ధనికుడూ, పలుకుబడిగలవాడూ అయిన సుదర్శనం గారింటికి స్నేహపూర్వకంగా వెళ్ళి, వాళ్ళ ముగ్గురూ తిరిగి వస్తూంటే చంద్రమౌళి వాళ్లకు తారస పడ్డాడు అతన్ని చూసి వాళ్ళ నవ్వుకోడానికి చంద్రమౌళి వాలకమే కారణం అతను ఎప్పుడూ గంభీరంగా ఆలోచిస్తాడు మొహంలో ఎంతో అమాయకత కన్పిస్తూంటుంది అతను బాగా ఆలోచిస్తున్నప్పుడు చుట్టూ ఉన్న పరిసరాల్ని మర్చిపోతాడు

తను బాటకడ్డంగా నిలబడినా, తనను తప్పించుకొని వెళ్లిపోయిన ముగ్గురమ్మాయిల్నీ అతను పరిశీలనగా చూడనేలేదు చీకట్లు కమ్ముకున్న ఆకాశం, నిశ్శబ్దం ఆవరించిన వాతావరణం, అతని లోంచి ఒక వేడినిట్టూర్పు తెప్పించి, గృహాభిముఖుణ్ణి చేశాయి ఇంటికి తిరిగివస్తూ, చంద్రమౌళి తనలోతను ఒక కథ చెప్పుకున్నాడు ఆకాశంలో ఒక పెద్ద మేడ కట్టాడుట. దానికి



సూర్యచంద్రులు ద్వారపాలకులు ఆ మేడనిండా మిగే దీపాలే నక్షత్రాలు పాలవెల్లి పెద్ద పందిరి మంచంట ఆ మంచంమీద తను విష్ణుమూర్తిలా పడుకుంటాడు తన కాళ్లదగ్గర ఒకమ్మాయి సాచాని ఉంటుంది తననుకుంటాడు, అంతా బాగానే ఉంది కానీ—ఏదో లోటుంది దృశ్యంలో అదేమిటి ? ఆ దృశ్యంలో ఉన్న లోటేమిటో చంద్ర మౌళికి బోధపడలేదు

చుట్టూ ఉన్న నిశ్శబ్దాన్ని పరిశీలించి, తనూ హించిన దృశ్యంలోని లోటును అర్థంచేసు కున్నాడు అక్కడా నిశ్శబ్దమే ! సూర్యచంద్రులు మాట్లాడరు నక్షత్రాలు ధ్వనిచెయ్యవు కలలో ఆ అమ్మాయీ మాట్లాడదు తనకేం మాట్లా డాలో తెలియదు చంద్రమౌళికి పెద్ద నవ్వొ చ్చింది అసలీ కథంతా వట్టి అభూతకల్పన ఆకాశం తంలో నిశ్శబ్దం కాక మరేముంటుంది ?

నవ్వుకుంటూ ఇంటికి తిరిగివచ్చాడు చంద్ర మౌళి

డాక్టరుగారి అమ్మాయిలు ఆ పల్లెటూరిగురించి తమ అభిప్రాయాలు వరసాగ్గా తండ్రితో చెప్తు న్నారు.

"ఇన్ని పల్లెటూళ్లు చూశాంగాని, ఇటువంటివూ రెక్కడా లేదు "

"మమ్మల్ని చూసి జనం విరగబడిపోయారు ఈ ఊళ్లో బొత్తిగా చదువుకున్నమ్మాయిలు లేరు కాబోలు !"

"కొంతమంది ఆడవాళ్లు మమ్మల్ని చూసి ముక్కుమీద వేలేసుకున్నారు "

డాక్టరుగారికి ఆయనకూతుళ్ల మాటలంటే సరదా వాళ్ళు ఎంత అల్లరిచేసినా కోప్పడరు "ఇంతకీ, సుదర్శనంగారింట్లో విశేషాలేమిటట ?" అని అడిగా రాయన

"ఆయనభార్య చాలా మంచావిడలా ఉన్నారు మమ్మల్ని బాగా మర్యాద చేశారు వాళ్ల ఇల్లు కూడా చాలా బావుంది ఒక గదినిండా పుస్తకాల బీరువా లున్నాయి వాళ్లబ్బాయివిట 'లా' చదువు తున్నాడేమో ననుకొన్నాం 'లా' కాదుట ఏం చదువో ఆవిడ చెప్పలేదు ఎంచేతో వాళ్లబ్బాయి విషయం ఎత్తేప్పటికి, ఆమెమొహం చిన్న బోయింది" అంది వాసంతి

"చెప్పినమాట వినడేమో ?" అంది జమున

"అబ్బే ! అదికాదు వాళ్లబ్బాయికి మతి స్థిరం లేదు" అన్నారు డాక్టరుగారు

"అయ్యో ! పాపం !" అన్నారు ముగ్గురు అక్క చెల్లెళ్ళూ ఒక్కసారి

"చదవడం ఎం. ఏ. వరకూ చదివాడు హఠా త్తుగా పరీక్షలముందు ఇంటికి వచ్చేశాడట ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ కూచుంటాడు మొదట్లో తలిదండ్రులు ఇతనికి మతి చలించిం దనుకోక, కేకలు వెయ్యడం, కోప్పడ్డం చేసేవారుట గట్టిగా కోప్పడితే ఏడ్చేవాడటగానీ ఏమీ సమాధానం చెప్పే వాడు కాడుట. వాళ్లకు మెల్లిగా అనుమానంవేసి ఒక పెద్దడాక్టర్ని తీసుకొచ్చి పరీక్ష చేయించా రుట ఆయన ఇతని మనస్సుకేదో పెద్ద 'షాక్' తగిలింది బాగా విశ్రాంతిస్తే అతనే కోలు కుంటాడని చెప్పాడుట" అన్నారు డాక్టరుగారు.

"మీరుకూడా 'ఎగ్జామిన్' చేశారా, నాన్నా ?" అని అడిగింది సుశీల

"ఓ ! అతను నాకెంతో ముఖ్యస్నేహితుడై పోయాడు ఈ నెలరోజుల్లోనూ ! మామూలుగా అతనిలో పిచ్చేమీ కన్పించదు ఎప్పుడో ఒకసారి వస్తుందది ఈ నెలరోజుల్లోనూ రెండుసార్లు మాత్రం కన్పించింది ఒక రోజంతా ఉంటుంది మర్నాడు మామూలే "

"అసలెందుకు వచ్చింది, అతనికి పిచ్చి ?" అని వాసంతి అడిగింది

"ఆ, ఏముంది ? ఈ వయస్సులో ప్రేమ ప్రభావం ఎక్కువగా ఉంటుంది బహుశా ఇతను కాలేజీలో ఎవర్నన్నా ప్రేమించి ఉండవచ్చు ఆ వ్యక్తి ఇతనిని మోసగించి ఉండవచ్చు సున్నిత మైన మనస్సు కలిగిఉండటంచేత ఇతను దానికి తట్టుకోలేకపోయి ఉండవచ్చు అనేకవందల కారణాల్లో ఇది ఒకటి అంతేగాని జరిగిందేమిటో

మనకు తెలియదుగదా !" అన్నారు డాక్టరుగారు

"మీరు మందేమన్నా ఇస్తున్నారా ?" అని అడి గింది వాసంతి

"మందు ఇస్తున్నాననుకో కాని అంతకన్నా అతనికి మనశ్శాంతి కావాలి తండ్రికీ, కొడుక్కీ చాలా అభిప్రాయభేదా లున్నాయి సుదర్శనంగారు కొడుకు నెంతో ప్రేమిస్తారు కాని కొడుకు భావాలుమట్టుకు ఆయనకు గిట్టవు వాళ్లిద్దర్నీ అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తే మనకే వెర్రెత్తు తుంది "

పిల్లలంతా నవ్వారు భోజనా లయిపోయాక అంతా సుదర్శనంగారి గొడవలు మానేసి స్వంతవిష యాల గురించి మాట్లాడుకున్నారు వాసంతి ఎం. బి బి. ఎస్ లో చేరాలని డాక్టరుగారు నిశ్చ యించారు జమున ఇంటర్‌లో చేరుతుంది సెల వలు ఇంకా రెండునెల లున్నాయి కాలేజీలు తెరవ గానే డాక్టరుగారి కుటుంబమంతా విశాఖపట్నం వెళ్లిపోతుంది

ఊరికి కొంచెం దూరంగా ఉన్న విశాలమైన భవనాన్ని డాక్టరు అద్దెకు తీసుకున్నారు. రాత్రయ్యే ప్పటికి చుట్టూ చీకటి, నిశ్శబ్దం ఆవరించు కుంటుంది పల్లెటూళ్లలో రాత్రిళ్లు ఏమిటో నిస్పృహగా ఉంటాయి మధురమైన వేకువ ఎప్పు డొస్తుందా ! అని ఎదురుచూసేట్టు చేస్తాయి

మర్నాడు పొద్దున్నే చుట్టుపట్ల పల్లెటూరులో ఏదో 'సీరియస్' కేసొకటి రావడంవల్ల డాక్టరు వెళ్లి పోయారు ఎనిమిదిగంటలకు కాఫీ త్రాగి, హాలులో కూర్చొని పుస్తకం చదువుకుంటున్న వాసంతి, మనిషి అలికిడై తలెత్తేసరికి ఎదురు గుండా చంద్రమౌళి కన్పించాడు

"డాక్టరుగారు లేరా ?" అని సంకోచిస్తూ అడిగాడు

"లేరండీ ఏదో కేసుకోసం పక్క ఊరికి ప్రొద్దున్నే వెళ్లారు "

"అరెరె ! ఆయనతో చాలా అర్జెంటు పనుందే? ఇప్పుడెలా ?"

వాసంతి చంద్రమౌళిని చూడగానే, ఆ క్రితం రోజు పొలాలవద్ద చూసిన మనిషి ఇతనేనని గుర్తు పట్టింది కొందరిని, భావనామయమైన మన సులు వాసంతికి చంద్రమౌళిని చూస్తే, అతనొక కవి అయివుంటాడని ఊహా, నమ్మకం కూడా కలి గాయి ఆయన అభిప్రాయాల్ని తెలుసుకుందామనే కుతూహలమూ కలిగింది

"ఆయన వచ్చేదాకా కూర్చోండి" అని కుర్చీ చూపిస్తూ ఆహ్వానించింది

"థాంక్స్" అని, పెద్ద సమస్యను పరిష్కరించిన వాడిలా కుర్చీలో ఆమెకెదురుగా కూచున్నాడు చంద్రమౌళి కూర్చున్నతరువాత ఏం చెయ్యాలో తెలియనట్లు పైకప్పుకేసి, వీధికేసి, హాల్లో పటాలకేసీ చూడసాగాడు తను కూర్చోగానే వాసంతి లోపలికి వెళ్లిపోతుందనుకున్నాడు ఆమె కదల్లేదు

"మీ దివూరేనాండి ?" అని అడిగింది వాసంతి

"ఈవూరే" అని ముభావంగా జవాబు చెప్పాడు చంద్రమౌళి

"ఇక్కడున్న స్కూలులో, మాస్టరుపని చేస్తు న్నారా?"

"లేదు "

"మరి ?"

"నేనేం చేస్తున్నానో చెప్పమంటారా ? జీవితం గురించి ఆలోచిస్తూ ఉంటాను మన కళ్లెదుట మన కర్థంకాని విషయా లెన్నో జరుగుతుంటాయి వాటి సంగతేమిటంటారు ? మా మేనత్త ఒకామె చాలా అందమైనదీ, మంచి స్వభావంకలదీ, బాగా పాడు తుంది ఆమెకు పెళ్లయిన మరునాటి సంవత్సరం భర్త పోయాడు అప్పటి కామె వయస్సు పదహారు. ఆమె గతేమిటంటారు ? మా మేష్టారుకి ఇద్ద రబ్బాయిలు. పెద్దబ్బాయి ఇరవై ఏళ్లవాడు గోదా వరి స్నానానికి వెళ్లాడు గజ ఈతగాడు నీటిలో మునిగి ఈత కొడుతూ పడవఅడుక్కి వెళ్లి పోయాడు ఘోరంగా చనిపోయాడు—పైకి రాలేక అత నెందుకు పోయాడంటారు ? ఇలాంటివెన్నో మనకళ్లముందర జరుగుతున్నాయి విధి అంటారా ? కర్మంటారా ? భగవంతుడున్నాడంటారా ? ఉంటే, ఇలాటి దురన్యాయాలకు ఒప్పుకొంటాడా? లేడంటారా ? లేకపోతే ఒకప్పుడు కాకపోతే ఇంకొక ప్పుడైనా న్యాయం, మంచి గెలుస్తున్నాయి

అన్యాయం, చెడూ ఓడిపోతున్నాయి అంటారా?" అని వాసంతి వైపు చూశాడు

చంద్రమౌళి మాటలాడే తీరూ, అతని మాటలూ విని వాసంతి ఆశ్చర్యపోయింది తనంతవరకూ అతన్ని వేళాకోళం చేద్దామనే ఉద్దేశంతో అతనితో సంభాషణ ఆరంభించింది కాని అతను అలా గంభీరంగా ఆలోచిస్తాడనిగాని, అతని హృదయం ప్రపంచంలోని బాధలగురించి బాధపడే స్వభావం గలదనిగాని ఆమె ఊహించలేదు చంద్రమౌళి కళ్లల్లో భరింపరాని వేదన ఉంది మొహంలో అర్థంకాని చిరాకేదో ఉంది తను సంభాషణ పొడిగించడమా ? లేక అతన్ని వదిలిపెట్టి లోపలికి పోవడమా ? అన్న సమస్యలో పడింది వాసంతి ఏమైనా ఆమెకు లేవబుద్ధి పుట్టలేదు

"నాకూ అలాగే అనిపిస్తోంది"

"మీరు ఎంతో మంచిహృదయం కలవారిలా కన్పిస్తున్నారు ఒక్కొక్కప్పుడు, మంచివాళ్లను చూస్తే జాలీ, భయం, బాధా కలుగుతాయి ఎందుకంటే వాళ్లకి ఏదో తప్పక చెడు జరుగుతుంది ప్రకృతి మంచితనాన్ని సహించలేదు

"నా కాభయం లేదులెండి అయినా మీరు చెప్పినంత మంచితనం నాలో లేదులెండి" అంది వాసంతి ఇంతట్లో జమున లోపల్నుంచి వచ్చి తనకు బట్టలు కుట్టడం నేర్పమని వాసంతిని లోపలికి తీసుకెళ్లింది వాసంతి, తను వెంటనే తిరిగి వచ్చేస్తానని చంద్రమౌళితో చెప్పి లోపలికి వెళ్లింది

చంద్రమౌళి కాస్సేపు ఒంటరిగా కూచున్నాడు ఇంతలో డాక్టరుగా రొచ్చారు "హల్లో ! ఎంతసేపయింది మీరు వచ్చి ? మూడురోజులనుంచీ మీరు కన్పించకపోతే ఊళ్లో లేరేమో అనుకున్నా మా కుటుంబం వచ్చేసింది మా అమ్మాయిలు నిన్న మీ ఇంటికి కూడా వచ్చారు" అని డాక్టర్గారు చంద్రమౌళితో మాట్లాడుతూ "వాసంతీ" అని కూతుర్ని పిలిచారు

"ఈ మూడురోజుల్నుంచీ నేను బయటకు కదలకుండా ఇంట్లో కూచొని నాలుగు పుస్తకాలు చదివాను నిన్ననలా షికారుకు వెళ్లాను ఇవాళ మా అమ్మగారికి ఒంట్లో బాగులేకపోవడంవల్ల మిమ్మల్నొకసారి తీసుకెళ్దామని వచ్చాను" అన్నాడు చంద్రమౌళి

తండ్రిపిలుపు విని వచ్చిన వాసంతితో డాక్టరుగారు 'ఈయన సుదర్శనంగారబ్బాయి, చంద్రమౌళిగారు మా ఇద్దరికి తొందరగా కాఫీ పట్రా నేను వాళ్లింటికి వెళ్లాలి" అన్నారు

ఆశ్చర్యంతో నిశ్చేష్ట అయిన వాసంతి 'అలాగే' అని లోపలికి వెళ్లిపోయింది, ఒక్క నిముషంలో తెప్పరిల్లుకుని కాఫీ కలుపుతూ, వాసంతి ఆలోచించింది ఎంత పొరపాటు ! ఆయన సుదర్శనంగారబ్బాయా ! ఆ పుస్తకాలన్నీ చదివినాయనా ! ఆయనకి మతి స్థిరంలేదని తన తండ్రి చెప్పారు పాపం ! ఆయన మనోవ్యధ ఏమిటో ! ఆయన మాటల్లో ఏమీ వింతలేదు

కాఫీ త్రాగాక డాక్టరుగారూ, చంద్రమౌళీ ఇద్దరూ కలిపి చంద్రమౌళి ఇంటికి వెళ్లారు సుదర్శనంగారు ఆయన్ని పలకరించారు చంద్రమౌళి "నాన్నగారూ, అమ్మను చూపించటానికి ఈయన్ను తీసుకువచ్చాను" అన్నాడు బాతాఖానీకి అది సమయం కాదన్నట్లు సుదర్శనంగారు మాట్లాడ్డం మానేసి లోపలికి తీసుకెళ్లమని చెప్పారు

డాక్టరుగారు పరీక్షచేసి, చంద్రమౌళితల్లికి గుండెజబ్బని నిర్ణయించారు బాగా విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు మందు తను రోజూ పంపిస్తానన్నారు డాక్టరుగారు వెళ్లాక, చంద్రమౌళి చాలాసేపు తల్లిదగ్గర కూర్చొని, ఆమె విశ్రాంతి తీసుకోవాలని బోధించాడు ఆమెకు చాలా ఆనందం వేసింది చంద్రమౌళి ఎప్పుడోగాని అలా, అంతసేపు మాట్లాడడు

రోజూ డాక్టరుగారింటికి వెళ్లి చంద్రమౌళి తల్లికి తానే స్వయంగా మందు తెచ్చేవాడు పది రోజులలో వాళ్ల కుటుంబంతో చంద్రమౌళికి బాగా పరిచయం ఏర్పడింది ఇంట్లో ఉన్నవాళ్లంతా అతనితో చనువుగా మెసిలేవారు. అందరూ కలిసి కారమ్స్ గాని, బ్రిడ్జిగాని ఆడుతుండేవారు చంద్రమౌళి మనస్సుకూడా కొంచెం కొంచెం ఉత్సాహపూరితం కాజొచ్చింది

కోమటి:- ఏమయ్యోయ్! తెల్లారకుండానే తయారయ్యావు అరువుపెట్టడానికి. ఇంకా ఏం బోణీలేదు. తర్వాత రా.

వచ్చినవ్యక్తి:-బోణీ చెయ్యటానికే కదయ్యా వచ్చింది. ఇదిగో ఈ కాని తీసుకొని రెండు బీడీలియ్యి, ఇప్పుడు వీళ పంచదార పాలడబ్బా యిచ్చిపద్దు రాసుకో

డి పూర్ణానంద స్వరూప్

బ్రిడ్జిలో ఎప్పుడూ వాసంతే అతని పార్ట్నర్గా ఉండేది చంద్రమౌళికన్నా బాగా ఆడేది డాక్టరుగారి ఇంటికి వచ్చినదగ్గర్నుంచీ చంద్రమౌళి కళ్లు వాసంతికోసమే వెదుకుతూ ఉంటాయి జమున గాని, సుశీలగాని అతనితో అంత చనువుగా మాట్లాడరు అతనిమాటలు వాళ్లకు పట్టి పొదిలా కనిపిస్తాయి వాళ్ల అభిరుచులే వేరు జమునకు ఇంగ్లీషు సినిమాలూ, హిందీ సినిమాలూ అంటే ఇష్టం ఏయే ఇంగ్లీషు యాక్టర్లకు, ఏఏ ఫిల్ముల్లో నటనకు 'ఆస్కార్' లభించిందో, వాళ్లెన్ని వివాహాలు చేసుకున్నారో, వాళ్లు ఎన్ని ఫిల్ముల్లో నటించారో ఆమెకు కంఠతావచ్చు సుశీలకు క్రికెట్, భరతనాట్యం అభిమానవిషయాలు

వాసంతికి వీటన్నిటిమీదా ఇష్టం ఉందికాని అనంటే పిచ్చిలేదు ఆమె ఎలాంటి సంభాషణలోనైనా పాల్గొనగలదు ఎలాంటి వ్యక్తులతోనైనా కలిసి మెలిసి మాట్లాడగలదు కాని ఏ వ్యక్తయినా ఆమెకు నచ్చాలి మానవస్వభావాన్ని పరిశీలించడం, అన్నిటికన్నా, ఆమెకు ఇష్టమైన విషయం తనతో చదువుకున్న అమ్మాయిలు, ఫాషనబుల్గా డ్రెస్ చేసుకోవడం, వీలైనంత జల్సాజీవితం గడపడం, మంచి మొగుడికోసం కలలు కనడం తప్ప జీవితంలో వేరే ఏమీ కోరదగినది లేనట్లుండేవారు బరువైన ఆలోచనలకి వాళ్ళు దూరంగా నిల్చొని, తమకి వద్దని తోసిపారేసేవారు వాళ్ల సంభాషణల్లో, ఎంతసేపూ 'వాళ్ల వెనకాల తిరిగే అబ్బాయిలూ, వాళ్ల లవ్ లెటర్స్' ప్రాధాన్యత వహించేవి

అంతమంది స్నేహితుల్లో ఒకరిదీ లోతైన స్వభావం కన్పించలేదు—ఒక్క సురయా బీగం అనే అమ్మాయిది తప్ప కానీ, ఏం లాభం ? సురయా తల్లి పతితురాలు అని వినికిడి వాళ్లకు డబ్బులేదు సురయా, చాలా తెలివైనది ఎన్నో పుస్తకాలు చదివింది ఎంతో బాగా మాట్లాడేది మానవ స్వభావం గురించి చాలా లోతుగా తరచి చూచినట్లు మాట్లాడేది వాసంతికి ఇంటర్ ఫస్టియర్లో సురయా అంటే చెప్పలేనంత అభిమానం. ఇద్దరూ గంటలతరబడి మాట్లాడేవారు అసలు వాసంతిలో ఎక్కువగా మార్పురావడానికి సురయాయే కారణం వాసంతి మనస్సుని, ఆదర్శ శిఖరాలకి, హృదయపు లోతుల్లోకి, భావనా ప్రపంచపుటంచుల్లోకి సురయాయే తీసుకువెళ్లింది మనుష్యులను అర్థం చేసుకోడంలోగల విశిష్టతను ఆమెకు సురయాయే బోధపరచింది క్లాసులో కూడా సురయాదే ఫస్టుమార్కు వాసంతీ, సురయా ఎన్నో నెలలు ఒకర్నొకరు విడవకుండా తిరిగి, ఏవో విషయాలు చర్చించేవారు సురయా, ఖొరాను చదివింది బైబిలు చదివింది భగవద్గీత కూడా చదివింది వాటిల్లో విషయాలుకూడా వాసంతికి చెప్పేది

అటువంటి సురయా, పరీక్షలముందు రామారావు అనే అబ్బాయితో హఠాత్తుగా లేచిపోయింది వాసంతికి సురయా అలా ఎందుకు పారిపోయిందో అర్థంకాలేదు రెండు మూడు రోజులు వాసంతికేమీ తోచలేదు తరువాత ఆమె మళ్లీ మామూలు ప్రపంచంలోకి వచ్చి, పరీక్షలకు గట్టిగా చదివి పాసయ్యింది సురయాను మర్చిపో ప్రయత్నించినా, ఆమెభావాలు మర్చిపోలేక పోయింది

చంద్రమౌళి మాటల్లోకూడా అప్పుడప్పుడు సురయా భావాలు గోచరిస్తుండేవి వాసంతికి వాసంతికి చంద్రమౌళిది పిచ్చిధోరణి అనిపించేది కాదు జీవితంలో అనేక సంఘటనల్నీ, వ్యక్తుల్నీ చూసి ఏర్పరచుకున్న భావాలులా ఉండేవి అతని మాటలు అయితే సురయా వేదాంతధోరణిలో వాటిని పట్టించుకొనేది కాదు చంద్రమౌళి మాత్రం వాటన్నిటినీ తనమనస్సుకు పట్టించుకుని, ఆ వ్యక్తులకోసం బాధపడి తనబుర్ర పాడు చేసుకుంటున్నాడు సురయాది ఒమర్ఖయ్యాం తత్వం చంద్రమౌదిళి అలా, 'ప్రపంచాన్ని దాని మానాన్న అది ఉండనిమ్మని వదిలేసి, మనం సుఖంగా ఉందాం' అనే తత్వం కాదు. ఏదో అని, నిర్మాణాత్మక దృక్పథంతో సంఘానికి సేవ చెయ్యలేదు అందుకే అతనికి మతి పోయింది డాక్టరు

వాసంతి

గారు, "తన శక్తికి మించిన ఆలోచనలు చేస్తాడమ్మా అతను" అన్నారు వాసంతితో

వాసంతి చంద్రమౌళి నర్థం చేసుకోడానికి ప్రయత్నించా లనుకొంది వయస్సులోనూ, అనుభవంలోనూ చిన్నదైనా, స్త్రీగా, తనకొక పురుషుడిమీద, గట్టి ప్రభావం చూపించగలనని ఆమెకు తెలుసు చంద్రమౌళి తనమీద చూపించే శ్రద్ధా, తనతో మాట్లాడేటప్పుడు అతని మాటల్లోవుండే మార్దవంఆమె కనిపెట్టింది తనింకా ప్రోత్సాహిస్తే అతను పూర్తిగా తనతో అతని మనోవ్యధనంతా చెప్పుకొని మానసికంగా ఆరోగ్యవంతుడు కావచ్చుననుకొంది ఇది కేవలం ఒక ప్రయోగంలా చేసి చూడదలచింది చంద్రమౌళి ఆరోగ్యవంతుడైతే అతని తలిదండ్రు లెంతో సంతోషిస్తారు

డాక్టరుగారు కూడా చంద్రమౌళి నారోగ్యవంతుణ్ణి చెయ్యాలని చాలా ప్రయత్నిస్తున్నారు అతనితో ఎంతో జాలిగా, ప్రేమగా మాట్లాడేవారు "చూడండి, చంద్రమౌళిగారూ ! మనం కూడా యంత్రాల్లాంటివాళ్లమే యంత్రాల లాగానే మన మెదడుకూడా పరిమితమైన శక్తి కలది మాత్రమే అనవసరంగా దానిని శ్రమ పెట్టకూడదు మనకు అలవిగాని ఆలోచనల్ని మనం దూరంగా ఉంచాలి పైగా వాటిని గురించి ఆలోచించి ప్రయోజనం ఏముంది ? కాబట్టి మీరు వాటి గురించి ఆలోచించవద్దు మనస్సుకు బాగా విశ్రాంతి నివ్వండి" అని చెప్పేవారు చంద్రమౌళి ఆయన చెప్పిందంతా శ్రద్ధగా వినేవాడు

"డాక్టరుగారూ ! మీరు చెప్పినట్లు చెయ్యడానికి ప్రయత్నిస్తున్నాను కానీ, నాలో ఉన్న ముఖ్యలోపం నా మెదడు నా 'కంట్రోలు' లో ఉండదు ఏం చెయ్యమంటారు ? అయినా మీరు చెప్పినట్లు ప్రయత్నిస్తాను" అనేవాడు

* * *

ఒకనాడు సాయంకాలం వాసంతీ, జమునా షికారు బయలుదేరారు వాళ్ళు కొంతదూరం వెళ్ళేసరికి వాన పట్టుకుంది ఆకాశంలో హఠాత్తుగా మబ్బులువేసి వాన కురవడం ప్రారంభించింది వాళ్లకు తలదాచుకోవడ మెలాగా అని భయమేసింది అదృష్టవశాత్తు ఎక్కడికి దగ్గరలోనే సుదర్శనంగారిల్లు ఉంది అక్కా చెల్లెళ్లిద్దరూ త్వరత్వరగా వారింట్లో కెళ్లారు సుదర్శనంగా రింట్లో లేరు చంద్రమౌళి తన గదిలో కూచొని చదువుకుంటున్నాడు సుదర్శనంగారి భార్య సీతమ్మ, వీరిని లోపలికి రమ్మని ఆహ్వానించింది వానలో కొద్దిగా తడిసారని, పెట్లోంచి చీరలూ, జాకెట్లూ తీసి కట్టుకోమని ఇచ్చింది బయట వాన ఎడతెరిపిలేకుండా కురవసాగింది

చంద్రమౌళికి వాసంతీ, జమునా వచ్చారనీ తెలిసి వాళ్లను తనగదిలోకి రమ్మని నౌకరుతో కబురు పెట్టాడు కొంతసేపు సీతమ్మగారితో మాట్లాడాక వాళ్లిద్దరూ చంద్రమౌళి గదిలోకి వచ్చారు

"రండి రండి బయట జోరుగా వాన కురుస్తూంటే ఇవాళ ఎలాగా గడపడం అని ఆలోచిస్తున్నా మీరు వచ్చారు గనక ఆ సమస్య తీరిపోయింది" అని వారిని ఆహ్వానించాడు వాసంతీ, జమునా అతని గదిని పరిశీలనగా చూడ నారంభించారు మంచి సోఫాలు, బీరువాలూ, రెండు అద్దాలబీరువాలనిండా పుస్తకాలూ, గోడల నిండా ప్రసిద్ధ చిత్రకారుల ఆయిల్ పెయింటింగ్సూ, బేటరీమీద నడిచే పెద్ద రేడియో, ఒక మూలగా టేబిలూ, రెండు కుర్చీలూ, మొత్తం మీద సంపదనీ, అభిరుచినీ చాటుతోంది, అతని గది ఇద్దరూ అతని కెదురుగుండా కూర్చొని మాట్లాడసాగారు

ఒకవూళ్ళో నాటకం మొదలు పెడతారనగా ఆ సమయానికి ఒక నటుడు రాలేదు ఆ నాటకం సింపేవాళ్ళు ఆ నటుడు రాకపోవటంవల్ల కొంత నాటక లాడటం చేతయిన ఒక హోటలు కుర్రాణ్ని ఆపాత్రకి ఉండమన్నారు నాటకం మొదలుబెట్టారు ఆ సర్వరుకి నాటకం కొత్తగాబట్టి కొంత కునుకుపట్టింది అప్పుడు కృష్ణుడు వచ్చి 'బావా ని సందేశమేమిటి?' అన్నాడు. అతడు వెంటనే 'ఆ ఏముంది యిడ్లీ 7న పైసలు మినపట్ 13న పై, కాఫీ,'అని చెప్పుకుపోతున్నాడు ఈ మాటలు విని ప్రేక్షకులందరుగొల్లున నవ్వారు. అప్పటికిగాని తెలియలేదు, అతడికి తను ఒకపాత్ర నిర్వహిస్తున్నాడని.

మాచిరాజు కిరణ్‌కుమార్ (బపట్ల)

"మీకు మంచి మంచి బొమ్మలంటే ఇష్టమా ?" అని అడిగింది వాసంతి, గోడనున్న ఆయిల్ పెయింటింగ్సు చూస్తూ

చంద్రమౌళి ఆమె ఆ చిత్రాల్ని పరిశీలించడం చూసి ఈ "చిత్రాలని చూసి నాకు బొమ్మలంటే ఇష్టం అనుకోవద్దు ఈ పెయింటింగ్సు వెనకాల ఒక చిత్రమైన గాథ ఉంది ఒక స్నేహితుడికి అత్యవసరంగా డబ్బు కావలసివచ్చింది అతని దగ్గర ఇవితప్ప అమ్మడానికి మరేవీ లేవు ఇవి కొనడానికి నేను సిద్ధపడ్డాను, అతని పరిస్థితి చూసి. వాకు వాటిని అమ్మేశాడు నేను మళ్లీ వాటిని అతని కిచ్చేద్దా మనుకున్నాను గాని, అతనికి వాటిమీద శ్రద్ధలేదు ఇవన్నీ వాళ్ల తండ్రి హయాములో సంపాదించినవి

"డబ్బుంటే ఎలాటి అపురూప వస్తువులైనా సంపాదించచ్చు" అంది జమున వాసంతి నవ్వింది

"అవును కాని, డబ్బుంటే కొన్ని అపురూపపు కష్టాలుగూడా సులభంగా వచ్చి మెడకు చుట్టుకుంటాయి నిజానికి డబ్బంత పాపిష్టిది మరోటి లేదు అది ఎన్ని అకార్యాలనైనా చేయిస్తుంది" అన్నాడు చంద్రమౌళి జమున ఒప్పుకోలేదు

"అలా అని అందరూ అంటారు కాని అందరూ అలాగుంటారా ?"

"ఉండడం, ఉండకపోవడం వాళ్లవాళ్ల తత్వాల మీద ఆధారపడి ఉంటుంది కాని డబ్బుకు మాత్రం ఆశక్తి ఉంది" అన్నాడు చంద్రమౌళి ఆ విషయాన్ని అక్కా చెల్లెళ్లిద్దరూ అంగీకరించినట్లు మౌనం దాల్చేరు చంద్రమౌళి కూడా కిటికీ అద్దంలోంచి కనిపిస్తున్న వానను చూస్తూ కాసేపు ఊరుకున్నాడు

వాన విపరీతంగా కురుస్తోంది ఉరుములూ, మెరుపులూ పెద్ద ఆర్భాటం చేస్తున్నాయి పెద్ద తుఫాను చెలరేగినట్లుంది నౌకరు ముగ్గురికీ కాఫీ తెచ్చాడు ముగ్గురూ త్రాగారు వాసంతీ, జమునా వానఉధృతం చూసి 'చీకటిపడిపోయింది ఇంటికెలాగ వెళ్లడమా' అని ఆలోచించారు వాన తగ్గే సూచనలేమీ కన్పించటంలేదు

చంద్రమౌళి, వాళ్ల ఖంగారు గమనించి "మీరిక్కడ ఉన్నట్టు మీ ఇంటికి ఈపాటికి కబురు వెళ్ళి ఉంటుంది మీరేమీ ఖంగారుపడ నక్కరలేదు మీ ఇల్లెంతో మా ఇల్లంతే" అన్నాడు

వాసంతి, "అబ్బే, అందుకు కాదండీ వాన ఇంత విపరీతంగా కురుస్తోందే ఈ గాలికీ, వానకీ, చిన్న చిన్న పూరికొంప లెన్ని కూలిపోతాయో అనిపిస్తోంది" అంది

"లెక్కలేనన్ని కూలిపోతాయి చాలామంది బీద జనం ఆశ్రయంలేక అల్లాడిపోతారు మన దేశంలో అనేక నదులున్నాయి వాటివల్ల దేశంలో చాలా పొలాలు సుభిక్షమైన పంటను పరిడిస్తాయి కానీ వాటికి వరదలు వచ్చినప్పుడు, ఎందరు ప్రాణాలు పోగొట్టుకుంటారో, ఎన్ని గ్రామాలు కొట్టుకు పోతాయో, ఎంతమంది అనాథలై పోతారో ఆలోచించండి అంతమంది అలా, ఆకలితో, చలితో, అటమటించిపోతూంటే మనం దిట్టమైన కొంపల్లో హాయిగా ఉండడం ఎంతో పాపమనిపిస్తుంది" అన్నాడు చంద్రమౌళి

"భగవంతుడి సృష్టే అలాగుంటే దానికి మనమేం చేయగలం ?" అంది జమున వాసంతి జమునతో ఏకీభవించలేదు

"ఎందుకు చెయ్యలేం మనకోసం మనం ఎన్ని చేసుకుంటున్నాం 'భగవంతుడి సృష్టి' అనుకొని పుట్టినవాళ్లం పుట్టినట్లు ఉండిపోతున్నామా ? ఎక్కువ సుఖాన్నీ, ఎక్కువ ఆనందాన్నీ పొందడానికి ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నాం మనకున్న అవకాశాలు మనం వినియోగించుకుంటున్నాం కొద్దిగా మన అవకాశాల్ని వాళ్లకుకూడా పంచి ఇస్తే వాళ్ళూ మనలాగే పైకివస్తారు" అంది వాసంతి

చంద్రమౌళి వాసంతివేపు గౌరవంగా చూశాడు వాసంతి తను చెప్పిన మాటల్ని తను ఎంతో ముఖ్య మైనవని విశ్వసిస్తున్నట్లుగా ముఖంపెట్టింది జమున, అక్క చెప్పిన మాటల్లో సత్యాన్ని గుర్తించింది

"మరి వీళా ఆలోచించేవాళ్లంతా, వాళ్ల నెందుకు ఉద్ధరించలేక పోతున్నారు ?" అని జమున ఒక అడ్డుసవాలు వేసింది

"ఎందుకు చెయ్యటంలేదు చేసేవాళ్ళు చేస్తూనే ఉన్నారు" అంది వాసంతి

చంద్రమౌళి "లేదు వాసంతి నువ్వు పొర బడుతున్నావు వాళ్లకు సాయంచెయ్యడంకూడా సులభంకాదు వాళ్ల గురించి బాధపడేవాళ్లనేక మంది ఉన్నారు కాని వాళ్లకున్న శక్తి చాలా తక్కువ ధనికు లెంతసేపూ తమ ధనాన్ని భద్రంగా కాపాడుకోవడంకోసం బీదవాళ్లని బీద రికంలోనూ, బాధల్లోనే ఉంచే విధానం ఆలో చిస్తూంటారు వాళ్లకున్న శక్తి, అధికారంతో వాళ్ళు తక్కినవాళ్లని ఏ మంచిపనీ చెయ్యనియ్యరు అందువల్ల బీదలస్థితి ఎప్పటికీ ఒకలాగే ఉంది మనం బీదవాళ్లని చూసి జాలిపడతాం వాళ్ల కోసం కన్నీళ్లు విడుస్తాం కాని మనస్థితి పంజరం లోని చిలకలా ఉంది మనచుట్టూ ధనికులు నిర్మించిన పంజరం ఉంది" అన్నాడు

వాసంతి "అయితే ధనికుల్లో మానవత్వమే కొరతవడిందన్నమాట ఎందుకంటే మానవత్వం ఉన్నవా డెవడూ, తన తోటిమానవుడికి అంత అప కారం చెయ్యలేడు" అంది చంద్రమౌళి అవు నన్నట్లు తలూపాడు జమునకూడా అతని మాటలలోని సత్యాన్ని ఆలోచిస్తూ కూచుంది

బయట వాన బాగా ఎక్కువగా కురుస్తోంది గాలి పెద్ద హోరుతో వీస్తోంది సీతమ్మగారు, వాసంతినీ, జముననూ ఆ రాత్రికి అక్కడే ఉండి పొమ్మన్నారు పొరుగూరు వెళ్లిన సుదర్శనంగారు రాలేదు

వాసంతి, జమునా ఇష్టపడకపోయినా, గాలి వాన ఎక్కువగా ఉండడంవల్లా, సీతమ్మగారి బల వంతంవల్లా ఆ రాత్రికి అక్కడ ఉండక తప్ప లేదు భోజనంచేసిన తరువాత సీతమ్మగారి గది లోనే వాళ్లిద్దరకూ నౌకర్లు మంచాలూ, పక్కలూ వేశారు ముగ్గురూ పడుకున్నారు చంద్రమౌళి ముందుగానే తన గదిలోకి పాలూ, రొట్టె తెప్పించుకొన్నాడు అతను రాత్రి, మామూలు భోజనం చెయ్యడు పాలూ, రొట్టె మాత్రమే తీస కుంటాడు

పక్కమీద పడుకొన్న కొద్దిసేపటిలోనే జము నకు నిద్రపట్టేసింది, వాసంతికి నిద్రపట్ట లేదు సీతమ్మగారుకూడా నిద్రపోయారు వాసం తికి రాత్రి పడుకోబోయేముందు ఏదైనా పుస్తకం చదువుతూ నిద్రపోవడం అలవాటు ఆమె చంద్ర మౌళి నడిగి ఏదైనా పుస్తకం తీసుకోవడం మర్చిపోయింది వాళ్ళు పడుకున్నగదిలో ఏ పుస్త కాలూ లేవు.

కొంతసేపటి వరకూ చంద్రమౌళి గురించి ఆలోచిస్తూ గడిపింది. చంద్రమౌళి సహజంగా ఎంతో మంచివాడూ, తెలివైనవాడు అతనిలో ఉన్న లోపమల్లా దేనిగురించైనా అతిగా ఆలో చించడమే కాని, అది అతని స్వభావంలో ఒక భాగం మెత్తని మనసు కలవాళ్లు ప్రతి విషయం గురించీ అతిగా బాధపడక తప్పదు ఇతరులు ఎంత చెప్పినా వాళ్లు వినలేరు

వాసంతి బుర్రలో ఎన్నో ఆలోచనలు దొర్లాయి బయట భయంకరంగా వీస్తున్న గాలి, కుంభవృష్టిగా కురుస్తున్న వర్షం, ఆ రాత్రితో ఈ ప్రపంచపు అంతేదో తేల్చడానికి నిశ్చయించుకున్నాయేమో! వనిపి స్తోంది హఠాత్తుగా ఆ యిల్లే కూలిపోయి తమ మీద పడితే ? తామంతా మరణిస్తారు అప్పుడు తనూ, తన తలిదండ్రులూ వీళ్లంతా ఒకరికొకరు సంబంధంలేకుండా నశిస్తారు మరణం గురించీ, యమలోకం గురించీ ఆలోచిస్తే ఏదో భయం వేస్తుంది వాసంతికి

పిచ్చిపిచ్చి ఆలోచనలన్నీ మర్చిపోవడానికి, ఏదైనా పుస్తకం దొరికితే బాగుణ్ణనిపించింది జమునా, సీతమ్మగారూ ఇద్దరూ నిశ్చింతగా నిద్రపోతున్నారు వాసంతి మెల్లిగా లేచి గది బయటకు వచ్చింది వరండా దాటి చంద్రమౌళి గది దగ్గరకు వెళ్లింది

తెలుగు మేష్టారు—(పాఠం చెబుతూ) "అంతట మహారాణి అవ్వనమునందు ఒకసింహమును కని

విద్యార్థి - మేష్టారూ ! మహారాణులకు సింహాలుపుట్టేవాండీ?

మండలపర్తి భుజంగరావు (భీమవరం)

చంద్రమౌళి గదిలో లైటు వెలుగుతోంది

చంద్రమౌళి కిటికీదగ్గర నుల్చొని, బయట కురుస్తున్న వానను చూస్తున్నాడు వాసంతి రావ డాన్ని అతను గమనించలేదు

ముందు ఏదైనా పుస్తకం తీసుకొని, చప్పుడు చెయ్యకుండా వెళ్లిపోదామనుకొంది వాసంతి కానిచంద్ర మౌళి కిటికీ దగ్గర నిల్చోడం, తను రావడం కూడా గమనించకపోవడం చూసి, అతన్ని అనవసరంగా ఆలోచించవద్దనీ, నిద్రపొమ్మనీ చెబుదామనుకొంది

చంద్రమౌళికి దగ్గరగా కొంచెం చప్పుడు చేసు కుంటూ వెళ్లింది

అత నిటు తిరగలేదు

"ఏమండీ !" అని పిల్చింది

చంద్రమౌళి ఇటు తిరిగాడు అతని మొహం శోకభూయిష్ఠంగా ఉంది వాసంతిని, ఎవరో కొత్త మనిషిని చూసినట్లు చూసాడు వాసంతికి కొంచెం భయం వేసింది మళ్లీ చంద్రమౌళి మొహం కిటికీవైపు తిప్పేసుకున్నాడు వాసంతికి అతని పరిస్థితి అర్థమైంది తనకూ, అతనికీ పరిచయ మైన దగ్గర్నుంచి, అత నెన్నడూ అలా ఉండలేదు వాసంతి తిరిగి వెళ్లిపోదామా అని ఆలోచించింది.

ఆమె మనస్సులోంచి ధైర్యం, ఒక పొంగు పొంగింది

చంద్రమౌళి భుజంమీద చెయ్యి వేసింది "ఇటు చూడండి !"

చంద్రమౌళి చంటిపిల్లాడిలా ఏడుస్తున్నాడు

వాసంతి అతని చెయ్యి పట్టుకుని "ఇలా రండి!" అని అతన్ని మంచం దగ్గరికి తీసికెళ్లింది మంచం మీద యాంత్రికంగా కూచున్నాడు కళ్లమ్మట నీళ్లు కారుస్తూనే వాసంతి అతని కళ్లనీళ్లు తుడి చింది ఆమెకు, అత నంతవరకూ తను చెప్పినట్లు వినడంతో మరింత ధైర్యం వచ్చింది

బయట ఒక మెరుపు మెరిసింది మేఘం గర్జించింది

వాసంతికి, తరువాత ఏం చెయ్యాలో తోచ లేదు ఒక్క నిముషం తనూ బయట కురు స్తున్న వానవైపు చూసింది మళ్లీ చంద్రమౌళి వైపు చూసింది చంద్రమౌళి తనవైపే తదేక దీక్షగా చూస్తున్నాడు

వాసంతికి, అతను తనవైపు అలా చూడడం కొంచెం సిగ్గేసింది

ఆమె మనస్సులో చిన్న కెరటంలా—అర్ధరాత్రి—తా మిద్దరూ ఏకాంతంగా—ఒక గదిలో ఉన్నామనే భావం వచ్చింది

వెంటనే, కర్తవ్యం తోచినదానిలా "మీరు పడు కోండి" అంది

అతను, ఆమెవైపు అర్థంకానట్లు చూశాడు

అతని భుజం పట్టుకొని "ఊఁ! పడుకోవాలి" అంది రోగిని ఆజ్ఞాపించే ధోరణిలో అతని తల తలగడామీద ఉండేట్లు చేసింది

"కళ్లు మూసుకోండి" అంది అతను కళ్ళు ముయ్యలేదు అతనిమీద దుప్పటి కప్పింది కంఠందాకా అతని కళ్లవైపు చూసింది అవి ఇప్పుడు కన్నీళ్లు కార్చటంలేదు ఆమెవేపు వింతగా చూస్తున్నాయి

తను అతని తలదగ్గర కూచొంది అతని నుదురు రాస్తూ మాట్లాడసాగింది "ఇంత రాత్రివరకూ మీ రెందుకు మేల్కొన్నారు ? పైగా మీరిలా మేల్కొంటారని మీ అమ్మగారికి తెలియదులా ఉంది అయినా ఎందు కొచ్చిన ఆలో చన లివి ? ఆరోగ్యం పాడుచేసుకొనేదాకా, ఆలో చించాలా ? మీరెన్నో పుస్తకాలు చదివారు ఎంతో తెలివైనవారు ఒక మనిషి తనని తాను, శారీరకం గానూ, మానసికంగానూ పటిష్ఠం చేసుకున్న తరు వాతే ఇతరుల్ని ఉద్ధరించగలడు తన మానసిక శక్తిని కోల్పోతే, ఆ వ్యక్తి ఏం చెయ్యగలుగుతాడు ? " వాసంతి అతని నుదురు రాయటం ఆపి, అతని మొహంవైపు చూసింది

చంద్రమౌళి నిద్రపోతున్నాడు వాసంతి, అతని మొహం బాగా పరిశీలించిచూసి ఒక నిట్టూర్పు విడచింది మెల్లిగా లేచింది బయట కొంచెం తగ్గిన వానవేపు చూసింది మెల్లిగా అడుగులేసు కుంటూ తను పడుకున్న గదిలోకి వెళ్లిపోయింది తీరా తన పక్కదగ్గరికి వెళ్లాక ఆమెకు—తను ఏ పుస్తకం తెచ్చుకోలేదని జ్ఞాపకమొచ్చింది తన మతిమరుపుకు, చిన్న నవ్వు నవ్వుకొంది పక్కమీద పడుకొని ఆవలిస్తూ దుప్పటి తన

మీదికి లాగుకొంది సీతమ్మగారూ, జమునా నిశ్చింతగా నిద్రపోతున్నారు

ప్రొద్దున్నే లేచి వాసంతీ, జమునా కాఫీ తాగాక ఇంటికి బయల్దేరారు వాన బాగా తెరిపిచ్చింది చంద్రమౌళి నిద్రనుంచి ఇంకా లేవలేదు

రాత్రంతా కురిసిన వానకి, నీరు పొలాల నిండా నిండిపోయింది గాలికి బోలెడుచెట్లు పడి పోయాయి ఆ భీభత్సమంతా చూస్తూ జమునా వాసంతీ యింటి కెళ్లారు ఇంటి కెళ్లగానే డాక్టరుగారూ, ఆయన భార్యా "ఏమ్మరా ? మంచి పని చేశారు సుదర్శనంగారి నౌకరు వచ్చి చెప్పే దాకా మీ గురించి ఎంతో బెంగపెట్టుకున్నాం" అన్నారు వాసంతి తను రాత్రి చంద్రమౌళి నిద్ర పుచ్చినవిషయం తప్ప తక్కిన విషయాలన్నీ చెప్పింది

పొద్దున్న పదిగంట లయ్యేటప్పటికి వాన పూర్తిగా తగ్గిపోయింది వాసంతికి, అవాళ పోస్ట్సులో ఎం బి బి ఎస్ లో సీటు వచ్చినట్లూ, పది రోజులలో వచ్చి 'జాయిన' వ్వాలనీ ఉత్తరం వచ్చింది తానొక నూత్నజీవితంలోకి అడుగుపెట్టబో తున్నట్లు, ఉత్సాహం పొందింది

అవాళ సాయంకాలం చంద్రమౌళి డాక్టరుగా రింటికి వచ్చాడు డాక్టరుగారితో చాలాసేపు మాట్లాడుతూ కూర్చున్నాడు అతను వెళ్లి పోయాక వాసంతి తండ్రి దగ్గరకు వచ్చింది ఆమెకు చంద్రమౌళిలో ఏదైనా మార్పుందేమో తెలుసుకోవాలని చాలా కుతూహలంగా ఉంది

డాక్టరుగారు కూతుర్ని చూసి "ఏమమ్మా, ఇవాళ చంద్రమౌళితో వచ్చి మాట్లాడలేదేం ?" అని అడిగారు వాసంతికి 'గతుక్కు'మన్న ట్లయింది మనసులో

"అబ్బే ! ఏంలేదు సుశీలా, నేనూ బట్టలు కత్తి రిస్తూ లోపలుండిపోయాం ఆయ నేమ్మైనా అన్నారా ?" అంది తన మనస్సులో ఉన్న ఆందో ళన వ్యక్తం చెయ్యకుండా

అదేమీలేదు చంద్రమౌళి ఇవాళ కొద్దిగా ఉత్సాహంగా ఉన్నాడు అలాంటప్పుడు అతనితో మాట్లాడటం సరదాగా ఉంటుంది" అన్నా రాయన

వాసంతి సంతృప్తిగా ఊపిరి పీల్చుకుంది

మర్నాడు బాగా ఎండ వచ్చింది ముగ్గు రక్క చెల్లెళ్ళూ సాయంకాలం షికారుకు బయల్దేరారు వాళ్లతో నౌకరుకుర్రాణ్ణి కూడా వెంటబెట్టుకు వెళ్లారు. చంద్రమౌళి వాళ్లకు ఎదురొచ్చాడు వాసంతి అతన్నికూడా వాళ్లతో షికారు రమ్మంది అతనూ వాళ్ల ననుసరించాడు

జమునా, సుశీలా, ఇద్దరికీ వాసంతిమీద చంద్ర మౌళికి ప్రత్యేకాభిమానం అని తెలుసుకాబట్టే, వాళ్ళిద్దర్నీ వెనక్కి వదిలేసి, తాము కొంచెం ముందుగా నడవనారంభించారు వాసంతి చంద్ర మౌళిని ముందు వాళ్లనాన్నగారు గాలివాన రోజున ఎక్కడికి వెళ్లిందీ, ఎప్పు డింటికి వచ్చిందీ అడిగింది

చంద్రమౌళి ఆమె మాటలకు జవాబు చెప్పి "వాసంతి నేను నీతో ఒక ముఖ్యవిషయం మాట్లాడాలని వచ్చాను" అన్నాడు వాసంతి అతని

వాసంతి

మొహంలోకి చూసింది

"ఏమిటది ?" అని అడిగింది

'నాలో ఏదైనా మార్పు వచ్చినట్లు కని పిస్తోందా ? నీకు"

"ఏమో నాకు తెలియదు."

"అలా కాదు వాసంతీ నువ్వు సమాధానం చెప్పాలి"

"నేనేం చెప్పగలను ?"

"నా అంతట నాకు చాలా మార్పు కన్పిస్తోంది నా మనస్సు వెనక, పగిలిన గాజుగ్లాసులా ఉండేది అందులో ఏది పోసినా కారిపోయేది ఇప్పు డలా కాకుండా, ఎవరో దాన్ని చక్కగా అతికించినట్లూ, అందులో ఏదైనా ఇమిడేటట్లూ ఉంది నాకు మళ్లీ చదువుకోవాలనిపిస్తోంది ఇంత మార్పు ఎలా వచ్చిందో బోధపడటంలేదు" అన్నాడు చంద్రమౌళి

"చాలా సంతోషం అదేగా కావలసింది! మీరు మళ్లీ చదువుకు వెళ్లినాకూడా నేను చాలా సంతోషిస్తాను అసలు మీకింత వివారం కలిగించిన విషయమేమిటో నాకు తెలుసుకోవాలని ఉంది"

"అది చాలా పెద్ద కథలే ఎప్పుడైనా చెబు తాను" అన్నాడు చంద్రమౌళి కొంచెం విచా రంగా వాసంతికి ఆ విషయం కదపడం తను పొర బాటుచేశా ననిపించింది చంద్రమౌళి కొంచెం సేపు మౌనం వహించి తరువాత మాట్లాడాడు

"జీవితంలో అపురూపంగా మంచి స్నేహం లభిస్తుంది ఈ ఊరికి రెండేళ్లక్రిందట నేను భగ్నహృదయంతో వచ్చినప్పుడు ఏనాడైనా నీలాటి వ్యక్తి కన్పిస్తుందనుకోలేదు ఈ రెండేళ్లూ నా మనసు, మనసులోలేక నానాయాతనా అనుభ వించాను నాయందు సానుభూతిచూపించేవా రెవరూ నా కింతవరకూ కన్పించలేదు నీతో పరి చయమైన ఈ అయిదారు వారాల్లోనూ నా కెంత మనశ్శాంతి లభించింది నీకు నామీద ఏదో ప్రత్యేక అభిమానం ఉన్నట్లు తోస్తోంది నీ స్నేహం, సానుభూతీ నాకు ఎల్లప్పుడూ కావాలి అందు కోసమే నిన్ను ప్రత్యేకంగా ప్రార్థిస్తున్నాను" అన్నాడు.

ఒకరు:-పిచ్చాసుపత్రికి కాలేజీకి భేద మేమిటి?

మరొకరు:- పిచ్చాసుపత్రి నుండి బయటకు రావాలంటే మనిషిలో చాలా అభివృద్ధి కన్పించాలి.

యస్. యన్ మురుగా
(కోవూరు)

వాసంతి చిన్న నవ్వు నవ్వింది "ఇందులో పెద్ద విశేష మేముంది ? మీరు ఎంతో మంచివారు కాబట్టే నేను మీతో స్నేహంచెయ్యగలిగాను నా సానుభూతి మీమీద ఎల్లప్పుడూ ఉంటుంది" అంది ముందు వెళ్తున్న జమునా, సుశీలలకి నౌకరుకుర్రాడు వేరుశెనగకాయల్ని మొక్కల్తో సహా పొలాల్లోంచి పీకి తంపవేసి పెట్టున్నాడు వాళ్లు సరదాగా ఆ ఉడికినకాయల్లోని పప్పు తీసుకు తింటున్నారు

చంద్రమౌళీ, వాసంతీ ఒకచోట కూర్చొని ఉడికిన వేరుశనగకాయల పప్పును తిననారం భించారు చంద్రమౌళి, వాసంతి ఎం బి బి ఎస్ కు వెళ్తోందని సంతోషించాడు వాసంతి "మీరు కూడా ఎం ఏ కు కట్టి పూర్తిచెయ్యా రాదా ?" అని అడిగింది చంద్రమౌళిని

"నేను ఆ ఉద్దేశంతోనే ఉన్నాను మా అమ్మ గారు నన్ను వదిలి ఉండడానికి ఇష్టపడటంలేదు ఆమెవంట్లో ఆరోగ్యం బాగాలేదు అందుకని సందేహిస్తున్నాను ఈ సంవత్సరం కాకపోతే వచ్చే సంవత్సరమైనా చేర్తాను" అన్నాడు

వాసంతి అతనివైపు చూస్తూ "మీరు నాకొక వాగ్దాన మివ్వాలి?" అంది

"ఏమిటది ?"

"నేను చదువుకు వెళ్లిపోయినా, మీ గురించే ఆలోచిస్తూ ఉంటాను మీరు అతిగా దేని గురించీ ఆలోచించవనీ, రాత్రిళ్ళు తొందరగా నిద్రపోతా ననీ, నాకు వాగ్దానమిస్తే నేను నిశ్చింతగా వుండ గలను"

"అలాగే" అని, చంద్రమౌళి మెల్లిగా అంటూంటే అతనికళ్లల్లో నీళ్లు నిలచాయి వాసంతి గమనించలేదు చంద్రమౌళి ఆమెకు తన మొహం కన్పించకుండా తిప్పేసుకున్నాడు జమునా, సుశీల వచ్చి ఇంటికి వెళ్దామన్నారు

అందరూ కలిసి డాక్టరుగారింటికి చేరు కున్నారు దారిలో ఎవరూ ఏమీ మాట్లాడలేదు వాళ్లను దిగబెట్టి, చంద్రమౌళి తనింటికి వెళ్లి పోతూ వాసంతియొక్క మంచితనంగురించి ఆలోచించాడు తన గురించి ఆమె చూపించే ఆత్రుతా, అభిమానం తనింతవరకూ ఎవరిదగ్గరా చూడలేదు. ఆమెలో ఏ ప్రబలమైన ఆకర్షణో, తన కల్లోలితమన స్సును చక్కబరుస్తోంది తనకు మునుపులేని ధైర్యాన్నిస్తోంది వాసంతి తనకన్నా చిన్నదైనా, ఆమె ఆలోచనలు తన ఆలోచనలకన్నా తెలివైన విలా కన్పిస్తాయి ఆమె దయార్ద్రహృద యాన్ని తల్చుకుంటే, తన మనస్సే కరిగి పోతుంది

చంద్రమౌళి అవాళరాత్రి ఇంటికి చేరుకున్న తరువాత తల్లితో తను మళ్లీ చదువుకు వెళ్తానని చెప్పాడు తండ్రికూడా విన్నాడు అతను చెప్పడం. ఆయనకు కొడుకుని దూరంగా పంపించటం ఇష్టమే కాని తల్లికి ఇష్టంలేదు

సీతమ్మగారు కొడుకుమాట కేమీ జవాబు చెప్ప లేదు భర్తతో కదిపింది సుదర్శనంగారు "వెళ్లనీ. ఈ రెండేళ్లబట్టీ వాడు అమాత్రమైనా ఉత్సాహం చూపించలేదు ఎలాగైనా మునుపటికన్నా వాడు కొన్ని మారినట్లున్నాడు ఈమాటు జాగ్రత్తగా

చదువుకుంటాడేమో !" అన్నారు.

"ఇక్కడుంటే మన కళ్లముందర తిరుగుతున్నాడుకాబట్టి ఎలా ఉన్నాడో తెలుస్తోంది దూరదేశంలో ఉంటే మనకేం తెలుస్తుంది ?"

"వాడికి తోడుగా మన వీరయ్యనుకూడా పంపిద్దాం ఒకటి రెండు నెలలు ఉంటాడు సవ్యంగా నడిస్తే సరే, లేకపోతే ఇద్దరూ తిరిగి వచ్చేస్తారు ఇక్కడమాత్రం వాడి మనస్సుకు తగిన వ్యాపృత్తి ఏది ?" అన్నారు

సీతమ్మగారు వాళ్లింట్లో పనిచేస్తున్న వీరయ్యను తోడిచ్చి పంపటానికి అంగీకరించారు వాసంతి ఎం బి బి ఎస్ లో చేరటానికి వెళ్లిన కొద్దిరోజుల్లోనే చంద్రమౌళి ఢిల్లీకి, ఎం ఏ రెండో సంవత్సరంలో చేరడానికి వెళ్లిపోయాడు

* * *

వాసంతికి ఢిల్లీనుంచి చంద్రమౌళి రెండుత్తరాలు రాశాడు అందులో తను కులాసాగా చేరినట్లూ, వాసంతిని ఎప్పుడూ తల్చుకుంటున్నట్లూ రాశాడు తరువాత అతనిదగ్గరనుంచి ఉత్తరాలు లేవు వాసంతి కొంచెం ఆందోళన చెందింది కాని డాక్టరుగారు కూతుర్ని చూడడానికి విశాఖపట్నం వచ్చినప్పుడు చంద్రమౌళి విషయం చెప్పారు

"చంద్రమౌళి ఢిల్లీకి వెళ్లిన రెండునెలల తరువాత, తల్లికి చాలా సీరియస్‌గా ఉందని టెలిగ్రాం వస్తే వెంటనే బయల్దేరి తమగ్రామం వచ్చాడు అతను వచ్చేటప్పటికే తల్లి ప్రాణాలు విడిచేసింది పదిహేనురోజులదాకా ఉండి, ఒకనాడు తండ్రికికూడా చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయాడు అప్పటినుంచీ అతనికోసం విశ్వప్రయత్నం చేశారుగాని కన్పించలేదు బహుశా ఏ దూరదేశాలకైనా పారిపోయాడో, లేక ప్రాణాలు పోగొట్టుకున్నాడో తెలియదు" అని డాక్టరుగారు చెప్పారు

ఈ మాటలు విని వాసంతి స్పృహతప్పిపడిపోయినంతపని అయింది డాక్టరుగారు ఖంగారుపడి ఆమెకు చెయ్యవలసిన సేవంతా చేశారు చాలా సేపటివరకు ఏడ్చింది డాక్టరుగారు ఆమె బాధ వర్థం చేసుకున్నారు ఆయన, విషయం ఇంతవరకూ వెళ్తుందని ఊహించలేదు కూతుర్ని ఈ విషయంలో ఏమీ అని లాభంలేదని, మెల్లిగా ఆమెకు ధైర్యంచెప్పి, చంద్రమౌళి ఆచూకీ కనుక్కోడానికి తనుకూడా ప్రయత్నం చేస్తానని చెప్పారు

ఆరేళ్ళ కాలగర్భంలో కలిసిపోయాయి

వాసంతి ఎం బి బి ఎస్ పూర్తవడం, ఒక ఏడాది 'హౌస్ సర్జన్' గా పనిచెయ్యడంకూడా అయిపోయి, విజయనగరంలో ప్రాక్టీసు పెట్టింది ఈ ఆరేళ్లలోనూ, అనేకసార్లు చంద్రమౌళి గురించి వాకబుచేసింది కాని అతనిజాడ ఏమీ తెలియలేదు డాక్టరుగారికి ఆ ఊరినుంచి, రెండు మూడు బదిలీలై రిటైరవబోతా రనగా ఆ ఊరే మళ్లీ వేశారు

* * *

డాక్టరు జానకిరాంకీ, సుదర్శనంగారికీ చాలా స్నేహం సుదర్శనంగారిని అన్ని కష్టాలలోనూ జానకిరాంగారే ఓదారుస్తూ ఉండేవారు చంద్రమౌళి సంగతి ఏమీ తెలియదు సుదర్శనంగారికి కూడా ఆరోగ్యం క్షీణించసాగింది భార్య చనిపోవడం, కొడుకు మతిస్థిరంలేక దేశాలపాలైపోవడంతో ఆయన చాలావరకూ క్రుంగిపోయారు

ఒకనాటి మధ్యాహ్నం వాసంతి విజయనగరం నుంచి తండ్రిని చూడాలని బయల్దేరింది ఆ ఊరు వెళ్లాలంటే బస్సుమీద వెళ్లాలి

ఆమెకు ఆనాటి మధ్యాహ్నంనుంచి తండ్రిని చూడాలని అనిపించడంవల్ల, సాయంకాలం ఒకర్తే బస్సులో బయలుదేరింది విజయనగరంనుంచి ఇరవైమైళ్లదూరంలో ఆ పల్లెటూరు ఉంది ఆ పల్లెటూరికి వెళ్లి చాలాకాలమైంది

వాసంతికి ఆరుసంవత్సరాల తర్వాత మళ్లా ఆ ఊరు వెళ్లవలసి రావడం, ఆశ్చర్యంగా ఉంది సుదర్శనంగారెలాఉన్నారో ? చంద్రమౌళి సంగతే తెలియదు ! అతన్ని తల్చుకున్నపుడల్లా ఆమెకు కన్నీరు వస్తుంది ఆమె సాధారణంగా ఒకర్తీ ప్రయాణం చెయ్యదు ఆనా డెందుచేతో, మనస్సు తండ్రిని చూడాలని కొట్టుకోవడంవల్ల బయల్దేరింది

చీకటిపడింది బస్సు పద్దెనిమిదిమైళ్లదాకా వచ్చాక టైరు పేలిపోయింది బస్సు కాస్సేపు ఆగింది తీరా టైరువేసాక చూస్తే 'డైనమో' చెడిపోయింది బస్సు తొందరలో కదలలేదని తెలిసి, ప్రయాణికులు 'ఏం చెయ్యాలా?' అని ఆలోచించసాగారు వాసంతి అంతవరకూ తల వంచుకొని తనలోతను ఆలోచిస్తోంది ఆమె ప్రయాణికుల నెవ్వరినీ పరిశీలించలేదు ఎవరో ఒక ప్రయాణికుడు కండక్టరుని "రామనగరం ఇక్కడికి రెండుమైళ్లుంటుందికదూ ?" అని అడుగుతున్నాడు.

వాసంతి ఆ గొంతువిని, తను ఎక్కడో మునుపు విన్న గొంతుకలా ఉందని అనుకొని, ఆ వ్యక్తిని పరీక్షగా చూచింది గడ్డాలూ, మీసాలూ పెరిగిపోయి మాసినబట్టల్తో ఉన్నా, ఆ వ్యక్తి చంద్రమౌళేనని గుర్తించింది ఆమెకు తల ఒక్కసారి తిరిగినట్లయింది సంతోషం, సంభ్రమాలు ఆమెలో ఒక్కసారిగా పెల్లుబికినయి

"చంద్రమౌళిగారూ !"

"ఎవరు ? వాసంతా ?" అని ఆమెవైపు చూస్తూ ఆశ్చర్యపోయాడు చంద్రమౌళి ఏం చెయ్యాలో అతనికి తోచలేదు

"మీ రెక్కడికి వెళ్తున్నారు ?"

"రామనగరం "

"నేనూ రామనగరమే "

"బస్సు ఇంతలో కదల్దు మనం నడిచి వెళ్లచ్చు"

"పదండి వెళ్దాం "

ఆగిపోయిన బస్సునీ, ఖంగారుపడ్తున్న ప్రయాణీకుల్నీ, తెల్లబోయిన కండక్టరునీ వెనకాల వదిలేసి, చేతిలో బెడ్డింగుతో చంద్రమౌళీ, చేతిలో సంచీతో వాసంతి రామనగరంవేపు నడక సాగించారు.

"ఈ ఊరు వస్తూనే, నిన్ను కలుసుకోవడం ఆశ్చర్యంగా ఉంది!"

"ఆరేళ్లతర్వాత మీరు కన్పించడం చాలా విచిత్రం "

"అవును వాసంతీ ఈ ఆరేళ్లలోనూ నువ్వు డాక్టరువయ్యా వనుకుంటాను నేను చాలా ఊళ్ళు తిరిగాను "

"నన్ను మీరు మర్చిపోయా రనుకున్నాను "

"లేదు వాసంతీ నువ్వూ, నీ సానుభూతీ నన్ను మనిషినిచేశాయి నాన్నగారికి వంట్లో బాగుండ లేదని తెలిసినా, నిన్ను చూసే అవకాశం లభిస్తుందేమోననే, మూడురోజులక్రిందట కాశీనుంచి బయల్దేరాను "

"మీ రెక్కడి కెళ్లారో, ఎక్కడున్నారో తెలుసుకుందామని చాలా ప్రయత్నం చేశాము కానీ మీ ఆచూకీ తెలియలేదు "

"నేను మా అమ్మగారు పోయినతరువాత మూడుసంవత్సరాలు దేశమంతా నడకమీద, తిరిగి చివరకు కాశీ చేరుకున్నాను కాశీలో నాకొక స్నేహితుడు లభించాడు అతనూ, అతని భార్యా నన్నెంతో ఆదరించి, ఓదార్చి నాచేత నూత్నజీవితం ప్రారంభింప జేశారు ఎం ఏ కు కట్టి కాశీలోనే పాసయి ఆ యూనివర్శిటీలోనే లెక్చరరుగా పనిచేస్తున్నాను పదిహేనురోజుల క్రిందట డాక్టరుగారి కొక ఉత్తరం వ్రాశాను ఆయన, మా నాన్నగారికి చాలా సీరియస్‌గా ఉన్నట్లు టెలిగ్రాం ఇచ్చారు నేను వెంటనే బయల్దేరి వచ్చాను "

"అబ్బ ! ఎన్ని విచిత్రాలు జరిగాయో ?"

చంద్రమౌళి వాసంతి కబుర్లు చెప్పుకుంటూ ఊరిలోకి వచ్చేటప్పటికే, సుదర్శనంగారు చావు బ్రతుకులమీదున్నట్లు తెలిసి వెంటనే చంద్రమౌళి ఇంటికి వెళ్లారు చంద్రమౌళి వెళ్లగానే, ఆఖరిసారి అతన్ని చూస్తూ, నోట మాటవడిపోవడం వల్ల, డాక్టరుగారివైపు వేలితో చూపించారు సుదర్శనంగారు.

ఒకరోజు రాత్రి ఒక నర్సుకు 'ఫోన్ కాల్' వచ్చింది.

అవతలి కంఠం.- ఏమండీ! మీ హాస్పటల్లో 8 వ నంబరు గదిలోని రోగికి ఎట్లా వుంది.

నర్సు:- బాగానే ఉంది.

అ. కంఠం:- అయితే అతన్ని ఎప్పుడు విడుదల చేస్తారు

నర్సు:- బహుశః సోమవారం. ఇంతకీ మాట్లాడేదెవరు?

అ. కంఠం:- మీ హాస్పిటల్లోని 8 వ నంబరు గదిలోని రోగిని.

సి. గోపాలకృష్ణ.

డాక్టరుగారు, చంద్రమౌళి వచ్చినందుకు సంతోషించి అతనితో "మీ తండ్రిగారు తనను క్షమించమని కోరుతున్నారు ఆస్తిని నీ ఇష్టంవచ్చినట్లు చేసుకోమని వీలు వ్రాశారు నువ్వొక ఇంటివాడివి కావాలని కోరుతున్నారు ఆయన తీరు వడిపోకముందు ఈ విషయాలన్నీ నీతో చెప్పమని నాతో చెప్పారు నువ్వు అందుకు అంగీకరించినట్లు ఆయనతోచెప్పి, ఆయన ఎడల సద్భావం చూపించవలసిందిగా కోరుతున్నాను" అన్నారు చంద్రమౌళి అంతా విని తండ్రివైపు చూచి తల ఊపాడు

సుదర్శనంగారు ప్రాణం వదిలేశారు చంద్రమౌళి తండ్రికి ఏలోటూ లేకుండా అంత్యక్రియలు జరిపించాడు. వాసంతి, డాక్టరుగారూ పదిహేనురోజులవరకూ, తక్కిన పనులన్నీ వదిలిపెట్టి చంద్రమౌళి చేత జరిపించవలసిన కార్యమంతా నడిపించారు

అంతా అయిపోయినతరువాత ఒకనాడు డాక్టరుగారు చంద్రమౌళి ఏం చెయ్యబోయేదీ అడిగారు అతను తను ఈ విషయాలన్నీ ఆలోచిస్తున్నాననీ ఇంకా ఒక నిర్ణయానికి రాలేదనీ చెప్పాడు అంతలో వాసంతి వచ్చి తను విజయనగరం వెళ్లదల్చుకున్నట్లు చెప్పింది

చంద్రమౌళి వాసంతిని చూసి "వాసంతీ, నా తలితండ్రులు నన్ను విడిచిపోయారు మిగిలిన ఆప్తులు మీరిద్దరే మీకు కొన్ని విషయాలను చెబుదామనుకొంటున్నాను" అన్నాడు వాసంతి ఒక కుర్చీలో అతనికెదురుగా కూర్చుంది

చంద్రమౌళి ప్రారంభించాడు "నేను ఢిల్లీలో చదువుతున్నప్పుడు నాకు ఇస్మాయిల్ అని ఒక స్నేహితుడుండేవాడు మా యిద్దరికీ ప్రాణస్నేహం కలిసింది అతను విశాఖపట్నం నుంచి వచ్చాడు మొదటి ఏడాదంతా ఎంతో స్నేహంగా మెలిగాం. అతను కవిత్వం రాసేవాడు ఎప్పుడూ నవ్వుతూ సరదాగా ఉండేవాడు. అతన్ని చూసినవాళ్లెవరైనా అతనికేమీ చికాకులు లేవనుకోవలసిందే, అందర్నీ నవ్వించేవాడు"

"ఇస్మాయిల్, నేనూ కలసి రెండో ఏడు ఒక గది తీసుకున్నాం ఇద్దరం ఎప్పుడూ ఒకరినొకరం విడిచివుండేవాళ్లం కాము ఒకసారి అతను తల్లికి వంట్లో బాగులేదని ఉత్తరం వస్తే విశాఖపట్నం వెళ్లి వచ్చాడు అతను తిరిగి వచ్చినదగ్గర్నుంచీ, మనిషి పరాకుగా ఉండడం, గంభీరంగా ఉండడం మొదలెట్టాడు రోజురోజుకీ మనిషి సరిగా తిండితినక క్రమంగా చిక్కిపోసాగాడు నేనెన్నివిధాలా అడిగినా కారణం చెప్పలేదు"

"ఒకనాడు రాత్రి నేనూ, అతనూ చాలా రాత్రివరకూ మాట్లాడుకొని నిద్రపోయాం నాకు నిద్ర బాగా పట్టేసింది నేను తెల్లవారి లేచి చూచేసరికి, ఇస్మాయిల్ ఆ రూములోనే దూలానికి కట్టిన తాడుతో ఉరిపోసుకుని కన్పించాడు నేను హడలిపోయాను ఆ దెబ్బకి నా మనస్సు తట్టుకోలేకపోయింది"

"ఇస్మాయిల్ చనిపోతూ నా పేర నొక ఉత్తరం రాశాడు అందులో అతను విశాఖపట్టణం వెళ్లినప్పుడు తన తల్లికి ప్రాణాపాయం కలిగిందనీ, ఆమె చనిపోతూ కొన్ని మాటలు చెప్పిందట—అవేమిటో వివరిస్తూ, వాటికారణంగా తనకు జీవితంమీద విరక్తి కలిగి ఆత్మహత్య చేసుకుంటున్నాననీ వ్రాశాడు అసలు యిస్మాయిల్ తల్లి మహమ్మదీయ స్త్రీ కాదుట ఆమె హైందవస్త్రీయే! ఒక ధనికుడు ఆమెను వంచించి, ఆమె శీలాన్నపహరించి, ఆమెకు గర్భం వచ్చాక, తా నప్పటికే వివాహితుడనని చెప్పి ఆమెను విశాఖపట్నం తీసుకొచ్చి ఒక ఇల్లు తీసుకుని ఆమెను ఉంచాడట ఆమె బిడ్డను కనేవరకు ఊరుకొని బిడ్డను కనగానే ఆబిడ్డ నెవరికైనా ఇచ్చెయ్యమని బలవంతంచేశాడట ఆమె మొదట్లో అందు కొప్పుకోకపోయినా తరువాత ప్రక్కయింటిలో ఉన్న ఒక ముస్లిం దంపతులకు పెంచమని ఇచ్చిందట వాళ్ళు అతన్ని పెంచి పెద్దవాణ్ణి చేశారు వాళ్లు చాలా బీదవాళ్లవడంవల్ల, ఇస్మాయిల్ కన్నతల్లే వారికి ధనసహాయం చేసేది అంతేకాకుండా ఆమె తరువాత

జనాభా ఎన్యూమరేటరు:- ఏమండీ ఈయింట్లో ఈనాలుగు రోజులనుండి ఎవరైనా పుట్టినారా?

ఒక విద్యార్థి:-ఇది విద్యార్థుల హాస్టలండీ ఇక్కడ పుట్టట మేమిటి.

జ. ఎ:- నాడ్యూటీ బాబూ? డ్యూటీసంగతి నీకేమి తెలుసు విద్యార్థివి.

పళ్లా నాగేశ్వరరావు (నాగాయలంక)

ఒక ఆడపిల్లనుకూడా కన్నది ఆపిల్ల, మహమ్మదీయనామంతో చెలామణి అవుతూ ఈ రెండిళ్లలోనూ తిరుగుతుండేది ఆమే, ఇస్మాయిల్‌కూడా తాము ముస్లిందంపతుల బిడ్డలమే ననుకొనేవారు కాని, కొందరికి ఈ రహస్యం తెలుసు"

"ఆ ముస్లిం దంపతులలో భర్త, ఇస్మాయిల్‌కి పన్నెండేళ్లప్రాయంలో చనిపోయాడు ఇస్మాయిల్ పెరిగి పెద్దవాడయ్యేవరకూ, అతనికీ, అతని చెల్లెలికీ ఆ కన్నతల్లే ధనసహాయం రహస్యంగా చేసేది ఆమె హఠాత్తుగా చనిపోయింది అప్పటికి ఇస్మాయిల్ చెల్లెలు ఎవరో అబ్బాయిని ప్రేమించి ఎక్కడికో వెళ్లిపోయింది ఇస్మాయిల్‌ని పెంచిన తల్లి జబ్బుపడిపోయింది ఇస్మాయిల్‌ని ఢిల్లీనుంచి పిలిపించి, అసలు విషయమంతా అతనికి చెప్పేసి తనింక చదివించలేనని చెప్పింది"

"అంతేకాక ఇస్మాయిల్ కన్న తండ్రెవరో చెప్పి, అతన్ని వెళ్లి ఆస్తిలో భాగం అడగమంది ఇస్మాయిల్‌కి జరిగినదంతా తెలిసి చాలా బాధపడ్డాడు తన కన్నతండ్రి ధనమదాంధతచేత, తనతల్లికి ద్రోహంచేశాడని, తా నింతవరకూ సంఘంలో గౌరవనీయ వ్యక్తి ననుకొంటూ బ్రతికి, ఒక కులటపుత్రుడి ననిపించుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని ఉత్తరంలో రాశాడు అంతేకాక తనను కన్న తండ్రియై తనతల్లిని మోసంచేసిన దుర్మార్గుడిది రామనగరం అనీ, ఆయన పేరు సుదర్శనం అనీ కూడా వ్రాశాడు"

డాక్టరుగారూ, వాసంతికూడా "ఆ!" అన్నారు ఒక్కసారిగా

చంద్రమౌళి విచారంతో "అవును మా నాన్నగారే అందుకే ఆయనమీద నేను కోపంతో ప్రవర్తించేవాణ్ణి ఆయన్ని నేను అనేకసారులు ఇస్మాయిల్ చెల్లెలిగురించి వాకబుచెయ్యమనీ, ఆస్తిలో ఆమెకు భాగమిమ్మనీ కోరాను కాని, ఆయన విన్పించుకోలేదు అందువలన నాకా ఆస్తి అక్కరలేదని, ఇన్నాళ్లూ ఆయనకు దూరంగా తిరిగాను అంతిమసమయంలో ఆయన పశ్చాత్తాపం ప్రకటించడంవల్ల, నేను ఆ ఆస్తినంతా తాత్కాలికంగా స్వీకరిస్తున్నాను కొద్దిరోజులలోనే, ఇస్మాయిల్ చెల్లెలుగురించి వాకబుచేసి, ఎలాగైనా ఆమె ఆచూకీ తెలుసుకుని ఆమెకు ఈ ఆస్తిలో సగభాగం ఇవ్వదలచాను" అన్నాడు

డాక్టరుగారు చంద్రమౌళి ఉదార స్వభావానికి సంతోషం ప్రకటించారు ఇంతలో డాక్టరుగారికోసం ఎవరో అర్జంటుకేసుందని వచ్చారు. డాక్టరుగారు చంద్రమౌళితో తను మళ్లీ వచ్చి అతన్ని కలుసుకుంటానని చెప్పి వెళ్లిపోయారు. వాసంతీ చంద్రమౌళీ మిగిలిపోయారు

సాయంకాలం ఆరుగంటలయింది వాసంతి అవాళ్టికి విజయనగరం వెళ్లే ఉద్దేశం మానుకుంది ఎదురుగుండా చంద్రమౌళి తనతో ఏదో చెప్పాలనుకుంటూ, మళ్లీ ఆగిపోయినట్లు గమనించింది తనూ అతని కళ్లల్లోకి చూచింది "పాపం! ఇదంతా మనస్సులో ఉంచుకొని అంత బాధ పడ్డావా!" [illegible] జాలిగా అతనివైపు చూసూ

"అవును [illegible] ముఖాన్ని ఎన్నాళ్లో నా మనస్సులో చెరగని ముద్రలా ఉండి, నన్ను బాధించింది ఇంతా చేస్తే అతను నా సోదరుడవటం, మేమిద్దరం ఒక తండ్రిబిడ్డ లవటం నన్ను మరీ బాధించేది"

"అవును మీ బాధ నా కర్థమైంది"

"ఆ సమయంలో నీ సానుభూతే నన్ను రక్షించింది"

"ఏంలాభం? ఎక్కువకాలం మీతో గడపలేకపోయాను"

"ఫరవాలేదు కొంతవరకు నా తల్లి మరణంవల్ల కలిగిన దుఃఖానికి, నీకిచ్చిన వాగ్దానంవల్లే నేను తట్టుకోగలిగాను"

"నాకన్నా మీ స్నేహితులెవరో మీకు చాలా ఉపకారం చేశారు"

"అవును రామారావు, జలజా ఇద్దరూ ఎంతో మంచివాళ్ళు" అని ఒక్క నిముషం ఆగి, చంద్రమౌళి "వాసంతీ ఈ ఆరేళ్లలోనూ—నీ ధ్యానతోనే జీవించాను"

"నేనంత అభిమానానికి పాత్రురాలిని కాదు."

"లేదు, వాసంతీ నిన్ను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నాను నన్ను పెండ్లిచేసుకోమని ప్రార్థిస్తున్నాను"

వాసంతి జవాబివ్వక తన తల ప్రక్కకి తిప్పుకుంది

"ఈ జీవితం అంధకారమయమవుతుం దను కున్న సమయంలో నువ్వొక వెలుగు చూపించావు నీ అభిమానంతో నన్ను మనిషిని చేశావు నీ కోసమే నేను జీవించాలనుకునేట్లు చేశావు నీతో గడిపిన క్షణాలే, మధుర స్మృతులుగా మనస్సులో నిలిచి, అతకుపూర్వం మనస్సు నావరించిన నీలి నీడల్ని తొలగించివేశాయి నువ్వు నా దేవతవు" అని చంద్రమౌళి ఇంకా ఏమేమో అనబోతుంటే వాసంతి తనకుర్చీలోంచి లేచి వచ్చి చంద్రమౌళి భుజం మీద చెయ్యివేసి,

"కాదు, డాక్టర్జీ" అంది చిరునవ్వు నవ్వుతూ

"అందుకే తొందరగా ఊ— మందు ఇమ్మంటున్నా!"

"ఏం మందూ ?"

"ప్రేమ—అనే మందు"

"భలేవారే!" అంది వాసంతి నవ్వుతూ చంద్రమౌళి నవ్వాడు

న్యాయానికి తండ్రిపోయిన కొన్ని నెలలదాకానైనా తనవివాహం అవడం మంచిదని తోచినా, తన చికాకుల్లో వాసంతిసహకారం లేందే నిర్వహించలేనని, తండ్రి పోయిన రెండు నెలల తర్వాత వాసంతిని చంద్రమౌళి వివాహంచేసుకోడానికి నిశ్చయించాడు

ముహూర్తమింక రెండురోజు లుంది

చంద్రమౌళి డాక్టరుగా రింటికి వెళ్ళి, "వాసంతీ నా స్నేహితులు జలజా, రామారావూ మెయిల్లో వస్తున్నారు మనం వెళ్ళి రిసీవ్‌చేసుకోవాలి పద" అని వాసంతిని బయల్దేరతీశాడు ఇద్దరూ విజయనగరం స్టేషనుకు బయల్దేరారు

మెయిలులో దిగిన యువతీ యువకుల్ని చూసి వాసంతి నిర్ఘాంతపోయింది జలజా, రామారావు చంద్రమౌళిని ఉత్సాహంతో పలకరించి వాసంతివేపు తిరిగారు

"ఓ! వాసంతీ! జ్ఞాపక మున్నానా?" అంది జలజ

"సురయా !"

"అవును అప్పుడు సురయానే ఈయన్ని పెళ్ళిచేసుకుని బ్రహ్మసమాజంలోచేరి జలజనయ్యాను" అంది నవ్వుతూ, రామారావును చూపించి

"అలాగా! కొత్తపేరు పెట్టుకున్నావన్నమాట!" అంది వాసంతి

చంద్రమౌళి వాళ్ళ సందర్భి కారెక్కించి, రామారావుతో హుషారుగా మాట్లాడుతూ, రామనగరంవైపు కారు పోనిచ్చాడు

కారులో వాసంతీ, జలజ ఎన్నో విషయాలు మాట్లాడుకున్నారు

"మీ దంపతుల ఆదరాభిమానాల్తో ఆయన బాగా ఆరోగ్యవంతులయ్యారు" అంది వాసంతి జలజతో

"ఇందులో విశేషమేముంది వాసంతీ అతని మీద నీకన్నా నా కెక్కువ బాధ్యత ఉంది అది మీ ఇద్దరికీతెలియదు అతను నా సోదరుడు" అందిజలజ

"స్వంతసోదరికన్నా ఎక్కువ సేవచేశావు."

"అతను నా స్వంత సోదరుడే"

వాసంతి అర్థంకానట్లు ఆమెవైపు చూసింది.

"ఈ విషయం నేను వెల్లడించకూడదని ఇంత వరకూ అనుకున్నాను కాని అతను మొన్న మాకు వ్రాసిన ఉత్తరంలో తనకొక చెల్లెలుందనీ, ఆమె కోసం వెతకదల్చుకున్నాననీ వ్రాశాడు అందుకని ఈ విషయం బైటపెట్టదల్చుకున్నాను నా సోదరుడు ఇస్మాయిల్‌కి తెలియకపూర్వమే నాకు ఈ వివరాలన్నీ, మమ్మల్ని పెంచిన ఆమెద్వారా తెలును" అని జలజ అంటూంటే, కారు డ్రైవు చేస్తూ, వీరి మాటల్ని వింటున్న చంద్రమౌళి, గబుక్కున వెనక్కి తిరిగి "ఆఁ నువ్వు నా సోదరివా ?" అన్నాడు

వెనకనుంచి రామారావు స్టీరింగు పట్టుకొనకపోతే కారుకు యాక్సిడెంటయ్యేది

"అవును" అంది జలజ రామారావు కారుకు బ్రేకువేశాడు చంద్రమౌళి ఆశ్చర్యానందాలతో కన్నీరుకారుస్తూ, కారు దిగి, వెనకసీటులోకి వెళ్ళి, జలజచేతులు పట్టుకుని "నీది అమృత హృదయం" అన్నాడు

"అన్నయ్యా! మామీద సానుభూతితో నీ మనస్సునే పాడుచేసుకున్నావు"

"ఫరవాలేదు నా సోదరుణ్ణి పోగొట్టుకున్నా, నిన్నయినా పొందగల్గాను" అని కన్నీరు కార్చాడు.

"రావోయ్! ఆకలేస్తోంది తొందరగా ఇంటికి పోదాం" అని రామారావు హెచ్చరించాక చంద్రమౌళి వచ్చి స్టీరింగు పట్టుకొన్నాడు ★

ఆదర్శాలు-ఆంతర్యాలు

(29వ పేజీ తరువాయి)

తిప్పించుకొనేటోడు" అన్నాడు సత్తిగాడు

"అగో పాండయ్య ఏంటో సెప్తున్నడు గమ్మునుండండహె—లొల్లిసేయక" మరో కార్మికుడు కసురుకున్నాడు

రంగపాండు మైకుదగ్గర నిలబడి గొంతు సవరించుకొని "కార్మిక సోదరులారా, ఈ రోజు మనకు చాలా మంచిరోజు ఎందుకంటే మీ మిల్లు కూలీలంతా ఒక సంఘంగా ఏర్పడడం, దానికి మీతోటి పనివాడైన రాజయ్యను మీరంతా ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకొని ఈ రోజు ఇక్కడ సమావేశం కావడం అని మీ అందరకూ తెలుసు మరి ఒక ముఖ్యవిశేష మేమిటంటే అర్జంటుగా పట్నం పోవలసిన పని ఉన్నప్పటికీ, దానిని మానుకొని ఈ సమావేశానికి అధ్యక్షతవహించడానికి అంగీకరించిన కార్మికనాయకులు, పార్టీ అధ్యక్షులు అయిన శ్రీ శ్రీ చలమయ్యదొరవారికి మిల్లు కార్మికులమీద ఎంత సానుభూతో నేను వేరే వివరించనక్కరలేదు" అని చెప్పుకుపోతున్నాడు

"సూసినావుర సీతాయ్ దొరవారికి అర్జంటుగా పట్నంపోయే పనుండెనంట . అది మానుకొని ఉండిపోయిండ్రంట" అన్నాడొక కార్మికుడు

"గట్ల సెప్పక ఉన్న సంగతి సెప్తారె ఓరన్న" అన్నాడు సీతాయి

సంఘం ఏర్పరచవలసిన అవసరాన్నిగూర్చి, మిల్లు యాజమాన్యం కార్మికులపట్ల చూపుతున్న విధానం గురించి చెప్తూ రంగపాండు "మీ కార్మికులంతా ఐకమత్యంతో ఉన్ననాడు మీ హక్కులను మీరు సాధించుకోగలుగుతారు మిల్లు యజమానులు ఎక్కువ లాభాలు గడిస్తూకూడా మీ జీతాలు పెంచడంలేదు మనఒక్క ఊళ్లో తప్ప తతిమ్మాచోట్ల ఉన్న మిల్లుల్లో పనిచేసే కార్మికులకు బోనసులు ఇస్తున్నారు ఒకవేంప ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి ఇటువంటి పరిస్థితుల్లో జీతాలు పెంచితేగాని మీరు కడుపునిండా తినలేరు" అని ఉపన్యాసమిచ్చాడు

రంగపాండు ఉపన్యాసం కార్మికులను చాలా మందిని ఆకర్షించింది

"ఉన్నది ఉన్నట్టు సెప్పిండురా సత్తిగా .. ధరలు జాస్తి గట్ల మండిపోతాండె, జీతాలు సూస్తె గిట్లుండె" అన్నాడొకడు

"మంచిగనే సెప్పిండుగనీ, ఇటు జీతాలు పెర్గితె అటు ధరలు పెరగకుండుంటాయె" అన్నాడు సత్తిగాడు

"వానోసి యాపారం చేసేటోల్లు ఊరుకుంటారు, జీతాలు పెంచిండ్రు అని యినంగనె ధరలు పెంచేస్తరు ఇంక మనకి జీతాలు పెర్గినయని సంబరమేముందారి" అన్నాడు మరొకడు.

"ఊకె ఒర్లకుండరె .. అగో ... చలమయ్యదొర ఏందో మాటాడుతున్నడు" అని కసిరాడు ఓ కార్మికుడు

"కార్మికసోదరులారా, ఈ స మా వే శా ని కి నన్ను అధ్యక్షులుగా చేసినందుకు మీ అందరికీ నా హృదయపూర్వకమైన కృతజ్ఞతలు తెలుపుతున్నాను మీ ఇబ్బందులు, మిల్లుయజమానులు మీపై చూపుతున్న నిర్లక్ష్యం అన్నీ నేను రంగపాండుగారి ద్వారాను, మీ సంఘం అధ్యక్షుడు రాజయ్య ద్వారాను విన్నాను మీ న్యాయమైన కోరికలను తీర్చడం మిల్లు యజమానుల ధర్మం. వాళ్ళ విధి ఈ విషయమై మీరు ఆందోళన చేయవలసిందే! మీ కోరికలను తెలుపుతూ ఒక ముసాయిదా తయారుచేసి యజమానులకు పంపించాలి. అందుకు వారు ఒప్పుకోకపోతే మీరు ఐకమత్యంగా, అంటే మీరంతా కలసి మెలసి, పోరాడాలి అవసరమైతే సమ్మెచేయాలి మీకు అన్నివిధాలా సహాయంచేసేందుకు నేను, మా పార్టీ ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాం" అని చలమయ్య మాట్లాడుతూంటే 'చలమయ్యదొరకు జై" అంటూ కరతాళ ధ్వనులు చేశారు కార్మికులు

"ఇప్పుడు మన ఊరి హైస్కూలు విద్యార్థి ఒక పాట పాడుతాడు" అన్నారు చలమయ్యగారు.

ఆ విద్యార్థి మైకుముందుకు వచ్చి గొంతు సవరించుకొని పాట ప్రారంభించాడు.

"వినరండోయ్—వినరండోయ్!

ఆదర్శాలు-ఆంతర్యాలు

వినండి వినండి—వినరండోయ్!
కష్టపడి చెమటోడ్చే
కూలికి తిండే కరువా?
కష్టం చేయక కులికేవారు
కుబేరులవుతారా?
ఎక్కడ ఉందీ లోపం?
ఎక్కడ ఉందీ మర్మం?
కార్మికులంతా ఒకటై వుంటే
కోరికలన్నీ తీరునుగా!
వినరండోయ్—వినరండోయ్!
వినండి వినండి—వినరండోయ్!

"భలే—భలే" అని చప్పట్లుకొట్టారంతా!

ఇంతలో పోలాయి ఎక్కడినుంచి వచ్చాడో వేదిక మీదకు వచ్చేప్పటికి "అరె మన పోలాయి పైకి ఎక్కిండు" అని కార్మికులు గుసగుసలాడారు చలమయ్యదొర, రంగపాండు ఒకరిముఖం ఒకరు చూసుకున్నారు రాజయ్య తెల్లముఖంవేసి ఎటూ పాలుపోకుండా చిత్తరయిపోయి చూస్తున్నాడు

"చలమయ్యదొరవారూ, ఇక్కడ వేదికమీద కూర్చున్నవారు, సభలోఉన్న నా అన్నలూ-తమ్ముళ్లూ నన్ను క్షమించాలి నేనుకూడా నా బుద్ధికితోచిందేమో మాట్లాడుదామని ఉంది మీరంతా అనుజ్ఞయిస్తే మాట్లాడుతా వద్దంటే దిగిపోతా" అని ఒక్షణం నిలబడ్డాడు పోలాయి

నీవేం మాట్లాడక్కరలేదు" అన్నాడు చలమయ్య దొర!

"ఇప్పటికే చాలా ఆలస్యమైంది—లాభంలేదు" అన్నాడు రంగపాండు

"పోలయ్యను మాట్లాడ నివ్వండి మాట్లాడ నివ్వండి" అని జనంలోంచి కేకలు

"పోలయ్యను మాట్లాడనిస్తే ఇష్టం వచ్చి నట్లు మాట్లాడుతాడేమో వద్దంటే కూలీలంతా గోలచేస్తారేమో" అని చలమయ్యదొర, రంగపాండు గుసగుసలాడారు పోలాయి వాళ్ళ కంగారు చూసి నవ్వుకున్నాడు

కూలీలలోంచి పోలాయిని మాట్లాడమని అరుపులు

"ఎవరికి ఇష్టంఉన్నా లేకపోయినా, నా అన్నలూ, తమ్ముళ్లూ మాట్లాడమంటున్నారు నన్ను ఇందుకు చలమయ్యదొరవారు నన్ను క్షమించాలనికోరుతున్నాను

"రంగపాండుగారు చెప్పినట్టు ధరలు పెరుగుతున్నమాట, ఇతరచోట్ల మిల్లుకార్మికులకు బోనసలు ఇస్తున్నమాటా నిజమే!" అని ఒక క్షణం ఆగాడు పోలాయి

రంగపాండుముఖం వికసించింది నవ్వుతూ చలమయ్యదొరవంక చూసి చెవిలో "మనమేదో అనుమానం పడ్డాం, పోలాయి మనవైపే మాట్లాడుతున్నాడు" అన్నాడు

పోలయ్య మళ్ళీ ఉపన్యాసం ప్రారంభించాడు

"ధరలు పెరుగుతున్నాయన్నారు ఎందుకు పెరుగుతున్నాయంటే, మనకు చాలినంత పంటలు పండటంలేదంటున్నారు—పెద్దలు నిజానికి ధరలు పెరిగిన పంటలే మనకు ఎక్కువగా పండుతున్నాయి అయితే ఈ పంటంతా ఏమవుతున్నటు? ఎక్కడకు పోతున్నట్టు? ఎక్కడకీ పోవడంలేదు. వ్యాపారస్థులు తమ గోదాముల్లో దాచేసి బజారులో సరుకు కనపడకుండాచేసి ధరలు పెంచుతున్నారు. సరే. ఈ విషయం అట్లా ఉంచుదాం ధరలు పెరుగుతున్నాయి కాబట్టి జీతాలు పెంచాలంటున్నారు మనపోరు పడలేకనో, నిజంగానే దయతలచో మిల్లుయజమానులు ఒక్కొక్కడికి పది రూపాయలు పెంచారనుకుందాం అప్పుడు మటుకు ధరలు ఇంకా పెరగకుండా ఉంటాయని నమ్మకమేమిటి? అప్పుడు ధరలు పెరిగాయికాబట్టి మళ్ళీ జీతాలు పెంచమంటాం, పెంచుతారు మళ్ళీ ధర పెరుగుతుంది అప్పుడేం చేస్తాం? ఇప్పుడున్న జీతాలకీ, ధరలు పెరగడానికీ సంబంధం ఏమీలేదు! కనుక అవుతున్న ఉత్పత్తిని నలుగురికీ సద్వినియోగం అయ్యేట్టు చూడమనీ, ధరలు కంట్రోలుచేయమనీ మ న ం ప్రభుత్వంమీద ఒత్తిడిచేస్తే అది లోకమూ మెచ్చుతుంది—మన ఊరి ఒక్క మిల్లుకార్మికులకేగాక మొత్తం దేశంలోని ప్రజలందరికీ మేలు కలిగించడమూ అవుతుంది" అన్నాడు పోలయ్య

"నదువుకున్నోడి లెక్క ఎంత మంచిగ మాట్లాడుతున్నడు మన పోలాయి" అన్నాడు సీతాయి

"ఆడు మనందరికంటె బలే తెలివైయినవోడులే గింతప్పటి నంది నూస్తున్నగా సిసింద్రీ" అన్నాడొకడు

"నదువుకున్న దొరలయ్యె సెలమయ్యగోరికి యీ యినయం తెల్యకపోయె . రంగపాండూ గంతేనయ్యె ఊకె—జీతాలు పెంచు



పెంచంటే ఎంతదనుక పెంచుతారె ఊరన్న మాఁవ"

"అవు మల్ల రూపాయలు సెట్టుకు కాస్తున్నయెట్ట" అన్నాడు రెండోవాడు

చలమయ్యదొర, రంగపాండు ముఖాలు వెలవెలపోయాయి

పోలయ్య మళ్ళీ ఉపన్యాసం ప్రారంభించాడు

"ప్రతి దసరాపండుగకు పనిచేసేవాళ్ళందరకూ సగంసగం జీతాలు ఈనాముగా ఇస్తున్నారు ఈ సంగతి చలమయ్యదొరవారికికూడా తెలుసనుకుంటాను పూర్తి నెలజీతం ఇవ్వండని కోరడం కొంతవరకు న్యాయంగా ఉంటుందనుకుంటాను అసలు ఇన్ని ఏళ్ళనుంచి మిల్లు నడుస్తున్నది ఎంతోమంది అందులో పనిచేస్తున్నారు ఎప్పుడూ ఏ పేచీలూ రాలేదే! వాళ్ళు అన్యాయం చేస్తున్నారని ఒక్కడూ చెప్పుకోలేదే! ఇంతమంది పనివాళ్ళు ఇక్కడున్నారు తమకు నిజంగా అన్యాయం జరుగుతున్నదని గుండెమీద చెయ్యి వేసికొని ఒక్కరైనా చెప్పగలరా?" అని ఆగాడు పోలయ్య

సభలో అంతా నిశ్శబ్దం ఒక్కడూ నోరెత్తలేదు

"ఇక చాలించు నీ ఉపన్యాసం" అని గర్జించాడు చలమయ్యదొర

"దొరవారు క్షమించాలి ఈ సభలో ఉన్న కార్మికసోదరులు మానెయ్యమంటే మానేస్తాను సోదరులారా! మీరు పశువులుకాదు, ఎటు మళ్ళిస్తే అటు మళ్ళడానికి మీకూ మనస్సులున్నాయి జాగ్రత్తగా ఆలోచించండి నే నింకా మాట్లాడితే దొరవారి ఎత్తులకు భంగంకలుగుతుంది చలమయ్యదొరవారు మీతో అందరికీ తెలుసు మీ మనస్సుకు ఏది మంచిదనితోస్తే అది చెయ్యండి" అంటూ పోలయ్య వేదిక దిగి చరచర జనంలో కలిసిపోయాడు

"కార్మిక సోదరులారా, కూర్చోండి . .
కూర్చోండి అల్లరి చేయకండి . .
పోలాయి ఏదో పిచ్చిపిచ్చిగా మాట్లాడి వెళ్ళిపోయాడు మీకు జీతాలు పెరగడం పోలాయికి ఇష్టం లేదు" అని ఇంకేదో చెప్తున్నాడు రంగపాండు

"సాల్లే కూసోవయ్యా, మాలావు సెప్తున్నావు.. పోలాయి ఎప్పుడూ నిజం సెప్తాడు" అన్నాడొకడు అప్పటికే చాలామంది కార్మికులు వెళ్ళిపోయారు

"ఈ దిక్కుమాలిన పోలాయి పిడుగులావచ్చి ఎంతపని చేశాడు" అనుకుంటూ చలమయ్యదొర లేచి మైకుదగ్గర నిలబడి "కార్మిక సోదరులారా, ఎవడో ఒక పుల్లాయివచ్చి ఏదో వాగాడని మేం భయపడేవాళ్ళంకాము మిమ్మల్ని బాగువరుద్దామనే మా పార్టీ ఉద్దేశం కాని ఇందులో మాకు ఒరిగేదేమీలేదు అనుకున్నప్రకారం కార్మికుల కోరికలను మిల్లుయజమానుల ముందు పెడదాం. వాళ్ళు ఎలా ఒప్పుకోరో చూద్దాం ఒకవేళ ఒప్పుకోకపోతే ఒప్పుకునేదాకా సమ్మె జరిపిద్దాం మీకేం భయంలేదు నేను మీకు అన్నివిధాలా సహాయపడతాను" అన్నాడు

మిగిలినకార్మికులలో సగంమంది డబ్బుపెట్టి కొనుక్కున్న వాళ్ళు వాళ్ళు సరేనన్నేప్పటికి మిగతా వాళ్ళంతా తలలూపారు మళ్ళీ ఒకసారి చలమయ్యగారికి జేజేలు కొట్టారు

సమావేశం ముగిసిందని చెబుతూ రాజయ్య అందరికీ కృతజ్ఞతలు తెలిపాడు

అందరూ ఎవరిదారిన వాళ్ళు బయలుదేరారు

వ్యర్థ కలహం పెంచబోకోయ్ . . .
కత్తి వైరం కాల్చవోయ్!
. .
మతంవేరైతేను ఏమోయ్
మనసులొకటై మనుషులుంటే
"

అని లౌడుస్పీకరులోంచి వినవస్తుంటే చలమయ్యదొర చిరాకుతో "ఇక చాలు రికార్డులు ఆపించెయ్యి . . " అంటూ రంగపాండుతో బయలుదేరాడు

"దొరవారు ఊఁ అనలేదుకాని లేకుంటే ఆ పోలాయిగాడి బొక్కలిరగతన్నేటోడ్ని" అంటూ చంద్రిగాడు కండలుబ్బించాడు

"ఆఁ ఈ ముఖమే—తన్నేది" అన్నాడు రంగపాండు

"ఏడిశావులే వోరు ముయ్యరా చంద్రిగా . . అంత పౌరుషంగలవాడివి ఇందాక ఏం చేశావ్ . నేను చెప్పలేదని ఊరుకున్నాట్ట మొనగాడు" అన్నాడు చలమయ్యదొర

ఇంక చంద్రిగాడు ఏమీ మాట్లాడకుండా వాళ్ళ వెనకాలే నడిచాడు. (సశేషం)

కాలుతుంటారు ఇందుకే కాబోలు.

గుమ్మందగ్గర నవ్వడి అయింది వర్ధని అక్కడ నుంచునివుంది ఆమె "వంట అయింది ఇక లేవండి" అని చెప్పి ఒక్క క్షణం అలాగే నుంచున్నది కాళిదాసు పుస్తకం బల్లమీదవుంచి లేచి నిలబడగానే ఆమె వెనుదిరిగి మెట్లుదిగి క్రిందికి వెళ్ళిపోయింది

కాళిదాసు క్రిందికి దిగివచ్చి లాల్చీవిప్పి, పెరట్లోకి వెళ్ళి కాళ్ళూ చేతులూ మొహమూ కడుక్కుని వచ్చాడు రాధ భోజనం అప్పుడే అయింది కాబోలు, మూతి తుడుచుకుంటూ ముందు గదిలోకి వెళ్ళిపోతున్నాడు

ఆమె వడ్డించి సిద్ధంగా వుంది కాళిదాసు భోజనం చేస్తున్నంతసేపూ ఆమె ఏమీ మాట్లాడకుండా ఎదురుగా ఒక పీటమీద కూర్చునివుంది అప్పుడప్పుడు కాళిదాసు తలయెత్తి చూసినప్పుడల్లా ఏదో అడగబోయి మానేస్తున్నది కాళిదాసు మౌనంగా భోజనం ముగించి లేచాడు ఆమె చేయి తుడుచుకునేందుకు టవల్ అందించింది అతడు ముందుహాల్లోకి వస్తూవుండగా ఆమె వెనకనుంచి "మీరు పైన కూర్చునివుండండి కాఫీ పట్లో వస్తాను" అన్నది కాళిదాసు విని తల వూపాడేగాని అతని ఆలోచనలన్నీ ఎక్కడో వున్నాయి ఆ తర్వాత కూడా అన్యమనస్కంగానే అతడు లాల్చీ తొడుక్కుని మళ్ళీ పైకివెళ్ళి పుస్తకాల గదిలో కుర్చీలో కూర్చుని ఆ పుస్తకాన్ని చేతిలోకి తీసుకున్నాడు

నిరంజనమూ, నిరాకారమూ, నిర్గుణమూ సర్వశక్తి సంపన్నమూ, అయిన ఒక మహాశక్తి యీ సృష్టికి కారణం ప్రాణికోటి అంతటిలోనూ యీ శక్తి కొద్దిపరిమాణంలో వుంది అదే జీవాత్మ

ఆ! ఏమీలేదు కేవలం శరీరంతప్ప మరేమీ నాకు కనిపించటంలేదు గుండె వుంది దానిపని అది చేస్తుంది నాడులున్నాయి వాటి పని అవి చేస్తాయి అలాగే శరీర భాగాలన్నీను అంతేకాని జీవాత్మా లేదు, జీవుడూ లేడు అవన్నీ మోసపు మాటలు" అంటాడొకడు ఒక జ్ఞాని ఆ మూర్ఖుణ్ణి చిత్రంగా ఒప్పిస్తాడు

"ఇది నీ యిల్లు, ఈ యిల్లు నీవు' కాదు అంతేనా?" అని అడుగుతాడు

"ఈ యిల్లు నాది అంతేకాని యిల్లు నేను కాదు" అని సమాధానం చెబుతాడు మూర్ఖుడు తర్వాత సంభాషణ యిలా నడుస్తుంది

"ఈ చెయ్యి నీది అంతేగాని యీ చెయ్యి 'నువ్వు' కాదు"

"ఒప్పుకున్నాను"

"ఈ కాళ్ళు నీవి ఈ కాళ్ళు 'నువ్వు' కాదు

"అంతే"

"ఈ శిరస్సు"

"నాది అది 'నేను'కాదు"

"ఈ శరీరం"

"ఈ శరీరం నాది అది 'నేను' కాదు"

జ్ఞాని యిక్కడ ఆగి నెమ్మదిగా "ఇవన్నీ నీవి వీటిలో ఏదీ 'నువ్వు' కాదు నీవు చెప్పిన హృదయమూ, నాడులూ వున్న ఈ శరీరం కూడా 'నువ్వు'కాదు మరి నువ్వెవరివి?" అని అడుగు

ధ్రువతార

(24-వ పేజీ తరువాయి)

తాడు మూర్ఖుడు నివ్వెరపోయి తనలో తనే "అవును ఇవన్నీ నావి ఇవన్నీకాక నే నెవరిని?" అని తర్కించుకుని జ్ఞానోదయమై జ్ఞానికి నమస్కరిస్తాడు

కాళిదాసు పుస్తకం చదవటం ఆపి తలపైకెత్తి చూశాడు వర్ధని చేతిలో చిన్న వెండిపళ్ళెంలో వక్కపొడి వుంచుకుని లోపలికి వచ్చింది ఆమె ముఖబింబం దీపపుకాంతిలో అసాధారణమైన వెలుగులను చిమ్ముతున్నది ఆమె నల్లని కురులు ఫాల భాగాన కదులుతున్నాయి విశాలములైన కన్నులు కాంతులను చిమ్ముతున్నాయి సృష్టికర్త ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తన కళాతృష్ణనంతటినీ తీర్చుకునేందుకు, కాలవ్యయాన్ని లెక్కచేయక మలచిన బంగారు శిల్పంవలె వున్నదామె

ఆమె ముందుకువచ్చి "మీరు వక్కపొడి వేసుకుంటారా?" అని అడిగింది అతడు లేచాడు ఆమె చేతిలోవున్న పళ్ళెంలోని వక్కపొడిని కొద్దిగా తీసుకుని నోట్లో వేసుకుని, కిటికీ దగ్గరికివెళ్ళి చీకట్లోకి చూశాడు

అతడు మళ్ళీ వెనుదిరిగి చూసేసరికి ఆమె పళ్ళెం బల్లమీదవుంచి నెమ్మదిగా గాలిలో తేలిపోయేదానిలా అడుగులువేస్తూ అతనివైపు నడి



చింది ఒక్క క్షణంలో అతన్ని తగిలేటంత దగ్గరగావచ్చి హఠాత్తుగా ఆగిపోయింది ఆమె కళ్ళలో భయం కనిపించింది ఆమెశరీరంగాలి తాకిడికిచలించిపోయే ఆకువలె ఆపాదమస్తకము కంపించి పోయింది మరుక్షణంలో ఆమె చేతులతో మొహాన్ని కప్పుకుని త్వర త్వరగా పరుగెత్తి క్రిందికి వెళ్ళిపోయింది

కాళిదాసు స్థితి అయోమయంగా ఉంది ఆశ్చర్యంతో ఆమె వెళ్ళినవైపే చూస్తూ కొంతసేపు శిలావిగ్రహంవలె నిలుచుండిపోయాడు తర్వాత నిట్టూర్చి చేతిలోని పుస్తకాన్ని బీరువాలోవుంచి నెమ్మదిగా మెట్లు దిగి క్రిందికి వచ్చాడు క్రింద హాల్లో రాధ చాపమీద పడుకుని నిద్రపోతున్నాడు అంతటా నిశ్శబ్దంగావుంది ప్రక్క గదిలో ఆమె వున్నట్టుంది లోపలినుంచి ఏదో శబ్దం వినవస్తున్నది ఆమె ఏడుస్తున్నదేమో!

కాళిదాసు ఆ గుమ్మంముందు నుంచుని "నేను వెడుతున్నాను" అన్నాడు లోపలినుంచి ఏమీ సమాధానంలేదు అత డలాగే ఒక్క క్షణం నిలబడి తర్వాత మెల్లిగా నడిచి వీధిలోకి వచ్చాడు

ఇంటికి వచ్చేసరికి రూబెనూ, మురళీ, గోవిందూ ఉత్తరంవైపు వరండాలో కూర్చుని చదువుకుంటున్నారు పనిమనిషి పిల్లవాడికి గుడ్డ ఉయ్యాల కడుతున్నది కాళిదాసు లోపలికి వెళ్ళగానే పట్టాభి ఉత్తరంవైపు వంచలోనుంచి ముందుగదిలోకి వచ్చాడు అతడు కాళిదాసును చూసి, "ఏమయ్యా మహాకవీ! అలా వున్నావేమిటి? నేను చాలా మంచి వార్త చెబుదామని వచ్చానే?" అన్నాడు కాళిదాసు లాల్చీ విప్పుతూ "ఏమిటా మంచివార్త?" అని ప్రశ్నించాడు పట్టాభి ఉత్సాహంతో "మా మామగారి దగ్గరినుంచి ఉత్తరం వచ్చిందోయ్. ఆడపిల్ల బారసాలనాటికి నేను వెళ్ళాలి ఈలోపల ఒక మంచి పేరు ఆలోచించి సిద్ధంగావుంచు" అన్నాడు

కాళిదాసు ఒక్కసారి నవ్వి "వెరీగుడ్ అయితే మరో టీపార్టీకి తయారవుతాన్లే" అన్నాడు

పట్టాభి కాస్సేపాగి "ఆడపిల్ల అనగానే మొదట్లో నిరుత్సాహపడ్డానుగాని తర్వాత 'ఎవరయితే నేమిలే' అనుకుని తృప్తిచెందాను" అన్నాడు

కాళిదాసు మరో కుర్చీలో పట్టాభి కెదురుగా కూర్చున్నాడు అతడు మళ్ళీ క్రమంగా పరధ్యానంలో పడిపోయాడు ఒక్క నిముషం నిశ్శబ్దంగా గడిచింది పనిమనిషి పిల్లవాణ్ణి గుడ్డ ఉయ్యాలలో పడుకోబెట్టి నిద్రపుచ్చి, నెరిసిన జుట్టును ముడివేసుకుని తానుకూడా చాపమీద పడుకున్నది

పట్టాభి "ఏమిటోయ్! మళ్ళీ సమాధిలో పడిపోయావే! కాస్త మాట్లాడవయ్యా మహానుభావా! అన్నట్టు క్రొత్త శిష్యుడొకడు ప్రవేశించినట్టున్నాడే" అన్నాడు

కాళిదాసు తలవూపి "ఆ! వాడు క్రొత్తవాడే! రావటమే చాలా ప్రమాదకరంగా వచ్చాడు నామొదటి పాఠం చదువుకునేందుకు వచ్చినవాడే యీ అలమారులోనుంచి యిరవై రూపాయల చిల్లరవున్న హుండీ చంకన బెట్టుకుపోయాడు మళ్ళీ ఆ రాత్రి తిండి తిని వస్తానని వెళ్ళినవాడు అంతులేడు నేనెందుకో అలా చూసి ఆ హుండీ లేకపోవడం గమనించి వెదికితే కనిపిస్తేగా! ఆ తర్వాత అనుమానంమీద వాళ్ళింటికివెళ్ళి అడిగితే అప్పటికి చాలాసేపటిక్రితమే భోజనంచేసి పుస్తకాలతో 'యిక్కడికి'ని చెప్పి వెళ్ళిపోయాడని తెలిసింది వాడి తండ్రి అసలే చాలీచాలని జీతంరాళ్ళతో కష్టపడుతూ వీణ్ణేదో నాలుగు ముక్కలు చెప్పించి ప్రయోజకుణ్ణి చేద్దామని అనుకుంటున్నాడు. నేనంతా చెప్పగా విని ఆయన కోపంతో మండిపడ్డాడు అప్పుడే వాణ్ణి వెదుక్కుంటూ వూరిమీదికి బయలుదేరాము వాడి స్నేహితులెవరియిళ్ళలోనూ లేకపోయేసరికి నేను బహుశా యీ ప్రబుద్ధుడు 'స్కిల్ గేమ్స్' ఆడేందుకు వెళ్ళి వుంటాడని అనుమానించాను అక్కడికి వెళ్ళిచూస్తే నా అనుమానం నిజమైంది అక్కడ నుంచుని బ్రహ్మాండంగా పందెం పెట్టేస్తున్నాడు. తర్వాత అక్కడి నుంచి లాక్కువచ్చి కాస్త బుద్ధి చెప్పాను అప్పటినుంచీ యింట్లోనూ, యిక్కడా, బళ్ళోనూ కూడా బుద్ధిగానే వున్నట్టు కనిపిస్తున్నాడు" అని చెప్పాడు.

పట్టాభి నవ్వి "అబ్బో! చాలా గ్రంథం నడిపాడే! ఈ బుద్ధిగా వుండటం ఏమిటో! కుక్కతోకదాలిగుంటా సామెత కాదుకదా?" అని కాస్సేపాగి "అయినా నిన్నుచూస్తే చాలా విచిత్రంగా వుంటుందోయ్ నీది చాలా "యీవెన్ట్‌ఫుల్ లైఫ్" ఎప్పుడూ ఏదో ఒక విశేషం జరుగుతూనే వుంటుంది" అన్నాడు

కాళిదాసు ఏమీ మాట్లాడలేదు పట్టాభి తర్వాత ఒక పావు గంటసేపు కూర్చుని "పొద్దుపోయింది.

ధృవతార

నేనింటికి వెడతాను" అని చెప్పి వెళ్ళిపోయాడు. పనిమనిషి నిద్రపోయింది చల్లని గాలి మెల్లగా కిటికీలోనుంచి వీస్తున్నది పరీక్షలు మరీ దగ్గరకు రావడంవల్ల రూబెనూ, మురళీ శ్రద్ధగా చదువుకుంటున్నారు గోవిందు అప్పటిదాకా చదువుకుని నిద్ర ముంచుకుని రాగా అలాగే చాపమీద పడుకుని నిద్రపోయాడు

కాళిదాసు ఆలోచిస్తున్నాడు అతని మనస్సులోంచి ఇందాకటి సన్నివేశం ఎంతగా ప్రయత్నించినా తొలిగిపోవటంలేదు మరిచిపోదామన్నా లేపోతే మరొకవిషయాన్నిగురించి ఆలోచిద్దామన్నా అతనికి సాధ్యం కావటంలేదు నిద్ర కూడా అతనిమీద పగ సాధిస్తున్నట్టున్నది కళ్ళు మూతలు పడటంలేదు

అతడు ఒక్కసారి పక్కకుతిరిగి గుమ్మంపైగా వున్న భార్య ఫోటోవంక చూశాడు ఆమె నవ్వుతున్నది ఆమె కనుబొమలు విల్లులవలె వంపు తేరివున్నాయి ఆమె నాసిక పొడవుగా కొనదేరి వుంది ఆమె అందంలో సగభాగం ఆ కన్నులలోనే వుంది ఆ కన్నులు పెద్ద పెద్ద చేపలవలె తళతళలాడుతున్నాయి

కాళిదాసుకు ఒకనాటి సంధ్యవేళ జరిగిన వృత్తాంతం జ్ఞప్తికి వచ్చింది ఆనాడతడు సాయంకాలం ఆరు గంటలు దాటిన తర్వాత యింటికి వచ్చాడు అప్పటికి మసక మసకగా చీకటి వ్యాపిస్తున్నది వేడిగాడ్పు అప్పటిదాకా తన శక్తినంతా ఉపయోగించి వీచి, అప్పుడే కొద్దిగా చల్లబడి తెరలు తెరలుగా వీస్తున్నది అతని తల్లి యింట్లోలేదు ముందు గదిలో చాపమీద అతని భార్య కూర్చుని వున్నది ఆమె తల వంచుకుని ఏదో ఉత్తరం చదువుతున్నది ఆమె పుట్టింటినుంచి ఎప్పుడో తప్ప తరుచుగా ఉత్తరాలురావు ఉత్తరం వచ్చిననాడు ఆమెకు పండుగ ఆమె నెమ్మదిగా ఒక్కొక్క అక్షరాన్నే కూడబలుక్కుంటూ చదివేది ఒక ఉత్తరం చదివేందుకు దాదాపు కొన్ని గంటల వ్యవధి కావలసివుండేది ఒక్కొక్కప్పుడు భర్త చదివి వినిపించిన తర్వాత కూడా ఆమె శ్రమపడి ఒక్కొక్క పదమే అర్థం చేసుకుంటూ జాబు చదువుకునేది ఒక్కొక్క వాక్యం చదవగానే ఆమె కళ్ళు నీళ్ళతో నిండేవి ఆనాడు యింటికి రాగానే కాళిదాసు తలవంచుకుని ఉత్తరం చదువుకుంటున్న ఆమె విశాల నయనాలను తన చేతులతో మూశాడు ఆమె ఉలిక్కిపడిందేగాని తన చేతులతో అతని చేతులను తప్పించే ప్రయత్నం చెయ్యలేదు ఇలా అప్పుడప్పుడు జరుగుతూనే వుంటుంది ఎవరయిందీ ఆమె చెప్పగలిగితేతప్ప అతడు తన చేతులను తప్పించడు కాని యీనాడు కళ్ళుమూసి అతడు చకితుడై చేతులు వెనక్కి తీసుకున్నాడు ఆమె కళ్ళనిండా నీళ్ళున్నాయి కాబోలు అతని చేతులకు తడి అయింది అతడు ఆదుర్దాగా "ఏమిటే కాముా! ఎందుకేడుస్తున్నావు ఏమున్నదాజాబులో" అంటూ ఆ ఉత్తరం తీసుకుని చూశాడు అందులో ఎక్కడా ఆదుర్దా పడవలసిన సంగతులేవీ లేవు ఆమె తమ్ముడు — పదేళ్ళవాడు 'కరివేపాకు చెట్టుమీదనుంచి పడ్డాడ'నీ, మొదట్లో 'కాలో చెయ్యో విరిగిందని ఆదుర్దాపడి'నప్పటికీ 'తర్వాత అంత ప్రమాదమేమీ లేదని తేలిందనీ' 'కాలు మాత్రం నొప్పి పట్టిం'దనీ, దానికి ఏదో తైలంవేసి తోమించుతున్నామనీ ఆమె తండ్రి వ్రాశాడు కాళిదాసు ఆ జాబు చదివి ఆమె భుజాలు పట్టుకుని 'ఛీ! కళ్ళు తుడుచుకో అందులో యింతగా కన్నీళ్ళు పెట్టుకోవలసిన విశేషాలేమున్నాయి? పిచ్చిదానా! నన్ననవసరంగా గాభరా పెట్టావు" అన్నాడు ఆమె కళ్ళు తుడుచుకోలేదు చేతులు వెనక్కి పెట్టుకునివుంది ఆమె కాళిదాసు మాటలువిని కళ్ళనీళ్ళతోనే ఫక్కున నవ్వి "నా కళ్ళు మీరే తుడవండి" అన్నది కాళిదాసుకు అర్థంగాక "ఇవ్వాళ నీకేమైనా పిచ్చి పుట్టిందా ఏమిటే? నీ చేతులకేం వచ్చిందీ?" అని అడిగాడు ఆమె చేతులలాగేవుంచి "ఏదో వచ్చింది ముందు మీరు కళ్ళు తుడవండి" అన్నది అతడు జేబు రుమాలుతో ఆమె కళ్ళను తుడిచాడు

"ఆ! యిప్పుడు చెప్పు ఏం వచ్చింది నీ చేతులకు?" అని అడిగాడు

ఆమె నవ్వుతూనే చేతులను ముందుకుచాపి చూపించింది కాళిదాసు ఆశ్చర్యపోయి తర్వాత "అదా సంగతి? ఇంతసేపూ ఎంత గాభరా పెట్టావు?" అన్నాడు చిరుకోపంతో ఆమెలేచి "కోపం వచ్చింది స్వామివారికి? అయితే చేతులు కడుక్కుని వస్తాను ఇక్కడి ఆకు మావూళ్ళో ఆకు కంటె మంచిది ఎంత ఎర్రగా పండిందో" అంటూ



లోపలికివెళ్ళి మరో నిముషంలో చేతులు కడుక్కుని వచ్చింది పలుచని పండు తమలపాకుల వంటి ఆ చేతులలో, ఎర్రగా పగడం రంగులో గోరింటాకు పండివుంది కాళిదాసు ముగ్ధుడైపోయాడు

అతనికి నెమ్మదిగా నిద్రపట్టబోతున్నది అయినా ఆలోచనలు మాత్రం తెగటంలేదు ఈ వర్ధని చాలా వింత మనిషి అందంగానే వుంటుంది కాని తన భార్యలోవున్న విశిష్టత ఆమెలో లేదు హృదయాన్ని ఉద్రేకభరితంచేసి కల్లోలపరిచే అందం ఆమెది. తన భార్య మెత్తని పువ్వువంటిది అది మనస్సుకు మలయానిలంవలె, గంధపుపూతవలె, శరదృతువులో మల్లెల వాసనవలె, హాయినిస్తుంది వర్ధని యీ వేళ చాలా చిత్రంగా ప్రవర్తించింది ఆమె కళ్ళలో కాముకత్వంలేదు గాని ఏదో వింత మత్తు కనిపించింది

కాళిదాసు నెమ్మది నెమ్మదిగా నిద్రాదేవత వడిలోకి వరిగిపోయాడు, చల్లని గాలి తెరచివున్న కిటికీలోనుంచి వీస్తుండటంవల్ల, శరీరానికి హాయిగా వుంది అంతా నిశ్శబ్దంగావుంది అవతలి పంచలో పిల్లలు కూడా నిద్రపోయినట్టున్నారు బల్లమీది గడియారం మటుకు 'టిక్కు టిక్కు'మంటూ తన కర్తవ్యం తాను నెరవేర్చుకుపోతున్నది

కాకులు 'కావు కావుమని' గోల చేస్తూ గుంపులు గుంపులుగా ఎగిరిపోతూ వుండగా అతనికి మెలకువ వచ్చింది రాత్రిఅంతా అతనికి నిద్ర సరిగా పట్టలేదు. అలా అని మెళకువగానూ లేదు. ఒకదాని తర్వాత ఒకటిగా ఏవో అర్థంలేని కలలు ఒక కలలో తనే అద్దంలో తన ప్రతిబింబం చూసుకుని ఏడ్చాడు మరోకల మున్నటి కొండమీదినుంచి పట్టుతప్పి కెవ్వున కేక వేస్తూ జారిపోతున్నట్టు వచ్చింది ఇలా ఒకదానివెంట ఒకటిగా కలలువచ్చి నిద్రను పాడుచేశాయి

అతడు ఆవులించి లేచాడు గుడ్డ ఉయ్యాలలో పసివాడు ఆడుకుంటున్నాడు కాళిదాసులేచి వెళ్ళి చూచాడు పసివాడు కాళ్ళూ చేతులూ ఆడిస్తూ బోసినోటితో నవ్వుతున్నాడు మునుపటికంటె కాస్త బొద్దుగా ఆరోగ్యంగా వున్నాడు కాళిదాసు కన్నార్పకుండా వాడివంకనే ఒక్క నిముషం సేపు చూశాడు తా నిన్నాళ్ళూ చూడనేలేదు వాడి మెడమీద ఒక పుట్టుమచ్చవుంది పట్టాభి ఒకనాడు తనను "నీకు దొరికిన ఆ చిరంజీవి ఎక్కడోయ్?" అని అడగటం జ్ఞాపకం వచ్చింది "అవును వీడు చిరంజీవి" అనుకున్నాడతడు

పనిమనిషి లోపలికి వచ్చింది ఆమె కాళిదాసుతో "అయ్యగారూ! మీ కెన్నిసార్లు చెప్పినా ఉయ్యాల తేవటం వాయిదా వేస్తున్నారు" అన్నది కాళిదాసు "యీనెల జీతంరాగానే మొదటి ఖర్చు అదేలే కాస్త యీ రెండు రోజులూ ఓపిక పట్టు" అన్నాడు ఆమె నవ్వి మరో పనిమీద పంచలోకి వెళ్ళిపోయింది

కాళిదాసు తర్వాత తన పనులన్నీ పూర్తి చేసుకుని యింటికి తాళంవేసి స్కూలుకు బయలుదేరాడు ఉదయంనుంచి ఏదో కలవరపాటు అజ్ఞాతంగా అతన్ని బాధపెడుతున్నది

అతడు నడుస్తున్నవాడల్లా హఠాత్తుగా ఆగిపోయాడు దుమ్ముకొట్టుకున్న బట్టలతో, వాడిన మొహంతో ఏడుస్తూ అతని కెదురుగా వస్తున్నాడు రాధ వాడు కాళిదాసును చూసి యింకా పెద్దగా ఏడవటం ప్రారంభించాడు కాళిదాసుకేమీ అర్థం కాలేదు "ఎందుకేడుస్తున్నావ"ని అడిగితే, వాడు బదులు పలకనేలేదు కళ్ళ నీళ్ళు చారికలుకట్టి కందిన బుగ్గలమీదుగా ప్రవహిస్తున్నాయి

ఈలోపల యిద్దరూ నిరంజనశర్మగారియింటి ముందుకు వచ్చారు కాళిదాసు నివ్వెరపోయాడు ఇంటివాకిట ఆవరణలో చాలామంది జనం నిలబడి వున్నారు అందరూ భయభ్రాంతులై వున్నారు కాళిదాసు త్వరత్వరగా లోపలికివెళ్ళి "ఏమిటి? ఏం జరిగింది?" అని ఒకణ్ణి ప్రశ్నించాడు ఆవ్యక్తి నోట మాటరాక 'లోపలికివెళ్ళి చూడమ'ని సైగ చేశాడు కాళిదాసు పెద్ద పెద్ద అంగలు వేస్తూ లోపలి గదిలోకి వెళ్ళి చూశాడు

అతని నెత్తిన పిడుగు పడ్డట్టయింది కళ్ళు తిరిగి, వళ్ళు తూలి, క్రిందపడబోయి, గోడ నాధారంగా చేసుకుని నిలబడి తమాయించుకున్నాడు. అతని మొహం భయంతో పాలిపోయింది

గదిలో వర్ధని శవం భయంకరంగా పడివుంది. ఆమె గుడ్డలనిండా కిరసనాయిల పోసుకుని నిప్పంటించుకుని మరణించింది ఆమె శరీరం కాలి కమురుకంపు కొడుతూ నేలమీద వికృతంగా పడివుంది

కాళిదాసు పాలిపోయిన మొహంతో పిచ్చి చూపులతో, తడబడుతున్న అడుగులతో బయటకు వచ్చాడు. (సశేషం)

చుట్టుప్రక్కల ఎక్కడా ఏ విధమైన మంట వేయగూడదు; ఏ దీపము పెట్టగూడదు" అన్నాడు అక్బర్.

ఆ వ్యక్తి అందుకు ఒప్పుకొన్నాడు. అతడు చాలపేదవాడవటం వల్ల డబ్బుకోసం చచ్చిపోయినా ఫర్వాలేదనుకొన్నాడు

సరస్సు చుట్టు సైనికులను కాపలాపెట్టారు.

ఆ మనిషి రాత్రంతా అదేవిధముగా ఆ సరస్సులోనే ఉన్నాడు. ఉదయముననే కావలాదారులతో కలసి మహారాజుగారి వద్దకు వెళ్ళాడు. అతడు ఇంకా బ్రతికియుండుటచూచి "అక్బరు" చాల ఆశ్చర్యపడ్డాడు.

"ఈ రాత్రంతా నువ్వు ఆ సరస్సులో ఏవిధంగా ఉన్నావు?" అన్నాడు అక్బరు

"నేను సరస్సులోనుండి అసలు బయటకు రానేలేదు ప్రభూ! కావలిస్తే మీ సేవకులను అడగండి" అన్నాడా వ్యక్తి.

సేవకులు అతను చెప్పినది నిజమని ఒప్పుకొన్నారు. అక్బరు అదెలా సాధ్య"మని అడిగాడు?

"ప్రభూ! మీ కోటయొక్క ఏడవ అంతస్థు పైభాగమున నేను ఒక దీపము వెలుగుచూ యుండుట చూచాను అప్పుడు నేను నాదృష్టినంతా దానిమీదనే కేంద్రీకరించి ఈ రాత్రంతా ఆసరస్సులోనే గడిపివేశాను" అన్నాడా మనిషి.

ఒక ఆస్థాన ఉద్యోగి, "ప్రభూ! ఇతడు తనకిచ్చినషరతులను పాటించలేదు. ఏడవ అంతస్థుపైనున్న దీపముతో ఇతడు చలికాచుకున్నాడు." అన్నాడు.

నువ్వు చెప్పింది నిజమని అక్బరు ఆ పేదవానితో నువ్వు షరతులను పాటించలేదుగనుక నీకు చిల్లిగవ్వ ఇవ్వను పొమ్మన్నాడు.

ఆ పేదవాడు ఏమీ చేయలేక

బీర్బల్ వంట


(31-వ పేజీ తరువాయి)

కంటినీటితో తిరిగి వెళ్ళిపోయాడు. బీర్బల్ ఆతనికి కనిపించి జరిగిన విషయమంతా తెలుసుకొని తాను అతనికి సహాయము చేస్తానని చెప్పి పంపివేశాడు.

తరువాతదిన ముదయమున అక్బర్ సభజేసెను. బీర్బల్ తప్ప ఆస్థాన ఉద్యోగులంతా ఆసభకు హాజరయ్యేరు. అతనిగురించి అక్బరు వారిని అడగ్గా వారు ఒకరి చెవులో ఒకరు ఏమిటో చెప్పకోవటం ప్రారంభించారు.

"ఏమిటది? బీర్బల్ ఎక్కడ?" అని అక్బరు మరల ప్రశ్నించాడు.

అందులో ఒక ఉద్యోగి లేచి నిలబడి, "ప్రభూ! బీర్బల్ సరస్సు ఒడ్డున ఉన్నాడు. అక్కడ అత



నేమిటో వింతపనులు చేస్తున్నాడు." అన్నాడు.

"ఆతనికి పిచ్చి ఏమీ ఎక్కలేదు గదా?" అన్నాడు అక్బర్.

"ఏమో సరిగ్గా చెప్పలేం ప్రభూ! బీర్బల్ మూడు పెద్దగెడలను కలిపి కట్టి, నిలబెట్టి వాటిపై ఒక కుండలో బియ్యం పోసినాడు. గెడల క్రింది భాగమున చిన్న మంట పెట్టినాడు." అన్నాడా ఉద్యోగి.

"బీర్బల్ ఎప్పుడూ ఆలోచించుటవలన ఆతనికి పిచ్చి ఎక్కిందేమో." అన్నాడు మరొక ఉద్యోగి.

బీర్బల్ ఏమి చేస్తున్నాడో చూద్దామని అక్బరు ఆ ఉద్యోగస్థులతో సహా సరస్సువద్దకు వెళ్ళాడు. బీర్బల్ ఆ సరస్సువద్ద ఉండి ఆ ఉద్యోగి చెప్పినట్టే చేస్తున్నాడు. వంటపాత్రకు నిప్పు చాలదూరములో ఉంది.

"నువ్వు ఇక్కడ ఏం చేస్తున్నావు?" అని అక్బర్ బీర్బల్ నడిగాడు.

"ప్రభూ! నేను అన్నం వండుతున్నాను" అని సమాధానం చెప్పాడు బీర్బల్.

"నిజంగా నీకు పిచ్చి ఎక్కే ఉంటుంది. అన్నం ఇలాగేనే వండటం?"

"ఏం ప్రభూ? కఱ్ఱల పైభాగమున కుండ బెట్టాను. అందులో నిండా నీళ్ళు ఉన్నాయి. బియ్యంకూడా ఉన్నాయి. అడుగున నిప్పుంది. అన్నం ఇలా ఎందుకు వండకూడదు?" అన్నాడు బీర్బల్ ఏమీ తెలియనట్టు.

"ఆ వంటపాత్ర నిప్పుకు చాల దూరాన ఉంది. దానికి వేడి తగలదు." అన్నాడు అక్బరు.

"క్రితం రాత్రి మీ కోటయొక్క ఏడవఅంతస్థుమీదున్న దీపం చాలదూరంగా సరస్సులో ఉన్న ఒకపేదవానికి వెచ్చదనం ఈయలేదా? కోటమీదున్న దీపంకంటె ఈ నిప్పు కుండకు చాల దగ్గరలోనే యున్నది. అందుచేత అన్నం తప్పకుండా ఉడికితీరుతుంది." అన్నాడు బీర్బల్ యుక్తిగా.

బీర్బల్ ఏమి చెప్పటానికి ప్రయత్నించాడో అక్బరు గ్రహించాడు.

"సరే లోనికి వచ్చేయి." అనడిగాడు అక్బర్.

"నీ వంట పూర్తయింది. వాటన్నిటిని తీసుకొని నీవు లోపలకురా. నిన్నరాత్రంతా సరస్సులో కాలం గడిపిన ఆ పేదవానిని ఇక్కడకు తీసుకురా. అతడు నీతోబాటు భాగం పంచుకొంటాడు" అన్నాడు అక్బరు నవ్వుతూ.

అక్బరు ఆ పేదవానికి చాల డబ్బు ఇచ్చి పంపివేశాడు. బీర్బల్ ను కూడా తగినరీతిని సత్కరించాడు.

★

ఇది ఏ రోజు కథ

(17-వ పేజీ తరువాయి)

భరితం అతని ఆలోచనే, ఒకవేళ ఎందుకు కాగూడదు కొత్తవారితో పరిచయం పెట్టుకోవడం ఇంతకూ తనపని కాదుగా ?

రైలు బ్రహ్మరాక్షసిలా పొలికేక వేసుకొంటూ వస్తూన్నది—కొన్ని క్షణాల్లో రైలు స్టేషన్‌లో ఆగబోతోంది

మరలా భారంతో సతమతమౌతూ పెట్టె సంచీ నేలపైన పెట్టింది అరవింద నలిగిన అరచేతులు బాగా ఎరుపెక్కినవి చేతులను చూచుకొంటూ స్టేషనుకళ్లే చూస్తూ నిట్టూరుస్తూ మరలా పెట్టె, బేగ్ ఎత్తుకుండే ప్రయత్నంలో ఉండడం అతడీసారి చూడలేకపోయాడు అటువైపు ట్రెయిన్ టయి మవుతోంది ఈసారి అరవింద అనుజ్ఞకు ఎదురుచూడలేదీ పురుష పుంగవుడు అమాంతం ఆ పెట్టె తీసుకొని "బేగ్ మాత్రం మీరు తీసుకొని వడిగా నడవండి లేకుంటే ట్రెయి నందదు మరి మీ ప్రయాణం ఎక్కడి వరకు ?" ప్రశ్నించాడు అతడు—"తిరుపతికి, సాయంత్రం ఈపాటికే కాలేజీ హాస్టలు చేరుకోవలసిన నాకు బస్సు తప్పడంవల్ల ట్రెయినులో వెళ్లవలసి వచ్చింది" అన్నది అరవింద 'నేను తిరుపతికే వస్తున్నాను' అంటూ వడివడిగా ముందుగా వెళ్లి స్టేషన్ చేరాడతడు అరవింద ప్లాటుఫారంపై అడుగుపెట్టేటప్పటికే స్టేషన్‌లో ఆగిన ట్రెయిను కదలబారుతోంది ఆ సమయానికే రెండు టికట్లతో సమీపించాడు అతడు "ఎక్కండి ట్రెయిను మూవ్ అవుతోంది" అన్నాడు

ఇరువురూ ఎక్కారు ఆ కంపార్ట్‌మెంటులో ఇంకెవరూ లేరు ట్రెయిను కదిలింది కిటికీలలోనుండి గాలి రివ్వు రివ్వున లోనికి వీవసాగింది రివ్వురివ్వున తిరిగిపోతూ కాలచక్రంలా కదలిపోతూన్న వంకా నాపి సుఖోపవిష్టు డయ్యాడు ఆ పురుష పుంగవుడు లైట్ల వెలుతురులో ఈసారి బాగా అగుపిస్తున్నాడు ఆ నూతనుడు.

పాతికేండ్ల వయసు వంకరటింకర్లుగా ఉంది క్రాపు, వల్లటి సిల్కు జుబ్బా పంచకట్టు

తాను ఓ నెరజవ్వని—అల కాలేజీలో చదివే నవనాగరికతాగంధ సంధాయిని—

ఇంకేమన్నా ఉందా ? ఇరువురే యీ పెట్టెలో కూర్చున్నాం—ఏమిటేమిటో ఆలోచనల తాలూకు విషవలయాల్లో ఆమె మనస్సు ఊగిసలాడుతోంది

"ఇందండి టిక్కెట్టు ఖరీదు" అన్నది అరవింద "పనిలేదులెండి" అంటున్నాడు ఆ క్రొత్తవాడు 'ఫరవాలేదు తీసుకోండి' అని ఇచ్చింది తీసుకొన్నాడు

మౌన సముద్రం ఇరువురుని ఆవరించుకొనింది తలపుల మెలపుల్లో మెదిలిన భావాలు—వెండితెర ముందు తిరిగిపోయే ఫిల్ములా ఏవేవో దృశ్యాలు మెదలినై అరవింద బుర్రలో

కాలేజి ప్రాంగణంలోనుండి ఏ సినిమాకో షికారుకో వెళ్లాలన్నా చంద్రబింబాన్ని కబళించే రాహు కేతువుల్లా వెనువెంటపడి మంచీ చెడ్డ అనేది అణువంతైనా ఆలోచించక ! పిల్లి కూతలు వెకిలి చేష్టలు చేస్తూ అన్యాపదేశంగా కాలేజీ అమ్మాయిల నుద్దేశించి తమ మిత్రులతో సంభాషిస్తూండడం నేటి కాలేజికుర్రాళ్లకు ఓ తృప్తి కాబోలు అసలు మగవారంతా యింతే పిల్లికి చెలగాటం, ఎలుకకు ప్రాణసంకటం అన్నట్టు అనిపించేది ఆ కాలేజి విద్యార్థులు తమ వెంటబడినపుడు

నాగరికత సంస్కారంతోపాటు ఉన్నత విద్యాభ్యాసానికి యిదేనా ఫలితం ! నూటికి తొంభై తొమ్మిది మగరాయళ్లలో—స్త్రీలంటే బానిసల్లాగా జీవంలేని పరిచారికల్లాగా తమ సౌఖ్యంకోసం ఉపయోగించుకొన జూస్తుంది పురుషజాతి

అమాయకులైన అమ్మాయిలు యిక వారి వల్లో పడ్డారా ! యింక సాలె గూటిలో తగులుకొన్న ఈగల చందమే—యిహపరాలకు దూరులై పోతూంటారు పతితలై పలవించవలసి వస్తూంటుంది—చల్లగా మెల్లగా జారుకుంటారు ఆ మగరాయళ్ళ

జీవితంలో ఒడిదుడుకులనే సంద్రంలో సుడిగుండాలై జీవన నౌకను ముంచివేయడ మనేది—యీనాటి కాలేజీ కుర్రాళ్లల్లో ఒక కార్యక్రమం!

ప్రశాంతంగా కూర్చున్న అతని మోములోని ప్రసాదగుణం—మౌనతలోని నమ్రత చూచి—సోనీ అందరు పురుషులు అలాంటివారే అవుతారని ఎందు కనుకోవాలి ? ఉన్న ఒక్క శాతంలోనికి యీ వ్యక్తి చేరతాడేమో !

ఏమో ? నిస్వార్థంగా తన పెట్టెనెందు కెత్తుకోనుంటాడు తను అబల అసహాయబాధ పడతా వుంటే చూచి ఓర్వలేని సుతిమెత్తని మనసు—అందుకు కారణమైనా అయి ఉండవచ్చు !

కాని—అంతరంగంలో ఏదో వ్యాజం పెట్టుకొని పైకి సహాయం చేస్తూ అవకాశాన్ని వినియోగించుకొనే—శకునులు— దుశ్శాసనులు—యెందరుండరీ యిలాతలంలో

ఈమాటు ఆమె ఆలోచనలలో నుండి తేరుకొంటూ—కిటికీలోనుండి చూస్తోంది రైలు వేగంగా—వెళుతోంది

కారుమేఘాలు విలయతాండవం త్రొక్కుతూ—గగనవీధిలో—గుములు గుములుగా బయలుదేరి అన్ని గుములు ఒక్కటి కాగా కనుచూపుమేర దూరమూ ఆకాశమంతా మేఘావృతమై గాఢాంధకారమైపోయింది నక్షత్రాల పొలకువైనా అగుపించడం లేదు కిటికీలోనుండి చూస్తూంటే కంటికి యేదీ గోచరించకుండా ఒక్కటే ప్రగాఢమైన గాఢాంధకారం ! వర్షం జోరుగా వర్షించసాగింది రైల్లో మాత్రం—దీపాల వెలుగు బయట ఏకధారగా వర్షం ! చీకటిని చీల్చుకొని—జియ్ జియ్‌మని వెడుతోంది రైలు

ఎంత భయంకరమైన కాళరాత్రి—ఈ రాత్రిలో—యీ పురుష పుంగవుని ముందు తను మరీ

ఇల చేస్తేనా అన్యాదారానికి పూనుకుంటే... మరి గతేమిటి తన హృదయంలోను గాఢాంధకారం అలుముకొన్నది అతడు నిర్వికారంగానే ఏదో ఆంధ్ర వారపత్రిక కాబోలు చదువుతూన్నట్టుంది —ఏమో అతని అంతరంగం అట్టడుగుటి తలపుల అలలు తనకేం తెలుసు తను సహాయం చేయడంలో ఏదో వ్యాజం — నిబిడీకృతమై ఉంటే యిటడిపాటికి ఈ పూటకు — పూరుకోడు—తను యిప్పుడు బండీ ఆపద్బాంధవా ! అనుకొన్నది—

బస్సులో పయనించి సాయంత్రం అయిదున్నరకే హాస్టలు చేరుకోవలసిన తను ఈ గాఢాంధకారంలో—ఈ నీరవ నిశ్శబ్ద కాళరాత్రిలో యీ అపరిచితునితో ప్రయాణం చేయాల్సి వచ్చింది

ట్రెయిను దిగి—తిరుపతిలో తానెట్ను హాస్టలు చేరుకొంటుంది అప్పటికి దాదాపు పదకొండు గంటలు అవుతోంది ఒంటరిగా నడచి వెళ్ల డానికి వీలుపడదు రిక్షా, జట్కా వగైరాలు పెట్టుకుంటే అమ్మో రాత్రి పదకొండు గంటలప్పుడు ఒంటరిగా రిక్షాలోగాని, జట్కాలో గాని ఊరికి అవతల ఉండే హాస్టలు చేరుకోవడమే

మారుమూలలకు రిక్షాలు, జట్కాలు తోలి దారులు తప్పించి సర్వస్వం దోచుకొని వదలి పెడతారటగా ఈ రిక్షావాలాలు, జట్కావాలాలూ ! తనకీ సంగతి ఎన్నోమార్లు మనోరమ చెప్పింది

కిటికీలోనుండి చూస్తోంది అరవింద చూస్తూండగానే యిట్టే వర్షం కురియడం ఆగింది మరికొంతసేపట్లో గాఢాంధకారాన్ని సృష్టించిన మేఘాలు పటాపంచలైపోయినవి పండు వెన్నెలలో ప్రకృతి మిలమిలా తళతళా మెరిసి పోతోంది

అరవింద హృదయాకాశంలోని సందేహాంతలు సమూలంగా ఛేదింపబడినట్లు, గాఢాంధకారం అంతరించి — జాబిల్లి ఆగపించింది నక్షత్రాలమధ్య చంద్రుడు ఎంతో మనోహరంగా ఉన్నాడు. అమృతాంశుని కిరణాలు సోకినంత యింకా హృదయానికి భారం .. ఎలా ఉంటుంది అరవింద హృదయం తేలికపడింది . ఏమో ... ఎంతోమంది మంచివారి ప్రపంచంలో ఎందు కుందరు అలాటివారి కోసకు చెందినా ఓ పురుషపుంగవుడు లేకుంటే తనవని యీపాటికి యేంగాను తననుకున్నట్టు వ్యాజపూరితంగా పాయుంచేసిన ఆగంతకుడు కాడీతడు

అతనివైపు చూస్తూ 'మీకు కృతజ్ఞురాలిని .. మీరు పెట్టె తీసుకుని ఉండకపోతే నేను రైలు అందుకోలేకపోయేదాన్ని పైగా టిక్కట్టు కూడా తొందరగా కొనితెచ్చారు ఐదింటికి కాలేజీ హాస్టలు చేరుకోవలసిన నేను యీలా రైల్లో పయనించి హాస్టలు చేరుకునేందికి ఏ పదకొండు గంటలో అయ్యేట్టుంది ' నిట్టూర్చింది ఒక్క దరహాసం అతని మోములోనుండి భాసించింది

'ఆ పత్రిక కొంచం యిలా యివ్వండి' అని అడిగి తీసుకొన్నది అరవింద ముఖచిత్రం మొదలు చివరి అట్టదాకా పేజీలు తిరగవేస్తూ ఉన్నది పిండివంటల శీర్షిక చదువుతోంది మైసూరుపాకు ఎలా చేసేది అందులో వివరంగా వ్రాయబడి ఉంది తన తల్లికి 'స్వీట్సంటే' బలే యిష్టం ఆమెకుమాత్రమే యేం ? తాను మాత్రం ఆ విషయంలో తక్కువ తిన్నదేం కాదు. ఈ పిండివంట చేసే క్రమం తన డైరీలో నమోదు చేసుకుని అవతల సెలవుల్లో యింటికి పోయి నప్పుడు చెబితే బలే పసందుగా తయారుచేసి పెడుతుంది అమ్మ రాధతో కలిసి లక్షణంగా ఫలహారాలు తినొచ్చు అలోచనలతోపాటే జిహ్వపై లాలాజలం అప్రయత్నంగా పూరి అప్పటికే నోట్లో ఆ మధురపదార్థం యిన్నట్టు దానిని ఆరగించే ప్రయత్నానికి లాలాజలం సంసిద్ధపడినట్టు తోస్తోంది

ఆలోచనలే గాని నోటిలో లేని మైసూరు పాకుకే ఊరడమా ? తమాయించుకొని మనస్సు నిదానించు అమ్మ వండిపెట్టినంక సెలవుల్లో తిందువుగాని అని ఓదార్పు చెప్పుకొని డైరీ తీసుకొంది తన బాకెట్‌కు తగిలించుకో నుండాలి కాబోలు వెతికింది పేనా లేదు తెల్లముఖం వేసింది రాధ వచ్చేప్పుడు పేనా తీసి అమాయికంగా దాంతో ఆడుకోడానికి ప్రయత్నించిందేమో ఉండవచ్చు

"కావలిస్తే తీసుకోండి" అని తన పేనా యిచ్చాడతడు అది చాలా ఖరీదైనది

డైరీలో మైసూరుపాకు వేసే పద్ధతి వ్రాసుకొంటోంది జాబిల్లి కిటికీలోనుండి తొంగి చూస్తున్నాడు పేనా మెల్లగా చల్లగా మంచివాని హృదయంవలె ఒడుదుడుకులు లేకుండా నిర్మలంగా వ్రాస్తోంది వ్రాయడం ముగించి మామూలు వాడుక మేరకు జాకెట్టుకు చెక్కుకుంది మరలా తన వ్రాతను ఓసారి చదువుకొని సంతృప్తితో డైరీ సంచిలో ఉంచింది

ట్రెయిను అక్కడక్కడా ఐదు నిముషాలు స్టేషన్లలో ఆగుతూ వెడుతోంది తుదకు తిరుపతి తూర్పు రైల్వేస్టేషను చేరుకొనబోతోంది

ఈవేళప్పుడు తను ట్రెయిను దిగి ఎప్పటికి వెళ్లడం నడిచిపోవాలంటే కాలేజీ హాస్టలుకు దాదాపు రెండున్నరమైళ్ళు తాను ఒంటరిగా పదకొండు గంటలప్పుడు ఎలా వెళుతుంది ఊరి నుండి దాదాపు ఒకమైలు కారుచీకటిలో పోవాలి జాబిల్లి కాస్త అస్తమించా దప్పటికి

మరి ట్రెయిను దిగి రిక్షానో, జట్కానో పెట్టించుక వెళదామంటే ఊరు వదలి చీకటి కోణాల్లోకి వెళ్లిగాని కాలేజీ హాస్టలు చేరజాలదు తను ఇంతలో 'అమ్మో ! రిక్షావాలాలు, జట్కావాలాలూ ఒంటరిగాఉన్న స్త్రీలను తప్పుదారుల పట్టించి ఏదైన ఒంటిపైనున్న నగలను తుదకు మానాన్ని, ప్రాణాన్ని కూడా తీసివేస్తారట !'— ఇలాంటి కథలు ఎన్నో కొల్లగానే వినిపించింది మనోరమ తన కిదివరకే

స్టేషన్ రావడమేగాని, వచ్చిందన్న సంతోషం అరవిందకు లేదు. బ్రహ్మరాక్షసిలా రైలు పొలికేక వేసుకొంటూ ప్లాటుఫారంపై ఆగింది

"వచ్చారా బాబూ !" అంటూ బండివాడు కాబోలు—కిటికీలోనికి చూచాడు "వచ్చాను అప్పన్నా యిదో మన సామానుతోపాటు .. యీవిడ పెట్టె, బేగ్ కూడా బండిలో పెట్టించు" ఉత్తర్వు జారీచేశాడు అతడు

ఏమిటి ? మరి ఆశ్చర్యం ! తన యింగితం లేకనే తన్నోమాటైనా అడక్కనే తన బేగు .. పెట్టె . తీయించి అతని వస్తువులతోపాటు



మీరేనా ఫామిలీప్లానింగ్ ఆఫీసర్ గారి పిల్లలు ?

బండిలో పెట్టుకుంటున్నాడు. కొంపతీసి యితడెవడో దేశాంతకుడులా ఉన్నాడు ... తీరా నన్ను నా లగేజీతోపాటు ఎక్కడికి తీసుకొని వెళతాడో? ఏం కొంప మునుగుతుందో ? . ఆలోచనలో పడిందే గాని కాళ్ళు మెల్లగా నడవసాగినై ప్లాటుఫారంపై అతన్ననుగమిస్తూ నడిచింది రైల్వే స్టేషన్ దాటగానే ఒంటెద్దు బండి సిద్ధంగా ఉంది

నా సామానెందుకు తీసిస్తావని గాని నేను బండిలో మీతో రాను గాని నిరాకరించేంత దొమ్ములు లేకపోయింది అలా అని నిరాకరించి తాను ఒంటరిగా ఎక్కడికి వెళ్ళడం ఆ అపరాత్రిలో—రిక్షాలో—అంత దూరం ఒంటరిగా తాను వెళ్ళే ధైర్యం లేదు ఒంటరిగా స్టేషన్లో గడపటాలదు దొంగకు తేలు కుట్టినట్లయింది అరవింద పని

"ఎక్కండి బండి" అన్న అతడి మాటలకు తింత సాహసం అనుకొంటూనే గత్యంతరంలేక ఎక్కి కూర్చుండినది సదయ హృదయుడు కాకపోతే తానొక్కతే అతాంగి ఒంటరిగా యింత దూరం అతనితో పయనిస్తే తనకేమి కీడు మూడనున్నదు యిప్పుడు మాత్రమేం కొంప మునిగింది. అనే తలంపు ఒకవైపు—

బాగా నమ్మించి — వంచించే ధోరణేమన్నా యిదేమో అన్న అనుమానం .... వాదోపవాదాలు చేస్తూ, రొదచేస్తూ తన మానసాంబుధిలోనే ఒక పెనుతుఫాను లేపివైచింది

ఆలోచనల అల్లకల్లోలాలతో "ఇటుపై నా గతేమి" అని వితర్కించుకొంటూ తన గమ్యస్థానమేమిటో — యీ రాత్రికి—యీ క్రొత్తవాడు అతనింటికి తీసుకొని వెడితే—వాళ్ళ వాళ్ళు ఏమని భావిస్తారో! లేక యిత డెక్కడికి యింతకూ ....తీసుక వెడతాడో ?

విద్యుద్దీపాల వెలుగులో తిరుపతి పట్టణం వీధుల్లో పయనించి పోతూన్నది ఒంటెద్దు బండి! లోనుండి వీధివైపైనా చూడకుండా, కదలకుండా, మెదలకుండా కూర్చున్నది అరవింద అక్కడ వీధి మలుపులో బండిని ఆపమని చెప్పి "అప్పన్నా .. యింక నేను దిగి వెడతాను. యీ అమ్మాయిని కాలేజీ హాస్టల్లో దిగబెట్టేరా" అని బండి దిగి "వస్తానండి నమస్తే" అని వెళ్ళే ప్రయత్నంలో ఉండే అతడికి ప్రతినమస్కారం చేయకుండా ఉండలేకపోయింది అతడు కదలిపోతున్నాడు బండి కాలేజి హాస్టలుకేసి వెడుతోంది

"అమ్మగోరూ చూచారా బాబుగోరు ఎంత మంచోరో అతగాడు నడిచివెళ్లి మీకు బండి పంపాడు" చాలా మంచోడండీ అమ్మగోరూ" అంటూ వడిగా బండి నడుపసాగేడు

ఔను, చాలా మంచివాడే తన భావాంబరంలో అపోహలతోనే పుట్టిన పెనుతుఫాను వట్టి అపోహగానే యిట్టే తేలిపోయింది

ఎంత నిర్వ్యాజమైన మైత్రి కష్టం చూచి సహించలేని హృదయం సహాయంచేసే మహత్త్వం ఎదుటి వ్యక్తి వ్యక్తిత్వాన్ని మన్నించేంత సంస్కారం—యితనిలో మూర్తీభవించినై

ఎంతమంది మంచివారు మగవారిలోను ఉండరు తమా, తన కాలేజీ అమ్మాయిల్లో తన స్నేహితు

ఇది మరొక కథ

రాండ్రు కొందరు అనుకొన్నంత సంస్కారహీనులే అందరూ ఉండరు

మంచివారు మగవారిలోనూ ఉంటారు స్త్రీలలోను ఉంటారు—చెడువారు కూడా యిరు తెగల్లో ఉంటారు తానెంత పొరబాటు పడ్డది ? ఎంత భ్రమపడింది ?

తన భ్రమలు పటాపంచలు కాగా హృదయం తేలికపడింది

బండి కాలేజీ గుమ్మంవద్ద ఆగింది అప్పుట ఘూర్ఖావాడు పహారా యిస్తున్నాడు అక్కడే బండి ఆపి బండిని చూస్తూ ఉండమని ఘూర్ఖావానికి చెప్పి అరవింద సంచీ తీసుకొంది అప్పన్న పెట్టె తీసుకొన్నాడు గదిని సమీపించేకుందికి అప్పటికి పదకొండున్నర కావస్తున్నా మనోరమ "మగవారి నిలా నమ్మరాదే చెలీ" అని కూని రాగాలు

భార్య :- ఏమండీ! మీరు నాకు చంద్రహారం తప్పకుండా చేయించాలి. తర్వాత మనం పొదుపుచేసుకోవడానికి శాయశక్తులా ప్రయత్నించాలండి.

భర్త:- నీ ఆఖరికోరిక తప్పక తీరుస్తాను నా ఖర్చులన్నీ సరిపోయాక.

యస్. కాశీ విశ్వేశ్వరరావు (కాకినాడ)

తీస్తున్నది పెట్టె గదిలో ఉంచి "వస్తానమ్మగోరూ అంటూ" అప్పన్న వెళ్లాడు

"ఏమిటే యీవేళ—ట్రెయినులో వచ్చావా ? బస్సు తప్పింది కాబోలు" పాడే పాటనాపి ప్రశ్నల వర్షం కురిపిస్తూన్నది మనోరమ "ఆ సంగతి మరలా చెప్తాగాని, మగవారిని గూర్చి నమ్మరాదంటూ అదేంటే పాట పాడుతున్నావు ఏంటీ ? వారిలో మంచివా రుండరా దంటావా ?" "ఓహో — ఎప్పుడు గ్రహించావు జలజాక్షీ ఈ నగ్నసత్యాన్ని పురుషుల మాటలు గట్టి నీటి మూటలు వారి అంతరంగం ఒక మృగతృష్ణ అని నీకింకా తెలిసిరాలేదు కాబోలు" అన్నది మనోరమ "అలా అనుకోకు" అంటూన్న అరవిందను చూస్తూ, "పోనీ, యీ పేనా ఎప్పుడు కొన్నావే ? చాలా బాగుంది" అన్నది మనోరమ అరవింద వెంటనే తడిమి చూచుకొని ఉండవే వస్తానంటూ వడివడిగా అడుగు లేసుకొంటూ జడిముడి తడబడగ నెలత ఘూర్ఖావాణ్ణే చేరి "బండివాడు వెళ్ళాడా" అని అడిగింది.

అప్పుడే వెళ్లాడని వాడు సమాధానం చెప్పాడు.

అడుగులో అడుగు వేసుకొంటూ గజగమనంతో, భారమైన హృదయంతో గది చేరుకొంది ఏమి జరిగిందేమిటి ? అన్న మనోరమకు జరిగిన సంగతి చెప్పి — అతడి అడ్రస్సైనా తెలియలేదు ! అతడేమనుకుంటాడో యింత సాయం చేసినందుకు అతని పేనా పొరబాటుగా తేవడమా ? ఎలాగా దాన్ని చేర్చడం ?

"చేర్చకుంటే పోనీవే నీవేమో అంటున్నావు గదా మగవారి మనసులు చాలా మంచివని మగవారి మంచిమనసులకు తార్కాణగా యీ కలం నీకు మిగిలిపోయింది" అనే మనోరమతో, పోవే వేళాకోళం చేసింది చాలు అంటూ భారమైన హృదయంతో తల వంచింది అరవింద

* * *

చదువులు పూర్తి అయినాయి — ఎవరి ఇండ్లు వాళ్ళు చేరుకొన్నారు మనోరమనుండి అరవిందకు ఒక శుభలేఖ అందినది ఫలానాదినం చిరుతానూరులో తన పెండ్లి మిస్టర్ శ్యామసుందరరావు గారితో జరుగుతోందని — దాని సారాంశం ఫలితం వారం తిరుగకుండగనే పెండ్లిపీటలపైన తన స్నేహితురాలిని, శ్యామసుందరరావుగారిని చూచింది చిరుతానూరులో అరవింద

ఆశ్చర్యం — తన కన్నులను తానే నమ్మలేకపోయింది ఆనాడు తన్ను సానువయంగా హాస్టలు చేర్చిన పురుషపుంగవుడే యీతడు — సాక్ష్యం యిన్నూ ఆతను మర్చిపోయిన కలం — చిరునవ్వులు చిందిస్తూన్నట్టుంది తనవద్దే వెంటనే బజారులోకి వెళ్ళి దానికి నమూనా మరొకటి కొన్నది రెండూ కల్యాణమంటపంలో వధూవరులకు చదివించింది

విడిదిలో ఆ బహూకృతులను మాసుకొంటున్న వధూవరులు ఆశ్చర్యంలో మునిగిపోయారు ఆ పేనా . తన ఆనాటి రైలు ప్రయాణాన్ని శ్యామసుందరరావునకు జ్ఞప్తికి తెప్పిస్తూన్నది

"పొరబాటుగా ఆనాడు మరచి మీ పేనా తెచ్చానండి—మీ యడ్రసు తెలియనందున తిరిగి పంపలేక పోయాను—క్షమించండి" అంది అరవింద లోనికి అడుగెట్టుతూ

"రావే ఓహో పోవే . పేనా దొంగా! చూచారటండీ పేనాదొంగ మగవాళ్ల మంచి హృదయానికి తార్కాణ అయిన ఆ పేనా మగవాళ్లకే తిరిగి యిస్తావటే" అని వెక్కిరించింది మనోరమ "పోవే, ఎవరి హృదయం మంచిదో వారే నీకు బహూకృతిగ లభిస్తాంటే, వారి పేనా వారికి చేరడంలో లోపమేముంది —

"పోనీ మా స్నేహితురాలు మనోరమతోడి యీ పార్కరు పేనాలూను మీకే బహుమతండీ" అనింది అరవింద

ఈ పేనాలు మాత్రమే కావు బహూకృతులు — ఈ మనోరమే ఓ గొప్ప బహూకృతి" అన్నాడు శ్యామసుందరరావు

స్నేహితురాండ్రు నవ్వకుండా ఉండలేకపోయారు, వారి ముఖ చంద్రులలోనుండి నవ్వులనే జ్యోత్స్నలను, గుంపులు గుంపులుగా నిర్గమించి గదిని ప్రకాశవంతం చేయసాగినై ! ★

చిత్ర సమీక్ష :

కనక వరలక్ష్మీ వ్రతం 'వరలక్ష్మీ వ్రతం'

చూస్తున్నంతసేపూ ప్రేక్షకుడి మనస్సును, ఆలోచనలను ఆకట్టి అటూ యిటూ తల త్రిప్పనీకుండా సవరపాలతో ఉక్కిరి బిక్కిరి చేసి, కథ కోసం మళ్ళీ చూచేటట్లు చేసే చిత్రం విశాల్ ప్రొడక్షన్స్ వారి వరలక్ష్మీవ్రతం ఈ చిత్రాన్ని ఇటీవల గోల్డెన్ స్టూడియోలో విడుదలకు పూర్వం ప్రత్యేకంగా ప్రదర్శించారు

చిత్రం కథ సగంపైదాకా అతి భారీ జానపద ఛాయలలో నడుస్తుంది

యశోవంతిరాజా ధర్మపాలుని (ఆర్ వి కృష్ణారావు) పట్టపుదేవి గర్భవతి కాగా చిన్న రాణి కళావతి (రమాదేవి) సవతి మత్సరంతో ఆమెను చంపించివేయాలని తన సోదరుడు విక్రమసేనుని (సత్యనారాయణ) సహాయంతో ప్రయత్నిస్తుంది విక్రమసేనుడు రుద్రభైరవుడనే మాంత్రికుని సహాయంతో ప్రయత్నించి విఫలు డవుతాడు మాంత్రికునికి అవమానం జరుగుతుంది పెద్ద రాణి కుమారుని ప్రసవిస్తుంది కళావతి శిశువును హతమార్చమని విక్రమునితో చెబుతుంది వీరి దురాలోచన పసిగట్టిన మంత్రివల్ల ఆ బాలుడు రక్షింపబడటం సేవకుడు కోటయ్య కుమారుడు మంత్రి విక్రముని చేతిలో మరణించడం జరుగుతుంది

రాజ్యలోభంతో విక్రముడు తన బావను హతమార్చి తన సోదరిని గూడా పెద్ద రాణితోబాటు బంధించి మేనల్లుడు ఆనందపాలునకు రక్షకుడుగా తానే రాజ్యం చేస్తుంటాడు

కాలక్రమాన పిల్లలు పెరిగి పెద్దవా రవుతారు విక్రముని కుమార్తె మణిమంజరి (కృష్ణకుమారి) తనను అడవిలో ప్రమాదం నుంచి రక్షించిన ఉదయసింహుని (కాంతారావు) ప్రేమిస్తుంది ఇది గిట్టని ఆనందపాలుడు ఉదయుని ద్వేషించి పరాభూతు డవుతాడు

తాను అవమానం పొందినప్పుడు ఆరుకోలేదనే కోపంతో రుద్రభైరవుడు (రాజనాల) అపూర్వ శక్తులు సంపాదించి విక్రముని సమయం కోసం చూస్తుంటాడు ఉదయుని కోసం వస్తున్న రాకుమారి మణిమంజరిని తన గుహలో బంధిస్తాడు ఆమెను వెతుకుతూ వచ్చిన ఆనందపాలుని (జగ్గారావు) భటులను చెట్లకు వేలాడదీస్తారు

రుద్రభైరవుడు కల్పించిన అవాంతరాలను గడచి మణిమంజరీ ఉదయసింహులు పారిపోతుండగా పరిమళ (స్వర్ణలత) అనే యక్షిణి ఉదయసింహుణ్ణి కామించి తనలోకానికి తీసుకుపోతుంది

ప్రాణేశుని వెతుక్కుంటూ మణిమంజరి దారిలో కష్టసముద్రాన్ని దబ్బున దాటి నారీద్వేషి సదానందుని ఆశ్రమం చేరుతుంది ఆతిన ఆక్రందన ఆవేశం అర్థం చేసుకున్న సదానందుడు ఆమెకు వరలక్ష్మీవ్రతం ఉపదేశిస్తాడు తత్ఫలితంగా వరలక్ష్మీదేవి కరుణించి ఉదయసింహుణ్ణి భూలోకానికి పంపమని పరిమళ కాజ్ఞ యిస్తుంది. పరిమళకు వరనారి శిల వున్న పరిమళంగా విరాజిల్లమని వరలక్ష్మి వరమిస్తుంది. వర ఫలంగా ఉదయుడు దివి నుండి భువికి దిగిరావటం మాంత్రికుడు రుద్రభైరవునితో యుద్ధంచేసి చివరకు అగ్నిలో త్రోసి చంపివేయటం జరుగుతుంది

మాంత్రికుని కుతంత్రాలవల్ల బద్ధులైన ఆనందపాలాదులు మహారాజు విక్రముడు ప్రభృతులకు విముక్తి కలుగుతుంది ఉదయసింహుడు ధర్మపాల మహారాజ పట్టమహిషి పుత్రుడని కోటయ్య చెప్తాడు విక్రముడు చెరలో వున్న మహారాణిని తన సోదరిని, క్షమాపణ వేడుకోటం, ఉదయసింహుడు రాజు కావటంతో కథ కంచికి చేరుతుంది

చిత్రం మొత్తంమీద ప్రశంసనీయంగా ఉంది. జి చంద్రు ఛాయాగ్రహణం ఛాయాగ్రాహకుని పనితనంవల్ల కథలోని ఉత్కంఠకు పరిపుష్టి కల్గింది ఇంద్రలోకం మృత్యుమందిరం లాంటి భారీ సెట్టింగులకు ఛాయాగ్రాహకుని నైపుణ్యం వన్నెకూర్చింది

సాధారణంగా జానపద పౌరాణిక చిత్రాలలో తమ తమ నటన చూపగల అవకాశం అందరికీ ఉంటుంది కనుక, నటీనటు లందరు బాగానే నటించారు. నాయకుడుగా నప్పకపోయినా వర్ధమాన నటుడు శ్రీ సత్యనారాయణ ప్రతి నాయకుడుగా ప్రతిభ చూపుకొనే అవకాశాలు చాలా కలి



వరలక్ష్మీ వ్రతం లో కాంతారావు కృష్ణకుమారి

పిస్తున్నవి. బాలకృష్ణ, మీనాకుమారి, రామ లింగయ్య, రామకోటిలు కావలసినంత కాలక్షేపాన్ని కలిగించారు.

కృష్ణమూర్తి కలం అక్కడక్కడా అశ్లీలార్థ సూచక ప్రయోగాలు దొర్లించినా మొత్తంమీద సాఫీగానే సాగింది. సంస్కృత గీత రచన అప వ్యత్తాభావాన్ని కల్గించినా "అందాలు చిందు మన ప్రేమ," "చిన్నవాడా" అన్న పాటలు సాహిత్యపరంగా బాగున్నాయి. విఠలాచార్యుల వెనకటి చిత్రాలంత పసందుగా లేకపోయినా, రాజన్, నాగేంద్రల సంగీతం ఏ బాణీలో ఉన్నప్పటికీ, వినటానికి ఇంపుగా ఉంది. "అందాలు చిందు మన ప్రేమ", "పిల్లా పిల్లంటూ వల్లికిలించేరు" "నీదానరా సుందరా" అన్న పాటలు ప్రజామోదం పొందవచ్చు.

ప్రచార విధానంలోను, చిత్ర దర్శకత్వంలోను వింత పోకడలు పోయిన శ్రీ విఠలాచార్య కొన్ని జానపద గాథల్లో కన్పించే గ్రామీణ జీవితాన్ని యథాతథంగా చిత్రించాలని ప్రయత్నించినట్లు కన్పిస్తోంది. రాజభటులను అవమానించేప్పుడు కళ్లలో కారం కొట్టటం లాంటివి కన్పిస్తాయి. కాని మాంత్రికుని పరాభవ సన్నివేశంలో గండూష బహుమానంలాంటివి సన్నివేశాలు తొలగించివుంటే 'అసభ్యత' అనే మాటకు తావేర్పడేది కాదు.

ఏవో ఇలాంటి లోపాలు ఒకటి రెండు ఉన్నా అవి చిత్ర విజయాన్ని గాని ప్రేక్షకానందాన్నిగాని అడ్డుకోలేవు. ప్రశాంతుడైన ప్రేక్షకునకు ఇంపైన సంగీతం, సొంపైన మాటలు, పాటలు, ఆటలు, మానసిక సుషుప్తి కల్గించి, అన్యలోకభ్రాంతి కల్గించేట్లుగాచేసే కనుపండువైన ఛాయాగ్రహణం, ప్రశంసనీయమైన ఉత్కాంఠభరితమైన నటనలతో విశ్రాంతిని కల్గించే ప్రమోదాత్మక చిత్రం "వరలక్ష్మీవ్రతం !"

'కన్నతల్లి' తరువాత తెలుగు చిత్రరంగంలో కన్పించని ట్రైలర్ విధానాన్ని పునరుద్ధరించి నందుకు శ్రీ విఠలాచార్య ప్రత్యేకంగా ప్రశంస నీయులు.


"నాగరాజ్" ★

వార్తాభరణం

చిత్రజగత్తుకు జాగృతిచిత్రం "పదండి ముందుకు"

తెలుగు చిత్రజగత్తులో ఎన్నో రకాల చిత్రాలు తయారయ్యాయి. పౌరాణికాలు, జానపదాలు, చరిత్రాత్మకాలు, సాంఘిక సమస్యాత్మకాలు—ఇలా ఎన్నో చిత్రాలు వచ్చాయి. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆధునిక దశలను చిత్రం నిర్మించినవారెవ్వరు లేరు. ఈనాటికి ఆ కొరత తీరింది. జాగృతి చిత్ర అన్న సంస్థ పేరుతో ప్రముఖ నటులు, విద్యాధికులు, సంస్కారి శ్రీ జగ్గయ్య "పదండి ముందుకు" అన్న చిత్ర కుసుమాన్ని కళాసీమంతినికి కానుకగా సమర్పిస్తున్నారు. కళ జాగృతికే గాని విస్మృతికి కాదు అన్న దృక్పథంతో శ్రీ జగ్గయ్య సమర్పిస్తున్న ఈ చిత్రంలో జగ్గయ్య, జమున, గుమ్మడి, వరలక్ష్మి, రమణారెడ్డి, కె. వి. ఎస్. శర్మ, కాంతారావు, హేమలత, కృష్ణారావు ప్రభృతులు నటిస్తున్నారు. కథ : చంగయ్య బి. ఏ. సంభాషణలు: జగ్గయ్య బి. ఎ. సంగీతం : కోదండపాణి, ఛాయ : పి. ఎల్. రాయ్. కళ : కృష్ణరావు. నిర్మాత : కృష్ణమూర్తి. దర్శకత్వం : మధుసూదనరావు.

1930 నాటి శాసనోల్లంఘనోద్యమంతో గాంధీజీ



"వరలక్ష్మీవ్రతం"లో స్వర్ణలత.

అడుగుజాడల్లో నిలిచి హింసాహింసల సరిహద్దుల్లో ప్రాణాలొడ్డి పోరాడిన పవిత్ర భారతీయ కుటుంబ గాథ ఆధారంగా నిర్మించబోయే ఈ చిత్రానికి ఆగస్టు 18 వ తేదీన సారథీ స్టుడియోస్ (హైదరాబాద్)లో ప్రారంభోత్సవం జరిగింది.



'వరలక్ష్మి వ్రతం'లో కృష్ణకుమారి.


ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య చిత్ర నిర్మాణానికి ప్రారంభోత్సవం చేస్తూ, మహాత్ముని ఆశయాలతో, 1930 నాటి ఉప్పు సత్యాగ్రహంనాటి కథావస్తువుగా చిత్రం నిర్మించటం నిజంగా ప్రశంసనీయమైన విషయమని అన్నారు. శ్రీ జగ్గయ్య చేబట్టిన ఈ మహత్కార్యక్రమం సఫలమవుతుం దనటంలో సందేహం లేదన్నారు.

ప్రారంభోత్సవంలో 'క్లాప్' కొట్టిన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్‌వర్క్స్ మంత్రి శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు చలనచిత్రాల సన్నివేశాలు వాస్తవికతకు దగ్గరగాను, సహజంగాను వుండాలని ఉత్తమ కథావస్తువుతో శ్రీ జగ్గయ్య తలపెట్టిన ఈ సాహసోపేత కార్యక్రమం విజయవంతం కావాలని ఆశిస్తున్నానని అన్నారు.



'వరలక్ష్మీవ్రతం'లో మీనాకుమారి.

కెమెరా స్విచ్ ఆన్ చేసిన ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ప్రసంగిస్తూ "ఉప్పు సత్యాగ్రహంనాటి త్యాగాలను చిత్రీకరించి వాటి విలువలు ఈ తరమువారికి తెలియజేసేం దుకు పూనుకోటం ముదావహం" అన్నారు.



'టాక్సీరాముడు'లో దేవిక

సాగదీవారి

'కలసివుంటె కలదు సుఖం'

ఈ చిత్రం సెన్సార్ గతనెల 14 వ తేదీన పూర్తి గావించారు యీనెల 7 వతేదీన ఈ చిత్రం ఆంధ్రప్రదేశ్‌లో విడుదలౌతోంది ఈ చిత్రానికి వెండితెరనవల తయారవుతున్నది

'ఆరాధన' జోరు

అన్నపూర్ణ నిర్మాతలు జగపతి పిక్చర్సువారు నిర్మిస్తున్న 'ఆరాధన' శీఘ్రగతిన పురోగమిస్తోంది ఇప్పటికి ఏడు రీళ్లకు పైగా పూర్తయింది నాగేశ్వరరావు, జగ్గయ్య, రేలంగి, రమణారెడ్డి, సావిత్రీగణేశన్, గిరిజ, రాజశ్రీ, రీటా ప్రభృతులు నటిస్తున్న ఈ చిత్రానికి దర్శకత్వం వి మధుసూదనరావు, కథ ఆచార్య ఆత్రేయ, నార్ల చిరంజీవి, సంగీతం ఎస్ రాజేశ్వరరావు, ఛాయ సి నాగేశ్వరరావు, కళ కృష్ణారావు నిర్మాతలు రంగారావ్, రాజేంద్రప్రసాద్ ఈ చిత్రానికి బంగాలీ చిత్రం సాగరిక ఆధారం గెస్ట్ ఆర్టిస్టులుగా గుమ్మడి, నాగయ్య పాల్గొంటున్నారు రికార్డయిన పాటలో రెంటి చిత్రీకరణం జరిగింది చిత్రీకరణం డిసెంబరు నాటికి పూర్తికాగలదని తెలుస్తోంది

దొరైస్వామి మృతి

ప్రసిద్ధ చలనచిత్ర నటుడు శ్రీ కె దొరైస్వామి అయ్యంగార్ గతనెల 16 వ తేదీన నెల్లూరులో మరణించారు పెళ్ళిచేసిచూడు, చండీరాణి, పరాశక్తి లాంటివి అనేక సాంఘిక, జానపద చిత్రాల్లో ఈయన నటించారు

తండ్రులు-కొడుకులు

రఘురాం ఫిలింస్స వారి సాంఘికచిత్రం "తండ్రులు-కొడుకులు" నిర్మాణం పూర్తికావచ్చింది సెప్టెంబరు మొదటి రెండు వారాల్లోగా విడుదల కావచ్చని తెలుస్తోంది కె హేమాంబరధరరావు దర్శకత్వంలో తయారవుతున్న ఈ చిత్రంలో గుమ్మడి, చలం, కృష్ణకుమారి, పద్మనాభం, చదలవాడ ప్రభాకరరెడ్డి, నిర్మల, శారద (కొత్త నటి) పాల్గొంటున్నారు. ఈ చిత్రానికి సహాయ

నిర్మాత ఎ పూర్ణచంద్రరావు రచన ఆత్రేయ ఛాయ సి నాగేశ్వరరావు

నిముషాలమీద డబ్బింగ్

కొద్ది నిమిషాల్లోనే చలనచిత్రాలను (సౌండ్ ట్రాక్)ను మార్చి తర్జుమా చేసే విధానాన్ని అమెరికన్ శాస్త్రజ్ఞులు కనిపెట్టారు ఈ విధాన ప్రదర్శనం (అమెరికాలో) ఇటీవల మగ్నెసౌండ్ స్టూడియోలో జరిగింది ఈవిధానాన్ని ఇంగ్లీషునుంచి విదేశ భాషలకు విదేశ భాషలనుంచి ఇంగ్లీషుకు మార్చేటప్పుడు కూడా ఉపయోగిస్తుందిట

భారతీయ చిత్రాలపై నైజీరియా మోజు

భారతీయ చలనచిత్రాలంటే నైజీరియా ప్రజలకు ఎంతో ఆసక్తి ఉందని దేశంలో 50 వంతుల చలనచిత్ర ప్రదర్శనశాలలు భారతీయ చిత్రాలనే ప్రదర్శిస్తాయని తూర్పు నైజీరియా ప్రధాని శ్రీ ఎం ఐ ఒక్పారా ఇటీవల మద్రాసులో అంతర్జాతీయ అభివృద్ధి సంఘం ఆధ్వర్యాన జరిగిన సభలో వెల్లడించారు

లతామంగేష్కర్ గానం తమ ప్రజలను ఉర్రూతలూగిస్తుందని కూడా శ్రీ ఒక్పారా అన్నారు

జర్మన్ టెలివిజన్‌లో ‘పథేర్ పాంచాలి

శ్రీ సత్యజిత్‌రాయ్ నిర్మించిన పథేర్ పాంచాలిని త్వరలో దేశవ్యాప్తంగా పశ్చిమ జర్మనీ టెలివిజన్ ద్వారా ప్రదర్శిస్తారు

టెలివిజన్‌లోకి ఎక్కిన ప్రప్రథమ భారతీయ చిత్రం ఇదే ఇప్పుడు జర్మనీలో 53 లక్షల టెలివిజన్ సెట్లు ఉన్నాయుట

స్టూడియో యజమాని సంఘం ఎన్నికలు

దక్షిణభారత చలనచిత్ర నిర్మాణశాలల యజమానుల సంఘానికి అధ్యక్షులుగా శ్రీ బి నాగిరెడ్డి (విజయ—వాహిని) ఎన్నికయ్యారు సర్వసభ్య సమావేశం శ్రీ ముత్తుకుమారప్పరెడ్డియార్‌కు ఉపాధ్యక్షులుగాను శ్రీశీయుతులు ఎ ఎల్ శ్రీనివాసన్ బి ఎన్ రంగా దీన్‌షా కె టెహరానీలను సభ్యులుగాను కూడా ఎన్నుకుంది

బుద్నిలో ముడిఫిల్ము ఫ్యాక్టరి

భోపాల్‌కు 60 మైళ్ళ దూరంలో ఉన్న బుద్నిలో ముడి ఫిల్ము ఫ్యాక్టరీని స్థాపించాలనే ఉద్దేశ్యంలో ఒక ప్రయివేటు సంస్థ మధ్యప్రదేశ్ ప్రభుత్వంతో సంప్రతింపులు జరుపుతున్నది

తమిళ చిత్రంలో నీగ్రోలు

తమిళ చిత్రంలో నీగ్రో భాష మాట్లాడే డాక్టరుగా నటించేందుకు ఇద్దరు నీగ్రోలు ఉగాండా నుండి మద్రాసుకు వచ్చారు వీరు కూడా సేలం వారి ఎణితిరై లో నటిస్తున్నారు

ఈ చిత్రంలో జెమిని గణేశన్ నీగ్రో డాక్టర్లచే రక్షితుడైన విమాన ప్రయాణికుడుగా నటిస్తున్నారు



సు.శ్రీ ఫవాహారి ‘శికారి రాముడు’లో రాజసులోచన

ఇండోనీషియాలో భారతచిత్రాల విజయం

ఇండొనీసియాలో ఇటీవల ప్రదర్శించబడిన భారతీయ చలనచిత్రాలు అసంఖ్యాక ప్రజల మన్ననల పొంది ఘన విజయం సంపాదించాయని ఇందుమూలంగా ఇండొనీసియా భారతదేశం నుంచి దిగుమతి చేసుకునే చిత్రాలసంఖ్య పెరగవచ్చని దక్షిణభారత చలనచిత్ర వాణిజ్యమండలి అధ్యక్షులు శ్రీ ఎ ఎల్ శ్రీనివాసన్ ఇటీవల మద్రాసులో అన్నారు

బెంగాల్ స్టూడియోలపై విచారణ

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని స్టుడియోలలో ఫ్యాక్టరీల చట్టం ఎలా అమలు జరుగుతున్నది దర్యాప్తు [illegible]పేందుకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది స్టుడియోలలో ఫ్యాక్టరీల చట్టం సరిగా అమలు జరగటంలేదని పదేపదే వచ్చిన ఆరోపణల ఫలితంగా ఈ దర్యాప్తు ఏర్పాటైందట

వెనిస్ చిత్రోత్సవానికి 'గంగా

రాజన్ తారక్‌దార్ దర్శకత్వం వహించిన వంగ భాషాచిత్రం "గంగా" ను సమాచార చిత్రాలలో ప్రదర్శించేందుకై భారతదేశం తరపున వెనిస్ చలనచిత్రోత్సవానికి ఎన్నిక చేశారు

అంతర్జాతీయ బాల చిత్రోత్సవం

బాల చలనచిత్ర సంస్థ అధ్వర్యాన మూడవ "అంతర్జాతీయ బాల చలనచిత్రోత్సవం ఈనెల్లో కలకత్తాలో జరుగుతుంది సుమారు 30 దేశాలు ఈ చిత్రోత్సవంలో పాల్గొంటాయని తెలుస్తోంది

హిందీ చిత్రజగత్

'గంగా జమునా'

సెన్సారునుండి విముక్తి

సిటిజన్స్ ఫిలిమ్స్ కార్పొరేషన్‌వారి గంగా జమునా అన్న వర్ణచిత్రం చిట్టచివరకు చిత్ర విచ్ఛేదకుల హస్తాలనుంచి బయటపడింది

కాముకత్వ ప్రేరేపక దృశ్యాలను మాటలు పాటలను సుమారు 300 అడుగుల వరకు తీసివేసేందుకు, సవరించేందుకు నిర్మాతలు అంగీకరించిన మీదట గత మూడునెల్ల వివాదానికి స్వస్తి చెప్పి చిత్ర విచ్ఛేదక సంఘం (సెన్సార్ బోర్డు) ఈ చిత్రాన్ని ఆమోదించిందట

ఈ చిత్రంలో దిలీప్‌కుమార్, వైజయంతిమాల, నజీర్‌హుస్సేన్, కన్హయలాల్, లీలా చిట్నీస్ ప్రభృతులు పాల్గొంటున్నారు

చిత్రాన్ని వర్ణచిత్రంగా ప్రింటు సంపాదించేందుకు నిర్మాత శ్రీ నర్‌ఖాన్ లండన్ వెళ్తున్నారు ఈ చిత్రాన్ని నవంబరులో విడుదల చేస్తారట శ్రీ ఖాన్ తమ పర్యటనా కాలంలో, ఈ చిత్రాన్ని విదేశాల్లో ప్రదర్శించేందుకు గల అవకాశాల్ని పరిశీలించి వస్తారు ★

మనము-మనదేహస్థితి

(14-వ పేజీ తరువాయి)

వాళ్ళు ఎనీస్తీషియాలో లోపాలవల్లనే ఏర్పడుతుంది అన్నిరకాల ఏనీస్తీషియా అన్ని తత్వాలవారికీ పడదు ఎవరికి ఏ విధానం అవలంబించవలెనో, సర్జనూ ఎనీటిష్టు సంప్రతించి నిర్ణయిస్తారు

టాన్సిలెక్టమీలో సాధారణంగా క్లోరోఫారం ఈథర్ మిక్చరు ఎనీస్తీషియాకు ఉపయోగిస్తారు ఇది తేలికగా పూనుకోతగ్గ పనికాదు ఈ విధానం అవలంబించడానికిముందు రోగి ఊపిరితిత్తులు పరిశుద్ధంగా వుండాలి టాన్సిలైటిస్ ముదిరినప్పుడు గాని, ఆపరేషన్ తలపెట్టరు అప్పటికే ఇన్‌ఫెక్షన్ క్రిందికిపాకి ఊపిరితిత్తులు, శ్వాసనాళములు వాచి బ్రాంకైటిస్ వచ్చి వుంటుంది కొందరిలో ఉబ్బసం వుంటుంది టాన్సిలైటిస్‌తో బాధపడేవారిలో సాధారణంగా ఇయోసినోఫైలియా (Eosinophilia) అనే వ్యాధి విశేషం ఉంటుంది ఇది ఒకరకమైన రక్త శ్వేతకణ సంఖ్య అపారంగా పెరిగిపోయినందున యేర్పడుతుంది ఇందువల్ల జలుబు ఉబ్బసం తరుచు ఏర్పడతవి కొందరిలో గాయంతగిలినప్పుడు రక్తస్రావం త్వరగా ఆగిపోదు ఈ స్థితిని 'హీమోఫైలియా' అంటారు ఇది చాలా అరుదు కాని ఇటువంటిది గమనించిన తల్లిదండ్రులు సర్జనుకు యీ విషయం ముందే తెలియజేయాలి హీమోఫైలియా వున్నవారిలో ఏ శస్త్రచికిత్స కూడదు కొందరిలో టాన్సిలైటిస్‌కు ఫలితంగానో, ఆజన్మసిద్ధంగానో హృద్రోగ విశేషములు ఏర్పడి లోప్పు యేర్పడి వుంటుంది వారు ఎక్కువసేపు వూపిరి బిగబట్టడం సాధ్యంకాదు క్లోరోఫారంయీథర్ యిచ్చినప్పుడు వూపిరి ఆగితే కొన్ని ప్రక్రియలవల్ల మళ్ళీ వూపిరి ఆడించడం జరుగుతుంది చాలాసేపు వూపిరి బిగబట్టగల వారిలో ఈపరిస్థితి యేర్పడదు ఏర్పడినా ప్రమాదకరం కాదు

దీర్ఘమయిన టాన్సిలైటిస్‌వల్ల శరీర ధాతువులు అతి దుర్బలములై నిర్వీర్యములైపోయి రక్తక్షీణత ఏర్పడి, పాండురోగానికి దారి తీస్తుంది క్రిమిదోషంవల్ల శరీరంలో టిష్యూల శక్తి నశించి పోయినతర్వాత టాన్సిల్ తీసివేసినా జరిగేమేలేమీ వుండదు లోపభూయిష్టమయిన ఆహారం తీసుకునేవారిలో, గాలీ వెలుతురు లేని ఇళ్ళల్లో నివసించే వారిలో దేహపరిశుద్ధ్యం, ముఖ్యంగా వాక్పరిశుద్ధ్యం విషయంలో శ్రద్ధవహించనివారిలో అన్నిరకాల క్రిమిదోషములూ తటస్థించడానికి వీలుంటుంది అటువంటివారిలో దీర్ఘమయిన క్రిమిదోషం శరీరం అంతటినీ పీల్చి పిప్పి చేస్తుంది ఈ స్థితి యేర్పడ్డతర్వాత టాన్సిలెక్టమీ వ్యయప్రయాసలకు, ప్రాణహానికీ దారితీస్తుందేగాని, ఆరోగ్యాన్ని ప్రసాదించదు

టాన్సిలెక్టమీకి పూనుకునే సర్జన్‌కు బిడ్డల తల్లిదండ్రులు తెలియజేయవలసిన విషయాలు పైన వివరించాను టాన్సిలెక్టమీ అయినతరవాత, వచ్చే ప్రమాదాలుకూడా వున్నవి నగరాల్లో, ఆస్పత్రులలో రోగిని డాక్టర్లు, నర్సులూ పరిశీలించడానికి వీలుంటుంది చిన్ననగరాల్లో ఇది సాధ్యంకాదు

టాన్సిలెక్టమీ తర్వాత మూడు నాలుగు రోజులు మింగడం సాధ్యంకాదు అప్పుడు వేడి పానీయములు యివ్వరాదు మంచువేసిన చల్లని ద్రవపదార్థములు ఇవ్వాలి రక్తనాళములకు వేసిన ముడులు ఊడి రక్తస్రావం యేర్పడవచ్చును. ఎర్రని నెత్తురు ఎక్కువగా నోటినుంచివస్తే వెంటనే సర్జనుకు ఆసంగతి తెలియజేయాలి. నెమోనియా, జ్వరం, వాంతులు ఎక్కిళ్ళు రావచ్చును వీటికి, చికిత్స చేయవలసిన వుంటుంది

టాన్సిలెక్టమీ చేయిస్తే కంఠస్వరం చెడిపోతుందని కొందరు భయపడతారు ఇది నిరాధారమైన అభిప్రాయం టాన్సిల్ ఇన్‌ఫ్లేం అయివుంటే ఎప్పుడయినా ఆ ఇన్‌ఫెక్షను శబ్దపేటికలోకిప్రాకి అక్కడ ఇన్‌ఫ్లేమేషన్ కలిగించవచ్చును ఆ స్థితి యేర్పడ్డతరవాత దీని నివారణ అంత సులభమైన పనికాదు టాన్సిలు తీసివేశాక ఒకవారంవరకు గొంతునొప్పి వుంటుంది అందువల్ల పాడడం కష్టంకావచ్చు కాని ఆ తరవాత ఏ కష్టమూ వుండదు

టాన్సిలెక్టమీ అయినతరవాత రోగికి అతి పుష్టికరమైనదీ, తేలికగా జీర్ణంఅయ్యేదీ అయిన ఆహారం యివ్వాలి పరిసరములు ఆరోగ్యవంతములుగా మార్చాలి లేకపోతే ఆపరేషన్ చేసిన ప్రయోజనం ఏమీ వుండదు

ముదిరిన టాన్సిలైటిస్‌ను పై పూతలతో గాని, ఔషధాలతోగాని నివారించడం అసాధ్యం అందుకని ధనవ్యయం కాలవ్యయం చేయడం మంచిదికాదు ★

హరివంశం

(10-వ పేజీ తరువాయి)

నేను ఈ వియద్వాహినిని చూచి ఎన్నిదినములైనదయ్యా! నిఖిల కళ్యాణరాశిని, కాశిని, చూచి ఎన్నిదినములైనదయ్యా! ఓయి! గంధర్వరాజ! ఈ స్థలమును తిలకించినావా! పరమశివుడు, రుద్రుడై, కాలభైరవుడై, విధాత్ర పంచమశిరస్సును గోటిగొడ్డలితో గిల్లగా, అది ఇచ్చట వ్రాలినది ఇదిగో, ఇతనిని, ఈ దేవుని చూచినావా! ఆయన శ్రీమత్కాలవటుకరాజు ఇదిగో ఇది పంచతీర్థము, ఇదిగో ఇది మత్స్యోదరీనామ మండలము వాడుగో, వాడు కామేశ్వరుడు, వాడు స్కందేశ్వరుడు, వాడు వినాయకేశ్వరుడు, వాడు హరుడు శశికిరీటుని, వీనిని, పార్వతీశ్వరుని చూచినావా! వీనిని భృంగీశుని, అధ్వరేశుని కనినావా! ఓయి! ఓయి! కాశికయందలి శివదేవమూర్తులను నీవు దర్శించలేదో! వీడు అష్టాదశాంగుశేశ్వరుడు, వీడు ధర్మశాస్త్రేశ్వరుడు, వీడు సారస్వతేశ్వరుడు, వీడు రత్నజాతీశ్వరుడు వీడుగో! గంధర్వ! బిందుమాధవదేవుడు అదిగో! పంచనదతీర్థము మాతల్లి కాశికకు ఫాలమున పెట్టిన కస్తూరికాతిలకమును పోలివున్నది ఇదిగో! మాతల్లి మంగళ కాత్యాయని ఇది మా తల్లి అన్నపూర్ణ, ఓయి! గంధర్వ! వెయ్యి ఎందుకు! ఆనందవిపిన భూమి నడుమను శశిఖండకోటీర నాగకటక నిటలలోచన గిరిశ ధూర్జటులయిన హరులు వారుపోసిన చందముగా నాటియుందురుగదా! అహో! ఇతి! ఇదిగదా జ్ఞానవాపిక! ఇదిగదా శివతీర్థము. ఇదిగదా ఈశనదేవుని శూలమునబడి పైకిలేచిన వరుణాంబుధార! ఇదిగదా నాకు నిత్యస్నానమునకైన సుందర తీర్థము అహో! నేను ఎక్కడ వున్నాను భో శంకర! భోభో! ఉమాశ్లిష్టవపుష! భోభో! ఆనందకానన నిరంతరనివాసియైన పుంస్కోకిల! భోభో! కృపణరక్షాతి నిపుణ! హే పశుపతే! శరణు శరణు!"

ఆమెలో స్తంభరోమాంచాది సాత్వికభావములు తోచినవి ఆమె మూర్ఛ పొందినది మహారాజు మలయకేతువునకు ఇది యంతయు అద్భుతమును ఆశ్చర్యమును అయినది ఆయన ఆమెకు అప్పుడు శిశిరోపచారములు చేయించినాడు తానై శిశిరోపచారములు చేసినాడు ఆమెకు ఒడలు తెలియలేదు రాజు బడలుపడిపోయినాడు ఆయనకు ఏమియు తోచలేదు అచ్చటనున్న అందరిముఖములను దీనుడై తిలకించినాడు ఆమెచెలికత్తియలవంక అతి దుఃఖితుడై చూచినాడు ఆ చెలికత్తియలలో నొక్కరుత్తుక రాణిమనసును ఎరిగినది యున్నది అది ఇప్పుడు రాణిని సమీపించినది చిత్రకరునివద్దనున్న పటమును తాను తీసుకొన్నది రాణి సమీపమునకు ఆ చిత్రపటమును చేర్చినది అందులో జ్ఞానోదమున్న యెడమ రాణి కన్నులకు ఎదురుగా నిల్పినది "రాణి! ఇదిగో జ్ఞానోదము. ఇదిగో! జ్ఞానవాపిక ఇదిగో శివతీర్థము" దృఢాక్షరముగా ముమ్మారులు అట్టుల ఆమె ఆ మాటలను ఉచ్చరించినది రాణి కన్నులను తెరచినది చెలికత్తియ మరల అన్నది "రాణి! ఇది చిత్రపటము నీవు కళావతివి" రాణి అన్నది "అవును ఇది చిత్రపటము నేను కళావతిని" రాజు తెప్పరిల్లినాడు రాజు సంతోషించినాడు

ఆతరువాత రాణికి అచ్చటనుండగా తోచలేదు ఆమె భర్తతో అన్నది "స్వామి! మనము కాశికి పోవలయును పిల్లలకు రాజ్యమును అప్పగించి మరియు మనము కాశికి పోవుదము"

రాజు 'వల్లె' యనినాడు పుత్ర సంక్రాంత రాజ్యభారుడైనాడు కళావతితోగూడ కాశికి పోయినాడు

అచ్చట జ్ఞానవాపికాతీర్థమున తపముచేసి ముక్తుడైనాడు ఆ భార్యయు, ఆ భర్తయు జ్ఞానవాపికామాహాత్మ్యమునకు గుర్తులు. వారు ఇప్పటికిని శివలోకములలో నున్నారు

శ్రీకృష్ణదేవుడు ఆ కథను వినినాడు తక్కంగలవారును ఆ కథను వినినారు

భగవంతుడు మహానందునితో అనినాడు

"మహానంద! నీవు జడుడవేమిటి?"

"పరమశివుడు ఒక్కడే అజడుడు మరి నేను జడుడనుకాక యేమియగుదును"

అంతలో ముక్తిమంటపమున గంటలు మ్రోగినవి. ★



సుఖం

(9-వ పేజీ తరువాయి)

చిన్నకారుకి ఎంచిచ్చి గౌరవించారు కాని సోంబాబు అసలు లాయరవుతాడూ అని సీతారాములు నమ్మ లేదు అంటే అది అయ్యగారి ఆలోచన అన్నమాట. సోంబాబు కేవలం తండ్రినిచూసి, పాదాభివందనం చేసి, ఆశీర్వాదం పొంది బళ్ళోకి పోదామని కాదు వస్తే! ఏమైనా కటాక్షం కలిగి ఓ వంద రెండూ కాంక్షను వేస్తారేమోనని అతగాడు తండ్రి నాశ్ర యిస్తాడు

సోంబాబుని అయ్యగారు ఎప్పుడు తలఎత్తి పెద్దపులిలా చూస్తారో అమ్మాయి కళమ్మని పళ్ళకొరికి తిడతారో (కళకి ఏ సమ్మంధమూ నచ్చదు గనుక) సీతారాములికి తెలుస్తుంది సోంబాబు సీతారాములి మొహంలో నాన్నగారి మనస్సు చద వాలని చూస్తాడు

"రేపు అకౌంటెంట్‌కి సీతారాములు చెపు తాడు తీసుకొనిపో అన్నట్లు, ఏం చదువుతున్నావ్ నువ్వు!"—అయ్యగారి మాటలలో బాధ, నిర్లక్ష్యం ముసుగు ధరిస్తుంది బాబుకి కావల్సింది డబ్బు సుఖం ధనంతో కొనగలగడం సోంబాబు నేర్చు కున్నాడు "లా చదువుతున్నానండి" అనేస్తాడు గభిక్కున

"ఒరే రాములూ!" అయ్యగారు కొడుకు వెళ్ళి పోతున్న దిక్కునే చూస్తూ పిలుస్తారు "ఇంతకీ రాంబాబు యీ సంవత్సరం పరీక్ష రాశాడా ?" ఆయన ప్రశ్నలో ప్రాధేయత ఉన్నది సీతా రాములికి కూడా అది స్ఫురిస్తుంది

ఏమనగల్డు వాడు ? చిన్నకొడుకు పరీక్ష రాస్తే కదా ? అయ్యగారు ప్యాసు చేయించడమేనా చేయ గలిగేది కాలేజీ చదువులంటే మజాగా ఉంటా యన్నది రాంబాబుకి తెల్సును తెల్సిపోయింది అందు కనే పరీక్షల్ని దూరంగా ఉంచుతా డతగాడు ఉన్నమాట అంటే అయ్యగారి కంటిక్రింద చారలు నుదురు ముడుతలు రెండూ చిక్కుపడిపోతాయి. అందుకనే,

"ఈ సంవత్సరం ఔతాడు బాబూ !" అంటాడు వాడు "డామిట్ ! వెధవ, ఫేలవుతా డన్నమాట! అంతేగా ప్యాసు అవడు నాకు తెల్స . ఛా! వాడికిబదులు నీకు ఆ డాక్టరీ చెప్పించినా ఈపాటికి సర్తనౌదువు" అయ్యగా రన్న మాటలోని సత్యం ఎంతో తెలియదుగాని ఆయన బాధ, ఆవేదన మాత్రం నిజం తనకి అయ్యగారు డాక్టరీ చెప్పించ లేదని విచారించడం వాడికి కొత్తగాదు అందులో ఆశ్చర్యం పోయింది సీతారాము లందుకనే చిరు నవ్వు నవ్వుతాడు

అయ్యగారి ఆ తపన వాడికొక క్షణం సుఖ ప్రసాదిని సీతారాముల్ని అయ్యగారు ఒక్క లాయరూ డాక్టరూ చేయలేనందుకే విచారించారు. "అయ్యో! వెధవా! ఏం చదివినా నిన్ను ఓ డైరెక్ట ర్నైనా చేసుకొందునే పోనీ" అంతే పోనీ తర్వాత వాక్యం ఎప్పుడూ పూర్తవలేదు అది ఎలా పూర్తిచేయాలో అయ్యగారికీ తెలీదు, సీతా రాములికీ తెలీదు

అయ్యగారికి పిచ్చి ఉందేమోనన్న అనుమానం సీతారాములి గుండెల్లో బరువుగా కూర్చున్న క్షణా లున్నాయి ఐనా వాడు దాన్ని అదుముకో గలడు

అయ్యగారికి రెండు మిల్లు లున్నాయి నాలుగు బంగళా లున్నాయి ఎన్నో 'షేర్లు' న్నాయి సీతా రాములి కేమిటున్నాయో వాడు ఆలోచించుకో లేదు అయ్యగారంటే వాడికి విశ్వాసముందని అయ్యగారి ఉద్దేశ్యం ఆయనంటే ఆయనకిలేనట్టే అమ్మగారికీ నమ్మకంలేదు అది సీతారాములి ఉద్దేశం

అయ్యగారు కోయంబత్తూర్ మీటింగుకి వెడితే మధురై ఇన్‌స్పెక్షను కెడితే విమానాశ్రయం దాకా సీతారాములు వెళ్తాడు అక్కడ అయ్య గారు ఆఖరికాసారి వాణ్ణిచూసి చెయ్యి ఊపిన వైనం వా డెరుగడు వాడి కది ఆటవిడుపు

తిన్నగ తిరిగివచ్చి, వాడు అయ్యగారి తోటలో — అసలు అది వాడితోటే ననుకుంటాడని అందరి ఉద్దేశం అందరికోపం మరి వాడికి వేరే తోట లేదు అందుకనే వా డా తోటలో హుర్రే మని పరుగెడతాడు క్రిందపడి దొర్లేస్తాడు . వా డెన్నోసార్లు అయ్యగారి బల్లప్రక్కని నేల మీద కూచుని — సీమనించి వచ్చిన బీరు తాగే శాడు అప్పుడు తివాసీ "పట్టు"లాగా, ఒళ్లు మత్తుగా అయ్యింది కాని తోటలో వా డిప్పుడు మంచినీళ్లు తాగేసినా అంతకంటే మత్తుగా హాయిగా జోలగా ఉంటుంది

అమ్మగారికి వాడు నౌకరు కాదు అసలు అమ్మగారికి అయ్యగారికి నాలుగేళ్లయ్యింది మాటలు లేవు ఉన్నా అవి మాటలు కావు అప్పట్నుంచే వాడు అయ్యగారి హమేషి నౌకరౌత

చిన్న అయ్యలికి వాడు డఫేదారు కానేకాడు

సరిగ్గా తోటలో వాడు ఉషారుగా గడ్డిలో పడి దొర్లుతూ వున్నవేళ మాలచ్చిని తలపోస్తూ ఉన్న తియ్యనిసమయంలో పెద్దమ్మాయి 'కళ' వస్తుంది లేదా కాంతి అంటే చిన్నమ్మాయి గారు రావచ్చును

ఒక్కోసారి అమ్మగారు మూడంతస్తులు దిగి వచ్చి వాణ్ణి "తోటలో ఏంచేస్తున్నావురా .. వెర్రి పీనుగా" అన్న సందర్భాలుకూడా ఉన్నాయి

అస లందుకే ఆటవిడుపు నాలుగు రోజులూ వాడు పారిపోదా మనుకుంటాడు కాని ఎక్కడికి ? ఇంకో ప్రపంచమెక్కడ ? వాడికి

మాలచ్చి చక్కని చుక్క

వంటయింటి కూరలు తరగడం, బియ్యం బాగుచేయడం మాలచ్చి పనులు మాలచ్చిని చిత్రంగా ఓసారి సీతారాములు రక్షించాడు

బియ్యంలో ఒక్క రాయి ఉన్నా, అది అన్నం లోకి వచ్చినా దానికి ఫైను తప్పదు ఐతే సీతా రాములు "కాంతమ్మ" గారు చేసిన ఫిర్యాదుమీద అయ్యగారిదగ్గర "ఒక్క అయ్యగారి భోజనంలో వస్తేనే కాని ఇంకెవరి భోజనంలో రాళ్లు కాదు కొండలు వచ్చినా ఫర్వాలేదయ్యా" అనేశాడు

మాలచ్చిమి రక్షించబడిన రోజున తనను ఎంత హాయిగా, నోరగా చూసిందని ? ఒళ్లు పులకరించింది వాడికి నోట వేసుకున్న పూతరేకు ముక్కలా కొన్ని గుండె కరిగినట్లయిపోయింది

అయ్యగారంటే ఎంత గురో మాలచ్చిమి అంటే కూడా తనకు అంత 'ఇది' అనుకున్నాడు ఓసారి వాడు

ఐతే యిటీవల వాడికి మాలచ్చిమితో నేస్తం పెరిగింది అసలు అదే వాడితో దోస్తీ పెంచు కున్నది రక్షించబడిన రోజునే "మామా" అనే సిందది వాణ్ణి

కళమ్మ పెద్ద యింగిలీషు క్లాసు చదువు తూంది ఆపిల్ల రాక వెల్లకితలా పడుక్కుని మెడ వెనక్కి వాల్చి తల్లకిందులా ఆకాశపుటంచుల చూస్తున్న కళ్ల పడింది

"ఒరే రాములూ ! నాన్నగారు కోయంబత్తూ ర్నుంచి ఎప్పుడొస్తారేం ?" అన్నది కళ

ఉలిక్కిపడ్డ రాములు లేచి కూచుని "అమ్మా యమ్మా నేనోమాట అడగనా ?"—అన్నాడు

కళ చాలా చక్కగా నవ్వుతుంది సీతారాములు

ఒకసభలో అధ్యక్షులవారు తీవ్రంగా ఉపన్యసిస్తున్నారు. మానవుని కర్తవ్యాలని గురించి వివరిస్తూ,

"అసలు మన మెందుకుపుట్టా మని" అధ్యక్షులవారు ప్రజానీకం వైపు ప్రశ్నార్థకంగా చూశారు.

"ఉపన్యాసాలివ్వటానికిసార్" అని గుంపులోనుంచి ఒక గొంతు వినిపించింది.

బి వేణుశ్యాం (రామదాసుపేట)

అడిగేడు "ఆ బొంబాయి సమ్మందం చేసుకో రాదూ అంతపెద్ద షేరు బిజినెస్సు గదా వారిది . లక్ష రూపాయిల కట్నం యిస్తారు గదా ? అయ్య గారు ?"

కళ వాడి మాటలకి కోపం తెచ్చుకుని నౌకరు వెధవ అధిక ప్రసంగం అనదు మరీ అందంగా నవ్వుతుంది

"షేర్లు సుఖం యిస్తాయిరా సీతారాములూ? నువ్వు యిక్కడ యీ గడ్డిలో దొర్లకపోతే నాన్న గారి ఏర్‌కండిషన్డు రూములో హాయిగా నిద్దరో రాదూ ?"—అసలు ఆ ప్రశ్నతోనే వాడికి విచారం పులుముకుంటుంది

"అమ్మ బాబోయ్ ! ఆ మేజాక్రింద నక్కి నక్కి ఛస్తాను తెలుసా ? చలిగా చల్లగా ఎము కలు మెత్తబారి పోతాయి ఐనా గాపోపోయినా కళమ్మా షేర్లు సుఖం ఇవ్వవు మరేంటి యిస్తాయో ?"

"నీకు తెలియదుగాని ఆ చిన్నకారు నాకు కావాలి షెడ్డు తాళాలియ్యి పోతాను .... "

కళ ప్రేమప్రవాహంలో కొట్టుకుపోతున్న దని కవిత్వం మినహాగా అనుకున్నాడు సీతారాములు కాని అందుకే అయ్యగారి మాటలపోకంతో వచ్చిన వాక్యం అనేశాడు

"గొప్పింటి బిడ్డవని మరిచిపోకమ్మా ! ఎట్నుంచి ఏమొచ్చినా మా గుండెలమీద కుంపటవుతాది."

"ఛా ! నోరుముయ్యి ఏ గుండెల కేమొచ్చింది. ఒరే ! నువ్వు అయ్యగార్ని ప్రేమించే మిషనువిరా రాముడూ ఆయనకి పరువుపోకూడా తాలురా. .. నాకు కారు తాళాలియ్యి . మళ్లీ అమ్మ చూసిందో తిడుతుంది "

"ఒంటరిగా వెళ్లి యిట్టే వస్తానని 'ప్రామిస్' చెయ్యి" సీతారాములికి భయం నిజంగానే ఉంది కళమ్మ ఏ మగపిల్లాడితోనో వెళ్తుందని .

కళకి తెల్సు వాడికి తనమీద, చెల్లెలిమీద ఉన్నంత వాత్సల్యం ఉన్నదని వాడు కళని చిన్న ప్పుడు ఎత్తుకుని ఎత్తుకోలేక ఎత్తేసినప్పుడు .. అమ్మ కేకలేస్తే నాన్న " వాడు వాళ్ల అన్నయ్యే అవుతే ఏంచేస్తావే" నని అమ్మని కేకలేయడం, అమ్మ యిప్పటికి అవసరం వచ్చినప్పుడు అది తల్చు కుని మండిపడటం ఆపిల్లకి తెల్సును

"ప్రామిస్ సరేనా ? ఓరబ్బీ ? ప్రేమంటే తెలీదురా నీకు తాళాలు పారేయ్ !" మని ఆపిల్ల తాళాలు లాక్కుని పారిపోయింది

"మాలచ్చిమీ ! యీ అమ్మాయి పరువు తీస్తుందే ఎట్లా చావడం అయ్యో దేముడా ! ఇక ఆ కాంతమ్మ లీలలు, వేషాలు . అయ్యగారికి సుఖంలేదే " వాడు మాలచ్చిమిని తల్చుకుని బాధ వెళ్లబోసుకుంటాడు


అదేవేళకి ఒక్కోసారి మా లచ్చిమి వస్తుంది. వెలిగించిన దీపంలాగుంటుందది అలాంటప్పుడు. వాడికి అంతలో కళ "ప్రేమిస్తే తెలుస్తుందిరా" అన్న మాటలు స్ఫురించేయి "ఛా ! నేను మాలచ్చిమిని ప్రేమిస్తున్నా నన్నమాట" అనుకుని వాడంతలో సిగ్గుపడిపోయి రెండు గడ్డిపరకలు అమాంతం పీకి కొరికేశాడు

"ఛీ! ఏంటి మావోఁ అచ్చాధికారి తర్వాత అంతోడివి యీ గడ్డి కతుకుతుంటే ?" మాలచ్చిమి రానేవచ్చింది హాయ్‌హాయ్ ! దాని కుత్తుకలో కత్తులే ఉన్నాయి దాని స్వరం చెవుల్లోనించి గుండెల్లోకి కరెంటు వదుల్తుంది

"ఏంటో, మాలక్ష్మి ! సుఖంలేదే " నన్నాడు. —అచ్చం అయ్యగారు బోలెడు ఫ్యాక్టరీల డైరె క్టరు, మిల్లు యజమాని, అందమైన అంతస్తుల మేడల సొంతదారు, నలుగురు పిల్లల తండ్రి— అపురూపమైన అందమైన గదిలో కూచుని— అన్న మాటలు, అనుకొనే మాటలు అవే అవే సీతారాములు అన్నాడు !

"ఛీ! ఏంటి సుకం తక్కువ మావాఁ! నీకు ? .. ఆఖరికి నీ బాసకూడా గొప్పోళ్లదే అయ్యిందే ... నన్ను మా లచిమి అనొద్దు మాలచిమి అనాల" అలుక ప్రదర్శించి అంతలో యిసింటా జరిగి, జారిన పైటనైనా గుర్తించకండా యిలా అంది: "ఈ గొప్పోళ్ల గోత్రాలు మా చెడ్డవి — అమ్మ గారికి అయ్యగోరంటే ఉలుకు అయ్యగారికి అమ్మగారంటే బెయమూను. నా మాటిను .నాను





సుఖం

గెనకేనుకో " మాలచ్చిమి హితబోధ వాడికి మరీ కొత్తది కాదు, మరీ పాతదీ కాదు అది గుండెలమీద చెయ్యివేసింది

అంత అందమైన చెయ్యీ, నాగుబాములా తగిలింది

"అయ్యగారు ఎవరనుకున్నావేంటి ?" వాడు మధనపడతాడు

"ఎవరో, ఎవరైతేనేం ? నీ కన్న'తండ్రి' రా, కనుక్కున్న బిడ్డా ?" అలక, యీసారి విజమైనదే మాలచ్చిమిది

అయ్యగారు అయ్యగారే ననుకున్నాడు సీతారాములు వాడికి కన్నతండ్రిని తెలియదు తల్లిని ఎరుగడు వాడు

మాలచ్చిమి ప్రయత్నాలతో వాడికి అయ్యగారి కష్టాలు అప్పుడు కొంచెం చులకన అయినా, అవి సాధారణంగా గుండెల్లో బరువుగానే నాటుతాయి

"ఏంటో సుఖంలే" దన్నాడు—వెంటనే అమ్మగారు నిన్ను పిలుసుక రమ్మందని మాలచ్చిమి నడక సాగించింది

"కాంతమ్మగారి కర్చులు మితిమీరిపోనాయి మామా " అని మాలచ్చిమి చెప్పినప్పటి బాధ యింకా వాడి గుండెల్లో పీకుతూండగానే సీతారాములు మాలచ్చిమిని అనుసరించాడు

అమ్మగారు పిలిచిందంటే హడలిపోలేదు సీతారాములు వాడికి సుఖంగా, ఆరుబయలు, ఆకాశం, మేఘాలు, దుమ్మూ, ధూళీ బురదా అన్నీ దొరికి నాలుగు గడియలేనా అవలేదు బాధగా వుంది వాడికి వాడికి ప్రేమించడం గురించి కళ తెలియజేసిన రహస్యం యింకా అప్పుడే అవగాహన అయ్యింది దాని తియ్యని అనుభూతికేనా తీరిక లేదు

అమ్మగారు చెయ్యెత్తు మనిషి

"ఏమిరా, సీతా ! మీ అయ్యగారు క్యాంపు కెడితే నీకింక తిండీ తిప్పలూ ఏమీ అక్కర్లేదా ? అలా కూచో వాయురా ! వీడికి అన్నీ వడ్డించి అవతలికి పో నే చూస్తూవుండగా వీ డివాళ భోజనం చెయ్యాలి"—

"అమ్మగారు నా కాకలిగా లేదండి"—సీతారాములికి ఆకలిగా ఉంది గాని తినాలని లేదు

"బాగుందిరా ! నీకు వేరే కొంపా గోడూ ఉన్నాయిరా నీ ఆకలి నాకు తెలియదా ? లేపోతే నీకు వేరే ఎవతేనా, మరదలుపిల్ల ఉన్నదా ? గంప ఎత్తుకొచ్చి ముంతముద్ద లెట్టడానికి "రా ! తిను . వూ"—అమ్మగారు గద్దించింది

వాడు కిక్కురుమనకండా కూచున్నాడు అమ్మగారన్న మాటలు వింటూవుంటే మాలచ్చిమి, దాని కొంగున కట్టుకొచ్చిన కూడు "రుచి" అనిపించేయి.

"ఈ సంస్కారం యీ ఖరీదైన భోజనం, యిందులో లేని సుఖం యెక్కడనో వుందని" పించింది వాడి గుండెల్లో ఎవరో చెప్పినట్టు

"అయితే రాముడూ మీ అయ్యగారు మొన్నటి కొత్త బంగాళా, ఎ వ రి పే రు న పెడదామనుకుంటున్నారు ?"

"వీడు నౌకరా ? కాడు " అని లోపల లోపల వాళ్ళే తిట్టుకుంటూనే అమ్మగారడిగింది

ఆమె వేసిన ప్రశ్నలో విపరీతం, విచిత్రం

గోచరించదు సీతారాములికి అయ్యగారిని తానే పోయి అమ్మగారు అడగ్గలగడం, పని సాధించు కోడం, యీ రెండూ వాలుగుసంవత్సరాల వెను కటిమాట

వాడి సమాధానం యిది

"అమ్మా! కళమ్మగారికి అయ్యగారు తెచ్చిన లక్షరూపాయల సమ్మంధం మీరు నచ్చచెప్పరాదూ?"

పెద్దింటి విషయాలు నీ కెందుకురా అనగల ధైర్యం ఆమెకు లేదు

"అమ్మగా రొకనాడు పెట్టిన భోజనం అయ్య గారు విసిరేసి "నీమాట, నీ తిండీ రెండూ నాకు విషమే ఇక నీచేతి తిండి, నే తిన" నన్నప్పుడు సీతారాము లొక్కడే అక్కడ సాక్షిలా నిల బడ్డవాడు అది నాలుగోకంటివాడికి తెలియక పోవడమే సీతారాముని సంస్కారం—

"అది కాదురా యీ బంగళా ఎవళ్ళేపేరు చేస్తుందటగా మళ్ళీ ఆ "రంజని" పేరిట రాస్తారా? అయినా గాకపోయినా యీ వయ స్సులో యింత వెరువుతక్కువపనులు చేయడం నా కర్మరా" అంతలోనే ఆమె కుతూహలం బాధ, బాధ, దిగులూ అయిపోయింది

"లేదమ్మా! అయ్య మీటింగ్ అడావుడిలో పడి పోయారు ఒకవేళ అది కళమ్మకి పెళ్లికానుకగా రాస్తారేమో?"—సీతారాములికి కొత్త బంగళా అయ్యగారు రంజని పేరున, కాదూ, కళ పేరున కాదు మరో అందాలతారకి రాస్తానని వంటిమీద తెలివిలేనప్పుడు ఒప్పేసు ... రని తెలును అయినా.

"అమ్మా! అయ్యగారి చిన్నతమ్ముడు సీమనుంచి వస్తాడంటగా ...." వాడి భోజనం ముగియ వచ్చింది

"ఛీ! వాడా? అప్రాచ్యపు వెధవ ఏ దొరసా నినో కట్టుకుని వస్తాడటగా" ఆమె అసహ్యం అంతలో పోయి దిగులు మళ్లీ ప్రత్యక్షం "అసలు యిల్లాలిని దుఃఖపెట్టే వంశంరా వాళ్లది " ఆమె నౌకరుముందు దొరికిపోతున్నానని మళ్లీ దుఃఖమంతా దాచుకుంటుంది

"అయితే శేఖరంమీద ఆయనకోపం చల్లార లేదా?"

శేఖరం అమ్మగారి మేనల్లుడు కాంతికి తగిన వరుడని ఆమె నమ్మకం కూడాను కాంతికి కూడా బావ అంటే నమ్మకమే

అయ్యగారు అతగాడికి బాంకులోనుంచి ఉద్యోగం వేయిస్తే డబ్బు తీసుకొని స్కూటరు కొనుక్కున్నా డతగాడు ఏమంటే కాంతి సరదా పడిందన్నాడు "అయ్యగారు" ధర్మరాజు గనక జైలుప్రాప్తి తప్పిందన్నాడు ఆరోజున సీతా రాములు "ఈ జన్మలో వాడిమొహం నాకు అగు పించనీయకు" అన్నాడు అయ్యగారు శేఖరాన్ని

"అమ్మా! కాంతమ్మకి అల్లుడి సమ్మంధం అయ్య ఒప్పుకోరమ్మా" అన్నాడు సీతారాములు

"ఔను! ఈ కోటీశ్వరుడి బందిఖానాలో నాకు అధికారం ఏముంది? అంతా ఆయన ఇష్టమే చెక్కుబుక్కులోనుంచి కాగితాలు సంతకాలు పెట్టి ఎంత కావాలో వేసుకోమని ఆయన బజారుముం " అవిడ ఆగిపోయింది పిక్‌నిక్‌కని వెళ్లిన కాంతి రివ్వున వచ్చేసింది

"మరేం మరేం బావా నేనూ వెళుతూ వుంటేమా స్కూటర్ తోవలో తోవలో తుమ్మచెట్టును గుద్దేశిందే" రొప్పుతూ చెప్పింది

"అయ్యో! అయ్యో!" కూతుర్ని గుండెల కదుముకుని ఆందోళనపడిపోయింది అమ్మగారు "దెబ్బ తగల్లేదుకద! అయ్యో! యింతకీ బావేడీ!"

"బావ బావ, " కాంతి గొంతుక బొక్కి ట్టింది సీతారాములికి భయం వేసింది అమ్మ గారి గుండె జారిపోయింది

కాంతి ఏం ఉపద్రవకరమైన వార్త చెపుతుందో నని యిద్దరూ వినడానికి భయపడ్డారు కాంతి నిజంగా గాభరాపడ్డది

"మరేమో తను గెంతేసి నన్ను నన్ను" తల్లిగుండెల్లో సిగ్గుపడి తల దాచుకుంది ... ఆ వాక్యం నగంలోనే పూర్తైపోయింది

విశ్రాంతిగా అమ్మగారు నిట్టూర్చింది

సీతారాములు ఫక్కున నవ్వేశాడు

తండ్రి:- ఏమిట్రా! నా గదిలో గోల

కొడుకు:-నేను, చెల్లీ ఆడు కుంటున్నాం నాన్నగారు

తండ్రి:-ఏం ఆటరా! ఒక ప్రక్క గోలచేస్తూ!

కొడుకు:- అదేనండి! 'దెబ్బ లాట' 'నేను' చెల్లి దెబ్బలాడు కుంటున్నాం.

పి గోపాలకృష్ణ (చేబ్రోలు)

"ప్రయోజకుడేనండమ్మ .. ఆ బ్బ డు" అన్నాడు

"ఛీ! ఛీ! నౌకరు వెధ " కాంతి తిట్టలేక పోయిందికాని ఆపిల్ల కళ్లల్లో కోపం తాండవించింది

"ఛీ! అయ్యగారి ముక్కు మొహం పోలి పుట్టేవావుగాని గుణం రాలేదు తల్లీ నీకు కళమ్మకున్న సాత్వికం లేదు నీకు నీకూ ' ఏమ వాలో తెలియక సీతారాములు "అత్త కొడుకు బావే సరి" అనేశాడు

అమ్మగారు నవ్వు దాచుకొని "నువ్వు పోరా అవతలికి" అనేసింది

వెళుతూవున్న సీతారాముని చెవిలో కాంతి మాటలు "ఈ వెధవని తగిలేస్తేగాని మనకి సుఖం లేదే" అన్నవి స్పష్టంగా పడ్డాయి

వాడేమీ అనలేదు అనుకోలేదు

2

మాలచ్చిమిని చూసి ఆశ్చర్యపోయాడు సీతా రాములు ఉలిక్కిపడ్డాడు "ఇది మా కాంతమ్మ చీరెలాగుందే ... యింత ఖరీదైన చీరె నీ కెక్కడిదే"

అనేద్దా మనుకున్నాడు అనేశాడుకూడాను

"ఛా! నాకేడదా? మీ కాంతమ్మది నాకెందు కేంటి? నేను కొనలేనా? గింతచీరె " ఒయ్యారంగా, విలాసంగా నవ్వేసింది మాలచ్చిమి

"ఛా! చెప్పమంటే? యిదెంత ఖరీదో తెలుసా?"

"తెల్దు మామా! నీయంత గొప్ప నాకేడదీ? ఉత్త వల్మారిదాన్ననేగా నీ యిది " నొచ్చు కుంది మాలచ్చిమి అన్నది "స్టారులా గుంటానంట తెల్సా? గింత మహా పట్నవాసం నడిబొడ్డున నాబొడ్డు కోసినారు, తెల్సా? మా అయ్యది 'ఇబరా బాద' నగరం మా యమ్మది యిసాపట్నం"—

అందులో అది అంత నొచ్చుకుని గిలిగిలాడి పోవర్సింది ఏమున్నదో దాన్ని" స్టారులా గున్నా"వని ఎవరన్నారో సీతారాములికి తెలిసిందికాదు

"ఛా! ఎందుకే పిల్లా నీకంత రోసం ? నువ్వు చక్కని చుక్కవేలే పో నేను పోవాలి. అయ్యగారు మంచంమీదున్నారు " —బుగ్గ మీద చిటికెవేసి పరిగెట్టేడు సీతారాములు

అయ్యగారికి జబ్బుచేసింది రెండు హమేషా లుంటున్నా డాయన్ని కనిపెట్టుగుని సీతారాములు.

అరుగురు డాక్టర్లు! అయ్యగారు నాటికి ఆరవ రోజున మధుర వెళ్లవల్సివున్నది గనక ఐదు రోజుల్లో ఆయనను బాగుచెయ్యాలని ప్రయత్నం చేస్తున్నారు

అయ్యగారికి మందు తాగాలన్నా భయమే ఆయన కడుపునొప్పి వార్త ఎలా తెల్సిందో ఐదారు వందల మైళ్ల పరిధిలో ఉన్న వారన దాయాది బృందమంతా వచ్చి వాలిపోయింది

సీతారాములికి కంట కునుకు లేదు అయ్య గారి కడుపునొప్పికి ఆయనమీద కనికారంలేదు

అయ్యగారికి ఏర్ కండిషన్డు రైలుబండిలో రిజర్వైన రెండు సీట్లు రద్దుచేసి తీరాలన్నారు డాక్టర్లు వీల్లేదు ఏడోతేదీ ఉదయం నేను మధు రైలో ఉండాలన్నారు అయ్యగారు

"ఒరే రాములు నువ్వు యీసారి కూడా నాతో రావాలిరా " అయ్యగారు యిటీవల వాడికి సుఖాన్ని, ఆటవిడుపుని యివ్వడంలేదు ఎక్కడకు వెళ్లినా వాడున్నా ఆయనతోపాటు ఉండాల్సిందే

వాడికి అయ్యగారిని వదిలి ఉండడం యిష్టం లేదు గాని అసలు మాలచ్చిమిని చూసిందికైనా, తోటలో పిచ్చిగా పరుగులుతీసిందికేనా లేని బాధ స్పష్టంగా ఉంది

మాలచ్చిమి కనిపించినప్పుడేనా, దాని కులుకు, షోకు ఎక్కువగానే ఉన్నది గాని, వాడికిమళ్లే దానికి, యెడబాటుబాధ తెలిసినట్లు కనిపించడం లేదు అది వాడికి ఖేంగే అయికూచుంది మాలచ్చిమి ఖరీదైన చీరెలు, నగలు ఎలా సంపాదిస్తున్నదనే ప్రశ్న వాడిలో ఉదయించిందేగాని అది యింకా అను మానం అవలేదు దొంగతనం, వెనకేసుకోవడం అనే రెండు లక్షణాలను స్పైతం దానికి అంట కట్టడం వాడికి యిష్టంలేదు

అయ్యగారు తనకేసి చూసిన ఒంటరివేళ సీతారాము లన్నాడు

"అయ్యా! ఆరోగ్యం బాగులేదు ఇన్‌స్పెక్షనూ వద్దు, ప్రయాణమూ వద్దు. నామాట వినండి"

సుఖం

వాడు రెండు చేతులతోను అయ్యగారి పాదాలను మెత్తగా పట్టుకున్నాడు

“కాదురా నువ్వు మధుర్కై పద . నాకోసరం రిజర్వుచేసిన రైల్లో పద .. ఫైల్సు తీసుకో సెక్రటరీ నాతో వస్తాడు నాకు బ్రతికి సుఖం లేదురా రాముడూ .” అయ్యగారి నిర్ధారణగా మాట్లాడ్డమే తతిమ్మా జనం ఎరుగును కాని సీతారాములు ఆయన జాలిమాటలు కూడా వినగలడు

“వద్దయ్యా! మీకు లేని సుఖమేంటి? కోటీశ్వరులు”—

“వెళ్లరా! నేను వచ్చి చెబుతాగా వెళ్ళు”— అయ్యగారికి హుకుం యివ్వడం ఒక్కటే తెల్సునని నౌకర్లందరికీ తెల్సినసంగతి సీతారాములు కూడా ఎప్పుడూ కొట్టిపారేలేదు

“సరేనయ్యా” అన్నాడు అన్నాడు కాని గుండెలు జారిపోయాయి వాడికి ఎక్కడి మధుర్కై ఎక్కడి తను అసలు తనెవడు? అయ్యగారి సీట్లో కూచుని వెళ్లడానికి

“నీపుణ్యం ఏంటోగాని దిక్కుమాలిన వాడివైతేనేం గాని రాజభోగంరా నీది' అనేశాడు బేగ్ నందుకుంటూ డాక్టరు డాక్టరు అలా అంటూ వాడి వీపుమీద కసిగా చరిచిన చరుపు యింత పిసరు వాడికి ఆనలేదు — మాటలుమాత్రం గుండెల్లో పొడుచుకున్నాయి

“ఛీ! బ్రతుక్కి సుఖంలేదు” అన్నది వాడి అంతరాత్మ

“ఛీ! యిప్పుడే పోయి రాజీనామా యిస్తాను. దిక్కుమాలిన బ్రతుకు చస్తాన” న్నాడు గట్టిగా విసురున అయ్యగారిదగ్గరికి వెళ్లేడు

“ఇష్షు బయటికి నడు” అన్నది నర్సు అయ్యగారికి నిద్రపట్టింది కాబోలు సీతారాములు బయటికి నడిచేడు అయ్యగారు కన్నుమూస్తే తనెవరింక? నౌకరు నౌకర్లకి కూడా కిట్టని నౌకరు

వాడి గుండెల నేదో నమిలేసినట్లయింది

సెక్రటరీ వచ్చి కూకలేశాడు “పదరా స్టేషనుకి దొరా! అంతా రెడీ” అన్నాడు

సీతారాములికి అయ్యగారిని వదిలి వెళ్లబుద్ధి అవలేదు “మరి అయ్య విమానం బుక్‌చేశారా?” వాడి ప్రశ్నకి సెక్రటరీ ఎంతో వెటకారంగా “చిత్తం” అన్నాడు

సీతారాములికి అయ్యగారిని వదిలి వెళ్ల బుద్ధయ్యిందిగాదు వెళ్లక తప్పిందికాదు

3

రైలుస్టేషను చాలా పెద్దని విచిత్రంగా లేదు సీతారాములికి అది వాడికి అలవాటైన స్టేషనే. వాడు యింకా పెద్ద స్టేషన్లు చూశాడు. కాని అంతా కొత్తగా ఉంది

“ఇవి లక్షలకి విలువైన కాగితాలు ఒరే! భద్రం సుమా రెండుసీట్లు నీకే .. ఏర్ కండిషన్డురా బాబూ! వెళ్ళు వెళ్ళు . అక్కడ

అయ్యగారికి ఫాక్టరీ వాళ్లిచ్చిన రూమ్‌లో యివి పెట్టుకో " సెక్రటరీ సాగనంపుతూ చెప్పేడు

సీతారాములికి గుండెలు పీకుతున్నట్లుంది రైలు నిర్దాక్షిణ్యంగా కదిలిపోయింది. వాడు అయ్యగారి పెశ్శి నొక సీటులో ఉంచాడు రెండో దానిలో తాను ఒదిగి కూచున్నాడు

రైల్లో చలిగా చల్లగా ఉంది బయట చిక్కగా చీకటి ఉందనుకున్నాడు లోపల ఆకు వచ్చ దీపం

మెత్తని సీటు వాడికి ముళ్లకంచెలా గుంది

వాడు జేబు పట్టుకుని ముడుచుకుని కూచు న్నాడు కునుకు రానేలేదు జేబులో ఐదువందల రూపాయి లున్నాయి అక్కడ హోటల్లో కట్టు లన్నాడు సెకరట్రీ

అసలు తాను ఎక్కడికి వెళుతున్నదీ మరిచి పోయాడు సీతారాములు వాడికి అయ్యగారి కడుపునొప్పి గురించి బెంగ

కళమ్మ పెళ్లిగురించి తలపోత లొచ్చాయి "ఇాచక్కా పిల్ల బొంబాయి సమ్మంధం ఒప్పుకుంటే అయ్యగారికి సుఖం ఉంటుందనుకున్నాడు కాని కళ కాలేజీలో ఎవర్నో ప్రేమించిందన్న అను మానం వాడికి పోలేదు సీతారాములికి భయం వేసింది

కళ ప్రేమవ్యవహారంగాని, కాంతి పెళ్లి విషయంగాని అయ్యగారికి తెలిస్తే ఆయన రివా ల్వర్ తీసి ఆ ఇద్దర్నీ కాల్చేస్తాడు

సీతారాములు కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. రైలు వెడుతున్నదో అవతల వెలుతు రున్నదో .. బయట ప్రపంచ మున్నదో పగలో రాత్రో .

వాడు ముడుచుకుని కూచున్నాడు చలిగా ఉంది బాధగానూ ఉంది మాలచ్చిమిగురించి జ్ఞాపకం వచ్చింది

"మాలచ్చిమి కంతడబ్బు ఎక్కణ్ణించి వస్తు న్నదో . " నన్న అనుమానం వచ్చింది అది సిల్కు చీర కట్టుగుంటున్నది బంగారం గొలుసు చేయించు కుంది

"కోటీశ్వరుడి తర్వాత అంతోడు, నీ నీడుండగా నాకు కొదవేంటి ?" అన్నదది వాడు జుట్టు పీక్కున్నాడు దాని మాటలు వాడి కర్థం అవలేదు

అయ్యగారికి ఎన్నో రహస్యాలున్నాయని, అవన్నీ తనకు తెలుసునని—అందరూ అనుకుంటారు కాని అయ్యగారికి సుఖంలేదన్న రహస్యం ఒక్కటే కద తనకు తెలుసు !

అయ్యగారి రహస్యాలు వాడు ఆలోచనలలో సుడిగుండంలోపడ్డ పడవలాగ గిరగిర తిరిగేడు

పెద్దకొడుకు లాయ రవలేదనీ .. కారు తాకట్టుపెట్టి డబ్బు ఖర్చు చేశాడనీ అయ్యగారికి బెంగ

చిన్నకొడుకు తన సంతకం ఫోర్జరీచేశాడని చెక్కు మార్చుకున్నాడు అనీ ఆయన బాధ.

కళ ఎన్ని సమ్మంధాలు చూసినా, చేసుకో వటేటున్నదనీ ఆయనకి కోపం.

తమ్ముడు దొరసానిని చేసుకొని సీమనించి దిగ బోతున్నాడనీ ఆయనకి దిగులు

ఆయన "రంజన" కి బంగళా యిచ్చేసిందికి కారణం . అమ్మగారి మీది కోపం . క్లబ్బులకు చెక్కుబుక్కు తీసికెళ్ళడానికి అమ్మగారిమీద ఆయ నకు పోయిన నమ్మకమే కారణం

సీతారాములికి నిద్ర రాలేదు ఆకలి వేయ లేదు రైలుబండి ఐదువందల మైళ్ళ ఆగుతూ పరి గెడుతూనే ఉంది

"బాబోయ్ ! ఈ ఉద్యోగం వదులుకుంటాను దిక్కుమాలినవాణ్ణి నాకు ఈ అయ్యగారితో సమ్మంధం ఏమిటి ? తిరిగివచ్చి నౌకరీ వదిలేస్తాను మాలచ్చిమితో మరోవూరు పోతాను " అని గట్టిగానే అనుకున్నాడు వాడు

అందరూ గొప్పవాళ్ళ ప్రయాణంచేసే ఆ రైలు పెట్టెలో సీతారాములి మాటలు ఎవ్వరికీ విని పించలేదు నిద్ర చలి . అందులో రెండోది సీతారాముల్ది మొదటిది తతిమ్మావాళ్లది

సీతారాము లదివరకూ అయ్యగారు ఆయన సమస్యలు వీటి గురించి బాధపడేవాడు మాలచ్చిమికి కూడా వాడు తనబాధ చెప్పేవాడు కాదు 'దాని కులుకు వెంటనే చచ్చిపోయేదని" భయం దానికి అయ్యగారిమీద ప్రేమలేదు

తోటలో ఒక్కడే బాటప్రక్కని ఒంటిరేక బంతిపువ్వుతో చెప్పుకునేవాడు

తనెక్కణ్ణించి వచ్చాడో ? అసలీ అయ్యగా రెం దుకు తన నిటువంటి ఉద్యోగంలో ఉంచుకున్నాడో అయ్యగారినే అడగాలని చాలాసార్లు అనుకున్నాడు

అడగలేకపోయాడు

*　　　*　　　*

మధురై స్టేషనుతో దిగిరమ్మని పోలీసులు వచ్చి దిగమనేవరకూ వాడు ఆలోచిస్తూనే ఉన్నాడు

వాడు బిక్కచచ్చిపోయాడు. వాడిభాష పోలీసులకి గాని తెలియలేదు

సీతారాములికి ప్రపంచంమీద కోపం వచ్చింది. తనను అందరూ హింసపెడుతున్నట్లే అనిపిం చింది "ఛీ ! అంతా అయ్యగారి నించే వచ్చింది . ఛీ ఆయన పాడు ఉద్యోగం మరి చెయ్యను. రాజీనామా యిచ్చేస్తా"నంటూవాడు గావుకేకవేశాడు.

లాభం లేకపోయింది

పోలీసులే వాణ్ణి మరి ఆరుగంటల తర్వాత పెద్దహోటల్లో, అయ్యగారిపేర రిజర్వయిన రూములో వదిలిపెట్టేరు

సీతారాములికి "అయ్యగారు వస్తారుకద యిక ఆయనకి చెప్పేస్తాను కద యీ నరకం నాకొద్దని" అనే ధైర్యం వెంటనే వచ్చింది

గదిలో అయ్యగారి సామానులన్నీ పెట్టి గది ముందు కూచున్నాడు సీతారాములు

ఆకలి వెయ్యలేదు నిద్ర రాలేదు, సీతారాములికి అయ్యగారి కారు కోసరం వాడు హోటలు గేటు కేసి చూస్తూ అలాగే గుమ్మంలో కూచున్నాడు కళ్ళు కాయలు కాచేయి

శరీరం పీక్కుపోయింది విమానంలో రావల్సిన అయ్యగారు రాలేదు వాడి ధైర్యం దిగజారి పోయింది

అయ్యగారు రాగానే వాడు పారిపోదామను కున్నాడు ఇక విముక్తి లభిస్తుందన్న నమ్మకం నన్నగిలిపోగానే వాడు ఫ్యాక్టరీకి పరిగెట్టేడు

వాణ్ణి చూసి "మీ అయ్యగారికి ఆపరేషను చేస్తారు రేపు నువ్వు తిరిగి పో" అన్నాడు మేనేజరు

సీతారాములికి గుండెలు జారిపోయాయి మేనేజ రిచ్చిన టిక్కెట్టు అయ్యగారి సామానుతో వాడు రైలెక్కాడు

రైలు నాడు అందులో కూచున్నా యీసారి వాడి గుండెలమీదే పరిగెత్తింది చెవుల్లోనే హోరెత్తింది. "అసలు నే నెవరు ? నన్నెందు కీ నరకానికి అయ్య గారు గురిచేశారు ? ఆయన్నే అడుగుతా" నను కున్నాడు ఏదువందలమైళ్ళ దూరంపాటువాడు. "అప్పటికిగాని తనకి సుఖంలే" దనుకున్నాడు

సీతారాముల్ని ఎవ్వరూ పోల్చలేనంతగా పీక్కు పోయాడు వాడు బంగళా చేరుకొనేసరికి వాణ్ణి వాడే పోల్చుకోలేక పోయేడు

అయ్యగారి మరణవార్త వాడి చెవుల్లో పడింది వాడు పరిగెట్టేడు పరిగెడుతూ — తోటలో మొక్కలకి నీరుపెట్టే కాలువలవార ఒంటిరేక గడ్డిబంతి పువ్వు దగ్గర పడిపోయాడు

"అయ్యగారు సుఖపడ్డాడు నేస్తం విన్నావా? నన్నుమాత్రం నన్నుమాత్రం ... అసలు నేనెవరు ? నే నెవరు "

గడ్డిబంతిపువ్వు తలూచిందికాని మాటలాడ లేదు సీతారాములి ఆఖరిమాటలు విన్న దొక్క ఆ పువ్వేను మరెవరూ వాణ్ని చూడలేదు అయ్య గారు ప్రాణం విడుస్తూ "నాయనా రాములూ" అన్న మాటలు—సీతారాములు వినలేదు అయ్య గారి "సుఖంలేదన్న" మాట ఒక్కటే వాడికి దక్కింది

సుఖం దక్కిందికాదు

రహస్యం —తాను ఎవరన్న "రహస్యం"— చిక్కిందికాదు. ★

ఓడమీద కడ్డీలు పట్టుకొని వంగి సముద్రములోకి చూస్తున్న ఒకస్త్రీ పొరపాటున సముద్రము లోకి జారిపడింది. వెంటనే ఇంకొక మనిషి దూకి ఆమెను లైఫ్‌బోటు వచ్చేదాకా కాపా డాడు తీరానికి వచ్చింతరువాత చూస్తే ఆమనిషి చాలా వృద్ధుడు. చుట్టూవున్న జనం అతని సాహ సానికి పొగడసాగారు. ఒళ్లు తుడుచుకుంటూ ఆవృద్ధుడు ఇలా అన్నాడు "ఇంతకీ ఆమె పడం గానే నన్ను సముద్రములోకి నెట్టింది మీలో ఎవరు."

యం. వి. రామకృష్ణరావు (చీరాల)

మనమూ-మన రాష్ట్రం

(7-వ పేజీ తిరువాయి)

ప్రభుత్వానికి అప్పగించడంకన్నా, రాష్ట్ర ప్రభుత్వానికి గత్యంతరం లేకపోయింది

ఈ గనులను కేంద్రం తీసుకోడంవల్ల కొంత లాభం, కొంత నష్టం ఉంది లాభం — మద్రాసులో నైవేలి లిగ్నైట్ గనులను అభివృద్ధి చేసినట్లు, భారీగా పెట్టుబడిపెట్టి ఇక్కడకూడా ఎంతో వృద్ధిచేసే వీలుంటుంది సింగరేణి గనుల్లో 20కోట్ల టన్నుల బొగ్గు దొరుకుతుందని అంచనా ఏటా 60 లక్షల టన్నులు ఉత్పత్తిచేసినా, మరో 30, 40 ఏళ్లదాకా ఢోకా ఉండదు కనుక దీర్ఘకాలిక దృష్టిలో పెద్ద పెట్టుబడి పెట్టవచ్చు ప్రభుత్వరంగంలో బొగ్గు ఉత్పత్తి మెరుగ్గా ఉందని ప్రయివేటు పారిశ్రామికులే అంగీకరిస్తున్నారు కనుక ఈ గనులు వృద్ధిలోకి రావన్న భయం లేదు పైగా ముఖ్యమంత్రి చెప్పినట్లు, ఇక్కడ మరో 20 వేల మందికి ఉపాధి లభిస్తుంది రాష్ట్రప్రభుత్వం కూడా వదేసి రూపాయల షేర్ల విలువ 12 దాకా, పెరిగింది గనుక ఆ రూపేణా కొంత లాభం చేసుకోవచ్చు

నష్టం — దేశంలోకెల్లా పెద్ద బొగ్గుగనులను, రాష్ట్రంలోకెల్లా పెద్ద పరిశ్రమను, రాష్ట్రప్రభుత్వం పోగొట్టుకొన్న ట్లవుతుంది ఏటా లాభంలో వచ్చే వాటా కూడా కోల్పోడ మవుతుంది అంతేగాక మన రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలో మనవాళ్లకు గాకుండా ఇతర రాష్ట్రాల వారికి ఎక్కువగా ఉద్యోగాలు లభించే ప్రమాదం తప్పదు కాని ఇటు ఉద్యోగుల నియామకాలకుగాని, అటు బొగ్గు పంపిణీలలో కాని రాష్ట్ర ప్రభుప్రభుత్వానికిక బొత్తిగా పలుకుబడి ఉండదు సింగరేణి బొగ్గుగనుల ఆసరా చూచుకొని పెడుతున్న కొత్తగూడెం ఎరువుల ఫ్యాక్టరీ, దుక్కఇనుము ఫ్యాక్టరీ, ఇలాంటివన్నీ ఇకముందు కేవలం కేంద్రం దయాధర్మాలపై ఆధారపడవలసి ఉంటుంది రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదిపే వీలుండదు

ఏమైనా 60 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించలేం, అందుకుతగ్గ పెట్టుబడిపెట్టే తాహతూ లేదు అని ముఖ్యమంత్రి అంటున్నా, ఎలాగైనా ఈ గనులను రాష్ట్రప్రభుత్వమే నిర్వహించాలని పట్టుబట్టడంలో అర్థం ఉండదు కాకపోతే ఒక పెద్ద పరిశ్రమను కోల్పోతున్నది గనుక, రాష్ట్రప్రభుత్వం కేంద్రంనుండి అందుకుతగ్గ ప్రతిఫలం సంపాదించగలిగితే గ్రుడ్డిలో మెల్ల అవుతుంది

* * *

ఆంధ్రలో మాదిరి తెలంగాణాలోకూ మద్యనిషేధం పెట్టడానికి తనకేం అభ్యంతరంలేదని, మద్యనిషేధం అవసరమనే వారితో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని తెలంగాణానాయకులలో ముఖ్యుడు, ఉపముఖ్యమంత్రి శ్రీ కొండా వెంకటరంగారెడ్డిగారు ఈ మధ్యపత్రికా విలేఖరుల సమావేశంలో చెప్పారు అంతేగాక, ఇన్నాళ్లు మద్యనిషేధం వద్దంటున్న తెలంగాణా కాంగ్రెసు శాసనసభ్యులు కూడా ఇప్పుడు మద్యనిషేధానికి అనుకూలురుగా ఉన్నారని, ఈ సందర్భంలో వారొక విజ్ఞాపన—మద్యనిషేధాన్ని కోరుతూ — తయారు చేస్తున్నారని కూడ రంగారెడ్డి చెప్పారు


మద్యనిషేధం దేశమంతటా అమలుపరచడమన్నది చిరకాలంగా కాంగ్రెస్ విధానమే అయినా, అన్ని రాష్ట్రాలు మద్యనిషేధాన్ని అమలుచేయాలని రాజ్యాంగచట్టంలోని ఆ దేశాలసూత్రాలలో స్పష్టంగా పేర్కొన్నా, తెలంగాణాలో మాత్రం నసేమీ వల్లకాదంటూ వచ్చిన కాంగ్రెస్ సభ్యులలో ఈ ఆకస్మిక పరివర్తనకు కారణం ఏమిటి అని జనం మధనపడతారని ఆ రహస్యం కూడా శ్రీ రంగారెడ్డే వెల్లడించారు మద్యనిషేధాన్ని వ్యతిరేకించేవారికి ఈసారి కాంగ్రెస్ టికెట్ ఇవ్వరాదన్న షరతు పెట్టారని, వాతావరణం అనుకూలంగా మారడానికి అసలు కిటుకు ఇదేనని ఆయన అన్నారు నిజాన్ని దాచుకోకుండా నిర్భయంగా బయటపెట్టినందుకు శ్రీ రంగారెడ్డి ఎంతైనా అభినందనీయులు వారి ధైర్యం ప్రశంసనీయం

శ్రీ రంగారెడ్డి చెప్పినదాన్ని బట్టి, తెలంగాణా కాంగ్రెస్ ఎం ఎల్ ఎ లకు మద్యనిషేధ ప్రయోజనాలలో నమ్మకం కుదరలేదని, కాంగ్రెస్ టిక్కెట్టు సంపాదించుకోడం కోసం ఆపద్ధర్మంగా మాత్రమే ఇందుకు అనుకూలంగా మారుతున్నదని స్పష్టమవుతోంది కాగా రేపు ఎన్నికలు పూర్తి అయాక ఈ ఎం ఎల్ ఏ లే తిరిగి గెలవడం జరిగితే, మద్యనిషేధాన్ని మళ్లీ ప్రతిఘటించి తీరుతారనే అనుకోవలసి వస్తోంది

మద్యనిషేధాన్ని వ్యతిరేకిస్తే కాంగ్రెస్ టికెట్ ఇవ్వరాదన్న షరతు పెట్టినవారు, కాంగ్రెస్ అభ్యర్థులుగా ఎన్నికలో నెగ్గిన తర్వాత మళ్లీ మద్యనిషేధాన్ని వ్యతిరేకిస్తే సహిస్తారా ? క్రమశిక్షణ చర్య తీసుకోరా అనవచ్చు సహించినా ఆశ్చర్యం లేదు భూసంస్కరణలు, సహకారసేద్యం వంటి కాంగ్రెస్ విధానాలను కాంగ్రెస్ ఎం ఎల్ ఏ లు వ్యతిరేకిస్తుంటే సహించక ఏంచేస్తున్నారు కాబట్టి తమపై ఏదోచర్యతీసుకుంటారన్నభయంఎవరికీలేదు

పోతే తెలంగాణావారు ఎంతకాలం ఇలా మద్యనిషేధాన్ని వ్యతిరేకించగలరనే ప్రశ్న ఉంది దేశంలో దాదాపు అన్నిరాష్ట్రాలు మద్యనిషేధాన్ని అమలు జరపాలని నిర్ణయించుకొన్నాయి కొన్ని రాష్ట్రాలు అమలు జరిపాయి మన రాష్ట్రంలో కూడా ఆంధ్ర ప్రాంతమంతటా ఇది ఉంది కనుక ఏనాటికైనా తెలంగాణాలో కూడా ఇది రాకతప్పదు ఇందువల్ల రాగలదనుకునే ఏడెనిమిదికోట్ల రూపాయల నష్టాన్ని ఇతర మార్గాలద్వారా ఆయా రాష్ట్రాలు భర్తీ చేసుకొంటున్నట్లే, భర్తీ చేసుకోవాలి అవసరమైతే అమ్మకంపన్ను లాగా, మరో కొత్తరకమైన పన్ను కనిపెట్టాలి మద్యనిషేధంవల్ల బీద బిక్కి బాగుపడతారని తెలిసి కూడా, ఏదో కొందరు కంట్రాక్టరులు దెబ్బతినిపోతారని, త్రాగేవాళ్లను బాధపెట్టాల్సి వస్తుందని మంచి సంస్కరణలను వద్దనడంలో అర్థంలేదు తమకు అబ్కారీ ఆదాయం పోతే వచ్చే నష్టాన్ని కేంద్రంగాని, ప్లానింగ్ కమిషన్ గాని భర్తీ చేయాలని అడుగుతున్నారు ఒకవేళ ఇందుకు వారు ఇప్పుడు సమ్మతించినా, ఎంతకాలం అలా భరిస్తారో ఎవరూ చెప్పలేరు మేమిక ఇవ్వలేం, మీరే చూచుకోండి అని చెబితే అప్పుడైనా ఇతర త్రా ఆదాయం వెతుక్కోవలసి వస్తుంది. కనుక కేవలం కేంద్ర ప్రభుత్వంపై ఆధారపడకుండా ఈ సంస్కరణ అమలు జరపడం ఉత్తమం. ★

గళ్లనుడికట్టు-68



అడ్డం

1 నీటిమధ్య గాలి ఇందులో ఉంటుంది!

3 తగలబడరు కాని చొక్కా మెడపట్టే అవుతారు.

5 ఆ! నయము! ఈయనలేరు!

7 ఎటునుంచి చూసినా ఒక చెట్టే

9 అం, వైకుంఠపురిలో మాత్రంకాదు.

10 కాపు.

11 మహానటకలపోగ అటునుంచే

12 చుట్టూ నీటితో నిండినది ఎక్కైనా ఒకటేగా!

14 తడికలదే అనుకున్నా అద్దానికిపనికి వస్తుంది

16. వాడిదయకాదు కొండ చేరువ వేం

18 ఆ వంలో చేపలు పద్మా్రా తేక అవతం ఏమైనా ......

20 వృక్ష విశేషంలో వేద భాగము.

21 తురకలహక ముక్కతీసుకోండి.

22 ముష్టిక!


23 శ్రీకృష్ణదేవ—

25. విషయం, సంగీతంలోనిదైనా కావచ్చు!

29 ముఖంలో పేరు వెతికి చూడండి

30 చేతిగుడ్డ

67-వ గళ్లనుడికట్టుకు జవాబు



నిలువు

1 తలలో ఉండవలసినది!

2 ఇరవైనాలుగు నిముషాలకాలం తలువుకి దాలు

3 7 అడ్డం ఒకవైపు పొడుగుచేసి చిందర వందర చేస్తే వేదు

4 దమ్మిడీ రువ్వరు

5 అద్దు

6 ఇక్కడికి వెళ్ళటానికి ఎవరూ ఇష్టపడరు

7 తల పైవిభాగం

8 నీటిబొట్టు వాణి కనుక అనుగ్రహించకపోతే కనిపించదు!

13 పాతబడిపోయిన చిన్న వాకిం!

15 దిగువ!

16 పదిరోజుల పండగా, రాత్రుల పండగా?

17 నవ్వానులు!

18 వింగి

19 చిందరవందరైపోయిన తీగ మారు పేటల హారంతోబాటు తిలకములో కలిసిపోయింది

24 ప్రయత్నము

26 కరవీరము

27 పడవ

28 కాలుపగంమారి చెయ్యి అయిందిట! ★

ఆరోజు దినపత్రికలను కొన్ని చంకన పెట్టుకొనిపోయే పత్రికల కుర్రాడు "బజారులో గొప్ప మోసం, ఆరుగురి కళ్ళలో దుమ్ము" అని బజారు వెంట కేక వేస్తూ పోతున్నాడు. ఆ దారిని పోయే సుబ్బారావు అది విని కుర్రాడిని కేకేసి ఒక పేపరు కొన్నాడు. ఆత్రంగా పేజీలు తిప్పాడు. కాని అందులో ఎక్కడా యేవిధమైన మోసం గురించి లేదు.

అతని ఒళ్లుమండి పేపరు కుర్రాడి కోసం అటూ, ఇటూ చూశాడు కొంతదూరంలో ఆ కుర్రాడు "గొప్ప మోసం 7 గురి కళ్ళలో దుమ్ము" అని అరచుకుంటూ పోతున్నాడు.

వి యల్ రామారావు (ముసునూర్)



కెమేరామన్: వీళ్ళిద్దరూ హీరో హీరోయిన్లుగా యాక్ట్ చేసేమాటయితే,
ఈ పిక్చర్ ని సినిమాస్కోప్ లోనే తియ్యాలండీ.

గమనిక

వనితాలోకం దీపావళి వ్యాస రచన పోటీకి మగవారు వ్యాసాలు పంపరాదు

హాస్య కథలు

క్లాసులో తెలుగు పండితుడు ఛందస్సును గురించి బోధిస్తూ ఒరే గోపాలం! పోలిక యతి యనగా నేమిరా?

గోపాలం:- యింట్లో పెళ్లాంమీద అలిగి సన్యాసం తీసుకొన్నాయనండి.

వై. సూర్యనారాయణరావు (గంగవరం.)

* * * *


ఒకహోటల్ యజమానితో యీ మధ్య మీ హోటల్ ని చాలా శుభ్రంగా ఉంచుతున్నట్టున్నారు!

"యేదో మీ దయ!."......

అబ్బే ముఖస్తుతి కాదు. నిజంగా ఏది తిన్నా అంతా సోపు వాసనే కొడుతూంది!......

పి యల్. రామారావు (మునునూర్)

Edited, Printed and Published by S Radhakrishna at the Andhra Patrika Press 6 & 7 Thambuchetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.


బిన్నీవారి
అచ్చపట్టు
అంగవస్త్రాలు
.... మీ విశాల భుజాలమీద దర్జా ఉట్టిపడేలా అమరి విలుస్తాయి. వాటివల్ల మీ విగ్రహానికొక స్ఫూర్తి అబ్బుతుంది. ఎక్కడా ఎబ్బెట్టనిపించని హుందాతనం, మీ ప్రత్యేక వ్యక్తిత్వం విశిష్టమై భాసిస్తాయి.
కంటి కింపైన జరీ అంచులతో బిన్నీ అచ్చ పట్టు అంగవస్త్రాలెన్నో రకాలు, అధికార ముద్రగల బిన్నీ స్టాకిస్టు లందరివద్ద దొరుకుతాయి.
బెంగుళూరు ఉలెన్, కాటన్ & సిల్క్
మిల్స్ కంపెనీ లిమిటెడ్
అగ్రహారం రోడ్, బెంగుళూరు-2
బిన్నీ & కంపెనీ (మద్రాసు) లిమిటెడ్ వారి శాఖ
BANGALORE CITY
JWT/BM/SA/1344



సెప్టెంబర్ విడుదల!
శ్రీసారథి స్టూడియోస్ చిత్రం
కలసివుంటే
కలదుసుఖం
దర్శకత్వం: తాపీ చాణక్య
నవయుగ